# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| కామ్రేడ్ కోటేశర్లు చరిత్ర | 5 |
| కామ్రేడ్ శేషన్న చరిత్ర | 14 |
| కామ్రేడ్ శ్రీకాంత్ చరిత్ర | 19 |
| కామ్రేడ్ సునీత చరిత్ర | 21 |
| కామ్రేడ్ బీఎస్‌ఏకు జోహార్లు | 27 |
| మాడ్‌పై దాడి | 29 |
| ఉప ఎన్నికల ఫలితాలు | 35 |
| కవ్వాల్ ప్రాజెక్ట్ | 38 |
| సుప్రీం కోర్టుకు బహిరంగ లేఖ | 40 |
| లాటూర్ దళితులపై దాడి | 41 |
| మంగెవాడ ప్రతిఘటన | 43 |




**సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక**

**సంపుటి: 36 సంచిక: 1 జూలై - ఆగస్ట్ 2012 వెల: పది రూపాయలు**



# జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని విజయవంతం చేయండి!

## సి.పి.ఐ. (మావోయిస్ట్) సంస్థాపక నేతలు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీలకు విప్లవ జోహార్లు! కామ్రేడ్స్ రాంజీ, శేషన్న, శ్రీకాంత్, విజయ్, సునీత, రణిత, సుక్కు, సింగన్న, జిల్లా సహా వేలాది అమరవీరుల ఆశయాన్ని పరిపూర్తి చేయడానికి పునరంకితమవుదాం!

**ప్రియమైన ప్రజలారా!**



కామ్రేడ్‌చారుమజుందార్



కామ్రేడ్ కన్నయ్ ఛటర్జీ

భారత విప్లవోద్యమ చరిత్రలో జూలై 28కి ఒక ప్రత్యేకత వుంది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో దశాబ్దాలుగా ఊడలు దిగిన రివిజనిజం నడ్డి విరిచి, భారత విప్లవానికి దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను నిర్దేశించిన కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ చటర్జీలు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కి సంస్థాపక నేతలుగా చరిత్రలో నిలిచారు. వీరిలో కామ్రేడ్ చారు మజుందార్ సరిగ్గా ఇదే రోజున 1972లో పోలీసుల చిత్రహింసలకు బలయ్యారు. ఈ కామ్రేడ్స్ నిర్దేశించిన పంథాలో గత 45 ఏళ్లుగా అనేక ఒడిదుడుకులు, గెలుపు ఓటముల గుండా ప్రయాణిస్తూ భారత విప్లవోద్యమం అప్రతిహతంగా ముందుకు సాగుతున్నది. ఒక ప్రాంతంలో అది తాత్కాలికంగా వెనుకంజకు గురైనా మరో ప్రాంతంలో అది బలం పుంజుకుంటూ నేడు దేశ యావత్ పీడిత ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచింది. ఈ 45 ఏళ్ల రక్తసిక్త చరిత్రలో దాదాపు 15 వేల మంది అమరవీరుల త్యాగాలు ఇమిడి వున్నాయి. ఈ త్యాగాల ఫలితంగానే 'నక్సల్బరీ ఏక్ హీ రాస్తా' అని నినదిస్తూ విప్లవోద్యమం విముక్తి ప్రాంతాల నిర్మాణ లక్ష్యంతో, ప్రాంతాల వారీగా రాజ్యాధికార స్థాపనా దిశగా పురోగమిస్తున్నది. ఈ అమరవీరులందరి త్యాగాల్ని స్మరించుకుంటూ లక్ష్య సాధనకు పునరంకితమయ్యే మహత్తర దినమే జూలై 28.

గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 170 మంది

కామ్రేడ్స్ అమరులయ్యారు. ఇందులో ఏపీలో ఒకరు, ఎన్‌టీలో అయిదుగురు, ఏవోబీలో 9 మంది, డీకేలో దాదాపు 60కి పైగా కామ్రేడ్స్ ఉన్నారు. దేశవ్యాప్తంగా అమరులయిన కామ్రేడ్స్‌లో వున్నత పార్టీ కమిటీల నేతల నుండి సాధారణ సభ్యులు, పీఎల్‌జీఏ కమాండర్లు, యోధులు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు, క్రాంతికారీ జనతన సర్కార్ ప్రతినిధులు, సాధారణ ప్రజలు వున్నారు. వీళ్లలో అత్యధికులు శత్రువు తన గ్రీన్‌హంట్ రెండవ దశలో భాగంగా కొనసాగిస్తున్న దమనకాండలో, బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు శత్రు బలగాలతో ముఖాముఖి పోరాడుతూ ప్రాణాలర్పించారు. మరి కొద్ది మంది అనారోగ్యంతో, ఇతర ప్రమాదాల్లో అసువులు బాశారు. జూలై 28 సందర్భంగా ఈ అమరులందరినీ పేరుపేరునా స్మరించుకుంటూ వాళ్ల కలలు గన్న దోపిడీ పీడనలకు తావు లేని నవ భారత నిర్మాణానికి శక్తి వంచన లేకుండా పోరాడుతామని మరోసారి శపథం చేద్దాం.

2011 నవంబర్ 24న పశ్చిమ బెంగాల్‌లోని బురిషోల్ గ్రామం వద్ద పోలీసు, పారామిలిటరీ బలగాలు ఒక కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పీడిత ప్రజల సమరశీల నేత కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు (రాంజీ)ను అత్యంత అమానుషంగా హతమార్చాయి. సోనియా-మన్మోహన్-చిదంబరం-ప్రణబ్ ముఖర్జీ-జయరాం రమేష్‌ల ఫాసిస్టు పాలక ముఠా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయ్యి పథకం ప్రకారమే ఆయనను హతమార్చింది. కరీంనగర్ జిల్లా (ఆంధ్రప్రదేశ్) పెద్దపల్లి పట్టణంలో 1954లో ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ రాంజీ దాదాపు 38 ఏళ్లుగా విప్లవోద్యమంలో కీలక నేతగా దేశంలో ఎన్నో ప్రాంతాల్లో, ఎన్నో బాధ్యతల్ని నిర్వహించిన వీర యోధుడు. నాటి జగిత్యాల జైత్రయాత్ర నుండి ఇటీవలి జంగల్‌మహల్ ప్రాంత ప్రజా తిరుగుబాటు దాకా ఎన్నో ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్షంగా నేతృత్వం వహించిన స్ఫూర్తిదాత. కార్యకర్తలకు, ప్రజలకు అభిమానపాత్రుడు. ఆంధ్రప్రదేశ్, దండకారణ్య ఉద్యమాభివృద్ధిలో ఆయన పాత్ర విడదీయరానిది. పశ్చిమ బెంగాల్‌లో, ముఖ్యంగా లాల్‌గఢ్ ప్రజా వెల్లువ కాలంలో ఆయన దోపిడీ పాలకవర్గాలు తలకెత్తుకున్న బూటకపు అభివృద్ధి నమూనాను ఎదిరిస్తూ ప్రజలను పెద్ద ఎత్తున కూడగట్టడం ద్వారా పాలకులకు కంట్లో నలుసయ్యాడు. అందుకే ఆయనను అంతమొందించడానికి అనేక కుట్రలకు పాల్పడి చివరకు శత్రువు విజయం సాధించాడు. కామ్రేడ్ రాంజీ మృతితో భారత విప్లవానికి తీరని నష్టం జరిగింది. కామ్రేడ్ రాంజీ ఆశయ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను పెంపొందింపజేస్తూ, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారానే ఆయన లాంటి మరెందరో వీరుల్ని సృష్టించుకోగల్గుతాం. కామ్రేడ్ రాంజీ నెలకొల్పిన ఆదర్శాలు మనల్ని సదా అందుకు పురికొల్పుతాయి.

ఉత్తర తెలంగాణా ప్రాంత ఉద్యమం మార్చ్ 18న మరో గొప్ప నేతను కోల్పోయింది. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ గుండేటి శంకర్ (శేషన్న) పాముకాటుతో చనిపోయాడు. విప్లవమంటే విందు భోజనం కాదు. ఇది ఎన్నో ప్రమాదాలతో, ఇబ్బందులతో, ప్రయాసలతో, వత్తిళ్లతో, రక్తతర్పణతో కూడుకున్న కఠినమైన వర్గ పోరాటం. కరీంనగర్ జిల్లా, గోదావరిఖని పట్టణం, జవహర్‌నగర్‌లోని ఒక కార్మిక కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ శేషన్న దాదాపు ముప్పయ్యేళ్లుగా విప్లవోద్యమ పురోగమనం కోసం నిలకడగా, పట్టుదలగా కృషి చేసిన ప్రజా నాయకుడు. ఈరోజు వెనుకంజలో వున్న ఉత్తర తెలంగాణా వుద్యమాన్ని పునరుద్ధరించేందుకు సాగుతున్న కృషిలో కామ్రేడ్ శేషన్న లేని లోటు అఘాతాన్ని సృష్టించింది. మనల్ని ఇబ్బందికి, ఆవేదనకు గురి చేస్తుంది. అయితే విప్లవానికి పురిటిగడ్డ వంటి తెలంగాణ గడ్డ శేషన్న లాంటి ఎందరో వీరులకు జన్మనిస్తూనే వుంటుందనేది కాదనలేని సత్యం.

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ హరక్ (శ్రీకాంత్) 2012 ఫిబ్రవరి 26న తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసాడు. ఛత్తీస్‌గఢ్‌లోని దల్లీరాజహరా పట్టణంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ హరక్ 1993లో పార్టీలో చేరి కార్మిక, యువజన, విద్యార్థి, సాంస్కృతిక రంగాల్లో పట్టణ, మైదాన ప్రాంతాల్లో ఎనలేని కృషి చేశాడు. 1998 నుండి ఆయన గడ్చిరోలి జిల్లాలో విప్లవోద్యమ నాయకత్వ బాధ్యతలు చేపట్టి ప్రజలకు, కేడర్లకు తలలో నాలుకయ్యాడు. 2005లో ఆయన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలోకి ఎన్నికయ్యాడు. గుండె జబ్బుతో బాధ పడుతూనే ఆయన ప్రజల మధ్య పట్టు వదలకుండా పని చేశాడు. చివరకు ప్రజల మధ్యనే ప్రాణాలు విడిచి నిజమైన ప్రజా సేవకుడిగా రుజువు చేసుకున్నాడు. ఆయన లేని లోటు విప్లవోద్యమానికి తీరనిదే అయినా ఆయన బాటలో దృఢంగా ముందుకు నడుస్తూ విప్లవానికి వేలాది, లక్షలాది వారసుల్ని తయారు చేసుకోగల్గుతాం.

డీకేలోని దక్షిణ రీజినల్ కమిటీ సభ్యుడు, దక్షిణ బస్తర్ డివిజనల్ కార్యదర్శి కామ్రేడ్ మడకం ఇడుమాల్ (విజయ్) ట్రాక్టర్ ప్రమాదానికి గురై 2012 జూలై 15న అమరుడయ్యాడు. దంతెవాడ జిల్లా కుంట బ్లాక్‌లోని కరంగడ్ గ్రామంలో పుట్టిన కామ్రేడ్ విజయ్ దాదాపు 25 ఏళ్ల క్రితం విప్లవోద్యమంలో అడుగుపెట్టాడు. ఈ ప్రాంతంలో ఆయన తొలితరం నాయకుడు. ఫారెస్ట్ అధికారులకు, ఆదివాసీ, ఆదివాసేతర భూస్వాములకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఎన్నో ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి ఇక్కడి ప్రజలకు విశ్వసనీయమైన నేతగా ఎదిగాడాయన. ప్రభుత్వం ప్రజలపై ఫాసిస్టు దమనకాండ కొనసాగిస్తున్న నేటి పరిస్థితిలో, ఆ దమనకాండను ఓడించడానికి ప్రజలకు క్రియాశీల నాయకత్వం అందించగల్గిన కామ్రేడ్ విజయ్ మరణం డీకే విప్లవోద్యమానికి, ప్రత్యేకించి దక్షిణ రీజినల్ వుద్యమానికి తీరని నష్టం. అయినప్పటికీ ఈ ఆదివాసీ ప్రజా నాయకుడు నెలకొల్పిన పోరాట వారసత్వాన్ని ప్రజలు గొప్ప ఉత్తేజంతో కొనసాగించి తీరుతారు.

సీనియర్ పార్టీ కార్యకర్త కామ్రేడ్ స్వరూప (సునీత) మార్చ్ 18న బ్రెస్ట్ క్యాన్సర్‌తో కన్నుమూసింది. ఆమె గత ముప్పయ్యేళ్లుగా విప్లవ పతాకను సమున్నతంగా ఎత్తిపట్టిన ఆదర్శ కమ్యూనిస్టు.

ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామంలో పుట్టిన కామ్రేడ్ సునీత పార్టీలో అనేక ముఖ్యమైన పనుల్లో పాలు పంచుకుని, గత కొన్నేళ్లుగా పీఎల్‌జీఏ బలగాలకు యూనిఫారాలు కుట్టించే టైలర్‌గా తన సేవలందిస్తూ వచ్చింది. అనారోగ్యం, ఒంటరితనం వంటి సమస్యలెన్ని ఎదురైనా బోల్షివిక్ పట్టుదలతో అధిగమించి చివరి ఊపిరి వున్నంత వరకు ఉద్యమంలో నిలబడ్డ ఈ వీర వనిత నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

ఆగస్టు 20న గడ్చిరోలి జిల్లాలోని మాకడ్‌చువ్వ గ్రామం సమకాలీన చరిత్రలో ఒక అపూర్వ ఘట్టానికి సాక్షిగా నిలబడింది. దాదాపు ముప్పయ్యేళ్ల వయస్సున్న కామ్రేడ్ రాంకో హిచ్చామి (రణిత) ఒంటరిగా వందలాది శత్రుబలగాల చక్రబంధంలో ఇరుక్కొని తన మొక్కవోని సాహసంతో ఒక కొత్త అధ్యాయం రచించింది. త్యాగానికి, పోరాటానికి కొత్త నిర్వచనం చెప్పింది. ఈ వీర యోధ ముగ్గురు కోబ్రా/సీ-60 కమాండోలను నేలగూల్చి మరో నలుగురిని తీవ్రంగా గాయపర్చింది. కామ్రేడ్ రణితను హతమార్చడానికి దాదాపు ఒక బెటాలియన్ సంఖ్యలో సాయుధ బలగాలు దిగి వేలాది తూటాలు, డజన్ల కొద్దీ చేతి బాంబులు, మోర్టార్ షెల్స్ ఉపయోగించాల్సి వచ్చింది. పొట్టావి జెవెల్లి గ్రామంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ రాంకో చిన్నతనంలోనే విప్లవ కార్యకలాపాల పట్ల ఆకర్షితురాలైంది. చనిపోయే నాటికి ఆమె చాద్‌గాం ఏరియా క్రాంతికారీ జనతన సర్కార్ అధ్యక్షురాలిగా ప్రజాసేవలో నిమగ్నమై వుంది. కామ్రేడ్ రణిత సాహసం, త్యాగం ప్రజా విముక్తి గెరిల్లాలకు సదా ప్రేరణగా నిలుస్తాయి.

మధ్య భారతంలో విప్లవోద్యమ విస్తరణ కర్తవ్యాన్ని భుజాన ఎత్తుకొని సాహసంగా పురోగమిస్తున్న క్రమంలో 2012 జనవరి 27న డీవీసీఎం కామ్రేడ్ మంగు పద్దాం (సుక్కు) ఛత్తీస్‌గఢ్‌లోని రాయగఢ్ జిల్లాలో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ ప్రాణార్పణ చేశాడు.

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో నలుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. చర్ల మండలం చెన్నాపురం, ఎర్రపాడు గ్రామాలలోని సంఘ నాయకత్వం, దళంపై దాడి చేయాలనే లక్ష్యంతో వచ్చిన గ్రేహౌండ్స్ బలగాలతో 2011 సెప్టెంబర్ 25న చెన్నాపురం గ్రామం వద్ద జరిగిన ఎదురుకాల్పులలో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్స్ ముచకి చుక్కా (జిల్లా), మడకం సోమాల్‌లు అమరులయ్యారు. గుండాల మండలంలోని కొమ్ముగూడెం వద్ద ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2012 ఫిబ్రవరి 20న సాయంత్రం 7 గంటలకు పోలీసుల ఆంబుష్‌లో చిక్కి హోరాహోరి పోరాడుతూ కామ్రేడ్ సుతారి పాపారావు (సింగన్న) అమరుడయ్యాడు. ఇదే జిల్లాలో 2012 మార్చి నెలలో కామ్రేడ్ దశరథం (శ్యాం) మరణించాడు.

ఏవోబీలోని ఈస్ట్ డివిజన్‌లో 2012 మే 10న లువ్వాసింగి దగ్గర జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లో మిలీషియా సభ్యులు కామ్రేడ్స్ తెల్లన్న పడాల్, పండలం అప్పారావు అమరులయ్యారు. శ్రీకాకుళం – కోరాపుట్ ఉమ్మడి డివిజన్‌లో గూండాల చేతిలో ఛసి ములియా ఆదివాసీ సంఘం సభ్యులు కామ్రేడ్స్ అప్పారావు, శీరిక నందు అమరులయ్యారు. ఇదే సంఘానికి చెందిన కామ్రేడ్ సాణ అనారోగ్యంతో చనిపోయాడు. 2012 జనవరి 12న బూటకపు ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ లక్ష్మీ, సీత్రులు అమరులయ్యారు. మల్కన్‌గిరి డివిజన్‌లో సంఘ సభ్యుడు కామ్రేడ్ రామాల్ అనారోగ్యంతో మరణించాడు. సంఘ సభ్యుడైన కామ్రేడ్ పొదియాల్‌ను 2011 సెప్టెంబర్‌లో పోలీసులు కాల్చి చంపారు.

దండకారణ్యంలో నాటి బస్తర్ మహాన్ భూంకాల్ అమర నేత గుండాధూర్ స్వగ్రామమైన నేతనార్ సమీపంలో, ప్రస్తుత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించేందుకు సాగుతున్న మరో భూంకాల్ మహా సమరంలో భాగంగా శత్రు బలగాలపై పీఎల్‌జీఏ 2011 అక్టోబర్ 11న చేసిన ఆంబుష్‌లో కాంగేర్‌ఘాటీ ఎల్‌జీఎస్ కమాండర్ వీరోచితంగా పోరాడుతూ రక్తం ధారపోశాడు. 2011 ఆగస్టు 16న తూర్పు బస్తర్‌లోని తిర్క గ్రామంలో చుట్టివేతకు గురైన గెరిల్లా టీం శత్రు బలగాలను వీరోచితంగా ప్రతిఘటిస్తూ, ఒక ఎస్‌టీఎఫ్ జవానును హతమార్చిన సంఘటనలో కామ్రేడ్స్ బద్రు, గోపి, ఆకాశ్‌లు అమరులయ్యారు. శత్రువు వీళ్ల ప్రతిఘటనను ఎదుర్కోలేక ఇంటికి నిప్పు పెట్టి తన పాశవికతను చాటుకున్నాడు. 2012 మార్చ్ 26న ఛెజ్జి సమీపంలో పీఎల్‌జీఏ చేసిన ఆంబుష్‌లో శత్రు బలగాలతో సాహసంగా పోరాడుతూ కామ్రేడ్స్ పాక్లు, మంగ్లిలు అమరులయ్యారు.

మే 16న భారత్ బంద్ సందర్భంగా ఖైరంగఢ్‌కు సమీపంలో అర్ధరాత్రి శత్రు బలగాలు సాగించిన దాడిలో కంపెనీ-9కు చెందిన పీపీసీఎం కామ్రేడ్ శివాజీ గాయపడి ఆ మరునటి రోజు అమరుడయ్యాడు. పశ్చిమ బస్తర్ యాక్షన్ టీం కమాండర్ కామ్రేడ్ ప్రమోద్ ప్రజా శత్రువైన రాజ్‌కుమార్ తామోను హతమార్చే ప్రయత్నంలో బాడీగార్డు జరిపిన కాల్పుల్లో అమరుడయ్యాడు. నేషనల్‌పార్క్ ప్రాంతంలో గోవింద్ అనే ఏసీ సభ్యుడు పాముకాటుతో అమరుడయ్యాడు. ఇంకా మరెందరో కామ్రేడ్స్ శత్రువుతో పోరాడుతూ, శత్రు పాశవికతకు గురై అమరులయ్యారు.

మైన్‌పూర్ డివిజన్‌లోని గరియబంద్ ప్రాంతంలో మే 31న జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో పోరాడుతూ కామ్రేడ్ సమీర సహా ముగ్గురు మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు. నల్లగొండ జిల్లాలో పుట్టి పెరిగిన కామ్రేడ్ సమీర విప్లవోద్యమాన్ని విస్తరింపజేయడంలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ నుండి డీకే మీదుగా సీవోబీ (ఛత్తీస్‌గఢ్ ఒడిశా బార్డర్)కి వెళ్లి, ఆ గడ్డ మీదనే తన నులివెచ్చని నెత్తురు చిందించింది.

2012 జూన్ 28న శత్రువు కొనసాగించిన దారుణ మారణకాండలో బీజాపూర్ జిల్లాలోని సార్కిన్ గూడ ప్రాంతంలో 17 మంది విప్లవ ప్రజానీకం నేలకొరిగారు. ఈ మారణకాండకు కొనసాగింపుగా సుకుమా జిల్లాలోని సిమిలిపెంట గ్రామ సమీపాన సోడి దూలా అనే మిలీషియా కమాండర్‌ను, మరో ఇద్దరు రైతులను

కాల్చి చంపారు.

దక్షిణ బస్తర్‌లో 2011 ఆగస్టు 6న చిక్‌పాల్ గ్రామ పటేల్ మడ్కామి మాసాను సీఆర్‌పీ బలగాలు దారుణంగా హత్య చేసి శవాన్ని పూడ్చివెయ్యగా, 2012 జనవరి 9న పొడియామి మాసాను పోలీసులు సుక్మా లాకప్‌లో అమానుష చిత్రహింసలకు గురి చేసి చంపేశారు. 2011 అక్టోబర్ 10న తూర్పు బస్తర్ డివిజన్‌లోని ఇస్సూర్ గ్రామంలో నేగీ యాదవ్ అనే ప్రజాసంఘ కార్యకర్తను పట్టుకొని హత్య చేసి ఎన్‌కౌంటర్ అని ప్రకటించారు. మాడ్ ప్రాంతంలో 2012 మార్చ్‌లో శత్రు బలగాలు చేపట్టిన ఆపరేషన్ హాకాలో భాగంగా తోకె గ్రామస్థుడైన దుంగ ధుర్వను అమానుషంగా హత్య చేశారు. ఇంకా మరెందరో సామాన్య ప్రజలు, నిరాయుధులు పోలీసు, పారామిలిటరీ బలగాల విచ్చలవిడి హింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు బలయ్యారు.

వీరే కాక బహిరంగ ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర వహిస్తున్న కొందరు కామ్రేడ్స్ ఈ మధ్య కాలంలో మరణించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో నక్సల్బరీ తరం ప్రజా వుద్యమ నేత కామ్రేడ్ బీఎస్‌ఏ జూన్ 22న గుండెపోటుతో మరణించాడు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన తుడుందెబ్బ నేత కామ్రేడ్ పేందోర్ భీంరావు పోలీసుల చిత్రహింసల ఫలితంగా అనారోగ్యం పాలయి కన్నుమూశాడు.

ప్రజలారా! కామ్రేడ్స్! నేడు దేశవ్యాప్తంగా మావోయిస్టు వుద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో పాలక వర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఒక క్రూరమైన యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధంలో లక్షలాది పారామిలిటరీ బలగాలే కాకుండా, ప్రస్తుతం సైన్యాన్ని మోహరించే ప్రక్రియ కూడా మొదలైంది. బస్తర్‌లో 'శిక్షణ' పేరుతో సైన్యం అడుగు పెట్టింది. నిజానికి ఒక్క మావోయిస్టు వుద్యమాన్నే కాదు, దేశ వనరులను బడా, విదేశీ పెట్టుబడిదారీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కోసం అడ్డంకిగా వున్న వుద్యమాలన్నిటినీ, శక్తులన్నిటినీ అణచివెయ్యడం ఈ యుద్ధం లక్ష్యం. దండకారణ్యం సహా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో పాలకుల బూటకపు అభివృద్ధి నమూనాకు భిన్నంగా ప్రజా శ్రేయస్సు కేంద్రంగా వున్న ప్రజా ప్రత్యామ్నాయం ముందుకు రావడం, అది రోజురోజుకూ వికసిస్తుండడం కూడా దేశ పాలకవర్గాలకు, వాళ్ల యజమానులైన సామ్రాజ్యవాదులకు మింగుడు పడడం లేదు. అందుకే తమ సర్వ శక్తులను ఒడ్డి ఈ యుద్ధాన్ని ముగించెయ్యాలని వేగిరపడుతున్నారు. ముఖ్యంగా ప్రపంచవాప్తంగా సామ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వాళ్లను ఇందుకు మరింత త్వరపెడుతున్నది. అందుకే వాళ్లు ప్రజలపై దారుణ హింసా దౌర్జన్యాలకు, హత్యాకాండలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు నాయకత్వం వహిస్తున్న విప్లవకారులను, విప్లవోద్యమ నేతలను హతమారుస్తున్నారు.

అయితే అణచివేత తిరుగుబాటుకే దారితీస్తుందనేది చారిత్రక సత్యం. వ్యక్తులను చంపేసి వాళ్ల భావాల్ని రూపుమాపలేరు. దేశ దోపిడీ పాలకవర్గాలు ప్రజల దృష్టిలో రోజురోజుకూ మరింతగా బట్టబయలవుతున్నాయి. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అవినీతి, కుంభకోణాలు, అధికధరలు, నిర్వాసితత్వం వంటి సమస్యలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రతి పార్లమెంటరీ పార్టీ ప్రజల దృష్టిలో పతనమై పోయినదే. ఈ పరిస్థితిలో అసమాన త్యాగాలతో, శౌర్యపూరిత పోరాటాలతో పురోగమిస్తున్న మావోయిస్టు ప్రజాయుద్ధం మొత్తం దేశ పీడిత ప్రజలందరికీ ప్రత్యామ్నాయంగా వుందనేది వాస్తవం.

ఆంధ్రప్రదేశ్, ఉత్తర తెలంగాణా, ఏవోబీలలో మావోయిస్ట్ వుద్యమాన్ని అణచివేసి, మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయబోతున్నామనే పాలకవర్గాల కలను కల్లలు చేస్తూ, రాష్ట్రంలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రజా వుద్యమాలుగా దినదినం పెంపొందుతున్నాయి. ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షతో వుద్యమం అభివృద్ధి చెందుతున్నది. ప్రజలు నిర్బంధాన్ని లెక్కచేయకుండా మిలిటెంట్ ఆందోళనలకు సిద్ధపడుతూ మావోయిస్ట్ పార్టీ నేతృత్వాన్ని బాహాటంగా కోరుకుంటున్నారు. ప్రజల ఈ కోరికను సాకారం చేయడానికి నడుం కడతామని అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా ప్రతిన బూనుదాం.

అమరవీరుల ప్రేరణను విస్తరింప జేసే లక్ష్యంతో జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకుందాం. పార్టీని కాపాడుకుంటూ, ప్రజాయుద్ధాన్ని దేశం నలు మూలలకూ విస్తరింపజేస్తూ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దామని ఈ సందర్భంగా ప్రతిన బూనుదాం. అమరవీరుల స్థూపాలను అలంకరించి, నిర్ణయించిన చోట్లలో కొత్తగా నిర్మించి, అమరుల త్యాగాల్ని పల్లెపల్లెనా ప్రచారం చేద్దాం. అమరవీరుల ఆదర్శాల్ని, వాళ్ల స్ఫూర్తిదాయకమైన జీవిత చరిత్రల్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళదాం. అమరుల త్యాగాల ప్రేరణతో, కోట్లాది భారత పీడిత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విప్లవోద్యమాన్ని పెంపొందిద్దాం. వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజా రాజ్యాధికారాన్ని సంఘటితపరుస్తూ, విస్తరింప జేద్దాం.

★

## గమనిక

**అనివార్య కారణాల వల్ల 2011 నవంబర్ - డిసెంబర్ సంచిక నుండి 2012 మే - జూన్ సంచిక వరకూ పత్రిక వెలువడలేదు. 2012 జూలై - ఆగస్ట్ నుండి మళ్లీ మీ ముందుకు వస్తున్నది. పాఠకులకు కల్గిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.**

**-సంపాదకులు**

# భారత విప్లవ మహా నాయకుడు

# కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు అమర్ రహే!

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు అమరత్వం ప్రజలనూ, పార్టీ శ్రేణులను తీవ్ర దుఃఖంలో ముంచింది. ఆయన నేలకొరిగిన రోజు –2011 నవంబర్ 24 – భారత విప్లవోద్యమ చరిత్రలో విషాద దినంగా నిలిచిపోతుంది. భారత విప్లవోద్యమ చరిత్రలో విశిష్ట పాత్ర పోషించిన గొప్ప నాయకుడాయన. అందుకే శత్రువుకు కంట్లో నలుసయ్యాడు. అనుక్షణం శత్రువు ఆయనను వెంటాడాడు. ఎన్నోసార్లు తప్పించుకో గలిగినప్పటికీ చివరికి ఆయన శత్రు వలలో చిక్కుకుపోయాడు. సుదీర్ఘకాలంగా విఫలమవుతూ వస్తున్న శత్రువు ఆయనను అంతం చేయడంలో ఎట్టకేలకు విజయం సాధించగలిగాడు.



ప్రజలు నమ్మరని తెలిసినా ఎన్‌కౌంటర్ కట్టుకథలను చెప్పడానికి ఎంత మాత్రమూ సిగ్గుపడని దేశపాలక వర్గాలు 2011 నవంబర్ 24న మరోసారి అదే కథను వినిపించారు. "పశ్చిమబెంగాల్ రాష్ట్రం పశ్చిమ మేదినీపూర్ జిల్లాలోని కుశ్‌బోనీ అడవుల్లో బురిషోల్ గ్రామం వద్ద భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య దాదాపు గంటసేపు హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో సి.పి.ఐ. (మావోయిస్టు) అగ్రనేత కోటేశ్వరరావు ఎలియాస్ కిషన్‌జీ మరణించాడు" అనేది ఆ కట్టుకథ సారాంశం. దేశ అంతర్గత భద్రతకు సి.పి.ఐ. (మావోయిస్టు) అతి పెద్ద ప్రమాదమని దుష్ప్రచారం చేస్తున్న పాలకవర్గాలు, వారికి నాయకత్వం వహిస్తున్న ఫాసిస్టు పాలక ముఠా సోనియా–మన్‌మోహన్–చిదంబరం –ప్రణబ్‌ముఖర్జీ–జయ్‌రాం రమేష్ మార్గదర్శకత్వంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో కుమ్మక్కయి కుట్రపూరితంగా నిర్వహించిన ఆపరేషన్‌లో కామ్రేడ్ కోటేశ్వర్లును సజీవంగా పట్టుకొని అమానుష చిత్రహింసలకు గురిచేసి హత్యచేశారు.

కామ్రేడ్ కోటేశ్వర్లుపై శత్రువు ఎంతగా కసి తీర్చుకున్నాడంటే, అత్యంత క్రూరంగా చిత్రహింసలు పెట్టి ఆయనను ఆపాదమస్తకం గాయాలపాలు చేశారు. జగిత్యాల నుండి లాల్‌గఢ్ వరకూ అలుపెరగకుండా కవాతు చేసిన ఆయన కాళ్లను శత్రువు నరికేశాడు. పాదాలను హీటర్లతో కాల్చాడు. అనుక్షణం విప్లవాన్ని స్వప్నించిన ఆయన కంటిని పెరికేశాడు. ట్రిగ్గర్‌నే కాదు, కలాన్నీ నేర్పుగా వుపయోగించిన ఆయన చేతివేలును నరికేశాడు. పాలకవర్గాల ఫాసిస్టు స్వభావాన్ని ఎండగట్టడం కోసం ఆయుధంగా మలుచుకున్న ఆయన స్వరాన్ని నులిమేశారు. ఎన్నడూ శత్రువు ముందు తలవంచనందుకేమో ఆయన మెడను బాయ్‌నెట్లతో కోసేశారు. చివరకు నోట్లో కూడా తూటా కాల్చగా మెదడు బయటికి వచ్చింది. ఆయన మృతదేహాన్ని చూసిన విరసం నేత కామ్రేడ్ వరవరరావు, నలభై అయిదేళ్ల కాలంలో నేను ఎన్నో 'ఎన్‌కౌంటర్' మృతదేహాలను చూసిన గానీ ఇంతగా చిత్రహింసల పాలయిన మృతదేహాన్ని చూడలేదు' అన్నాడంటే కామ్రేడ్ కోటేశ్వర్లును ఎంతగా చిత్రహింసలు పెట్టారో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

శత్రువు చేసిన ఈ దారుణ హత్యకు తీవ్ర నిరసన వెల్లువెత్తింది. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రగతిశీల రచయితలు ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా పలు హక్కుల, ప్రజాస్వామిక సంఘాలు, రాజకీయ పార్టీలు, సంస్థలు ఈ హత్యను ఖండించాయి. పలు సంస్థలు సంఘటనా స్థలానికి వెళ్లి నిజనిర్ధారణ చేసి ఎన్‌కౌంటర్ బూటకమని ప్రకటించాయి. అంతర్జాతీయంగా పలు విప్లవపార్టీలు ఈ హత్యను ఖండిస్తూ పార్టీకి సంతాప సందేశాలు పంపాయి. ఇక్కడి ప్రజల, పార్టీ శ్రేణుల దుఃఖంలో పాలుపంచుకున్నాయి.

పలువురు వ్యక్తులు, సంస్థలు కామ్రేడ్ కోటేశ్వర్లు కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. వాళ్ల దుఃఖంలో పాలుపంచుకున్నారు. విప్లవ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పశ్చిమబెంగాల్ నుండి కామ్రేడ్ కోటేశ్వర్లు మృతదేహాన్ని ఆయన పుట్టిన గడ్డ పెద్దపల్లికి తీసుకువచ్చారు. ఎప్పటి వలెనే శత్రువు అంత్యక్రియలకు పెద్ద ఎత్తున ప్రజలను తరలి రానివ్వకుండా విఫల ప్రయత్నం చేశాడు. అయితే తమ ప్రియతమ నాయకుడిని కడసారి చూసుకోవాలని శత్రు చక్రబంధాన్ని చీల్చుకొని వచ్చిన వేలాది ప్రజల, పలు సంఘాల కార్యకర్తల, కటుంబ సభ్యుల, బంధుమిత్రుల సమక్షంలో, వుద్వేగ పూరిత వాతావరణంలో, కన్నీటి నివాళులూ, కసితో కూడిన నినాదాల మధ్య నవంబర్ 27న

### కామ్రేడ్ కోటేశ్వర్లు విప్లవ ప్రస్థానం



**1954 –** నవంబర్ 26న ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా పెద్దపల్లి పట్టణంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. మధురమ్మ, వెంకటయ్యల రెండవ సంతానం.

**1969 –** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర వహించాడు.

**1974 –** కరీంనగర్‌లో డిగ్రీ చదువుతూ, విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాడు.

**1974 –** పార్టీని సంఘటితం చేసే కార్యాచరణ ప్రారంభించాడు.

**1977 –** పార్టీ తెలంగాణ ప్రాంతీయ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాడు.

**1978 –** జైగిత్యాల జైత్రయాత్రలో ముఖ్య భూమిక పోషించాడు.

**1978 –** మొట్ట మొదటి కరీంనగర్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కమిటీలో సభ్యుడయ్యాడు.

**1980 –** సెప్టెంబర్‌లో జరిగిన బాకపా (మా–లె) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఆ తర్వాత రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

**1986 –** దండకారణ్య ఉద్యమ నేతృత్వంలో ప్రత్యక్షంగా భాగస్వామయ్యాడు.

**1987 –** ఫిబ్రవరిలో డీకే పార్టీ మొదటి మహాసభలో ఫారెస్టు కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

**1993 –** సీవోసీ సభ్యుడిగా కో–ఆప్ట్ అయి బెంగాల్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టాడు.

**1995 –** మునుపటి భాకపా (మా–లె) (పీపుల్స్‌వార్) అఖిల భారత ప్రత్యేక మహాసభలో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

**2001–** మునుపటి భాకపా (మా–లె) (పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్‌లో సీసీఎంగా ఎన్నికయి, పీబీఎంగా ఉత్తర రీజనల్ బ్యూరో కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు.

**2004–** విలీనంలో ముఖ్య పాత్ర పోషించాడు. భాకపా (మావోయిస్టు) ఆవిర్భావానంతరం ఐక్య కేంద్ర కమిటీలో, పీబీలో సభ్యుడై తూర్పు రీజనల్ బ్యూరోలో సభ్యుడయ్యాడు.

**2007–** ఐక్యతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీలోకి తిరిగి ఎన్నికయి, పీబీఎంగా తూర్పు రీజనల్ బ్యూరోలో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు.

**1993–11** 18 సంవత్సరాలు కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు.

**2001–11** 11 సంవత్సరాలు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు.

**2011** నవంబర్ 24న అమరత్వం – పశ్చిమ బెంగాలోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా బురిసోల్ అడవుల్లోని కుశ్‌బోనీ గ్రామం వద్ద జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో.

పెద్దపల్లిలో కామ్రేడ్ కోటేశ్వర్లు అంతిమయాత్ర, అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. తన కొడుకు బాటలో నడవాలని కామ్రేడ్ కోటేశ్వర్లు తల్లి, వీరమాత మధురమ్మ దేశవాసులందరికీ పిలుపునిచ్చి ఉత్తేజపరిచింది.

పార్టీ కేంద్రకమిటీ తరపున అధికార ప్రతినిధి అభయ్ కామ్రేడ్ కోటేశ్వర్లు హత్యను ఖండిస్తూ, ఈ క్రూర హత్యను ఖండించాలని ప్రజలకూ, ప్రజాస్వామిక వాదులకూ, సంఘాలకూ విజ్ఞప్తి చేస్తూ నవంబర్ 25న ప్రకటన ఇచ్చాడు. ఆ ప్రకటనలో విప్లవోద్యమానికి కామ్రేడ్ కోటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడాడు. నవంబర్ 29 నుండి డిసెంబర్ 5 వరకూ నిరసన వారాన్ని డిసెంబర్ 4,5 తేదీలలో బంద్‌ను ప్రకటించాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఆయన హత్యకు నిరసనగా నవంబర్ 26, 27 తేదీలలో బంద్ పాటించారు.

దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాల్లో, గెరిల్లా జోన్ ప్రాంతాల్లో కామ్రేడ్ కోటేశ్వర్లు సంస్మరణలో అనేక సభలు సమావేశాలు జరిగాయి. ఆయన స్మృతిలో అనేకమంది మేధావులు, ప్రజాస్వామికవాదులు, రచయితలు, కార్యకర్తలు పలు వ్యాసాలు, స్పందనలు, కవితలు పాటలు రాశారు. వివిధ భాషల్లో ఆయన జీవిత చరిత్రలు ప్రచురించబడ్డాయి.

ఇదంతా పార్టీ శ్రేణుల్లోనే కాక, విస్తృత ప్రజల్లో, ప్రజాస్వామికవాదుల్లో, మేధావుల్లో కామ్రేడ్ కోటేశ్వర్లుకు వున్న గుర్తింపును తెలియజేస్తుంది. ఈ గుర్తింపు ఆయాచితంగా రాలేదు. విప్లవోద్యమానికి ఆయన చేసిన కృషి ఫలితమే యిది. ఆ కృషిని తడుముకుందాం.

## దేశభక్తి, అభ్యుదయ భావాలతో పెనవేసుకున్న బాల్యం

ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ కోటన్న, ప్రహ్లాద్, బిమల్, కిషన్‌జీగా ఎక్కువగా పరిచితుడైన ఆయన అసలు పేరు మీడియాలో కోటేశ్వరరావుగా ప్రచారం అయ్యింది. కానీ తల్లిదండ్రులు ఆయనకు పెట్టుకున్న పేరు మాత్రం కోటేశ్వర్లు. ఉత్తర తెలంగాణాలోని, కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో 1954 నవంబర్ 26న ఆయన జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు మధురమ్మ, వెంకటయ్యలు. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు. తల్లి, భర్త ఆశయాలను గౌరవించిన విశాల హృదయురాలు. కామ్రేడ్ కోటేశ్వర్లుకు ఒక అన్న, తమ్ముడు వున్నారు. ఆయన అన్న ఆంజనేయులు ఉద్యోగిగా పని చేసి ప్రస్తుతం రిటైర్ అయ్యారు. ఆయన తమ్ముడు సిపిఐ(మావోయిస్టు)లో కేంద్ర కమిటీ సభ్యుడిగా వున్నాడు. వారిది చితికిపోయిన మధ్య తరగతి

కుటుంబం. తండ్రి చిరుద్యోగి కావడంతో తల్లి కష్టపడి చేను చెలకలు తిరిగి గడ్డి కోసుకొచ్చి పశువులను పోషించి పాలు అమ్మి కుటుంబ పోషణలో కీలక బాధ్యతను నిర్వర్తించింది.

హైస్కూలు చదువు వరకూ కామ్రేడ్ కోటేశ్వర్లు బాల్యం పెద్దపల్లిలోనే గడిచింది. తండ్రి ప్రభావంతో కామ్రేడ్ కోటేశ్వర్లు చిన్నప్పటి నుండి దేశభక్తి భావాలు కలిగి వుండేవాడు. దేశ రక్షణ కోసం సైనికుడు కావాలని కోరుకునేవాడు. ఆ కోరిక మూలంగా కొద్దికాలం పాటు ఆర్.ఎస్.ఎస్. శాఖకు హాజరయ్యాడు. కానీ కొద్ది కాలానికే దాని మతోన్మాద రాజకీయాలు, కుహనా దేశభక్తి అర్థమయి దానికి దూరమయ్యాడు.

తండ్రి నుండి ప్రగతిశీల సాహిత్యం చదివే అలవాటు కూడా అబ్బడంతో కామ్రేడ్ కోటేశ్వర్లులో అభ్యుదయ భావాలు ఏర్పడ్డాయి. చదువులో చురుగ్గా వుండే కామ్రేడ్ కోటేశ్వర్లు హెచ్ఎస్సి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ రోజుల్లోనే టైఫాయిడ్ బారిన పడడం వల్ల ఆయనకు ఒక చెవి శాశ్వతంగా వినబడకుండా పోయింది.

1969లో ప్రత్యేక తెలంగాణా పోరాటం మొదలయింది. విద్యార్థి లోకం ఈ పోరాటంలో సమరశీల పాత్ర వహించింది. కామ్రేడ్ కోటేశ్వర్లు కూడా ఆ పోరాటంలో చురుకైన పాత్ర వహించాడు. ఈ పోరాటమే ఆయన జీవితాన్ని ఒక మలుపు తిప్పిందని చెప్పుకోవచ్చు. ఈ తర్వాత క్రమంగా ఆయన విప్లవ రాజకీయాల వైపుగా పయనించాడు. హైస్కూలు చదువు తర్వాత కామ్రేడ్ కోటేశ్వర్లు కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి కళాశాలలో ప్రీ-యూనివర్సిటీ కోర్సు (పి.యు.సి.)లో చేరాడు. అప్పటికే ఆ కళాశాలకు నక్సల్బరీ సందేశం చేరుకుంది. కామ్రేడ్ కోటేశ్వర్లు కూడా ఆ రాజకీయాలకు ఆకర్షితుడై ఒక యువ విప్లవకారుల బృందంలో చేరిపోయాడు. పి.యు.సి. అనంతరం బి.ఎస్సి (గణితం)లో చేరాడు.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు వెనకపట్టు పట్టిన తర్వాత పార్టీలో అనేక చీలికలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నాయకత్వం అతివాద, మితవాద పంథాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని ఎక్కుపెట్టి 'గతాన్ని సమీక్షించి సాయుధ పోరాటాన్ని పురోగమింపజేద్దాం' అంటూ ఆత్మ విమర్శనా రిపోర్ట్‌ను తయారు చేసింది. దానిపై ఆధారపడి విప్లవ శక్తుల పునరేకీకరణకు కృషిని కొనసాగించింది. ప్రజా పునాదిని పెంచుకోవడంలో భాగంగా ప్రజా సంఘాల నిర్మాణం మొదలయింది. రాష్ట్ర వ్యాప్తంగానూ, వివిధ జిల్లాల్లోనూ పలు సాహితీ సంస్థలు ఏర్పడ్డాయి. కామ్రేడ్ కోటేశ్వర్లుకు పార్టీతోనూ, సాహితీ సంస్థలతోనూ పరిచయాలు ఏర్పడ్డాయి. విప్లవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనసాగాడు. 1973లో ఆగస్టు 15న బూటకపు స్వాతంత్ర్య వేడుకలను బహిష్కరించి మూడు రంగుల జెండాను తగులబెట్టిన సంచలన ఘటనలో ఆయన పాల్గొన్నాడు. ఇలా విప్లవ కార్యకలాపాలలో చురుకైన పాత్ర వహిస్తున్న కామ్రేడ్ కోటేశ్వర్లును పోలీసులు అరెస్టు చేశారు. అది ఆయన జీవితంలో తొలి అరెస్టు. కానీ ఆ అరెస్టు ఆయన సుదీర్ఘ విప్లవ ప్రస్థానానికి ఎటువంటి ఆటంకాన్నీ కలిగించలేకపోయింది. ఆయన ప్రభావంతో క్రమంగా వాళ్ల ఇల్లు కూడా ఒక విప్లవకేంద్రంగా మారిపోయింది.

1974లో ఆయన డిగ్రీ పూర్తి చేశాడు. 1974 అక్టోబర్‌లో ఆవిర్భవించిన రాడికల్ విద్యార్థి సంఘం, 1975 ఫిబ్రవరి 23-24 తేదీలలో ప్రథమ మహాసభను జరుపుకుంది. దీనికి తమ జిల్లా నుండి కామ్రేడ్ కోటేశ్వర్లు విద్యార్థులను పెద్దయెత్తున కదిలించాడు.

1975 జూన్ 26 నుండి 1977 మార్చి వరకూ దాదాపు 20 నెలల పాటు దేశంలో అత్యవసర పరిస్థితి అమలయింది. దేశమే జైలుగా మారిన ఈ కాలంలో ఎంతో మంది విప్లవకారులు రహస్య జీవితానికి వెళ్లిపోయారు. పోలీసులకు పట్టుబడినవారు చిత్రహింసలనూ, జైలు శిక్షలనూ ఎదుర్కొన్నారు. గిరాయిపల్లి అమరులుగా చరిత్రకెక్కిన సూరపనేని జనార్దన్, మురళీమోహన్, ఆనందరావు, సుధాకర్‌లను ఈ కాలంలోనే ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపింది. ఎటువంటి నిరసనలనూ లెక్కచేయకుండా భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీసింది.

ఈ కాలంలో రహస్య జీవితానికి వెళ్లిన కార్యకర్తలకు అదొక పరీక్షా కాలం. నిర్బంధం వలన పార్టీ కాంటాక్టులు సరిగా లేక, ఆర్థికంగానూ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయినా ప్రజలను అంటిపెట్టుకొని వుంటూ నిప్పులు చెరిగే నిర్బంధంలోనే ప్రజా పునాదిని విస్తరింపచేయడానికి కృషి చేశారు. ఇలా కృషి చేసిన వారిలో కామ్రేడ్ కోటేశ్వర్లు కూడా వున్నాడు. ఈ నిర్బంధ కాలంలోనే 1977 జనవరిలో పార్టీ నాయకత్వం అత్యంత రహస్యంగా నాగపూర్ నగరంలో 'తెలంగాణా రీజినల్ కాన్ఫరెన్స్'ను జరుపుకుంది. ఆ కాన్ఫరెన్స్ (1974-75లలో సిఓసి రూపొందించిన) 'విప్లవానికి బాట' డాక్యుమెంట్‌ను ఆమోదించింది. దీనికి కామ్రేడ్ కోటేశ్వర్లు ప్రతినిధిగా హాజరయ్యాడు. అతివాద ఎత్తుగడలను సమీక్షించి వాటి నుంచి బయటపడడానికి ప్రజాపంథాపై ఆధారపడి సరైన ఎత్తుగడలతో ఆచరణలోకి వెళ్లేందుకు ఈ కాన్ఫరెన్స్ ఒక మలుపు లాంటిది. ఈ కాన్ఫరెన్స్ వెలుగులో ఆ చీకటి రోజుల్లోనే అనేకమంది కార్యకర్తలు ఆర్గనైజర్లుగా గ్రామాలకు తరలిపోయారు. అందులో భాగంగా కామ్రేడ్ కోటేశ్వర్లు సిరిసిల్లా తాలూకా మరిమడ్ల ప్రాంతంలో ఆర్గనైజేషన్ బాధ్యతలు చేపట్టాడు.

## ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆర్గనైజర్

సిరిసిల్లా ప్రాంతంలో బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే కామ్రేడ్ కోటేశ్వర్లు అరెస్టయ్యాడు. యాదృచ్ఛికంగా ఎమర్జెన్సీ ఎత్తివేసిన రోజునే ఆయన అరెస్ట్ కావడంతో ప్రాణాలకు ముప్పు తప్పింది. మూడు మాసాలలోపే కామ్రేడ్ కోటేశ్వర్లు జైలు నుంచి బెయిల్‌పై విడుదలై తన కార్యాచరణను కొనసాగించాడు.

ఎమెర్జెన్సీ కాలంలో విప్లవకారులు చేసిన రహస్య కృషి ఫలితంగా ఎమెర్జెన్సీ అనంతరం రాష్ట్రంలో పలు ప్రజా వెల్లువలు, ప్రజాస్వామిక ఆందోళనలు చోటుచేసుకున్నాయి. అందులో భాగంగా గిరాయిపల్లి బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టాలనే డిమాండ్ బలంగా

ముందుకు వచ్చింది. దీనిపై విచారణకు భార్గవ కమిషన్ నియమించబడింది. తార్కుండే కమిటీ ఏర్పడింది. ఈ కమిషన్, కమిటీలకు వాస్తవాలను వెల్లడించడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు కృషి కూడా వుంది.

1977 ఆగస్టులో నక్సల్బరీ వెల్లువ అందించిన పాఠాల వెలుగులో ఎ.పి.ఎస్.సి. నిర్దిష్ట పరిస్థితికి తగిన నూతన ఎత్తుగడలు రూపొందించిన నేపథ్యంలో విప్లవ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రాడికల్ విద్యార్థి సంఘం బలపడసాగింది. జిల్లా, తాలూకా ముఖ్య పట్టణాలలోని విద్యా సంస్థలన్నింటిలో రాడికల్ విద్యార్థి సంఘం ఒక నూతన శక్తిగా ఆవిర్భవించింది.

1978 ఫిబ్రవరిలో ఆర్ఎస్‌యు రెండవ రాష్ట్ర మహాసభలు జరిగాయి. అందులో పార్టీ తరఫున వక్తగా కామ్రేడ్ కోటేశ్వర్లు వర్తమాన రాజకీయ పరిస్థితులలో విప్లవ విద్యార్థుల కర్తవ్యం, బూటకపు ఎన్నికల బహిష్కరణలపై ఉత్తేజకరంగా ఉపన్యసించాడు. మహాసభ ఇచ్చిన పిలుపును అందుకొని వేసవి కాలంలో 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్ల ద్వారా వందలాది విద్యార్థి–యువజనులు 'దున్నేవారికే భూమి' నినాదాన్ని పల్లెల్లోకి ఉత్సాహంగా తీసుకెళ్లారు. అప్పటి నుండి యేటా గ్రామాలకు తరలండి వేసవి క్యాంపెయిన్‌లు జరగడం ఒక సాంప్రదాయంగా కొనసాగింది. విద్యార్థి–యువజనులకు రాజకీయ తరగతులు బోధించి వారిని గ్రామాలకు తరలించడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు విశేషమైన కృషి జరిపాడు. బహిరంగంగా పని చేయడానికి అనువుగా వున్న ఆనాటి వాతావరణాన్ని విప్లవోద్యమ నిర్మాణానికి మరింత శక్తివంతంగా వినియోగించుకోవడానికి పార్టీ సలహాపై కామ్రేడ్ కోటేశ్వర్లు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా కోర్సు (న్యాయ శాస్త్ర విద్య)లో చేరాడు.

1979లో రాడికల్ యువజన సంఘం, దాని తర్వాత 1981లో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఒకదాని వెంట మరొకటి ఉనికిలోకి వచ్చాయి. పల్లెల్లో విప్లవ కార్యక్రమాలు తీవ్రతరమయ్యాయి. తరతరాలుగా దొరల గడీలలో వెట్టిచాకిరీతో నడుంలు కుంగిపోయిన రైతాంగం విప్లవ రాజకీయాలతో సంఘటితం కాసాగింది. పాలేర్ల జీతాల పెంపుదల, పోరంబోకు, బంచరాయి, చెరువు శిఖం భూముల స్వాధీనం, భూస్వాముల భూముల స్వాధీనం పోరాటాలు ముందుకొచ్చాయి. ఈ పోరాటాలకు రాష్ట్రంలోని ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల భావాలు కలిగిన మేధావులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అండగా నిలిచారు. కామ్రేడ్ కోటేశ్వర్లు గైడెన్స్‌లో ఉపాధ్యాయుల, ఉద్యోగుల సంఘాలు తమ న్యాయమైన సమస్యలపై చురుగ్గా కదలసాగాయి. కామ్రేడ్ కోటేశ్వర్లు బహిరంగ కార్యక్రమాలన్నింటిలో చురుగ్గా పాల్గొంటూ నాయకత్వం వహించేవాడు. అనతి కాలంలోనే ఆయన నాయకత్వంలో జిల్లాలో రెండవ శ్రేణి నాయకులు అమరులు సాయిని ప్రభాకర్, దగ్గు రాజలింగం, బయ్యపు దేవేందర్ రెడ్డి తదితర కామ్రేడ్స్ ఎదిగి వచ్చారు. కోటేశ్వర్లు తదితర కామ్రేడ్స్ చేసిన ఈ కృషి జగిత్యాల జైత్రయాత్రకు రంగం సిద్ధం చేసింది.

## చరిత్ర గతిని మార్చిన 'జగిత్యాల జైత్రయాత్ర'కు నేతృత్వం

1978 సెప్టెంబర్ 7న జగిత్యాల పట్టణం వేలాది మంది రైతాంగంతో కిటకిటలాడసాగింది. జూనియర్ కళాశాల ఆవరణ జనంతో కిక్కిరిసిపోయింది. డజన్ల కొద్దీ గ్రామాల నుండి రైతాంగం కదిలివచ్చారు. దున్నేవారికే భూమి నినాదం వారిని కదిలించింది. దొరల అత్యాచారాలు వాళ్లను పోరుబాట పట్టించాయి. ఆనాడు జరిగిన సభలో కామ్రేడ్ కోటేశ్వర్లు ఒక ముఖ్య వక్త. వేలాదిగా తరలివచ్చిన ఆ జనసంద్రం జగిత్యాల జైత్రయాత్రగా చరిత్రలో నిల్చిపోయింది. అమరుడు కామ్రేడ్ కోటేశ్వర్లు ఆ జనసంద్రం హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోయాడు.

జగిత్యాల జైత్రయాత్ర సృష్టించిన విప్లవ రాజకీయ వాతావరణంలో పలువురు కరుడుగట్టిన భూస్వాములు పల్లెలు విడిచి పట్నాలు పారిపోయారు. కొందరు భూస్వాములు రైతాంగం ముందు సాగిలపడ్డారు. లొంగిరాని భూస్వాములపై సాంఘిక బహిష్కరణ విధించారు. దొరల వందల ఎకరాల పంట భూములన్నీ దుక్కులు సాగక బీళ్లుగా మారాయి.

దానితో 'రాజ్యం' రంగప్రవేశం చేసింది. సిరిసిల్ల, జగిత్యాల తాలూకాలను చెన్నారెడ్డి ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. దొరల గడీల రక్షణ కోసం ప్రత్యేక సాయుధ పోలీసు బలగాలు పల్లెలకు చేరాయి. దీంతో రైతాంగం రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడి తీరాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.


పెద్దపల్లి తాలుకా రాఘనేడు గ్రామంలో తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించని భూస్వాములను రైతులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఆ రోజుల్లో ఈ ఘటన (1978) 'రాఘనేడు కిడ్నాప్'గా జిల్లాలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించింది. ఈ ఘటనకు కామ్రేడ్ కోటేశ్వర్లు నాయకత్వం వహించాడు. జిల్లాను ఖాకీ వలయంగా మార్చి తుపాకీ సన్నీలను పల్లె పల్లెపై ఎక్కుపెడుతున్న పరిస్థితులలో తిరిగి కామ్రేడ్ కోటేశ్వర్లు రహస్య జీవితానికి వెళ్లాడు. కానీ కొద్ది రోజుల్లోనే అదే తాలూకాలోని రచ్చపల్లి గ్రామం వద్ద అరెస్టు అయ్యాడు. కొద్ది రోజుల్లోనే బెయిల్‌పై విడుదలై వచ్చి తిరిగి రహస్య జీవితానికి వెళ్లాడు. చుట్టుముట్టిన పోలీసు వలయం నుండి చాకచక్యంగా తప్పించుకున్న ఘటనలు ఆయన విప్లవ జీవితంలో అనేకం ఉన్నాయి.

## ఆంధ్రప్రదేశ్ ఉద్యమ సారథ్యం చేపట్టిన కామ్రేడ్ కోటేశ్వర్లు

కరీంనగర్ జిల్లాలో రైతాంగ ఉద్యమం సంఘటితం కాసాగింది. పల్లెల్లో విరుచుకపడిన ఖాకీల హింసా దౌర్జన్యాలను ప్రతిఘటించడం రైతాంగానికి క్రమంగా అలవాటైంది. 1977లో నూతన ఎత్తుగడలతో ప్రజలలో పార్టీ పనిని ప్రారంభించగానే కరీంనగర్, ఆదిలాబాద్ రెండు జిల్లాలను కలిపి వుమ్మడి జిల్లా పార్టీ కమిటీని ఏర్పర్చారు. ఈ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి) కాగా, కామ్రేడ్

కోటేశ్వర్లు ఈ కమిటీ సభ్యుడయ్యాడు. 1979 నాటికి రెండు జిల్లాలకు వేర్వేరుగా పార్టీ జిల్లా కమిటీలు ఏర్పడగా కరీంనగర్ జిల్లా పార్టీ కమిటీకి కామ్రేడ్ కోటేశ్వర్లు కార్యదర్శి అయ్యాడు. ఆ వెంటనే 1980 సెప్టెంబర్‌లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ 12వ మహాసభకు ప్రతినిధిగా హాజరైన కామ్రేడ్ కోటేశ్వర్లు రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత రెండు మూడు నెలలకు రాష్ట్రకమిటీ ఆయనను కార్యదర్శిగా ఎన్నుకుంది. అప్పటి నుండి కామ్రేడ్ ప్రహ్లాద్ పేరుతో ఆయన ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమానికి సారథ్యం వహించాడు.

పార్టీ 12వ రాష్ట్ర మహాసభ తీసుకున్న అతి ముఖ్యమైన నిర్ణయాలలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల రైతాంగ పోరాటాన్ని గెరిల్లాజోన్ స్థాయికి అభివృద్ధి చేయడం, విముక్తి ప్రాంత లక్ష్యంతో ప్రజా విముక్తి సైన్య నిర్మాణానికి బీజరూపాలైన దళాలను నిర్మించడానికి పార్టీలోని మూడవ వంతు కేడర్లను దండకారణ్యానికి పంపడం, ఉత్తర తెలంగాణలోని మిగతా జిల్లాలైన ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు, పలు ప్రాంతాలకు విస్తరించడం ప్రధానమైనవి. వీటి అమలుకై యావత్ పార్టీ యుద్ధ ప్రాతిపదికపై నడుం బిగించింది. 1980 జూన్-జూలై నాటికే కొంతమంది యువ విప్లవకారులను ఎంపిక చేసి రాష్ట్రకమిటీ దండకారణ్యానికి పంపింది. రాష్ట్ర కార్యదర్శిగా కామ్రేడ్ ప్రహ్లాద్ ఈ నిర్ణయాన్ని అమలు చేయడంలో ప్రముఖ పాత్ర పోషించాడు.



## ఫాసిస్టు రాజ్యహింసను ఎదిరిస్తూ విప్లవోద్యమ విస్తరణ

పార్టీని పునస్సంఘటితం చేయడానికి 1970లలో తీవ్రంగా కృషి చేసిన ముఖ్యమైన నాయకుడు కొండపల్లి సీతారామయ్య (కె.ఎస్.) 1982లో అరెస్టయ్యాడు. ఆయనను జైలు నుండి విడిపించుకు రావడానికి రాష్ట్రకమిటీ ఒక చర్యకు పథకం రూపొందించి అమలు చేసింది. ఆనాడది 'గ్రేట్ ఎస్కేప్'గా విప్లవ శిబిరాన్ని ఎంతగానో ఉత్సాహపర్చింది. ఆ సాహసోపేతమైన గెరిల్లా చర్యకు పథక రచన చేసిన వాళ్లలో కామ్రేడ్ ప్రహ్లాద్ ముఖ్యుడు.

పార్టీ నాయకత్వంలో పెంపొందుతున్న విప్లవోద్యమం శత్రువుకు రోజు రోజుకు కునుకు పట్టకుండా చేయసాగింది. దానితో మెరికల్లాంటి పార్టీ క్యాడర్లను శత్రువు హతమార్చసాగాడు. బూటకపు ఎన్‌కౌంటర్లలో అవార్డులు, రివార్డులు అందుకుంటున్న, క్రౌర్యం నిండిన ఖాకీ అధికారులు రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లో కామ్రేడ్ ప్రహ్లాద్ ఆనుపానులను పసిగట్టి ఆయనను పట్టుకోబోగా తన పిస్తోలుతో వాళ్లను ప్రతిఘటించి వాళ్ల కళ్లల్లో దుమ్ముకొట్టి నగర జనారణ్యంలో సునాయాసంగా కలిసిపోయాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను తీవ్రం చేసి విప్లవోద్యమంపై కత్తిగట్టి కాలుదువ్వుతున్న కరడుగట్టిన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించి బుద్ధి చెప్పాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. వర్గపోరాటం తీవ్రతరమవుతున్న క్రమంలో ప్రజాయుద్ధ రాజకీయాలతో సుశిక్షితులవుతున్న రైతాంగ, విద్యార్థి గెరిల్లాలు యాదగిరి రెడ్డి (ఖాజీపేట ఎస్ఐ), బుచ్చిరెడ్డి (పెద్దపల్లి డిఎస్‌పి), కోమల్ రెడ్డి (హెడ్ కానిస్టేబుల్), లక్ష్మణ్‌రావు (కాగజ్‌నగర్ ఎస్.ఐ.) లాంటి క్రూరమైన పోలీసు అధికారులను మట్టికరిపించారు.

రాజ్యం హత్యాకాండలను కొనసాగించి విప్లవోద్యమ విస్తరణను, సంఘటితీకరణను ఆపలేకపోయింది. 1985లో 'అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్య' ఏర్పడింది. అనేక రాష్ట్రాలలో ఏర్పడి పనిచేస్తున్న విప్లవ విద్యార్థి సంఘాలు ఒక దేశవ్యాప్త సమాఖ్యగా ఏర్పడి బలమైన విద్యార్థి ఉద్యమానికి పునాదులు వేశాయి. కామ్రేడ్ ప్రహ్లాద్ ఈ సమాఖ్య నిర్మాణానికి, ప్రథమ మహాసభల నిర్వహణకు పాటు పడ్డాడు.

"శత్రు అప్రకటిత యుద్ధాన్ని ఆత్మరక్షణ యుద్ధం ద్వారా ఓడిద్దాం...." అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ విడుదల చేసిన సర్క్యులర్ వెలుగులో పార్టీ ఆ సమయంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. శత్రువు కొనసాగిస్తున్న నిర్బంధ పరిస్థితుల్లో రాష్ట్రకమిటీని ఐదుగురికి కుదించాలనీ, స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడంలో భాగంగా గణనీయమైన సంఖ్యలో కార్యకర్తలను దండకారణ్యానికి తరలించాలనీ, దేశంలోని ఇతర రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్ ఆవల) ముఖ్యంగా పారిశ్రామిక పట్టణాలలో నూతనంగా శక్తులను మోహరించాలనీ పార్టీ ముఖ్యమైన ఎత్తుగడలు చేపట్టింది. ఈ క్రమంలో పార్టీ నిర్ణయం మేరకు కామ్రేడ్ కోటేశ్వర్లు దండకారణ్య ఉద్యమ మార్గదర్శకత్వ బాధ్యతలు చేపట్టి అడవికి పయనమయ్యాడు. రజాకార్లతో హోరాహోరీగా పోరాడి వీరమరణం చెందిన ఆదివాసీ యోధుడు 'రాంజీ గోండు' పేరును ఆయన పెట్టుకున్నాడు. అప్పటి నుంచి దండకారణ్య ప్రజలలో, కేడర్లలో 'రాంజీ దాదా'గా సుపరిచితుడై, అందరికీ అభిమానపాత్రుడై, వాళ్ల హృదయాలలో చిరస్థాయిగా స్థిరపడిపోయాడు.

## ప్రజాయుద్ధ సేనాని

కామ్రేడ్ రాంజీ ప్రజాయుద్ధ సూత్రాలను, గెరిల్లా యుద్ధతంత్రాన్నీ, ప్రజా సైన్య నిర్మాణావశ్యకతనూ, చైనా, వియత్నాం, రష్యా విప్లవాల అనుభవాలను, ఎర్రసైన్యం అనుభవాలను, ప్రపంచ యుద్ధాల అనుభవాలను, సున్-జూ, క్లాస్‌విట్జ్ తదితర యుద్ధ నిపుణుల రచనలను, వివిధ దేశాల సైనిక మాన్యువల్స్‌ను చాలా శ్రద్ధగా, లోతుగా అధ్యయనం చేశాడు. తాను అధ్యయనం చేయడంతో పాటు వాటిని పార్టీ కేడర్లతో చదివించడానికి ప్రత్యేక కృషి చేసేవాడు. సైనిక శిక్షణ పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించేవాడు. భారతదేశ

చరిత్రలో జరిగిన అనేక యుద్ధాలను, సిక్కుల పోరాట అనుభవాలను, తమిళ పులుల గెరిల్లా యుద్ధ అనుభవాలను శ్రద్ధాసక్తులతో అధ్యయనం చేసేవాడు. ఆ అనుభవాలను మావోయిస్టు సైనిక సిద్ధాంత వెలుగులో సమీక్షించి వ్యాసాల రూపంలో కేడర్లకు అందించడంలో ఎంతో కృషి చేశాడు. సైనిక ప్రజ్ఞా పాటవాలు పెంచుకోవడం కోసం ఆయన నిరంతరం అభ్యాసం చేసేవాడు.

1981 మొదలు 1989 వరకు దండకారణ్యంలో జరిగిన ప్రధాన సైనిక శిక్షణా శిబిరాలన్నింటిలో కామ్రేడ్ రాంజీ ఒక విద్యార్థిగా పాల్గొని సైనిక రంగంలో ప్రావీణ్యం సంపాదించాడు. 1983లో జరిగిన కేంద్ర సైనిక శిక్షణా శిబిరంలో ఆయన విద్యార్థిగా, రాజకీయ ఉపాధ్యాయుడుగా పాల్గొని ఆనాటికి మెరుగైన శిక్షణను బలగాలకు అందించడానికి రాష్ట్రకమిటీ కార్యదర్శిగా శక్తివంచన లేకుండా కృషి చేశాడు. ఆ తర్వాత ఏపి రాష్ట్ర కమిటీ, దండకారణ్య ఫారెస్ట్ కమిటీల చొరవతో 1987లో, 1989లో జరిగిన సైనిక శిక్షణా శిబిరాలు ప్రజాసైన్య అభివృద్ధిలో ముఖ్యమైన ఘట్టాలు. మావోయిస్టులుగా మారిన సోదర శ్రీలంక తమిళ జాతి పోరాటకారులు కార్మికవర్గ అంతర్జాతీయతత్వంతో ఆ క్యాంపులలో ఇన్‌స్ట్రక్టర్లుగా పాల్గొని అడ్వాన్స్‌డ్ మిలటరీ జ్ఞానాన్ని అందించారు. గెరిల్లాలకు అవసరమైన సైనిక మెళకువలను నేర్పారు. వీటన్నింటినీ కామ్రేడ్ రాంజీ చాలా పట్టుదలగా నేర్చుకున్నాడు. ఆ అనుభవాన్ని ఆయన జంగల్ మహల్‌లో గెరిల్లాలకు కమాండర్‌గా, సైనిక ఇన్‌స్ట్రక్టర్‌గా అందించి శత్రువుపై సాహసోపేతమైన దాడులు చేసి విజయాలు సాధించడానికి తోడ్పడ్డాడు. 2010 ఫిబ్రవరి 15న 24 మంది ఈస్టర్న్ ఫ్రాంటియర్ రైఫిల్స్ జవాన్లను మట్టుబెట్టిన సిల్దా రెయిడ్‌ను ఆయన సైనిక ప్రతిభా పాటవాలకు వుదాహరణగా చెప్పుకోవచ్చు. సైనిక క్రమశిక్షణకు కామ్రేడ్ రాంజీ పెట్టింది పేరు. శరీర దారుఢ్యానికి ఆయన ఎంతటి ప్రాధాన్యతను ఇచ్చేవాడో, గెరిల్లా క్రమశిక్షణలో భాగంగా అందరిచే దానిని పాటింపజేయడానికి అంతే శ్రద్ధ చూపేవాడు. గెరిల్లా దళాల అనుభవాలను క్రోడీకరించి వాటికి స్థాయీ ఆదేశాల (స్టాండింగ్ ఆర్డర్స్)ను రూపొందించి అందించడంలో, వాటిని క్రమశిక్షణాయుతంగా అమలు చేయడంలో, చేయించడంలో కామ్రేడ్ రాంజీ పాత్ర ముఖ్యమైనది. 1999లో గెరిల్లా సైన్య నిర్మాణంపై పార్టీ కేంద్రకమిటీ (సి.సి.) విస్తృతంగా లోతైన చర్చలు జరిపింది. 1980 నుంచి 1999 వరకూ పెంపొందిన దళాల, ప్లాటూన్ల అనుభవాలను సమీక్షించింది. ప్రజాయుద్ధంలో సాధించిన అభివృద్ధిని, విముక్తి ప్రాంత లక్ష్యాన్ని కూలంకషంగా చర్చించింది. ఆ చర్చల ఫలితమే కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిల అమరత్వ స్ఫూర్తితో వారి తొలి వర్ధంతియైన 2000 డిసెంబర్ 2 నాడు ప్రజా గెరిల్లా సేన (ప్రస్తుతం పి.ఎల్.జి.ఏ.) ఆవిర్భావం. ఇందులో కామ్రేడ్ రాంజీ తన వంతు పాత్ర పోషించాడు.

## దండకారణ్య ఉద్యమాభివృద్ధిలో

కామ్రేడ్ రాంజీ 1986 నుంచీ 1993లో కేంద్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టే వరకూ దండకారణ్య వుద్యమాన్ని అభివృద్ధి చేయడంపై కేంద్రీకరించాడు. 1987లో నూతనంగా ఏర్పడిన ఫారెస్టు కమిటీలో ఆయన సభ్యుడయ్యాడు. 1987-93 మధ్య కాలంలో ఆయన ఫారెస్టు కమిటీ సభ్యుడిగా, సెక్రటేరియట్ మెంబర్‌గా వుంటూ ఉద్యమాభివృద్ధికి కృషి జరిపాడు. గడ్చిరోలిపై ఆయన ఎక్కువ కేంద్రీకరిస్తూ, ఆదిలాబాద్ నుంచీ మన్యం కొండల (తూర్పు కనుమలు) వరకూ అన్ని డివిజన్ల ఉద్యమాల అభివృద్ధికి, 1989లో విస్తరించిన మధ్య భారతంలోని బాలాఘాట్ డివిజన్ అభివృద్ధికి ఆయన కృషి జరిపాడు. 1993 చివరలో ఆయన సీవోసీ సభ్యుడిగా ఉత్తరాది రాష్ట్రాలతో పాటు, ప్రధానంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో విప్లవోద్యమ బాధ్యతలపై వెళ్లినప్పటికీ దండకారణ్యంతో సజీవ సంబంధాలను కలిగి వుంటూ అక్కడ జరిగే ప్రతి యుద్ధచర్యను, రాజకీయ, నిర్మాణ మార్పులను శ్రద్ధగా తెలుసుకొనేవాడు.

## తూర్పు, ఉత్తర భారతావనిలో

1993 చివరి నుండి కామ్రేడ్ కిషన్‌జీ విప్లవ జీవితం ప్రధానంగా తూర్పు, ఉత్తర భారత రాష్ట్రాలలో, ప్రత్యేకించి పశ్చిమ బెంగాల్‌లో విప్లవోద్యమ అభివృద్ధితో, విస్తరణతో పెనవేసుకుంది. 1994 ప్రారంభం నుండి బెంగాల్‌ను తన ప్రధాన కార్యక్షేత్రం చేసుకుంటూనే ఢిల్లీ, హర్యానా, పంజాబ్, యుపి తదితర రాష్ట్రాలలో వుద్యమ అభివృద్ధికై కృషి చేశాడు. 1998లో పార్టీ యూనిటీతో విలీనం పూర్తయిన తర్వాత ఆయన బీహార్-ఝార్ఖండ్ రాష్ట్రాలలో కూడా విప్లవోద్యమాభివృద్ధికి పాటుపడ్డాడు. అక్కడ పార్టీ యూనిటీ నాయకత్వంలో గతం నుండి సాగుతున్న సాయుధ రైతాంగ విప్లవోద్యమాన్ని లోతుగా అధ్యయనం చేస్తూ దానిని మరింత వున్నత స్థాయికి ఎదిగించడం కోసం కృషి చేశాడు. రాష్ట్రకమిటీ సమావేశాలకు హాజరవుతూ, వుద్యమ ప్రాంతాల్ని పర్యటిస్తూ వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ గెరిల్లా యుద్ధాన్ని పెంపొందించడంలో తగిన గైడెన్స్ అందించాడు. పార్టీ సభ్యులను వృత్తి విప్లవకారులుగా తీర్చిదిద్దడంలో, ప్రజల్ని, వుద్యమాన్ని నిరంతరం అంటిపెట్టుకుని వుండేలా వాళ్లను మల్చడంలో ఆయన కృషి చేశాడు. 2004లో ఎంసీసీఐ, పీపుల్స్‌వార్ పార్టీల విలీనం తర్వాత కామ్రేడ్ కిషన్‌జీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, కొత్తగా ఏర్పడిన తూర్పు రీజనల్ బ్యూరోలో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి ప్రధానంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కేంద్రీకరించి పని చేశాడు. 2004లో రెండు పార్టీల విలీనం తర్వాత పశ్చిమ బెంగాల్‌లో మునుపటి రెండు పార్టీల నుండి వచ్చిన పార్టీ శ్రేణుల మధ్య బలమైన ఐక్యతను నెలకొల్పడానికి ఆయన ఎంతో కృషి చేశాడు.

పశ్చిమ బెంగాల్‌లోని సింగూరులో టాటా నిర్మించ తలపెట్టిన నానో కార్ల పరిశ్రమను, నందిగ్రామ్‌లో విదేశీ పెట్టుబడితో ఇండోనేషియా సలేం గ్రూపు నిర్మించపూనుకున్న కెమికల్ హబ్‌ను

ప్రజలు వ్యతిరేకించారు. మన పార్టీ సింగూర్, నందిగ్రాం రైతాంగానికి అండగా నిల్చింది. ఈ వుద్యమాలకు నాయకత్వం వహించేలా పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటీకి కామ్రేడ్ కిషన్‌జీ మార్గదర్శకత్వం వహించాడు. ఐక్య సంఘటనలో భాగంగా ఏర్పడిన రైతాంగ భూముల దురాక్రమణ వ్యతిరేక పోరాట కమిటీ (బియుపిసి)లో చేరిన ప్రజా సంఘాలను క్రియాశీలంగా గైడ్ చేస్తూ రైతాంగాన్ని తమ భూముల కోసం సమరశీల పోరాటాల్లోకి దించడంలో పార్టీ విజయవంతమైంది. దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు, వాళ్లకు అండగా నిల్చిన సామ్రాజ్యవాదులకు ఊడిగం చేయడానికి అంకితమైన 'మార్క్సిస్టులు' లక్షల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడి కోసం నందిగ్రామ్‌ను వల్లకాడుగా మార్చ పూనుకున్నారు. అక్కడ వాళ్లు చేయని ఘోరం అంటూ లేదు. సీపీఎం గూండాలు ఆధునిక రైఫిళ్లతో పోరాడే ప్రజలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అయినా జనం లొంగిపోలేదు. ప్రజలు, ప్రధానంగా యువత సాయుధ ప్రతిఘటనకు సిద్ధమై సోషల్ ఫాసిస్టు గూండాలను ఎదుర్కోవడంలో ముందు నిలిచారు. దీంతో వామపక్ష కూటమి ప్రభుత్వం నందిగ్రామ్ ప్రజా పోరాటం ముందు తలవంచక తప్పలేదు. నందిగ్రామ్ నుంచి కెమికల్ హబ్ తోక ముడిచింది. సింగూర్ నుంచి టాటా నానో గుజరాత్‌కు పరుగుతీసింది. ప్రజలు విజయం సాధించారు. ఆ విజయాల వెనుక కార్మికవర్గ అగ్రగామి దళం కృషి వుంది. దానికి కామ్రేడ్ కిషన్‌జీ నేతృత్వం వుంది.

## చారిత్రాత్మక లాల్‌గఢ్ ప్రజా ఉద్యమ నేత

నందిగ్రామ్ ప్రజా విజయ వార్షికోత్సవాల నాటికి లాల్‌గఢ్ తిరుగుబాటు ముందుకొచ్చింది. లాల్‌గఢ్‌లో జిందల్ ఒక స్టీలు ఫ్యాక్టరీ నిర్మించతలపెట్టి ప్రజలను తమ భూముల నుండి వెళ్లగొట్టే కుట్రకు పూనుకున్నాడు. బుద్ధదేవ్ భట్టాచార్య, రాంవిలాస్ పాశ్వాన్‌లు ఎర్ర తివాచీ పరిచి ఆయనకు స్వాగతం చెప్పారు. జంగల్ మహల్ ప్రజల ఆస్తులను ప్రత్యేకించి ఖనిజ సంపదను జిందల్ కొల్లగొట్టుకపోవడానికి వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. కానీ, జంగల్ మహల్ ప్రజ ఎదురు తిరిగింది. దీన్ని పెడచెవిన పెట్టిన జిందల్, బుద్ధదేవ్, రాంవిలాస్‌ల వాహనాల కాన్వాయి ప్రజా విముక్తి గెరిల్లా సైనికుల మందుపాతర విస్ఫోటనను చవి చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత పోలీసు బలగాలు ప్రజలపై విరుచుకుపడడంతో దానికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం వెల్లువెత్తి ఒక గొప్ప తిరుగుబాటు ప్రారంభమైంది. నవంబర్ 13 లాల్‌గఢ్ పోరాట దినంగా చరిత్ర కెక్కింది. నక్సల్బరీ వారసురాలిగా 'లాల్‌గఢ్' ఖ్యాతినార్జించింది.

ప్రజల సంఘటిత శక్తి ముందు దోపిడీ రాజ్యవ్యవస్థ ఆ ప్రాంతంలో కొద్ది మాసాలు పూర్తిగా స్తంభించి పోయింది. మేదినీపూర్, పురులియా, బంకూరా జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతమైన జంగల్‌మహల్‌లోని వందలాది గ్రామాలు యుద్ధ క్షేత్రాలుగా మారిపోయాయి. వేల సంఖ్యలో ప్రజా మిలీషియా సాంప్రదాయక ఆయుధాలతో సాయుధమయ్యారు. పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా, మొదలైన పోరాటం క్రమంగా పీడిత ప్రజల న్యాయమైన సమస్యలన్నింటిపైనా సమరశీల పోరాటాలుగా అభివృద్ధి చెందింది. అధిక ధరలకు వ్యతిరేకంగా, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు జరిగాయి. విద్యాలయాల నుంచి పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని, బూటకపు ఎన్‌కౌంటర్లు నిలివేయాలని, గ్రీన్ హంట్ సైనిక దాడిని వుపసంహరించాలని, సెజ్‌ల నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

ముప్పయి యేళ్లుగా తమను అనేక హింసా, యాతనలకు గురి చేసిన సోషల్ ఫాసిస్టు సి.పి.ఎం. గూండాలను ప్రజలు బజార్లోకి ఈడ్చారు. ఊరూరా కుఖ్యాతి గాంచిన గూండాలను ప్రజాకోర్టులు శిక్షించాయి. ఆ గూండాల ఘాతుకాలకు నిలయాలుగా మారిన సిపిఎం పార్టీ కార్యాలయాలను ప్రజలు కూల్చివేశారు. గూండాల ఆయుధాలను ప్రజలు స్వాధీనపర్చుకున్నారు.

ముప్పయి యేళ్లుగా సోషల్ ఫాసిస్టులు బాకాలూదుతున్న 'ప్రజా పాలన' అంతమై పీడిత, తాడిత ప్రజల పాలన మొదలైంది. విద్యా, వైద్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి వాటిని ప్రజలు తమ చేతిలోకి తీసుకున్నారు. ప్రజలు తమ సాహసిక పోరాటాలతో, అసమాన త్యాగాలతో నూతన చరిత్రను నిర్మించుకోసాగారు. దీనికి కామ్రేడ్ కిషన్‌జీ అందించిన మార్గదర్శకత్వం కొనియాడదగినది.

లాల్‌గఢ్ ఉద్యమాన్ని అనతి కాలంలోనే బెంగాల్‌లో తిరిగి 1970ల నాటి విప్లవ ప్రాంతాలైన సువర్ణముఖి నదీ తీరం వరకూ, గోపీవల్లభపూర్ జిల్లా సరిహద్దు వరకూ విస్తరించారు. ఢిల్లీ, కలకత్తా, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ సహా అనేక పట్టణాలలో విద్యార్థులను, మేధావులను, ప్రజాస్వామికవాదులను, ఆదివాసీ హితోభిలాషులను లాల్‌గఢ్ ఆకర్షించింది. ఆహ్వానించింది. చిత్ర నిర్మాతలను, కవులను, కళాకారులను, పాత్రికేయులను లాల్‌గఢ్ కదిలించింది. ఈశాన్య రాష్ట్రాల పోరాట ప్రజలను ఆలోచింపజేసింది. 'లాల్‌గఢ్ ఒంటరిగా లేదు, లాల్‌గఢ్ వెంట మేమున్నాం' అంటూ లాల్‌గఢ్ ప్రజా పోరాటాల సంఘీభావ కమిటీలు దేశవ్యాపితంగా ఉనికిలోకి వచ్చాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రంగా జరిగిన ఈ సంఘీభావోద్యమ నిర్మాణానికి కామ్రేడ్ కిషన్‌జీ తన వంతు కృషి చేశాడు.

## అంతర్గత పోరాటాల్లో దృఢంగా నిలిచి

కామ్రేడ్ కోటేశ్వర్లు పార్టీలో వివిధ సందర్భాల్లో తలెత్తిన అంతర్గత పోరాటాల్లో విప్లవ పక్షం వైపు దృఢంగా నిలబడుతూ అతి, మితవాద అవకాశవాదాల్ని, విచ్ఛిన్నకారుల్ని నిక్కచ్చిగా వ్యతిరేకించాడు. పార్టీ పంథాపై రకరకాల రివిజనిస్టులు, అవకాశవాదులు చేసే దాడుల్ని ఒక సైద్ధాంతిక యోధుడిగా ఎదుర్కొన్నాడు. 1985లో మునుపటి పీపుల్స్‌వార్ పార్టీలో సత్యమూర్తి తదితర అవకాశవాదులు సృష్టించిన సంక్షోభాన్ని రాజకీయంగా ఎదిరించి పార్టీని సమైక్యంగా, విప్లవ పంథాపై దృఢంగా నిలబెట్టడానికి ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశాడు. 1991లో ఆనాటి పార్టీ కార్యదర్శి కొండపల్లి

సీతారామయ్య స్వయంగా అవకాశవాదానికి గురై మరో సంక్షోభానికి కారకుడైన సందర్భంగా కూడా కామ్రేడ్ కోటేశ్వర్లు విప్లవ పక్షం వైపు దృఢంగా నిలబడ్డాడు. 1980 దశకంలో ఏపీలో మితవాద అవకాశవాదులతో జరిగిన సైద్ధాంతిక పోరాటంలో, పశ్చిమ బెంగాల్‌లో నయా రివిజనిస్టులతో నిరంతరం సైద్ధాంతిక-రాజకీయ పోరాటాన్ని నిర్వహించడంలో, 2002లో అప్పటి పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ కార్యదర్శి మాణిక్ ముందుకు తెచ్చిన అవకాశవాద రాజకీయాల్ని ఓడించడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు పోషించిన పాత్ర ఎంతో గొప్పది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర శాఖలో తలెత్తిన వివిధ సమస్యలపై ప్లీనంలను నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేశాడు. ఈ సైద్ధాంతిక పోరాటాల సందర్భంగా డాక్యుమెంట్లను, బుక్‌లెట్స్‌ను రూపొందించడంలో, వివిధ పత్రికల్లో చర్చలను నిర్వహించడంలో ఆయన కృషి ఎంతో వుంది. మొత్తంగా చూసినపుడు భావజాల, సైద్ధాంతిక, రాజకీయ విషయాలపై గట్టి పట్టును కలిగి వుంటూ నిరంతరం అధ్యయనం కొనసాగిస్తూ పార్టీ పంథాను అభివృద్ధి చేయడంలో, దాన్ని సంరక్షించుకోవడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు మహత్తర పాత్ర పోషించాడు. ఈ క్రమంలో మన పార్టీకి చెందిన అన్ని డాక్యుమెంట్లతో పాటు 'వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంట్‌ను సంపద్వంతం చేయడంలో కూడా ఆయన అవిరళ కృషి చేశాడు.

కామ్రేడ్ కోటేశ్వర్లు దిద్దుబాటు వుద్యమంలో ముందుశ్రేణిలో నిలబడి తప్పులు సరిదిద్దుకోవడంలోనూ ఆదర్శప్రాయుడిగా నిలిచాడు. 1984లో పార్టీలో ఆరు చెడులను సరిదిద్దడంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా తన నుండి జరిగిన లోపాలను గుర్తించి నిజాయితీగా ఆత్మవిమర్శను ప్రవేశపెట్టి కార్యదర్శి పదవి నుండి వైదొలిగాడు. రాష్ట్రకమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా కొనసాగుతూ తన తప్పుల నుంచి బయటపడడానికి చిత్తశుద్ధితో కృషి చేసి అనతికాలంలోనే అందరి మన్ననలు పొందాడు. పార్టీ కమిటీ సమావేశాలలో సహచర కామ్రేడ్స్ ఆయనపై చేసిన విమర్శలనూ, సూచనలనూ లోతుగా అర్థం చేసుకొని వాటిని సరిదిద్దుకునేవాడు.

## విప్లవకారుల ఐక్యతా కృషిలో

నక్సల్బరీ ఉద్యమం తాత్కాలికంగా వెనుకపట్టు పట్టిన తర్వాత తిరిగి వివిధ పీడిత వర్గాలు, సెక్షన్లలో, వ్యూహాత్మక ప్రాంతాలలో బలమైన విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేసే క్రమంలో దేశంలోని నిజమైన విప్లవకారుల సమైక్యతకు కృషి తీవ్రతరమైంది. 1990లలో ఈ కృషి ఫలితాలను ఇవ్వసాగింది. కామ్రేడ్ కోటేశ్వర్లు కూడా దేశంలోని సోదర విప్లవకారులతో, సంస్థలతో ఐక్యత కోసం కృషి చేశాడు. ప్రత్యేకించి మునుపటి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్), సీపీఐ (ఎం-ఎల్) పార్టీ యూనిటీల మధ్య 1998లో జరిగిన విలీనంలో ఆయన ముఖ్య పాత్ర పోషించాడు. మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 2001 కాంగ్రెస్ సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణ, ఎత్తుగడలపర విషయాలలో చేసిన మదింపు, అది కొనసాగించిన ఆచరణ వల్ల అదే విధంగా, ఈ విషయాలలో ఎం.సి.సి.ఐ. అప్పటికి సాధించిన ఫలితాల వల్ల రెండు పార్టీల ఐక్యతకు కావలసిన ప్రాతిపదిక ఏర్పడింది. భారతదేశంలోని ఈ రెండు ప్రముఖ విప్లవ ప్రవాహాల మధ్య 2004 సెప్టెంబర్ 21న జరిగిన చారిత్రాత్మక విలీనంలో, అవి రెండూ సమైక్యమై ఒక మహా ప్రవాహంగా రూపుదిద్దుకోవడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆ రెండు పార్టీల మధ్య అనేక దఫాలుగా జరిగిన ద్వైపాక్షిక సమావేశాల్లో కామ్రేడ్ కోటేశ్వర్లు సిపిఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ప్రతినిధి వర్గంలో సభ్యుడిగా పాల్గొన్నాడు. రెండు పార్టీల ఆచరణలోని పాజిటివ్ అంశాలను సంశ్లేషించి దాన్ని నూతన సమైక్య పార్టీ డాక్యుమెంట్లలో పొందుపర్చడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు కృషి చేశాడు.

## సౌహార్ద సంబంధాల ప్రగతిలో

భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో పెంపొందుతున్న విప్లవోద్యమం, నేపాల్‌లో వేగంగా ముందుకు వచ్చిన ప్రజాయుద్ధం ఆధారంగా దక్షిణాసియాలో ఒక విప్లవ సమన్వయ కేంద్రాన్ని నిర్మించే దిశలో మన పార్టీ చొరవతో కృషి చేసింది. రిమ్ (రివల్యూషనరీ ఇంటర్నేషనలిస్టు మూవ్‌మెంట్)తో మన పార్టీ విడిగా సంబంధాలు కొనసాగిస్తూనే దక్షిణాసియాలోని మావోయిస్టు విప్లవ పార్టీలతో, గ్రూపులతో సౌహార్ద సంబంధాలను ఏర్పర్చుకొంది. 1996లో ఢిల్లీలో జాతుల సమస్యపై జరిగిన సెమినార్‌లో ఎం.సి.సి., పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీ పార్టీలు చొరవతో పాల్గొని, జాతుల సమస్య పట్ల తమ వైఖరులను ప్రవేశపెట్టాయి.

అలాగే దేశంలోని అనేక పోరాట సంస్థలతో కామ్రేడ్ కోటేశ్వర్లు స్నేహ సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. అసోం, నాగాలాండ్, మణిపూర్ మొదలైన రాష్ట్రాలలో విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న జాతి విముక్తి పోరాట సంస్థలతో విప్లవకర సంబంధాలను నెరపుతూ భారత దోపిడీ పాలకవర్గాల విస్తరణవాదానికి వ్యతిరేకంగా సమైక్య పోరాట అవగాహనను పెంపొందింపజేయడంలో ప్రశంసనీయమైన పాత్రను పోషించాడు. కాశ్మీర్ ప్రజా పోరాట సంస్థలతో ఐక్య సంఘటన నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశాడు. దశాబ్దాలుగా రివిజనిజాన్ని నరనరాన జీర్ణించుకున్న సోకాల్డ్ కమ్యూనిస్టుల పట్ల నమ్మకం కోల్పోయిన జాతి విముక్తి పోరాట సంస్థలతో మన పార్టీ విధానాల ఆధారంగా సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని వారితో ఉమ్మడి పోరాట అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకోవడంలో ఆయన నిర్వహించిన పాత్ర విశిష్టమైనది.

## పార్టీ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లలో

కామ్రేడ్ కోటేశ్వర్లు పార్టీ నిర్వహించిన పలు కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. నాటి భారత కమ్యూనిస్టు పార్టీ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) 1995లో నిర్వహించిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌లోనూ, 2001లో నిర్వహించిన 9వ కాంగ్రెస్‌లోనూ కామ్రేడ్ కోటేశ్వర్లు సైద్ధాంతికంగా, రాజకీయంగా చురుకైన పాత్ర పోషించి, పార్టీ పంథాను, పార్టీ డాక్యుమెంట్లను

అభివృద్ధి చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు. పలు సందర్భాల్లో ముందుకు వచ్చిన అతివాద, మితవాద ధోరణులను ఆయన వ్యతిరేకించాడు. 2007లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్ విజయవంతం కావడంలో తను ముఖ్యమైన పాత్ర పోషించాడు.

## అభిమానం, ఆత్మీయత, ఆప్యాయతల కలబోత

కామ్రేడ్ రాంజీ పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఒక నాయకుడిగానే కాకుండా అత్యంత ప్రేమాస్పదుడుగా, ఆత్మీయుడుగా మెలిగే వాడు. ఏ వయస్సు వాళ్లతోనైనా, ఎలాంటి సామాజిక నేపథ్యం గలవాళ్లతోనైనా, మహిళలైనా, పురుషులైనా అందరితో ఆయన కలగలిసి పోయేవాడు. ఆత్మీయతను పంచేవాడు. క్యాడర్ల అవసరాలను తెలుసుకోవడమే గాకుండా వాటిని బాధ్యతగా గుర్తు పెట్టుకొని తీర్చేవాడు. అందుబాటులో ఉన్న కామ్రేడ్స్‌ను తప్పనిసరిగా కలిసేవాడు. తమకు తెలియని ఎన్నో విషయాలు చెప్పి, తమ లోపాలను గుర్తింపజేసి, తమలోని మంచిని భుజం తట్టి ప్రోత్సహించి మోటివేట్ చేసే నాయకుడిగా అందరూ ఆయనను అభిమానించే వాళ్లు.

ఆయన పార్టీలో చేరినప్పటి నుండీ తన ఆత్మీయులను సైతం విప్లవోద్యమంలోకి ఆకర్షించేందుకు ప్రత్యేకంగా కృషి చేశాడు. తనతో పాటు తన తమ్ముడిని కూడా విప్లవ కార్యకలాపాలలోకి తీసుకొచ్చి విప్లవోద్యమ కార్యకర్తగా, నేతగా తీర్చిదిద్దడంలో కామ్రేడ్ రాంజీ అందించిన ప్రోత్సాహం, తోడ్పాటు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి. 1984లో విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా పని చేస్తున్న ఒక కామ్రేడ్‌తో ఆయన పెళ్లి జరిగింది. ఆమెకు ఆయన ఎంతో తోడ్పాటు అందించేవాడు. ఆమె విప్లవోద్యమంలో ఒక ప్రముఖ నాయకురాలిగా ఎదిగేలా ఆయన అందించిన ప్రోత్సాహం ఎంతో గొప్పది. తమ తమ బాధ్యతల రీత్యా దూర ప్రాంతాల్లో వుంటూ, శత్రువు చేసే క్రూర దాడుల మధ్య తరచుగా కలవడం ఏ మాత్రం వీలు కాని పరిస్థితులలో విప్లవ ప్రయోజనాలే పరమావధిగా పని చేసిన ఆదర్శ జంట వాళ్లిద్దరిదీ. తన తల్లికి ఆయన పత్రికాముఖంగా రాసిన వుత్తరాలు ఆమెకూ, ఆమె లాంటి తల్లులందరికీ విప్లవ సందేశాన్ని అందించి, వుద్యమ పరిస్థితిని అవగతం చేయించే ప్రయత్నమే కాకుండా ఆయన లోని మానవీయ స్పర్శకు నిదర్శనంగా నిలుస్తాయి.

## కలంతోనూ, గళంతోనూ కొనసాగించిన యుద్ధం

కామ్రేడ్ కోటేశ్వర్లు మంచి రచయిత, కవి, విమర్శకుడు, వక్త. ఆయన ఎన్నో కవితలు, వ్యాసాలు రాసాడు. అనేక కలం పేర్లతో ఆయన రాసేవాడు. చివరలో 'అసిధార' పేరును స్థిరపర్చుకున్నాడు. ఆయన పార్టీ పరంగా చేసిన రచనలు అనేకం ఉన్నాయి. వివిధ సమస్యలపై వెంట వెంటనే స్పందించి రచనలు చేయడం ఆయన ప్రత్యేకత. పార్టీ పత్రికలకే కాకుండా బూర్జువా ప్రింటు మీడియాకు కూడా తన రచనలు పంపేవాడు. పార్టీపై, విప్లవోద్యమంపై కుహనా విప్లవకారులు, శత్రువు చేసే దాడిని మార్క్సిస్టు తర్కంతో తిప్పికొట్టేవాడు. విప్లవ పత్రికలను నడపడంలో ఆయన అమితాసక్తిని ప్రదర్శించేవాడు.

క్రాంతి, రాడికల్ మార్చ్, కార్మిక పథం, ప్రభాత్, వ్యాన్‌గార్డ్, అవామీ జంగ్ వగైరా పత్రికలను నడపడంలో ఆయన చొరవగా కృషి చేశాడు. పశ్చిమ బెంగాల్‌లో పలు విప్లవ పత్రికలను ప్రారంభించడంలో, నడిపించడంలో ఆయన మార్గదర్శకత్వం అందించాడు. ఆయన సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక, సామాజిక విషయాలన్నింటిపై అధ్యయనం చేసి పలు వ్యాసాలు రాశాడు. దండకారణ్యంలో ప్రాంతాల వారిగా ప్రజల భాషలో పత్రికలు తేవాలని తపన చెందాడు. దండకారణ్య సాహిత్య పత్రిక 'ఝంకార్'ను అనేక రకాలు ప్రోత్సహించేవాడు. పుస్తకాల ప్రచురణ పట్ల కూడా చాలా శ్రద్ధ వహించేవాడు.

ఆయన రాసే ఉత్తరాలు కూడా కవితాత్మకంగా వుండేవి. తను రాయడమే కాకుండా తోటి కామ్రేడ్స్‌తో రాయించడం, వాటిలోని లోపాల్ని వివరించడం, విమర్శించడం, ప్రోత్సాహాన్నివ్వడం కామ్రేడ్ రాంజీ విశిష్ట లక్షణంగా వుండేది. ముఖ్యంగా మహిళా కామ్రేడ్స్‌ను రచయితలుగా ఎదగడానికి ప్రోత్సహిస్తూ వారి రచనలపై సలహాలు, సూచనలు ఇచ్చేవాడు.

1984లో ఆలకూరపాడులో విరసం నిర్వహించిన ప్రజాకళారూపాల వర్క్‌షాపుకు చేసిన సూచనలు, వాళ్లతో పంచుకున్న ఆలోచనలు విప్లవ రచయితలకు బాధ్యతను గుర్తు చేస్తుంటాయి.

కామ్రేడ్ కోటేశ్వర్లు మంచి వక్త. ఆయన ఏ విషయంపైనైనా అనర్గళంగా మాట్లాడేవాడు. ఆయన ఏ ప్రాంతం వెళితే అక్కడి భాషలలో మాట్లాడడానికి ప్రయత్నించేవాడు. ఉద్యమ అవసరాల కోసం ఆయన కోయ, హిందీ, ఇంగ్లీషు, బంగ్లా భాషలను నేర్చుకున్నాడు. ఆయన ఉపన్యాసాలు శ్రోతల అవగాహనను పెంచేలా, ఉత్తేజాన్ని నింపేలా ఉండేవి.

కామ్రేడ్ కోటేశ్వర్లు 2007 నుండి పార్టీ తూర్పు రీజనల్ బ్యూరో అధికార ప్రతినిధిగా వున్నాడు. ఆ తర్వాత లాల్‌గఢ్ ఉద్యమ వెల్లువ కాలంలో ఆయన మీడియాతో నిత్య సంబంధాల్లో వుంటూ అనేక విషయాలపై పార్టీ వైఖరిని తెలుపుతూ వచ్చాడు. పాత్రికేయులతో ఆయన సత్సంబంధాలను కొనసాగించేవాడు.

## ఒక మార్క్సిస్టు ఉపాధ్యాయుడు

కామ్రేడ్ కోటేశ్వర్లు చేపట్టిన ముఖ్యమైన బాధ్యతల్లో క్యాడర్లకు విద్యాబోధన ఒకటి. ఆయన తొలినాళ్ల నుంచీ క్యాడర్లకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించి వాళ్ల ఎదుగుదలకు చాలా కృషి చేశాడు. 1996లో అమరుడు కామ్రేడ్ ఆజాద్ నేతృత్వంలో ఏర్పడిన కేంద్ర రాజకీయ పాఠశాల, స్కోప్‌లో కామ్రేడ్ కోటేశ్వర్లు కూడా భాగమయ్యాడు. నాయకత్వ క్యాడర్లకు సిద్ధాంత బోధనా

*(మిగతాది 34వ పేజీలో...)*

# తెలంగాణా ఉద్యమ నేత - పిఎల్‌జిఏ కమాండర్ కామ్రేడ్ గుండేటి శంకర్‌కు అరుణారుణ జోహార్లు!!

సీనియర్ తెలంగాణా ఉద్యమ నేత కామ్రేడ్ గుండేటి శంకర్ (శేషన్న, మహేష్, కృష్ణ) మనకిక లేరు. ఆయన దండకారణ్యంలోని ఒక గ్రామ పొలిమేరల్లో మార్చి 17న రాత్రి నిద్రలో వుండగా విషపు పాముకాటుకు గురై 18 సాయంత్రం ఏడున్నర గంటలకు అమరుడైనాడు.

పాము కాటుకు గురైన కామ్రేడ్ శంకర్‌ను పార్టీ చివరి వరకు బతికించుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విషం క్రమంగా తన శరీరంలోని ముఖ్యమైన సున్నిత భాగాల్లోకి వ్యాపించింది. అయినప్పటికీ ఆయన అత్యంత ధైర్య సాహసాలతో ఈ స్థితిని ఎదుర్కొంటూనే, తను కొద్ది సేపట్లో చనిపోతానని తెలిసి కూడా తన తోటి కామ్రేడ్స్‌కు ధైర్యాన్నిస్తూ మాట్లాడుతూనే ఉన్నాడు. అక్కడ అందుబాటులో లేని తన తోటి, నాయకత్వ కామ్రేడ్స్‌కు పేరు పేరునా లాల్‌సలాం చెబుతూనే తుది శ్వాస వదిలాడు. ఊహించని రీతిలో సహచరులను, పార్టీని విషాదంలో ముంచి కామ్రేడ్ శేషన్న అందర్నీ విడిచివెళ్లాడు. కామ్రేడ్ శేషన్నను కోల్పోవడం పార్టీకి తీవ్రమైన నష్టం. ఎన్‌టి విప్లవోద్యమానికి ఆయన మరణించిన రోజు విషాదకరమైన దినం.



భారత విప్లవంలో ఏపి విప్లవోద్యమానికి విశిష్టమైన స్థానముంది. ప్రస్తుతం ఆ ఉద్యమం తాత్కాలిక సెట్‌బ్యాక్‌లో వుంది. ఆ ఉద్యమాన్ని (ఏపి, ఎన్‌టి, ఏఓబి) మళ్లీ పునరుద్ధరించే మహత్తరమైన పార్టీ కృషికి కామ్రేడ్ శేషన్న అమరత్వం పెద్ద ఎదురుదెబ్బ. ప్రత్యేకించి నిర్దిష్టంగా ఆయన నాయకత్వం వహిస్తున్న ఆదిలాబాద్ జిల్లా వుద్యమానికి తీరని నష్టం. కామ్రేడ్ శేషన్న మన పార్టీ సీనియర్ నాయకత్వ కామ్రేడ్స్‌లో ఒకరు. సుదీర్ఘకాలం విప్లవోద్యమంలో అలుపెరగని కృషిచేస్తూ, ప్రజల, పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని చూరగొన్న సీనియర్ రాష్ట్ర కమిటి నాయకుడు. సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీ, నిర్మాణ రంగాల్లో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించిన నాయకుడు.

### కామ్రేడ్ శేషన్న కుటుంబ నేపథ్యం

కామ్రేడ్ శేషన్న 47 సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా, గోదావరిఖని పట్టణం, జవహర్‌నగర్‌లోని ఒక కార్మిక కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి గుండేటి రాజయ్య గని కార్మికునిగా పని చేశాడు. ఆయన తల్లిదండ్రులు ఆయనకు శంకర్‌గా నామకరణం చేశారు. ఆయన కుటుంబంలో పెద్దవాడు. విప్లవోద్యమంలో అడుగిడిన తర్వాత కామ్రేడ్ శంకర్ నల్గొండ జిల్లాలో బిజెపి గూండాల చేతిలో అమరుడైన కామ్రేడ్ శేషన్న స్ఫూర్తితో శేషన్నగా తన పేరు మార్చుకొన్నాడు. ఆ తర్వాత కాలంలో ఈ పేరు ప్రజలకు, సహచరులకు ప్రియమైనదిగా మారింది. కామ్రేడ్ శంకర్ నిర్మల్ పట్టణంలో విద్యార్థి ఆర్గనైజర్‌గా పని చేసినప్పుడు కృష్ణ అనే పేరుతో, ఖమ్మంలో పని చేసిన కాలంలో మహేష్ పేరుతో పని చేశాడు.

కార్మిక కుటుంబంలో అందులోను సింగరేణి కార్మికోద్యమం ఉన్న చోట జన్మించడం వలన కామ్రేడ్ శేషన్నకు సహజంగానే సామాజిక చైతన్యం, విప్లవ ప్రేరణ లభించింది. ఎందరెందరో నిరుపేదలు ఫ్యూడల్ గ్రామీణ జీవితం నుండి సింగరేణిలో బతుకు దెరువు కోసం ఉద్యోగంలో చేరుతారు. పల్లె జీవితానికి, కార్మిక జీవితానికి ఎంతో తేడా వుంటుంది. పల్లెటూర్లలో ఫ్యూడల్ అణచివేత కింద ఎలాంటి స్వేచ్ఛా లేని జీవనం వుంటుంది. పట్టణంలో కార్మిక జీవితం సంఘటిత శక్తిగా బతకడం నేర్పుతుంది. మెల్లగా సాగే పల్లెటూరు జీవితం, ఇక్కడ ఉరుకుల పరుగులతో కూడిన క్రమశిక్షణాయుతమైన జీవనసరళిగా మారుతుంది. కార్మికులకు వయోజన విద్య లభిస్తుంది. జీతం పేరిట డబ్బు చేతిలో ఉంటుంది. కుల కట్టుబాట్ల నుండి సాపేక్షికంగా విముక్తి లభిస్తుంది. పత్రికలు, ట్రేడ్ యూనియన్లు, అవి నడిపే రాజకీయ ప్రచారం ద్వారా దేశ, ప్రపంచ రాజకీయాలు అందుతాయి. కార్మిక శక్తి, ఐక్యత వలన కార్మికుల్లో, యువకుల్లో నాయకత్వ శక్తి అభివృద్ధి అవుతుంది. అందుకు కార్మికవర్గ రాజకీయాలు మరింత పదునుపెడుతాయి. కార్మిక కుటుంబాలు తమ పిల్లల్ని మంచిగా చదివించడానికి ప్రాధాన్యత నిస్తారు. మంచి బట్టలు కొని పెడతారు. తమ పిల్లల ఎదుగుదలను చూసి మురిసిపోతారు. మంచి తిండి సమకూర్చుతారు. అలాంటి కుటుంబంలో కామ్రేడ్ శేషన్న పుట్టి పెరిగాడు. అందరి కొడుకుల్లాగే కామ్రేడ్ శేషన్న తల్లిదండ్రుల ఆప్యాయతలు పొందాడు. ఇంటిలో పెద్ద కొడుకైన కామ్రేడ్ శేషన్నను చదివించడంతో పాటు పాలు, పెరుగులతో కూడిన మంచి ఆహారాన్ని పెట్టి ఆరోగ్యంగా పెంచి పెద్ద చేశారు. అందువల్ల కామ్రేడ్ శేషన్న మంచి శరీర సౌష్టవంతో పాటు, చురుకైన వాడుగా, తెలివైన వాడుగా అభివృద్ధి చెందాడు. ఇటువంటి కార్మికవర్గ నేపథ్యంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ శేషన్న కార్మిక జీవితంలోని మరో పార్శ్వం అయిన దోపిడీ అణచివేతలను ఎదిరించి, కార్మికులు పూర్తి స్వేచ్ఛగా జీవించే శ్రామిక రాజ్యాన్ని స్థాపించాలని కలలు గని, విప్లవోద్యమంలో ముందుకు సాగాడు.

## రాడికల్ విద్యార్థి నుండి రైతాంగ యోధుడిగా

60, 70 దశకాల్లో సమాజంలో వర్గపోరాట ప్రకంపనలు పుట్టి దేశంలోని యువజన, విద్యార్థులపై తీవ్రమైన ప్రభావాన్ని వేశాయి. ప్రతి ఒక్కరు సమాజం గురించి ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి వుండేది. అటువంటి నేపథ్యంలో నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలు యువజన, విద్యార్థులకు దిశాదశలను నిర్దేశించాయి. దాన్నందుకున్న వారంతా ఉవ్వెత్తున వుద్యమాల్లో చేరడం ప్రారంభమైంది. ఫలితంగా కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ వుద్యమాలు ముందుకు వచ్చాయి. సింగరేణిలో విప్లవోద్యమానికి సన్నాహాలు నక్సల్బరీ కాలం నుండే ప్రారంభమైనాయి. కరీంనగర్ ఆదిలాబాద్ ఉద్యమాలతో సింగరేణి కార్మికోద్యమం తాదాత్మ్యం చెందింది. భారత విప్లవంలోనే సింగరేణి కార్మికోద్యమం రివిజనిజాన్ని తుత్తునియలు చేయడంలో, మిలిటెంట్ కార్మికోద్యమాన్ని నిర్మించడంలో నూతన అనుభవాల్ని అందించింది. 80వ దశకంలో సింగరేణి నుండి కార్మికులు, యువకులు, విద్యార్థులు విప్లవోద్యమంలో చేరడం వెల్లువలా సాగింది. గోదావరిఖని పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో కామ్రేడ్ శేషన్న, సింగరేణి విప్లవోద్యమ నాయకుడు, సింగరేణి బెల్ట్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ కట్ల మల్లేష్ నేతృత్వంలో విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. చదువులో చురుకైన విద్యార్థిగా ఉన్న కామ్రేడ్ శేషన్నను పలువురు విద్యార్థులు అనుసరించేవారు. అనతి కాలంలోనే కామ్రేడ్ శేషన్న రాడికల్ విద్యార్థి సంఘ నాయకుడిగా ఎదిగాడు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న సమయంలో రైతాంగ పోరాట నిర్మాణం కోసం కార్యకర్తల అవసరం ఉందని, అందుకు సిద్ధం కావాలని పార్టీ ప్రతిపాదన పెట్టగానే, కామ్రేడ్ శేషన్న ఎలాంటి శషభిషలు లేకుండా ఇల్లు, చదువు విడిచిపెట్టి విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేయడానికి ముందుకు వచ్చాడు. 18 ఏళ్ల వయసులోనే రైతాంగ ఉద్యమంలో పాల్గొనడం కోసం ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ ఏరియా దళంలో 1983లో సభ్యుడిగా చేరాడు. అప్పటి నుండి 29 సంవత్సరాలుగా విప్లవోద్యమంలో అవిరళ కృషి జరిపాడు.

ఉవ్వెత్తున ఎగుస్తున్న గ్రామీణ, పట్టణ ఉద్యమాలను అణచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 1982లో ఉత్తర తెలంగాణా జిల్లాల్లో కేంద్ర రిజర్వు బలగాలను (సిఆర్‌పిఎఫ్) మోహరించింది. ఆదిలాబాద్ జిల్లా చెన్నూర్ తాలుకాలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు బలంగా సాగుతుండినాయి. ప్రభుత్వం ఈ వుద్యమాన్ని అణచడానికి బూటకపు ఎన్‌కౌంటర్స్ ప్రారంభించి కామ్రేడ్ పల్లె కనకన్నను హత్య చేసింది. ఏరియాలో తీవ్ర నిర్బంధకాండ కొనసాగుతున్న కాలంలోనే కామ్రేడ్ శేషన్న చెన్నూర్ సి.ఓ. దళంలో సభ్యుడిగా పని చేశాడు. ఆ రోజుల్లో రక్షణ కోసం దళం ఎల్లప్పుడూ కదలికలోనే వుండాల్సి రావడంతో, రోజుకు పదుల మైళ్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. రాత్రుల్లో ప్రజలను కలిసి ఆర్గనైజ్ చేయాల్సి వచ్చేది. యిలాంటి కఠిన సమయంలో కూడా సమయాన్ని చిక్కించుకొని పార్టీ సాహిత్యాన్ని చదివేవాడు. అలా మొదటి నుండి తనకు సాహిత్యం చదివే అలవాటు మెండుగా వుండేది. చదువు కోసం నిద్రను కూడా తగ్గించుకొని చదువుకు ప్రాధాన్యతనిచ్చేవాడు. ఈ ఆచరణ విప్లవ జీవితమంతా కొనసాగుతూ అభివృద్ధి చెందింది.

కామ్రేడ్ శేషన్న క్రమశిక్షణ, పట్టుదలను చూసి జిల్లా కమిటీ మంగి ఆదివాసీ ప్రాంతంలో పని చేస్తున్న దళానికి బదిలీ చేసింది. మంగి ఏరియా కొండలు, గుట్టలతో వుండడంతో పాటు, తినడానికి అక్కడ జొన్న గట్క మాత్రమే దొరుకుతుంది. ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో చాలా బీదరికం వుండేది. అలాంటి కష్ట పరిస్థితుల్లో పని చేయడానికి తగిన వాడని జిల్లా కమిటీ నిర్ణయించి పంపింది. 1983 చివరలో మంగి దళంలో చేరి, 1987 ప్రారంభం వరకు అక్కడ పని చేశాడు. ఆ కాలంలో ఆర్గనైజర్‌గా, రాజకీయంగా ఎంతో ఎదిగాడు. దానితో విద్యార్థి ఉద్యమ నిర్మాణం అవసరం కొరకు 1987 ప్రారంభంలో పార్టీ నిర్మల్ పట్టణ ఆర్గనైజర్ (సీఓ)గా పార్టీ కామ్రేడ్ శేషన్నను మంగి నుండి బదిలీ చేసింది. నిర్మల్ పట్టణంలో ఆర్గనైజర్‌గా కృష్ణ పేరుతో పని ప్రారంభించాడు. అక్కడకు వెళ్లిన అనతి కాలంలోనే విద్యార్థి, యువకుల్లో, ఆర్‌టిసి కార్మికుల్లో గుర్తింపు పొందాడు. అయితే ఒక ద్రోహి యిచ్చిన సమాచారంతో 1987 అగస్టులోనే పట్టణంలోని తన డెన్‌లో అరెస్టయి వరంగల్ జైలుకు పంపబడినాడు.

## జైలు జీవితం

1987 నుండి 1991 వరకు వరంగల్ జైలులో ఉన్నాడు. జైలు జీవితంలో దొరికిన సమయాన్ని ఉపయోగించుకొని మార్క్సిస్టు సిద్ధాంత అధ్యయనాన్ని చేపట్టాడు. పార్టీ డాక్యుమెంట్లను, ఇతర మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల డాక్యుమెంట్లను అధ్యయనం చేశాడు. ఈ అధ్యయనం ద్వారా సిద్ధాంత విషయాల్లో మంచి పట్టు సంపాదించాడు. జైలులో కూడా పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి వున్నాడు. జైలు కమ్యూన్‌ను నడపడంలో మంచి కృషి చేశాడు. జైలులో ఉన్న రాజకీయ ఖైదీలకు రాజకీయ పాఠాలు బోధించేవాడు. జైలును రాజకీయ పాఠశాలగా మార్చడంలో మంచి కృషి చేశాడు. జైలు ఖైదీల హక్కుల కోసం ఈ కాలంలో పోరాడాడు. ఒక వైపు అమరుడు కామ్రేడ్ శ్యాం, మరో వైపు అమరుడు కామ్రేడ్ మహేశ్ గైడెన్స్ కామ్రేడ్ శేషన్నకు నిరంతరం అందుతూ వుండేది. అలా జైలు జీవితంలో మంచి పరిణితిని సాధించి, 1991లో విడుదలైన వెంటనే మళ్ళీ మంగి దళంలో చేరాడు. 1992 అక్టోబర్‌లో జరిగిన జిల్లా ప్లీనం అనంతరం మంగి దళ కమాండర్‌గా బాధ్యతలు తీసుకొన్నాడు.

## వర్గపోరాట కొలిమిలో రాటుదేలిన ఆదిలాబాద్ ఉద్యమ నేత

1992 సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వం బి.ఎస్.ఎఫ్. బలగాలను మోహరించి ఉద్యమాన్ని అణచివేయాలని తీవ్ర నిర్బంధకాండ పెంచింది. ఈ సమయంలో జిల్లాలోని ముఖ్య నాయకులు కొందరు ఉద్యమాన్ని విడిచి వెళ్లిపోయారు. జిల్లాలో ఉద్యమ నిర్మాణ సమస్యలను పరిష్కరించుకోవడానికి 92 అగస్టులో

జిల్లా ప్లీనం జరిగింది. ఈ ప్లీనంలో కామ్రేడ్ శేషన్న మంచి పాత్ర పోషించాడు. జిల్లా ఉద్యమ నాయకత్వంలో కొందరిలో పేరుకుపోయిన వ్యక్తిగత పని విధానం, బ్యూరోక్రసీ లాంటి చెడు ధోరణులను తొలగించుకోవడానికి పార్టీ తీసుకొన్న నిర్ణయాల్లో కామ్రేడ్ శేషన్న చురుకైన పాత్ర పోషించాడు. అప్పటి నుండి జిల్లా ఉద్యమ నాయకుడిగా ఆయనలో ఎదుగుదల ప్రారంభమైంది. 1993లో ఏర్పాటు చేసిన తూర్పు ప్రాంతం సబ్ డివిజనల్ కమిటి సభ్యుడై మంగి, సిర్పూర్, చెన్నూర్ ప్రాంత ఉద్యమాలకు నాయకత్వం అందించాడు. 1995 జనవరిలో జరిగిన ఆదిలాబాద్ జిల్లా మూడవ మహాసభలో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికై మంగి, ఇంద్రవెల్లి, సింగపూర్, దళాలను గైడ్ చేశాడు. మంగి, ఇంద్రవెల్లి ఏరియాల్లో పార్టీకి ఉన్న ప్రజా పునాది, పోరాట వారసత్వం, భౌగోళిక స్థితిని దృష్టిలో వుంచుకొని ఆ ప్రాంతాలు దీర్ఘకాలంగా పార్టీకి బలమైన కేంద్రాలుగా పని చేశాయని, వాటిలో అందుకు తగిన శక్తులు వున్నాయని నమ్ముతూ వచ్చాడు. 2001 జనవరిలో జరిగిన మునపటి పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్‌లో పార్టీ గెరిల్లా బేస్‌లపై అవగాహన అందించగా ఆ ప్రాంతాలను గెరిల్లా బేస్‌లుగా అభివృద్ధి చేయగలమనే నమ్మకానికి వచ్చాడు.

ఆదిలాబాద్ ఉద్యమం తీవ్ర నిర్బంధం మధ్యనే దినదినం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆదివాసులు, ఆదివాసేతర ప్రజలల్లో బలమైన ఉద్యమం నిర్మాణం అయ్యింది. ఎన్నెన్నో రకాలైన వైవిధ్య పూరితమైన పోరాట నిర్మాణ రూపాలు ఉద్యమంలో ముందుకు వచ్చాయి. 80వ దశకంలో ఇంద్రవెల్లి వంటి ఆదివాసుల తిరుగుబాటు వెల్లువతో పాటు రాష్ట్రాన్నే అబ్బురపరిచిన రైతాంగ కరువు దాడులు జరిగాయి. అల్లంపల్లిలో గెరిల్లాలు చేసిన ఆంబుష్ రాష్ట్ర ప్రభుత్వాన్నే గడగడలాడించింది. ప్రజా ఉద్యమాల్లో, మిలటరీ ప్రతిఘటనలో జిల్లా ఉద్యమం అనేక అనుభవాలు సాధించింది. 1990లో రైతాంగం భూ ఆక్రమణ సాగించి అనేక వేల ఎకరాల భూస్వాముల భూములు ఆక్రమించింది. ఈ పోరాటాలన్నింటితో భూస్వామ్య వర్గ పునాదులు కదిలిపోయాయి. రాజ్యం పెద్ద ఎత్తున దమనకాండకు పాల్పడింది. మరో వైపు ఎన్‌టిఆర్ ప్రభుత్వం సంస్కరణలు పెద్ద ఎత్తున అమలు చేసింది. 1992 నాటికి ఈ పరిస్థితిని ఎదుర్కొంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాల్సి వచ్చింది. తీవ్ర నిర్బంధంలో వ్యక్తిగత బలహీనతలతో నాయకత్వంలో కొద్దిమంది ఉద్యమాన్ని విడిచి వెళ్ళిపోతే ఆదిలాబాద్ ఉద్యమం దెబ్బతిని పోయిందని పాలకవర్గాలు సంబరపడి పోయాయి. పాలకవర్గాలు వుద్యమంపై తీవ్రమైన దుష్ప్రచారం చేశాయి. అలాంటి పరిస్థితుల్లో ఉద్యమాన్ని నిర్మించడానికి ఆదిలాబాద్ జిల్లాలో నాయకత్వం ఓపికగా కృషి చేసింది. ముందు పార్టీని సంఘటిత పరిచింది. సాయుధ శక్తిని పునర్నిర్మించింది. ప్రజలతో సంబంధాలను దృఢతరం చేసింది. రాష్ట్రంలో మాదిరిగానే జిల్లాలో సామాజిక సంబంధాల్లో మార్పులు జరగడం ప్రారంభమైంది. 80వ దశకానికి భిన్నంగా 90వ దశకంలో ఆదివాసుల నుండి నూతన డిమాండ్స్ రూపకల్పన చేసి, నూతన పోరాట నిర్మాణ, రూపాలను ముందుకు తేవలసిన అవసరం ఏర్పడింది. 1994 నుండి ఈ కృషిని జిల్లా కమిటి ప్రారంభించింది. ఈ కృషి ఫలితంగానే ఆదివాసులకు స్వయం పాలన కావాలని 5,6 షెడ్యూల్ లాంటి రాజకీయ డిమాండ్స్‌ను ముందు పెట్టి ఆదివాసుల పోరాట సంస్థల ఏర్పాటును ప్రారంభించారు. మన రాష్ట్రంలో ఈ డిమాండ్స్‌పై ఆదిలాబాద్‌లోనే ముందుగా నిర్మాణాలు ప్రారంభమై ఇదే ధోరణితో ఆ తదుపరి కాలంలో నిర్మాణ పోరాట రూపాలు రాష్ట్రంలో ముందుకు వచ్చాయి. రైతాంగ వుద్యమాల్లో కవర్ సంఘాల్లో నిర్మాణాలు కూడా ఈ కాలంలోనే ముందుకు వచ్చాయి. ఈ మొత్తం కృషిలో కామ్రేడ్ శేషన్న ముఖ్య పాత్ర వహించాడు.

1995 అక్టోబర్‌లో జరిగిన ఉత్తర తెలంగాణ మొదటి మహాసభకు కామ్రేడ్ శేషన్న ఆదిలాబాద్ జిల్లా కమిటి నుండి ప్రతినిధిగా హాజరైనాడు. ఆ అనుభవంతో జిల్లా ఉద్యమాన్ని అభివృద్ధి పరచడంలో తన వంతు కృషి చేశాడు. 1996 నుండి జిల్లా వుద్యమం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. ఒకవైపు ప్రజా ఉద్యమాలు, మరోవైపు సాయుధ ప్రతిఘటన ఉ ధృతమైంది.

## వీరత్వాన్ని ప్రదర్శించిన సాహస గెరిల్లా యోధుడు

1996 నవంబర్‌లో సిర్పూర్ (యూ) పోలీస్ స్టేషన్‌పై గెరిల్లాలు విజయవంతమైన దాడి చేశారు. ఇందులో పోలీస్‌స్టేషన్ కూల్చి వేయబడింది. పది మంది పోలీసులు చనిపోయారు. ఆ దాడి ప్రభావం రాష్ట్రమంతటా పడి, ఆ తదుపరి రాష్ట్రంలో గెరిల్లాలు అనేక ప్రతిదాడులు చేయడానికి ప్రేరణగా నిలిచింది. ఈ దాడికి కామ్రేడ్ శేషన్న డిప్యూటి కమాండర్‌గా నాయకత్వం వహించాడు. ఆ తర్వాత నుండి కామ్రేడ్ శేషన్న మిలటరీ రంగంలో కేంద్రీకరించడం ప్రారంభించాడు. క్రమంగా ఆదిలాబాద్ జిల్లాలో 1999 ఫిబ్రవరిలో ఏర్పడిన ప్లాటూన్‌కు మొట్టమొదటి కమాండర్ అయినాడు. ఆ కాలంలోనే ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన మిలిటరీ దాడుల్లో పాల్గొని ప్రముఖపాత్ర వహించాడు. నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌పై, గోలేటి, ఇంద్రారంల్లో సిఐఎస్‌ఎఫ్ క్యాంపులపై, బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌పై జరిగిన దాడుల్లో పాల్గొన్నాడు. ఇలా విజయవంతమైన మిలటరీ దాడుల్లో పాల్గొని మంచి మిలిటరీ కమాండర్‌గా జిల్లా క్యాడర్ విశ్వాసాన్ని పొందాడు.

1999 సెప్టెంబర్/అక్టోబర్‌లో జరిగిన ఎన్‌టిఎస్‌జెడ్‌సి ప్లీనంలో ప్రతినిధిగా హాజరైనాడు. ఆదిలాబాద్ ఉద్యమంలో సంపాదించిన ప్రజా ఉద్యమ, మిలటరీ అనుభవాలను ఈ ప్లీనంలో చర్చించి, రాష్ట్ర పిఓఆర్‌ను సుసంపన్నం చేయడానికి తోడ్పడినాడు. 2000 చివరలో జరిగిన ఆదిలాబాద్ జిల్లా నాలుగవ మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. 2001 జనవరిలో జరిగిన ఎన్‌టిఎస్‌జెడ్‌సి రెండవ మహాసభలో ఎస్‌జెడ్‌సి సభ్యుడిగా ఎన్నుకోబడినాడు. మునుపటి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటి, 9వ కాంగ్రెస్ నిర్ణయంలో భాగంగా అప్పటికే ప్రజాసైన్యం ఏర్పాటు దిశలో భాగంగా పిజిఏను ఏర్పాటు చేయడం జరిగింది. 2001

జూలైలో జిల్లా కార్యదర్శి నుండి రిలీవ్ అయి మిలటరీ రంగంలో కేంద్రీకరించడానికి ఎస్ఎంసి మెంబర్‌గా, పశ్చిమ మిలటరీ కమాండర్-ఇన్-ఛీఫ్‌గా మిలటరీ బాధ్యతలు చేపట్టాడు. 2001 జనవరిలో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ 9వ పార్టీ కాంగ్రెస్‌లో కూడా కామ్రేడ్ శేషన్న ప్రతినిధిగా హాజరై చురుకైన పాత్ర పోషించాడు.

2000 నుండి ఎన్‌టి ఉద్యమంపై ప్రభుత్వ దాడి మరింత తీవ్రమయింది. ప్రభుత్వ గ్రేహౌండ్స్ దళాలు పక్కా సమాచారంతో గెరిల్లా బలగాలపై దాడులు చేయడం ప్రారంభించాయి. ఇలాంటి దాడులను కామ్రేడ్ శేషన్న నాయకత్వంలో మన పిజీఏ ఎదుర్కోవడం ప్రారంభించింది. 2001 చివర ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దమ్మన్నపేట అడవుల్లో మిలటరీ క్యాంపు జరుగుతున్న విషయం పోలీసులకు తెలిసి దాడికి వచ్చారు. ఈ విషయం తెలిసిన గెరిల్లాలు కామ్రేడ్ శేషన్న నాయకత్వంలో ముందే ఆంబుష్‌లో కూర్చొన్నారు. దానితో పోలీసులు కౌంటర్ ఆంబుష్‌కు గురై వెనక్కి వెళ్లిపోయారు. ఇద్దరు పోలీసులకు తీవ్రంగా గాయాలైనాయి. 2003 ఆగస్టులో సింగరేణి ప్రాంతంలో అకెనపల్లి అడవుల్లో ఉదయం పూట పోలీసులు కామ్రేడ్ శేషన్న వున్న గెరిల్లా దళంపై దాడి చేశారు. ఈ దాడిని తిప్పికొడుతూ గెరిల్లాలు క్షేమంగా రిట్రీట్ అయినారు. యిలాంటి పలు దాడుల్లో శత్రువును ధైర్యంగా ఎదుర్కొని కామ్రేడ్ శేషన్న క్షేమంగా రిట్రీట్ అయ్యేవాడు. ఆదిలాబాద్ జిల్లా తులసీపేట, దమ్మన్నపేట ఎన్‌కౌంటర్స్‌లో ధైర్యంగా పోరాడాడు.

పార్టీ నిర్వహించిన మిలటరీ క్యాంపుల్లో హాజరై మిలటరీ స్కిల్స్ నేర్చుకోవడమే కాకుండా మంచి మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా అభివృద్ధి చెందాడు. తాను మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌గా యితర రాష్ట్రాల్లోని గెరిల్లాలకు విజయవంతంగా ట్రైనింగ్ అందించాడు. 2003లో జరిగిన ఎన్‌టిఎస్‌జెడ్‌సి ప్లీనం తర్వాత నిజామాబాద్ డివిజన్ బాధ్యతలు చేపట్టాడు. 2006 మార్చి నుండి ఆదిలాబాద్-నిజామాబాద్ డివిజన్స్‌ను కలిపి ఏర్పాటు చేసిన సంయుక్త డివిజన్ బాధ్యతల్లో వున్నాడు.

## ఉత్తర తెలంగాణ ఉద్యమ పునర్నిర్మాణ కృషిలో

2004లో చర్చల కాలంలో ప్రభుత్వం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా దళాలపై పోలీసుల చేత, కోవర్టుల చేత దాడులను చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే నిజామాబాద్ జిల్లా మానాలలో కోవర్టు ఆపరేషన్‌లో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రమేష్‌తో పాటు 13 మందిని క్రూరంగా హత్య చేసింది. ఇలాంటి సమయంలో కామ్రేడ్ శేషన్న జిల్లా క్యాడర్లను నిలబెట్టడానికి తీవ్రమైన కృషి చేశాడు. తీవ్రమైన శత్రు నిర్బంధం-దాడుల మధ్య ఆదిలాబాద్-నిజామాబాద్ ఉద్యమాలను నిలబెట్టడానికి కృషి జరిపాడు.

ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగుతున్న తీవ్ర నిర్బంధం మూలంగా 2008లో జిల్లా నుండి క్యాడర్లను తాత్కాలికంగా రిట్రీట్ చేయడం జరిగింది. ఈ కాలంలో కామ్రేడ్ శేషన్న ఖమ్మం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. ఈ బాధ్యతల్లో 2008 నవంబర్ నుండి 2010 ఫిబ్రవరి వరకు వున్నాడు. ఇక్కడ కామ్రేడ్ మహేశన్న పేరుతో బాధ్యతలు నిర్వహించాడు. కంచాల్ ఎన్‌కౌంటర్ తర్వాత ఖమ్మం జిల్లా ఉద్యమం తీవ్రంగా దెబ్బతింది. ఖమ్మం జిల్లా ఉద్యమాన్ని మళ్లీ పునర్నిర్మాణం చేయడంలో కామ్రేడ్ మహేష్‌కు గల అనుభవం ఎంతో పని చేసింది. అనతి కాలంలోనే ఖమ్మం జిల్లా ఉద్యమాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేశాడు. కేడర్ రిక్రూట్‌మెంట్‌ను పెంచాడు. దండకారణ్యం-ఉత్తర తెలంగాణ ఉద్యమాల వారధిగా ఈ రెండు ప్రాంతాల సరిహద్దుల్లో, రెండు ప్రాంతాల ప్రజల, క్యాడర్ల మనోభావాలను, ఆచరణాత్మక సమస్యలను దృష్టిలో వుంచుకొని ఎంతో నైపుణ్యంగా పని చేశాడు. దండకారణ్య-ఉత్తర తెలంగాణా సమన్వయ కమిటీలో వుండి, ఈ ఉద్యమాల పరస్పర సహకారాన్ని అందజేసుకొనే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాడు.

ఎన్‌టి ఉద్యమం 2001 నాటికి ముందే తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురైంది. ఈ ఉద్యమాన్ని శత్రుదాడుల నుండి రక్షించుకొంటూ, మళ్లీ అభివృద్ధి చేయడాన్ని ఎన్‌టిఎస్‌జెడ్‌సి ముఖ్య కర్తవ్యంగా చేపట్టింది. ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి కామ్రేడ్ శేషన్న అహర్నిషలు కృషి చేశాడు. ఉద్యమం ఆటులో ఉన్నప్పుడు తిరోగమన ఎత్తుగడలు రూపొందించి, ఉద్యమాన్ని ఎలా రక్షించుకోవాలనే విషయంలో ఎప్పటికప్పుడు సిసి/ఎస్‌జెడ్‌సిలు రూపొందిస్తూ వచ్చిన ఎత్తుగడల నిర్ణయాల్లో చురుకైన పాత్ర పోషించాడు. ఉద్యమం తీవ్ర శత్రుదాడిని ఎదుర్కొంటున్నప్పుడే, అత్యంత కఠిన పరిస్థితుల్లో ప్రజలను, కేడర్లను ఉత్సాహపరుస్తూ, వారినంటి పెట్టుకొని వుండడంతో కామ్రేడ్ శేషన్నకు వాస్తవ పరిస్థితులపైన మంచి పట్టు వుండేది. దాని మూలంగా ఈ ఎత్తుగడలను ఆచరణలో అన్వయించడంలో, అభివృద్ధి చేయడంలో క్రియాశీల పాత్ర పోషించాడు. ఎప్పటికప్పుడు ఉద్యమంలో నిరంతరం కల్గుతున్న మార్పులపై, ఆయా సమయాల్లో ఎలాంటి పోరాట నిర్మాణాలు చేపట్టాలనే విషయంలో ఎంతో స్పష్టంగా, అనర్గళంగా కేడర్లకు బోధించేవాడు. ఈ పది సంవత్సరాల కాలంలో మంచి సిద్ధాంత అవగాహనను పెంచుకొని, విప్లవ పురోగమనానికి అవసరమైన నిర్ణయాలు చేయగలిగే దక్షతతో కూడి, మంచి భరోసానిచ్చే నాయకుడిగా ఎదిగాడు. ఎన్‌టిలో 2003, 2011లలో జరిగిన ప్లీనాల్లో, 2007లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఉద్యమం పునర్నిర్మాణం కోసం చేసిన చర్చల్లో మంచి పాత్ర పోషించాడు.

శత్రుదాడిలో స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడం, ఉద్యమాన్ని మెట్టుమెట్టుగా ఎదిగించుకోవడంలో భాగంగా 2011 ఎన్‌టి ప్లీనం తర్వాత ఆదిలాబాద్ ఉద్యమాన్ని పునరుద్ధరించే కర్తవ్యాన్ని భుజానికెత్తుకొని, ముందుకు సాగాడు. ఈ కృషిలో మంచి ఫలితాలు సాధించే క్రమంలో ప్రమాదవశాత్తు అమరుడయ్యాడు.

## నిత్య నిర్బంధంలో ఉద్యమాలకు ఊపిరులూదిన శేషన్న

తీవ్ర నిర్బంధంలో కూడా ప్రజలను కూడగట్టడం, ప్రజాసంఘాలను నడిపించడం, ప్రజా పోరాటాలకు అవసరమైన పోరాట డిమాండ్స్‌ను రూపొందించడం, కొత్తగా నిర్మాణ రూపాలను

ప్రవేశపెట్టడంలో కామ్రేడ్ శేషన్న తీవ్రమైన కృషి జరిపేవాడు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులకు, పోలవరం డ్యాం నిర్మాణంకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు నిర్మించాడు. ఈ మధ్య ఆదిలాబాద్ జిల్లాలో జి.వో. నెం. 27 పేరిట కవ్వాల అభయారణ్యం నుండి పదుల సంఖ్యలో గ్రామాలను తొలగించే దుర్మార్గమైన ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ఆదివాసులు చేపట్టిన ఆందోళనకు నాయకత్వం వహించాడు.

1996 నుండి సాగుతున్న ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ వుద్యమానికి నాయకత్వం అందించాడు. 2009 నుండి ఉవ్వెత్తున ఎగిసిన ఈ ఉద్యమాన్ని రాజకీయంగా, నిర్మాణపరంగా సంఘటితం చేయడానికి తీవ్రమైన కృషి చేశాడు. తీవ్ర నిర్బంధంలో కవర్ సంఘాల నిర్మాణం చేపట్టాడు. రహస్య పనికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత నిచ్చాడు.

## ఉద్యమ అవసరాలను గుర్తించిన విప్లవ రచయిత

ఈ కాలంలోనే విప్లవ అవసరాల కోసం కామ్రేడ్ శేషన్న మంచి రచయితగా ముందుకొచ్చాడు. ఆయన షంషేర్ అనే కలం పేరుతో కథలు రాసాడు. 1. యోధ, 2. మానాల విప్లవ జ్వాల, 3. వీరన్న బాటలో, 4. పోరువనంలో ఎర్రజెండా–పద్మ కథ, 5. అరుణ –స్వప్నల క్రాంతి బాట, 6. రాజన్న అంతర్మథనంపై, 7. ధర్మన్న, 8. మల్లేష్, 9. బాలన్న, 10. ప్రవీణ్, 11. సుధాకర్‌లపై, 12. శాంత 13.ఇద్దరు వీరవనితల కథ మొదలగు రచనలు చేశాడు. ఆయన శైలి సాధారణంగా ఉంటుంది. ఈ కథలన్నీ విప్లవ జీవితంలో ఉండే సంఘర్షణను తెలియజేస్తాయి. తనతో యుద్ధరంగంలో పాల్గొని, అమరులవుతున్న కామ్రేడ్స్ జీవిత చరిత్రలను ఆయన కథలు, కథానికలు, నవలికల రూపంలో కళ్లకు కట్టినట్లు రాసేవాడు. అట్టడుగు ప్రజల నుండి పోరాట రంగంలోకి ఎదిగిన కామ్రేడ్స్ పాత్రలనే ఆయన ఎంచుకున్నాడు. వారంతా రైతాంగ మహిళలు, పిఎల్‌జీఏ యోధులు, పార్టీ ఆర్గనైజర్లుగా వుద్యమంలో చురుకుగా పని చేసిన వారు. వీరి జీవిత చరిత్రలను చదువుతుంటే ఉద్యమంలో వీరు నిర్వహించిన పాత్రతో పాటు, వుద్యమ చరిత్రను కూడ అర్థం చేసుకోగలం. అమరవీరుల చరిత్రను కథల రూపంలో రాసి బయటి ప్రపంచానికి తెలియజేయడం అనేది విప్లవోద్యమంలో ఎంతో ఉపయోగకరమైన ప్రక్రియ. కామ్రేడ్ శేషన్న తాను రాయడమే కాక, కేడర్లను కూడా కథలు, కవితలు రాసేలా ప్రోత్సహించడంతో పాటు వారిని గైడ్ చేసేవాడు. ఉత్తర తెలంగాణా సాంస్కృతిక సాహిత్య పత్రిక – నెత్తుటి గోదావరిని వెలువరించడంలో ప్రత్యేకమైన కృషి చేసేవాడు. ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్న ప్రభుత్వ విధానాలను బహిర్గతపరుస్తూ ఆయన అమరత్వంకు ముందు అభ్యుదయ పత్రికలకు రాసిన వ్యాసాలు అమరత్వం తర్వాత అచ్చవుతూనే ఉన్నాయి. మొత్తం విప్లవ జీవితంలో ఆయన ఎన్నో కవితలు కూడా రాసాడు.

కామ్రేడ్ శేషన్న కాడర్లకు విప్లవ రాజకీయాలు బోధించడంలో ముందుండేవాడు. పార్టీ కేడర్ల ఎడ్యుకేషన్ కోసం నిర్వహించే క్లాసుల్లో తప్పకుండా ఒక టీచర్‌గా వుండేవాడు. దళ సభ్యుల నుండి జిల్లా కమిటీ స్థాయి కేడర్ల వరకు బోధించే వాడు. ఆయనకు మంచి రాజకీయ ఉపాధ్యాయుడు అనే గుర్తింపు క్యాడర్లలో ఏర్పడింది. తను చెప్పే సిద్ధాంత రాజకీయ పాఠ్యాంశాలకు, ఉద్యమ పాఠాలను అన్వయించి చక్కగా చెప్పేవాడు. పార్టీ చరిత్ర, మార్క్సిస్టు రాజకీయ మూల సూత్రాలు, పార్టీ డాక్యుమెంట్లపై విద్యార్థులకు బోధించేవాడు.

కామ్రేడ్ శేషన్న క్యాడర్లతో ఆత్మీయంగానూ, నాయకులతో వినయంగా, గౌరవ భావంతో వుండేవాడు. విప్లవం పట్ల అచంచల విశ్వాసం కలిగి వుండేవాడు. అత్యంత కఠిన పరిస్థితుల్లో నిబ్బరంగా పని చేసేవాడు. నిరంతరం ప్రజలతో మమేకమయ్యేవాడు. ఆయన కఠోరమైన అధ్యయనాన్ని చేసేవాడు. విమర్శనాత్మక పరిశీలనా దృక్పథం మెండుగా వుండేది. శత్రువుతో గొప్ప ధైర్య సాహసాలతో పోరాడేవాడు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి నిర్ణయాలు తీసికోవడంలో దిట్ట. సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ మిలటరీ రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందాడు. ఆయన విప్లవ రచయితగా, రాజకీయ బోధకుడుగా బహుముఖంగా ఎదిగిన కామ్రేడ్.

కామ్రేడ్ శేషన్న జైలు జీవితం నుండి విముక్తి పొంది, మళ్లీ వుద్యమంలో చేరిన అనంతరం 1992లో మంగి దళంలో పని చేసే ఆదివాసీ మహిళ కవితతో ఆయన వివాహం జరిగింది. ఆయన సహచరికి నిరంతరం రాజకీయాలు బోధిస్తుండేవాడు. చదువుకోవాలని నిరంతరం వుత్సాహపరిచేవాడు. విప్లవోద్యమంలో అనేక యిబ్బందుల మధ్య సుదీర్ఘకాలం వీరు సహచరులుగా జీవించారు. కానీ ఆమె రాజకీయంగా బలహీనపడి 2010లో వుద్యమాన్ని విడిచిపెట్టి, శత్రువుకు లొంగిపోయింది. దానితో కామ్రేడ్ శేషన్న వైవాహిక జీవితం సమాప్తమైంది.

కామ్రేడ్ శేషన్నకు పాము కరిచిన తర్వాత గ్రామ ప్రజలు అతన్ని బతికించుకోవడానికి చెట్ల మందులు పోశారు. కాని అవి కూడా పనిచేయలేదు. ఈ నిర్బంధ కాలంలో కామ్రేడ్ శేషన్న భౌతికకాయాన్ని ప్రజాసంఘాలకు గాని, తన కుటుంబానికి గాని పార్టీ అప్పజెప్పలేకపోయింది. కామ్రేడ్ శేషన్న అంతిమ యాత్రలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. పార్టీ సాంప్రదాయాల ప్రకారం ఆయనకు ఎర్రజెండా కప్పగా, ప్రజలు తమ ఆచారం ప్రకారం పదుల సంఖ్యలో తెల్ల గుడ్డలు కప్పారు. ఆ గ్రామ స్మశాన వాటికలో స్థానం యిచ్చి ఎంతో గౌరవాన్ని ప్రదర్శించారు. కామ్రేడ్ శేషన్న భౌతిక కాయాన్ని చూసి కేడర్, ప్రజలు భోరున ఏడ్చారు. నాయకులు, కేడర్ ఒక్కొక్కరు కామ్రేడ్ శేషన్న భౌతిక కాయంపై పూల గుచ్ఛాలను, పూలను వుంచి, విప్లవ నినాదాలు చేశారు. విప్లవ నినాదాలు, పాటల మధ్య కామ్రేడ్ శేషన్న అంతిమ యాత్ర వుద్వేగంగా జరిగింది. కామ్రేడ్ శేషన్న మృతికి సంతాపంగా పార్టీ సభ్యులు, ప్రజలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయనకు గౌరవ వందనం సమర్పించడానికి ఎస్‌జెడ్‌సి సభ్యుడు గాలిలోకి తుపాకితో మూడు రౌండ్లు కాల్చగా, ఆయన చితికి కేంద్రకమిటీ సభ్యుడు నిప్పంటించాడు.

**(మిగతాది 28వ పేజీలో...)**

# పీడిత ప్రజల సమరశీల నేత

# కామ్రేడ్ హరక్ (శ్రీకాంత్)కు అరుణారుణ జోహార్లు

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ శ్రీకాంత్ సుదీర్ఘ అనారోగ్యం తర్వాత, 2012 ఫిబ్రవరి 26న అమరుడయ్యాడు. ఆయన వయస్సు దాదాపు 48 సంవత్సరాలు. ఆయన గత 14 ఏళ్లుగా గడ్చిరోలి జిల్లాలో విప్లవోద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తూ వచ్చాడు. 2004లో ఆయనకు మొదటిసారి ఛాతీలో నొప్పి మొదలైంది. డాక్టరుకు చూపించుకోగా ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చినట్టు బైటపడింది. అప్పటి నుండి ఆయన మందులు తీసుకోవడం ప్రారంభించాడు. ఆ తర్వాత గెరిల్లాజోన్‌లో వుండే కఠిన పరిస్థితులు, శత్రువు సాగిస్తున్న భారీ నిర్బంధకాండ నడుమ ఆయనకు రెగ్యులర్‌గా వైద్య చికిత్స చేయించుకునే అవకాశం లేకుండా పోయింది. తగినంత విశ్రాంతి, ఇతర సౌకర్యాలు కరువయ్యాయి. తన అనారోగ్యాన్ని ఏ మాత్రం లెక్క చేయకుండా విప్లవ కార్యకలాపాల్లో నిరంతరాయంగా పాలు పంచుకున్న ధీరోదాత్త నేత ఆయన. 2011 మధ్య నుండి ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతినసాగింది. శత్రు నిర్బంధం మూలంగా వైద్య సదుపాయాలు, మందులు లభించడంలో ఆలస్యమైంది. ఆయనను రక్షించుకోవాలని పార్టీ నాయకత్వం, పీఎల్‌జీఏ కామ్రేడ్స్ ఎంతగానో ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తన సహచరులను, గడ్చిరోలి జిల్లా సమరశీల ప్రజలను దుఃఖ సాగరంలో ముంచుతూ ఆయన మన నుండి తుది వీడ్కోలు తీసుకున్నాడు.



కామ్రేడ్ శ్రీకాంత్‌కు తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు 'హరక్'. స్నేహితులు, పరిచయస్తులు ఆయనను ప్రేమగా 'గుండూ' లేదా 'గుండూ భయ్యా' అని పిలిచేవారు. నిజానికి ఆయన ఈ పేరుతోనే అందరికీ సుపరిచితుడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన తల్లిదండ్రులు ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాకు చెందిన కార్మిక పట్టణమైన దల్లీరాజహరాలో స్థిరపడ్డారు. అక్కడే కామ్రేడ్ శ్రీకాంత్ పెరిగి పెద్దయ్యాడు. ఆయన విద్యాభ్యాసం దల్లీరాజహరాలో, ఇతర చోట్లలో పూర్తయ్యింది. చదువుకునే సమయంలోనే ఆయన ప్రగతిశీల, విప్లవకర భావాలతో ప్రభావితుడయ్యాడు. ఆయనపై కార్మిక పోరాటాల ప్రభావం ఎంతగానో వుండింది. ఆయన డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఆయన బాగా చదివే విద్యార్థి. ప్రేమ్‌చంద్ నుండి మక్సీమ్ గోర్కీ వరకు ఎన్నో దేశాలకు చెందిన ప్రగతిశీల, విప్లవ రచయితల సాహిత్యాన్ని ఆయన బాగా అధ్యయనం చేశాడు. నక్సల్బరీ రాజకీయాల ప్రేరణతో ఆయన మొదట సీపీఐ (ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్‌లో చేరాడు. ఆ పార్టీలో క్రియాశీలంగా పని చేస్తూ పూర్తికాలం కార్యకర్తగా మారాడు. ముఖ్యంగా ఆయన రాజ్‌నాంద్‌గాం, దుర్గ్ జిల్లాల్లో ఎక్కువ కాలం పని చేశాడు. సీపీఐ (ఎంఎల్) రెడ్‌ఫ్లాగ్‌లో ఆయన రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించాడు.

కాని కామ్రేడ్ హరక్ తన పార్టీ రాజకీయాలతో, పని విధానంతో సంతృప్తి చెందలేదు. అట్లాగే శంకర్ గుహ నియోగి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా కూడా కార్మిక వుద్యమాన్ని సరైన దిశలో సాగించడంలో విఫలమవడాన్ని ఆయన గమనించాడు. వీటికి వ్యతిరేకంగా ఆయన రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాడాడు. మరోవైపు తాను పని చేస్తున్న ప్రాంతానికి కొద్ది దూరంలోనే సాగుతున్న దండకారణ్య విప్లవోద్యమంతో ఆయన బాగా ప్రభావితుడయ్యాడు. అలా అతను అప్పటి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)తో సంబంధాలు ఏర్పర్చుకొన్నాడు. కొద్ది మంది సహచరులతో కలిసి 1993లో అందులో చేరాడు. పార్టీ నిబంధనావళి ప్రకారం ఆయన డివిజనల్ కమిటీ సభ్యుని హోదాలో సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)లో చేరాడు. 1994లో ఏర్పడిన ఆర్‌డీఆర్ (రాయపూర్-దుర్గ్-రాజ్‌నాంద్‌గాం) కమిటీలో సభ్యుడిగా ఎన్నికై పార్టీ పని ప్రారంభించాడు. ఆయన ముఖ్యంగా కార్మికుల్లో, యువజనులలో, విద్యార్థులలో పని చేస్తూ వాళ్లను సంఘటితం చేశాడు. అలాగే సాంస్కృతిక రంగంలో కూడా ఆయన చెప్పుకోదగ్గ కృషి చేశాడు. ఆయన స్వయంగా ఒక కళాకారుడు కూడా. వీధి నాటకం ప్రక్రియపై ఆయనకు బాగా పట్టు వుండేది. కళ ద్వారా విప్లవ రాజకీయాల్ని ప్రచారం చేయడంలో ఆయన ముందుండేవాడు.

1998లో పట్టణ ప్రాంతంలో జరిగిన కొన్ని నష్టాలతో, ప్రతికూల పరిస్థితులలో ఆర్‌డీఆర్ కమిటీని ఎస్‌జెడ్‌సీ రద్దు చేసి కామ్రేడ్ శ్రీకాంత్‌ను గడ్చిరోలి డివిజనల్ కమిటీ సభ్యుడిగా బదిలీ చేసింది. అప్పటి నుండి చివరి దాకా ఆయన విప్లవ జీవితమంతా గడ్చిరోలిలోనే కొనసాగింది. మొట్టమొదట ఆయన టిప్రాగఢ్

ఏరియాలో పని చేశాడు. తనకు తెలియని భాష, పరిచయం లేని సంస్కృతి అయినప్పటికీ ఆయన స్థానిక ప్రజలతో తొందరగానే కలిసిపోయాడు. అందరితో కలిసిపోయే స్వభావం రీత్యా ఆయన ప్రజల, కేడర్ల విశ్వాసం చూరగొన్నాడు. 2000 తర్వాత ఆయన గడ్చిరోలి డివిజనల్ కమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2003లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోన్ మూడో పార్టీ మహాసభ మొదటి ప్లీనంలో ఎస్‌జెడ్‌సీలోకి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2005లో ఆయనను ఎస్‌జెడ్‌సీ సభ్యుడిగా కోఆప్ట్ చేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు కొద్ది కాలం మైదాన ప్రాంతంలో ఆర్గనైజేషన్ బాధ్యతలు అప్పగించారు. దల్లీ, మాన్‌పూర్, చౌకీ మొదలైన ప్రాంతాల్లో ఆయన పని చేశాడు. నిరుద్యోగ యువజనుల్ని కూడగట్టి పల్లామాడ్ ప్రాంతంలో ఒక సమరశీల వుద్యమానికి ఆయన మార్గదర్శకత్వం వహించాడు. గడ్చిరోలి వుద్యమంలో కీలకపాత్ర పోషించిన మరో నేత, ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ వికాస్ 2006 సెప్టెంబర్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు. దాంతో కామ్రేడ్ శ్రీకాంత్ మళ్లీ గడ్చిరోలి బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. అప్పటికే వుద్యమ విస్తరణను దృష్టిలో పెట్టుకొని గడ్చిరోలి డివిజన్‌ను ఉత్తర, దక్షిణ డివిజన్లుగా విభజించారు. సెప్టెంబర్ 2006లో జరిగిన దండకారణ్య నాల్గవ మహాసభలో ఆయన మళ్లీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2007లో జరిగిన పార్టీ ఐక్యతా కాంగ్రెస్ - 9వ కాంగ్రెస్‌లో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నాడు. కాంగ్రెస్‌లో జరిగిన సైద్ధాంతిక, రాజకీయ చర్చలలో ఆయన క్రియాశీలంగా పాల్గొన్నాడు. 2007లో ఆయన పశ్చిమ సబ్‌జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2009లో సబ్‌జోనల్ బ్యూరోల స్థానంలో రీజనల్ కమిటీల ఏర్పాటు జరగగా ఆయన పశ్చిమ రీజనల్ కమిటీకి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అదే సమయంలో ఆయన ఎస్‌జెడ్‌సీ సెక్రటేరియట్ సభ్యునిగా కూడా బాధ్యతలు చేపట్టాడు.

కామ్రేడ్ శ్రీకాంత్ రాజకీయంగా, సైద్ధాంతికంగా సమర్థుడైన నాయకుడు. మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాలపై ఆయనకు చాలా పట్టు వుండేది. విప్లవకర పంథాను ఎత్తిపడుతూ రివిజనిస్టు, మితవాద అవకాశవాద భావాలను, ఆచరణను, ధోరణులను ఆయన ఎల్లప్పుడూ దృఢంగా వ్యతిరేకించాడు. ఆయన ఎంత వేగంగా పుస్తకాల్ని చదివేవాడో అంతే వేగంగా రాత పనులు చేసేవాడు. కమిటీ తీర్మానాలను, సమీక్షలను, రిపోర్టులను రాయడంతో పాటు కరపత్రాలు, వ్యాసాలు కూడా రెగ్యులర్‌గా రాసేవాడు. 2006లో ఆయన డీకే ఎస్‌జెడ్‌సీ అధికార పత్రిక 'ప్రభాత్' సంపాదకవర్గ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. 'ప్రభాత్' కోసం అతను అనేక వ్యాసాలు రాశాడు. ఆయన రచనాశైలి సరళంగా, సుబోధకంగా వుండేది. 2009లో ఎస్‌జెడ్‌సీ ప్రచురించిన అమరవీరుల జీవిత చరిత్రల పుస్తకం ఆయన సంపాదకత్వంలోనే వెలువడింది. కమిటీ సమావేశాల్లో ఆయన తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా వ్యక్తం చేసేవాడు. ఏదైనా విషయంలో ఆయనకు భిన్నాభిప్రాయం లేదా విమర్శ వుంటే ఎలాంటి తటపటాయింపులు లేకుండా కమిటీ ముందుంచేవాడు. చర్చలలోనూ, భావాలను ఇచ్చిపుచ్చుకోవడంలోనూ ఆయన ప్రజాస్వామిక పద్ధతులకు పూర్తిగా కట్టుబడి వుండేవాడు. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడంలో ఆయన ఎల్లప్పుడూ ముందు నిలిచేవాడు.

కామ్రేడ్ శ్రీకాంత్‌లోని మరో విశిష్ట లక్షణం ఏంటంటే ఆయన ఎల్లప్పుడూ నేలను అంటి పెట్టుకొని వున్నాడు. గ్రామాల్లో సంఘాల సభ్యులు, కార్యకర్తల నుండి పార్టీలో కొత్త, పాత సహచరులందరితో ఆయన స్నేహంగా మెలిగేవాడు. ఛత్తీస్‌గఢ్‌లోని మైదాన, పట్టణ ప్రాంతాల్లో గానీ, గడ్చిరోలి, మాడ్ ప్రాంతంలోని లోతట్టు గ్రామాల్లో గానీ అతనెక్కడికి వెళ్లినా ప్రజలు ఆయనను విశ్వసించారు. ప్రేమించారు. అనారోగ్యం మూలంగా రెగ్యులర్‌గా తిరగడంలో ఇబ్బంది వున్నా ఆయన తన సహచరులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ వుండేవాడు. తన చివరి రోజుల్లో పక్క మీద నుండి సరిగా లేవలేని స్థితిలో వుండి కూడా ఆయన గడ్చిరోలి వుద్యమం ముందున్న సమస్యలపై ఒక రిపోర్టు రాశాడు. ఆయన ఎల్లప్పుడూ వుద్యమ భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ వుండేవాడు.

ఐక్యతా కాంగ్రెస్ నిర్దేశించిన కర్తవ్యాలను పరిపూర్తి చేసే కృషిలో భాగంగా ప్రజాయుద్ధాన్ని పెంపొందింపజేయడంలో, పీఎల్‌జీఏను పటిష్టం చేయడంలో కామ్రేడ్ శ్రీకాంత్ తన వంతుగా శక్తిమేరకు కృషి చేశాడు. గడ్చిరోలి జిల్లాలో సీ-60 కమాండోల భయ బీభత్సాలు పెచ్చరిల్లిపోయి, ప్రభుత్వ నిర్బంధకాండ మూలంగా ప్రజలు ఎన్నో ఇబ్బందుల పాలవుతున్న పరిస్థితిలో పార్టీ శత్రు సాయుధ బలగాల్ని నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేక ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లను చేపట్టింది. ఈ క్యాంపెయిన్లను సఫలం చేయడానికి ఆయన ఎంతో పట్టుదలతో కృషి చేశాడు. ముఖ్యంగా 2008-09లో అనేక సైనిక చర్యలు విజయవంతం కావడంలో ఆయన ప్రత్యక్ష, పరోక్ష పాత్ర వుంది. ఆయనొక ప్రేరణాస్పదమైన నాయకుడు. ప్రజాయుద్ధ రంగంలో పీఎల్‌జీఏ, ప్రజలు సాధించే ప్రతి చిన్న విజయానికీ ఎంతో సంతోషించేవాడు. వాళ్లకు అభినందనలు తెలిపేవాడు. వైఫల్యాలు ఎదురైనపుడు కూడా వాళ్ల మనోస్థైర్యాన్ని నిలబెట్టడంలో, వాటి నుండి సరైన పాఠాలు తీసి వెన్ను తట్టడంలో ఆయన ముందు నిలిచేవాడు.

కామ్రేడ్ శ్రీకాంత్ ఇక లేడు. అయితే ఆయన నెలకొల్పిన ఆదర్శాలు పార్టీ శ్రేణులకు, ముందడుగు వేసేలా సదా ప్రేరణనిస్తూ వుంటాయి. విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి దేశ సహజ సంపదలన్నిటినీ సామ్రాజ్యవాదానికి కట్టబెట్టే లక్ష్యంతో నేడు శత్రువు పార్టీపై, ప్రజలపై ఒక పెద్ద యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. శత్రువు ప్రత్యేకించి వుద్యమ నాయకత్వాన్ని టార్గెట్ చేసి దెబ్బ తీయడంలో ఒక మేరకు సఫలమవుతున్నాడు. రాజ్యం సాగిస్తున్న ఈ తీవ్ర నిర్బంధకాండ మూలంగానే కామ్రేడ్ శ్రీకాంత్‌కు మెరుగైన వైద్యం అందలేదు. అది చివరికి మరణానికి దారితీసింది. ఈరోజు వుద్యమం ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఈ స్థితిలో కామ్రేడ్

# ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ సునీతను సంస్మరించుకుందాం!

కామ్రేడ్ సునీత తీవ్రమైన అనారోగ్యంతో 2012, మార్చి 18న అమరురాలయింది. దాదాపు 47 సంవత్సరాల వయసున్న కామ్రేడ్ సునీత మూడు దశాబ్దాల క్రితం తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసుకుంది. అప్పటి నుండి ఎన్ని ఆటంకాలు ఎదురైనా అవిశ్రాంతంగా ఆమె పార్టీకీ, పిఎల్‌జిఎకూ, ప్రజలకూ పలు రకాల సేవలందించింది. చనిపోయేనాటికి ఆమె దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ ప్రాంతంలో ఒక టైలర్ టీంకు బాధ్యురాలుగా వుండింది.



పరిచయస్తులెవరికైనా కామ్రేడ్ సునీతను తలుచుకుంటే అమ్మ ఆప్యాయత గుర్తుకొస్తుంది. పసిపిల్లల్లోని అమాయకత్వం గుర్తుకొస్తుంది. స్వచ్ఛమైన నవ్వు గుర్తుకొస్తుంది. అడ్డంకులకు తలవంచని కొండంత నిబ్బరత గుర్తుకొస్తుంది.

మెదక్ జిల్లాకు ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమంలో ఒక ప్రత్యేక స్థానం వుంది. ఉత్తర తెలంగాణ తర్వాత, దక్షిణ తెలంగాణాలో ఉద్యమం మొదటగా బలపడింది మెదక్ జిల్లాలోనే. ఆ జిల్లాలో వెల్దుర్తి గ్రామంలో ఒక పేద వ్యవసాయ కుటుంబంలో కామ్రేడ్ సునీత పుట్టింది. తల్లిదండ్రులు ఆమెకు పెట్టుకున్న పేరు స్వరూప. ఆమెకు తోడుగా ఒక అక్క, ముగ్గురు తమ్ముళ్లు పుట్టారు. పేదరికం కారణంగా ఆమె చదువుకోలేక పోయింది. వెనుకబాటుతనం వల్ల చిన్నప్పుడే ఆమెకు తల్లి దండ్రులు మేనబావతో పెండ్లి చేశారు. అయితే కుటుంబ కలహాల కారణంగా కొద్దికాలానికే ఆ పెండ్లి విచ్ఛిన్నమైపోయింది.

ఆ సమయంలో ఆమె మేనమామ ఆమెను తమ ఇంటికి తీసుకెళ్లాడు. కామ్రేడ్ ఉడుతల శ్రీనివాసులు ఆమె మేనమామ. ఆయన విప్లవోద్యమం గర్వించతగిన అమరుడు. ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితి విధించే నాటికి విప్లవ రాజకీయాల ప్రభావంతో ఎదిగివచ్చిన వుద్యోగ సంఘాలలో పి అండ్ టి (పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్) ఒకటి. ఆ సంఘం నుండి మన పార్టీలోకి వచ్చిన కామ్రేడ్ శ్రీనివాసులు మన పార్టీలో వివిధ స్థాయిల కార్యకర్తలకు మార్క్సిస్టు విద్య గరిపిన బోధకుడు. రాజకీయంగా, సైద్ధాంతికంగా పార్టీలో విశేషంగా కృషి చేసిన యోధుడు. 1995లో ఆయన అనారోగ్యానికి గురై అమరుడయ్యాడు.

కామ్రేడ్ ఉడుతల శ్రీనివాసులు దంపతులకు ఆడపిల్లలు లేనందువల్ల స్వరూపను కన్నబిడ్డలా చూసుకున్నారు. అప్పటికే వారి కుటుంబం నాటి సిపిఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) రాజకీయాలతో పూర్తిగా మమేకమై వుండడంతో క్రమంగా కామ్రేడ్ స్వరూప కూడా విప్లవ రాజకీయాలలోకి ప్రవేశించింది. పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో పని చేయడానికి సిద్ధమైంది.

1983లో ఆమె కామ్రేడ్ ఆనంద్‌కు జీవిత భాగస్వామి అయింది. గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన కామ్రేడ్ ఆనంద్ అసలు పేరు మురళి. కామ్రేడ్ సునీత ఆయన జీవితంలో అడుగుపెట్టే నాటికి ఆయన పార్టీ అగ్ర నాయకత్వానికి కొరియర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ వుండినాడు. కాబట్టి ఆయనతో పాటు ఆమె కూడా రాష్ట్ర సరిహద్దులను దాటుకొని రహస్య జీవితానికి వెళ్లిపోయింది. పార్టీ అవసరాలకు అనుగుణంగా వారి జంట తమిళనాడు, కర్నాటక, ఒడిశా, మహారాష్ట్రల్లో డెన్‌లను నిర్వహించింది. దానికి అవసరమైనట్టుగా కామ్రేడ్ సునీత పలు భాషలు నేర్చుకుంది. నాటి పార్టీ నేత కొండపల్లి సీతారామయ్య వాళ్ల డెన్‌లో వుంటూ తన కార్యకలాపాలు నిర్వహించే వాడు. విప్లవోద్యమ అమర నేతలు కామ్రేడ్స్ ఐ.వి.సాంబశివరావు (ప్రకాష్ మాస్టర్), నల్లా ఆదిరెడ్డి (శ్యాం) వంటి మరెందరో కీలక నేతలు వాళ్ల డెన్‌లోనే రక్షణ పొందారు. ఎన్నో కీలక సమావేశాలకు వాళ్ల ఇల్లు వేదికగా మారింది. అటువంటి కీలక నేతల కోసం, పనుల కోసం డెన్‌ను నిర్వహించడమనేది కత్తి మీద సాము వంటిది. ఉక్కు క్రమశిక్షణ, రహస్య పని పద్ధతులు, త్యాగనిరతి, నిబ్బరత్వం, సమయస్ఫూర్తి,

---

శ్రీకాంత్ ఇలా అర్ధాంతరంగా వెళ్లిపోవడం దండకారణ్య విప్లవోద్యమానికి, ప్రత్యేకించి గడ్చిరోలి జిల్లా (పశ్చిమ రీజియన్)లో సాగుతున్న విప్లవోద్యమానికి చాలా పెద్ద నష్టం. ప్రజా పోరాటాల్ని, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారానే ఈ నష్టాన్ని మనం పూడ్చుకోగలుగుతాం. కామ్రేడ్ శ్రీకాంత్ సహా వేలాది అమరవీరులు కలలు గన్న దోపిడీ పీడనలు లేని సమసమాజాన్ని నిర్మించే బాధ్యత మనపైనే వున్నది. ధైర్యంగా, దృఢ సంకల్పంతో పురోగమిద్దాం. త్యాగాలకు సాహసిద్దాం. తుది విజయం మనదే.

★

**కామ్రేడ్ శ్రీకాంత్ అమర్ రహే!**

చాకచక్యం, సేవా దృక్పథం, పొదుపరితనం మొదలైన లక్షణాలన్నీ వుండాలి. సాధారణంగా డెన్‌లు నిర్వహించేది నగరాలూ, పట్టణాల్లోనే. అక్కడ వస్తువినిమయ సంస్కృతి దాడి చెయ్యడానికి సిద్ధంగా వుంటుంది. కార్మికవర్గ చైతన్యంతో ఆ జంట అటువంటి సంస్కృతులను జయించింది. ఇరుగు పొరుగు వాళ్లకు ఎటువంటి అనుమానాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎక్కువగా డెన్‌లోని మహిళల మీదే వుంటుంది. కామ్రేడ్ సునీత ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించింది.

తనలోని కలుపుగోలుతనం, ప్రేమాస్పద స్వభావం, సేవా దృక్పథం ద్వారా ఆమె పలువురు నాయకుల మన్ననలు పొందింది. ముఖ్యంగా కామ్రేడ్ ప్రకాశ్ మాస్టర్, కామ్రేడ్ శ్యాంలతో ఆమె ఆత్మీయ అనుబంధాన్ని పెంచుకుంది. డెన్ జీవితంలో తరచూ ఎదురుపడే ఒంటరితనాన్ని కూడా కామ్రేడ్ సునీత నిబ్బరంగా భరించింది. డెన్ జీవితంలో వుండే ఒంటరితనాన్ని, ఇబ్బందులను భరించలేక పిల్లలను కనాలని కోరుకున్న కామ్రేడ్స్ కూడా కొందరు వున్నారు. కానీ కామ్రేడ్ సునీత విప్లవ ప్రయోజనాల కోసం పిల్లలను కనకూడదని దృఢంగా నిర్ణయించుకుంది.

ఇలా దాదాపు పదేళ్లకు పైగా డెన్ బాధ్యతలను నిర్వహించిన తర్వాత 1994లో కామ్రేడ్స్ ఆనంద్, సునీతలు ప్రత్యక్షంగా యుద్ధరంగంలో పనిచేయడం కోసం దండకారణ్యం వెళ్లారు. పార్టీ వాళ్లను తాత్కాలికంగా గడ్‌చిరోలి డివిజన్‌లోని టిప్రాగఢ్ ఏరియాలో వుంచింది. ఆ సమయంలో పోలీసులతో సిందసూర్ గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 1994 ఆగస్ట్ 28న కామ్రేడ్ ఆనంద్ అమరుడయ్యాడు.

తాను ప్రాణప్రదంగా భావించిన సహచరుడి ఎడబాటు ఆమెను ఎంతగానో కలచివేసింది. ఆ సమయంలో ఆమెను లోపల పని చేస్తావా? బయట పని చేస్తావా? అని పై కమిటీ కామ్రేడ్స్ అడిగినపుడు తన సహచరుడు నెత్తురు చిందించిన దండకారణ్యంలోనే తనకు పనిచేయాలని వున్నట్టు వెల్లడించింది. ఆమె ఆకాంక్షను దృష్టిలో వుంచుకొని, పై కమిటీ ఆమెను బాలఘాట్ డివిజన్‌లోని టాండా దళంకు పంపింది. కానీ అక్కడ ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ సమయంలో బాలఘాట్ డివిజన్ పార్టీ నాయకత్వంలో పితృస్వామ్యానికి సంబంధించిన సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. పితృస్వామ్యం మూర్తీభవించిన కొందరు పురుష కామ్రేడ్స్ మూలంగా కొంత మంది మహిళా కామ్రేడ్స్ తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. వారిలో సునీత కూడా వుంది. సహచరుడిని కోల్పోయిన గాయం పచ్చిగా వుండగానే తాను ఎదుర్కున్న ఈ సమస్యలు ఆమెను తీవ్ర మనస్థాపానికి గురిచేశాయి. ఇదే సమయంలో కామ్రేడ్ ఆనంద్ అమరుడయిన సరిగ్గా సంవత్సరానికి కామ్రేడ్ ఉడుతల శ్రీనివాసులు అనారోగ్యంతో అమరుడయ్యాడు. ఈ వార్త ఆమెను మరింత వేదనకు గురిచేసింది. ఈ కారణాలన్నింటి వల్ల ఆమె ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తిన్నది. 1996 చివరిలో ఆమె వైద్యం కోసం బయటకు వెళ్లింది.

ఆ తర్వాతనే దండకారణ్య జోన్ నాయకత్వానికీ, కేంద్ర కమిటీ నాయకత్వానికీ బాలాఘాట్‌లో జరిగిన పరిణామాలన్నీ తెల్సాయి. మనస్థాపం చెంది బయటకు వెళ్లిన కామ్రేడ్స్‌ను నిలబెట్టుకోవాలని, జరిగిన తప్పులను సరిదిద్దుకోవాలని ఉన్నత నాయకత్వం నిర్ణయించుకుంది. ఆ సమయంలో కామ్రేడ్ సునీత ఆంధ్రప్రదేశ్‌లో వైద్యం చేయించుకుంటూ వుండింది. అమరులు కామ్రేడ్స్ శ్యాం, సంజీవ్‌లతో పాటు మరి కొందరు నాయకత్వ కామ్రేడ్స్ ఆమెకు వుత్తరాలు రాశారు. కలిసి మాట్లాడారు. 1998 జనవరిలో అమరుడు కామ్రేడ్ మహేష్ ఆమెను కలిసి పార్టీపరంగా జరిగిన తప్పిదాల గురించి మాట్లాడాడు. ఆ తర్వాత ఆమె మునుపటి వలెనే పార్టీ పనిలో క్రియాశీల భాగస్వామి అయింది.

ఆ సమయంలో కొద్ది నెలల పాటు ఏపీలో ఒక గెరిల్లాల క్యాంపులో ఆమె వుండింది. అందులో నాటి రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ లింగమూర్తి (కృష్ణ, శంకర్) కూడా వున్నాడు. ఆ క్యాంపులో ఆమె కొద్ది రోజులు గడపడం అనేది ఆమె విప్లవ జీవితంలో ఒక కీలక మలుపుగా చెప్పుకోవచ్చు. ఆ క్యాంపులో వున్న పలువురు కామ్రేడ్స్ సాన్నిహిత్యం ఆమె గాయాలకు మందులా పనిచేసింది. కల్మశం ఎరుగని ఆమె ప్రవర్తన, అందరితోనూ ప్రేమగా, కలివిడిగా మెదిలే ఆమె స్వభావం కామ్రేడ్ లింగమూర్తిని ఆకట్టుకుంది. 1994లో తన జీవిత సహచరి కామ్రేడ్ పద్మను కోల్పోయిన కామ్రేడ్ లింగమూర్తి కామ్రేడ్ సునీతను తన జీవితంలోకి ఆహ్వానించాడు. కామ్రేడ్ సునీత ఆ ఆహ్వానాన్ని స్వీకరించింది. వాళ్లిద్దరి నిర్ణయాన్ని నాటి రాష్ట్ర కమిటీ స్వాగతించింది. అలా 1998 మధ్య కామ్రేడ్స్ సునీత, లింగమూర్తులు జీవిత భాగస్వాములయ్యారు.

ఆ తర్వాత ఆమె నల్లమల ఉద్యమంలో భాగమయింది. అక్కడ ఆమె నిర్మల పేరుతో అందరికీ చిరపరిచితురాలయింది. మొదట మహానంది దళంలో సభ్యురాలిగా పని చేసింది. కొద్దిరోజులకు ఏసీ సభ్యురాలిగా ఎదిగి అక్కడే పనిచేసింది. భౌగోళికంగా కఠినంగా వుండే నల్లమల ప్రాంతంలో దాదాపు మూడున్నర సంవత్సరాలు పనిచేసింది. అక్కడి ప్రజల, నాయకత్వం, క్యాడర్ విశ్వాసాన్నీ, ప్రేమాభిమానాల్ని విశేషంగా చూరగొంది.

ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో కామ్రేడ్ లింగమూర్తికి వున్న స్థానం విశిష్టమైనది. కఠోరమైన వర్గపోరాటంలో సుదీర్ఘ కాలం దృఢంగా నిలబడి విప్లవ ప్రజల్లో, మేధావుల్లో, పీడిత సెక్షన్లలో చెరగని ముద్ర వేసిన నాయకుడాయన. ఆయన క్యాడర్‌ను అమితంగా ప్రేమించేవాడు, అందుకే క్యాడర్ హృదయాల్లో ముద్రించుకు పోయాడాయన. కామ్రేడ్ కృష్ణ, నిర్మలలు పరస్పరం ఎంతో అన్యోన్యంగా వుండేవారు. పెళ్లయిన కొద్ది నాళ్లకు కామ్రేడ్ కృష్ణ తీవ్రమైన అనారోగ్యం పాలయ్యాడు. ఆ సమయంలో కామ్రేడ్ సునీత ఆయనకు ఎంతగానో సహకరించింది. బాధల్లో వున్న కామ్రేడ్స్‌ను ఎల్లవేళలా అక్కున చేర్చుకునే స్వభావం వలన ఆ జంట ఎందరికో సన్నిహిత జంట అయింది. అయితే 2001 చివర్లో కామ్రేడ్ సునీతకు కడుపునొప్పి సమస్య వచ్చింది. చికిత్స కోసం ఆమె నల్లమల అటవీ

ప్రాంతం నుండి బయటకు వెళ్లింది. బయట వుండగానే ఆమె జీవితంలో మరో పెను విషాదం చోటు చేసుకుంది. 2002 మార్చి 27న కృష్ణా నదిలో పుట్టి మునిగి కామ్రేడ్ కృష్ణ అమరుడయ్యాడు. ఆ సమయంలో సానుభూతిపరుల ఇంట్లో వున్న ఆమెకు కనీసం దుఃఖం వెళ్లగక్కే అవకాశం కూడా లేకుండింది. కొద్ది రోజులకు ఆమె నల్లమలకు తిరిగి వెళ్లింది. సహచరులతో దుఃఖాన్ని పంచుకుంది.

అయితే అప్పటికి నల్లమలలో నిర్బంధం తీవ్రం కాసాగింది. ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుండింది. అందుకని ఏపీ రాష్ట్ర కమిటీ ఆమెను నల్లమల నుండి రిలీవ్ చేసి ఆమె బాధ్యతను సీసీకి అప్పగించింది. ఆ సమయంలో కేంద్రకమిటీ నుండి ఏపీ రాష్ట్ర కమిటీకి బాధ్యత వహిస్తున్న కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) ఆమె బాధ్యతను తీసుకున్నాడు. ఆమె దాదాపు రెండేళ్లపాటు బయటే ఆయన పర్యవేక్షణలోనే వుండింది. అయితే ఆమెకు బయట వుండడం ఇష్టం లేకుండింది. అనారోగ్యం వున్నప్పటికీ గెరిల్లాజోన్ ప్రాంతంలోనే వుంటూ తన శక్తి మేరకు ప్రజా యుద్ధానికి తోడ్పడాలని నిశ్చయించుకుంది. ఆనాటికి దండకారణ్యంలో పెంపొందుతున్న ప్రజాయుద్ధ అవసరాల్ని తీర్చుకోవడం కోసం విడిగా అనేక అనుబంధ విభాగాలు ఏర్పడే క్రమం మొదలైంది. గెరిల్లాలకు అవసరమైన యూనిఫాంలు కుట్టడం కోసం టైలర్ల అవసరం ఎంతో పెరిగింది. దీన్ని దృష్టిలో వుంచుకొని ఆమె టైలరింగ్ పనిని నేర్చుకుంది. ఆ సమయంలో ఆమెకు కడుపు నొప్పి తీవ్రమై ఆపరేషన్‌కు దారితీసింది. అయినప్పటికీ టైలరింగ్ నేర్చుకోవడాన్ని కొనసాగించి 2004 ఫిబ్రవరిలో టైలర్‌గా దండకారణ్యంలో అడుగుపెట్టింది.

దాదాపు ఎనిమిది నెలల పాటు ఆమె మాడ్ డివిజన్‌లో పని చేసింది. ఇతర కామ్రేడ్స్‌కు టైలరింగ్‌లో శిక్షణ కూడా ఇచ్చింది. ఆ తర్వాత దక్షిణ రీజియన్‌కు వెళ్లింది. ఆమె వెళ్లిన తర్వాతే మొదటిసారి అక్కడ ఐదుగురు కామ్రేడ్స్‌తో రీజనల్ స్థాయిలో టైలరింగ్ టీం ఏర్పడింది. ఈ టీంకు కామ్రేడ్ సునీత బాధ్యురాలిగా వుంది. అక్కడ కొంత కాలం పాటు పనిచేసిన తర్వాత 2007లో పశ్చిమ బస్తర్‌కు బదిలీ అయింది. పశ్చిమ బస్తర్‌లోని గంగులూరు ఏరియా టైలర్ టీంకు ఆమె బాధ్యురాలిగా పనిచేసింది. ఈ బాధ్యతలో వుండగానే 2011 ఆగస్ట్‌లో ఆమెకు రొమ్ములో నొప్పి మొదలైంది. మొదట అదేమిటో అర్థం కాక యాంటీబయటిక్స్ తీసుకుంది. కానీ నొప్పి మరింత తీవ్రమైన దశలో ఆస్పత్రికి వెళ్తే రొమ్ము క్యాన్సర్ మూడవ దశలో వుందని డాక్టర్లు నిర్ధారించారు. వెంటనే చికిత్స ప్రారంభించినప్పటికీ ఉపయోగం లేకపోయింది. ఆస్పత్రిలోనే ఆమె తుది శ్వాస విడిచింది.

ప్రజలనూ, సహచర కామ్రేడ్స్‌ను ఆమె ప్రేమించే తీరు ఎన్నదగినది. ఎదుటి వాళ్ల బాధలను తన బాధలుగానే భావించి వాళ్లకు అవసరమైన సహకారాన్ని అందించేది, ఆత్మీయతను పంచేది. చివరి సమయంలో ఆమె చాలా ఒంటరితనానికి గురయింది. అంతటి ఒంటరితనంలోనూ తనను తాను నిలబెట్టుకుంటూ, బాధల్లో వున్న కామ్రేడ్స్‌ను ఓదార్చడానికి ప్రయత్నించేది. గలగలా నవ్వుతూ ఎదుటి వాళ్ల బాధలను మరిపించేది.

ఆమెకు గెరిల్లా జీవితంలో పెద్దగా అనుభవం లేనప్పటికీ బాలాఘాట్ డివిజన్‌లో పని చేస్తున్న క్రమంలో పోలీసులతో జరిగిన నాలుగైదు ఎన్‌కౌంటర్లలో ఆమె నిబ్బరంగా నిలబడింది. తన కిట్టును శత్రువుకు దొరకనివ్వకుండా పట్టుకొని తన సహచరులతో కలిసి రిట్రీట్ అయ్యింది.

ఆమె తన సహచరులను ఎంతగా ప్రేమించేదో శత్రువు పట్ల అంతే ద్వేషాన్ని కలిగి వుండేది. ఆమె దక్షిణ రీజియన్‌కు చేరిన తర్వాత సల్వాజుడుం మొదలైంది. ప్రజలపై చెప్పనలవి కాని హింసా, దౌర్జన్యకాండలు కొనసాగాయి. 2009 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులు కూడా ప్రారంభమయ్యాయి. కామ్రేడ్ సునీత తాను పని చేసే ప్రాంత ప్రజలను కలుస్తూ వాళ్లను ఓదార్చేది. ధైర్యం చెప్పేది. శత్రువు చేసే దాడులకు భయపడకుండా ప్రతిఘటించాలని వాళ్లకు చెప్పేది. శత్రు బలగాలపై ప్రజలు, పి.ఎల్.జి.ఏ. చేసే ప్రతి వీరోచిత చర్యకు, సాధించే ప్రతి విజయానికి ఎంతో స్పందించేది.

కామ్రేడ్ సునీత పార్టీలోనే చదవడం, రాయడం నేర్చుకుంది. రాత తనకు కష్టమైనా అమరుల జ్ఞాపకాలను రాయడానికి ప్రయత్నించేది. తన సహచరులు కామ్రేడ్స్ ఆనంద్, లింగమూర్తిల స్మృతిలో ఆమె రాసిన స్పందనలు ఎంతో ఆర్ద్రమైనవి. అలాగే కామ్రేడ్ శ్యాం స్మృతిలో కవితలు రాసింది. సహచరులకు రెగ్యులర్‌గా వుత్తరాలు రాసేది.

కామ్రేడ్ సునీత విప్లవ జీవితం నేటి తరాలకు ఎంతో ఆదర్శదాయకం. ఎన్ని కష్టాలు, కడగండ్లు ఎదురైనా ఆమె తుది ఊపిరి వరకూ విప్లవ మార్గంలోనే ప్రయాణించింది. ఏ పదవులనూ, స్థాయిలను ఆశించకుండా నిస్వార్థంగా ప్రజలకూ, పార్టీకీ శక్తి మేరకు సేవ చేసిన ఆదర్శ కమ్యూనిస్టు కార్యకర్త ఆమె.

కామ్రేడ్ సునీత ఆదర్శాలను ఎత్తిపడుదాం. ఆమె దాదాపు ముప్పయ్యేళ్ల తన సుదీర్ఘ విప్లవ జీవితంలో పాటించిన విలువలను, ప్రదర్శించిన విప్లవ చైతన్యాన్ని అలవర్చుకుందాం. ఆమె కన్న కలలను నెరవేర్చడం కోసం దృఢంగా ముందుకు నడుద్దాం!

**అమర్ రహే కామ్రేడ్ సునీత!** ★

## గమనిక

**ఇప్పుడు 'క్రాంతి' bannedthought.netలో కూడా లభిస్తుంది. 2006 నుండి అన్ని సంచికలు ఇందులో అందుబాటులో వున్నాయి.**

**- సంపాదకులు**

# చెన్నపురం అమరులకు జోహార్లు!

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లా చర్ల మండలం చెన్నాపురం, ఎర్రపాడు గ్రామాలలోని సంఘ నాయకత్వం, దళంపై దాడి చేయాలనే లక్ష్యంతో వచ్చిన గ్రేహౌండ్స్ బలగాలతో 2011 సెప్టెంబర్ 25న చెన్నాపురం గ్రామం వద్ద జరిగిన ఎదురుకాల్పులలో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్స్ ముచకి చుక్కా, మడకం సోమాల్‌లు అమరులైనారు. భారత దేశ విముక్తి కోసం పోరాడి నేలకొరిగిన ఈ యిద్దరు అమరవీరులకు తలవంచి వినమ్రంగా జోహార్లర్పిద్దాం. వారి ఆశయసాధనలో మరింత దృఢంగా ముందుకు సాగుదాం.

## కామ్రేడ్ ముచకి చుక్కా (జిల్లా)

కామ్రేడ్ ముచకి చుక్కా (25) బీజాపూర్ జిల్లా, ఊసురు ఏరియా, రేంగం గ్రామంలోని ఆదివాసీ పీడిత కోయ కుటుంబములో జన్మించాడు. కామ్రేడ్ చుక్కా కుటంబం 1985లో దర్భా ప్రాంతం నుండి ఇక్కడికి వలస వచ్చింది. ఇతనికి ఒక తమ్ముడు, చెల్లెలు వున్నారు. కామ్రేడ్ చుక్కా 12 సంవత్సరాల వయస్సులో వుండగానే తల్లి-తండ్రులు రెండు సంవత్సరాల తేడాతో అనారోగ్యంతో మరణించారు. చుక్కాను, అతని తమ్ముడు, చెల్లెలును చిన్నాన్న, చిన్నమ్మలు పోషించారు.

ఊసురు ఏరియాలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు ప్రభావితుడైన కామ్రేడ్ చుక్కా మిలీషియాలో చేరాడు. 2004లో ఊసుర్ ఏరియా ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన బేస్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తూ పని చేశాడు. ఆ సమయంలో కామ్రేడ్ చుక్కా వయస్సు 17 లేదా 18 సంవత్సరాలు ఉండవచ్చు. ఈ విధంగా పనిచేస్తూ గెరిల్లా దళంలో పనిచేస్తానన్న నిర్ణయాన్ని పార్టీకి తెలియచేసి, 2008లో గెరిల్లా సైన్యంలో చేరాడు.

పార్టీ ఆదేశానుసారం కామ్రేడ్ చుక్కా (జిల్లా) ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్ వెంకటాపురం ఏరియాలో పనిచేయడానికి వెళ్లాడు. మొదట మూడు నెలలు వెంకటాపురం ఏరియా మిలీషియా నిర్మాణంలో సభ్యుడిగా పనిచేశాడు. ఆ తర్వాత 2008 సెప్టెంబర్‌లో శబరి ఏరియాకు బదిలీ అయ్యాడు. 2008లో పార్టీ సభ్యుడైనాడు. శబరి ఏరియా దళంలో ఏడు నెలలు పనిచేసిన తర్వాత 2009 మేలో పార్టీ నిర్ణయానుసారం జిల్లా సెక్రెటరీకి గార్డ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. 2010 డిసెంబర్ 2న కామ్రేడ్ చుక్కాను గార్డు బాధ్యతల నుండి రిలీవ్ చేసి పి.ఎల్. సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా ప్రమోట్ చేస్తూ పార్టీ బదిలీ చేసింది. 2011 ఆగస్టు వరకు పి.ఎల్. సెక్షన్ డిప్యూటి కమాండర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాడు. 2011 ఆగస్టులో వుత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ మొదటి ప్లీనం తరువాత సెప్టెంబర్ నెలలో కామ్రేడ్ చుక్కాకు వెంకటాపురం ఏరియా బార్డర్ జన మిలీషియా కమాండర్ బాధ్యతను ఇవ్వడం జరిగింది. అప్పటి నుండి తను అమరుడయ్యే వరకు ఇదే బాధ్యతలు కొనసాగిస్తూ 2011 సెప్టెంబర్ 25న చెన్నపురం ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరుడైనాడు.

కామ్రేడ్ చుక్కా అంతర్జాతీయతత్వాన్ని ప్రదర్శిస్తూ దండకారణ్యం నుండి ఉత్తర తెలంగాణాకు ఎటువంటి శషభిషలు లేకుండా బదిలీ అయ్యాడు. చిన్నతనంలోనే విప్లవోద్యమంలో చేరి మెట్టు మెట్టుగా అభివృద్ధి చెందుతూ ఒక ఆదర్శవంతమైన కమాండర్‌గా ఎదిగాడు. విప్లవోద్యమంలో వస్తున్న ఆటు పోటులను గెలుపు ఓటములను ఎదుర్కొంటూనే తన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకున్నాడు. పార్టీలో పని చేస్తూ తెలుగు, హిందీ భాషలు రాయడం, చదవడం నేర్చుకున్నాడు. ఏ మాత్రం సమయం దొరికినా చదవడం, రాయడం పైన కేంద్రీకరించే వాడు. పత్రికలు, కరపత్రాలు చదువుతూ తన జ్ఞానాన్ని పెంచుకొనేవాడు. ప్రజలతో ఎల్లప్పుడు రాజకీయ సంబంధాలను కొనసాగిస్తూ విప్లవ రాజకీయాలను బోధించేవాడు. దళంలో ఐక్యతను, క్రమశిక్షణను కల్గి వుండేలా నిరంతరం కృషి చేసేవాడు. కామ్రేడ్ జిల్లా విప్లవ పట్టుదల భవిష్యత్ తరాల యువతీ, యువకులకు ఎంతో మార్గదర్శకంగా ఉంటుంది.

ప్రజల పట్ల ప్రేమ, ఉద్యమం పట్ల పట్టుదల, శత్రువు పట్ల వర్గకసి గల కామ్రేడ్ చుక్కాను కోల్పోవడం జిల్లా ఉద్యమానికి ముఖ్యంగా వెంకటపూర్ ఏరియా విప్లవోద్యమానికి తీరని లోటు.

కామ్రేడ్ చుక్కా అమరత్వ వార్త తెలిసిన ప్రజలు పోలీసులతో పోరాడి అతని మృతదేహాన్ని అతని స్వగ్రామమైన రేంగం గ్రామానికి తీసుకువచ్చి, సెప్టెంబర్ 28న విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. ఈ సందర్భంగా సి.ఎన్.ఎమ్ కళాబృందం, ప్రజలు పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. కామ్రేడ్ చుక్కా ఆశయాలను కొనసాగిస్తామనీ శపథం చేశారు.

కామ్రేడ్ జిల్లా అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొందాం. అతని ఆదర్శాలను పుణికిపుచ్చుకొని ముందుకు పోదామని శపథం చేద్దాం. ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని పునరుద్ధరింపచేయడానికి రాబోయే రోజుల్లో ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం.

## కామ్రేడ్ మడకం సోమాల్

కామ్రేడ్ మడకం సోమాల్ (25) తాను నేలకొరిగిన చెన్నపురం గ్రామంలోనే నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. కామ్రేడ్ సోమాల్‌కు ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. మెజారిటీ ఆదివాసుల వలెనే కామ్రేడ్ సోమాల్‌కు కూడా చదువుకునే అవకాశం రాలేదు. 2003 నుండి విప్లవోద్యమ ప్రభావంతో ఉత్తేజితుడయ్యాడు.



తల్లిదండ్రులు అతనికి చిన్న వయసులోనే పెళ్ళి చేసినారు. కాని ఇద్దరి మధ్య సమస్యలు రావడంతో 2009లోనే విడిపోయారు. 2009లో చెన్నపురం ఆర్.పి.సి. మిలీషియా ప్లాటూన్ సెక్షన్ కమాండర్‌గా ఎదిగాడు. పార్టీ చేపట్టిన అనేక శత్రు నిర్మూలనా చర్యలలో తన వంతు కర్తవ్యాన్ని పట్టుదలతో నిర్వర్తించాడు.

కామ్రేడ్ సోమాల్ ఆశయ సాధనలో పునరంకితమవుతూ మిలీషియాను మరింతగా బలోపేతం చేద్దాం.

# కామ్రేడ్ సుతారి పాపారావు (సింగన్న)

ఖమ్మం జిల్లా గుండాల మండలంలోని కొమ్ముగూడెం వద్ద ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఫిబ్రవరి 20న సాయంత్రం 7 గంటలకు పోలీసుల ఆంబుష్‌లో చిక్కి హోరాహోరిగా పోరాడుతూ కామ్రేడ్ సుతారి పాపారావు (సింగన్న) అమరుడైనాడు. ఈ అమరుడికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.



కామ్రేడ్ సుతారి పాపారావు (45)ది వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం నర్సాపురం గ్రామం. ఆదివాసీ కుటుంబానికి చెందిన సుతారి రామయ్య, పుల్లమ్మల పెద్ద కొడుకు కామ్రేడ్ సింగన్న. పేదరికం వల్ల చదువుకోలేకపోయాడు. ఇంటికి పెద్ద కొడుకైన సింగన్నకు ముగ్గురు చెలెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు. ఒక తమ్ముడు సిపీయుఎస్ఐ పార్టీలో అమరుడయినాడు. తనకు పెళ్లి జరిగిన రెండు సంవత్సరాలకే భార్య అనారోగ్యంతో మరణించింది. తల్లి తండ్రులు వృద్ధులు కావడంతో కుటుంబ బాధ్యత తన మీదే పడడంతో చిన్నతనంలోనే కాటాపురంలో కొద్దిరోజులు జీతం వున్నాడు. ఆ తరువాత వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురి కావడంతో గీత కార్మికుడిగా మారినాడు. గీత కార్మికుడిగా పనిచేస్తూనే గ్రామంలో భూస్వాముల పెత్తందారీతనానికి వ్యతిరేకంగా పోరాడుతూ, సహజంగానే తమ్ముడు అమరుడయిన ప్రభావంతో సిపియుఎస్ఐతో సంబంధాలను ఏర్పర్చుకొని, 2001లో పూర్తికాలం కార్యకర్తగా సిపియుఎస్ఐలో చేరాడు. ఆ పార్టీలో సెంట్రల్ దళానికి సైనిక కమాండర్‌గా ఎదిగాడు. ఆ పార్టీ నాయకత్వ ద్రోహాన్ని వ్యతిరేకించి ప్రజల కోసం పోరాడే నిజమైన పార్టీలోకి రావాలనే ఆలోచనలతో, ఆ పార్టీకి చెందిన దాదాపు 60 ఆయుధాలతో, 2005 సెప్టెంబర్‌లో సిపిఐ (మావోయిస్టు)లో చేరిన వారిలో కామ్రేడ్ సింగన్న ముఖ్యుడు. క్రమశిక్షణలో సిపిఐ (మావోయిస్టు)కూ, సిపియుఎస్ఐకూ చాలా తేడా వుంటుంది. సిపిఐ (మావోయిస్టు) క్రమశిక్షణను అలవర్చుకోలేకనూ, శత్రు నిర్బంధాన్ని తట్టుకోలేకనూ సిపియుఎస్ఐ నుంచి వచ్చిన వారిలో చాలామంది కొద్ది రోజులకే సరెండర్ అయినారు. కానీ సింగన్న మాత్రం ఉక్కు క్రమశిక్షణతో, శత్రువుపై మరింత వర్గకసితో, ప్రజలకు నిజమైన నాయకత్వం అందించే పార్టీలో చేరాననే సంతోషంతో పని చేశాడు. పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను సక్రమంగా నెరవేర్చాడు. పార్టీ, క్యాడర్ విశ్వాసాన్ని చూరగొన్నాడు. తాను అమరుడయ్యే నాటికి కొత్తగూడెం-నర్సంపేట ఏరియా సభ్యుడిగా వుంటూ ఏరియా దళానికి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండినాడు.

చిన్ననాటి నుండే కష్టపడి పని చేసిన అలవాటుతో పాటు, కష్టపడాలనే అవగాహన కల్గి వుండిన కామ్రేడ్ సింగన్న ఎంతటి కష్టతరమైన పనిలో కూడా తప్పక పాల్గొనే వాడు. ప్రజలతో, తోటి కామ్రేడ్స్‌తో, నాయకత్వంతో ఆప్యాయంగా, మర్యాదగా వుండేవాడు. పార్టీలో చదువు నేర్చుకోవడానికి నిరంతరం కృషి చేసేవాడు.

కొమురారం ప్రాంతంలో పాండవుల గుట్టపైన నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ పోలీసులు చుట్టుముట్టి చేసిన దాడిలో ధైర్యంగా కాల్పులు జరుపుతూ నాయకత్వాన్ని, దళాన్ని రక్షించాడు. సిపియుఎస్ఐ పార్టీలో వున్న సమయంలో కూడా జరిగిన పలు పోలీసు దాడులను తిప్పికొట్టాడు. న్యూడెమోక్రసీ సాయుధ రివిజనిస్టులు ప్రజలపై, సంఘ నాయకులపై గ్రామ బహిష్కరణలు విధిస్తూ, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గిరి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సింగన్న వాళ్ల రాజకీయాలను, వారి స్వభావాన్ని అర్థం చేయిస్తూ ప్రజలకు మద్దతుగా నిలిచినాడు. ఏరియాలో ప్రజలను నిర్మాణాలలోకి, పోరాటాలలోకి తీసుకు రావడానికి తన వంతు పాత్ర నిర్వహిస్తూ, ప్రజాద్రోహులైన ఎన్‌డి పార్టీ నాయకుడు ఖాజా, పుల్సు వెంకన్న, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డిని ఖతం చేయడంలో ముందున్నాడు.

ఇలా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన కామ్రేడ్ సింగన్న అమరత్వం కె.కె.డబ్ల్యూ. వుద్యమానికి, ముఖ్యంగా కొత్తగూడెం-నర్సంపేట ఏరియా ఉద్యమానికి తీరని లోటు. కామ్రేడ్ సింగన్న ఆదర్శాలను ఎత్తిపడుతూ, అతని ఆశయాలను నెరవేరుద్దామని శపథం చేద్దాం.

కామ్రేడ్ సింగన్న అంత్యక్రియలు అతని స్వగ్రామమైన నర్సాపురంలో జరిగాయి. ఈ సందర్భంగా వేలాది మంది ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, బంధు మిత్రుల కమిటీ కార్యకర్తలు పాల్గొని తమ ప్రియతమ నాయకునికి విప్లవ జోహార్లు తెలుపుతూ, సింగన్న ఆశయాలను తుదివరకు కొనసాగిస్తామని శపథం చేసారు.

# కామ్రేడ్ దశరథం (శ్యాం)



కామ్రేడ్ దశరథం (శ్యాం) 2012 మార్చి చివరి వారంలో చెట్ల మందు తాగి ఆత్మహత్య చేసుకొని అమరుడయ్యాడు. కామ్రేడ్ దశరథం (శ్యాం) వరంగల్ జిల్లా ములుగు మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబంలో 28 సంవత్సరాల క్రితం జన్మించాడు. తల్లి తండ్రులకు పెద్ద కొడుకైన దశరథంకు ఇద్దరు చెల్లెళ్లు, ముగ్గురు తమ్ముళ్లు వున్నారు. చిన్ననాటి నుండే కామ్రేడ్ దశరథం చదువులో ముందుండేవాడు. ఇంటర్ వరకు చదివాడు. లక్ష్మీదేవిపేటలో కరడుగట్టిన భూస్వాముల అణచివేతను ఎదుర్కొన్న కుటుంబాలలో కామ్రేడ్ దశరథం కుటుంబం ఒకటి. దీనికి వ్యతిరేకంగా పోరాడాలనే చైతన్యంతో ఆ ప్రాంతంలో పనిచేస్తున్న సిపియుఎస్ఐ సంబంధాలలోకి 2001-02లలో వచ్చి విద్యార్థి ఆర్గనైజర్‌గా పనిచేశాడు.

2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సిపిఐ (మావోయిస్టు), జనశక్తి పార్టీలతో చర్చలు జరుపుతున్న కాలంలో ములుగు పట్టణంలో 90 అడుగుల అమరవీరుల స్థూపం నిర్మించడంలో కామ్రేడ్ దశరథం క్రియాశీల పాత్ర పోషించాడు. ఆ వెనువెంటనే చర్చల ప్రక్రియ ముగియడంతో నిర్బంధం పెరిగి కామ్రేడ్ శ్యాం సిపియుఎస్ఐలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు.


పనిచేస్తున్న క్రమంలో సిపియుఎస్ఐ నాయకుల ద్రోహాన్ని అర్థం చేసుకొని, 2005 సెప్టెంబర్‌లో ప్రజల కోసం పోరాడే సిపిఐ (మావోయిస్టు)లో చేరడానికి వచ్చిన వారిలో కామ్రేడ్ శ్యాం ఒకరు. సిపిఐ (మావోయిస్ట్)లోకి వచ్చిన తర్వాత మొదట్లో కామ్రేడ్ శ్యాం నర్సంపేట ఎల్‌జిఎస్‌లో పనిచేశాడు. ఆ కాలంలో తనలోని పాత భావాలను తొలగించుకొని, క్రమశిక్షణను అలవర్చుకోవడానికి నిరంతరం కృషి చేసినాడు. 2007లో ఏసి సభ్యుడిగా ప్రమోట్ అయి ఇల్లందు-మణుగూరు ఏరియా కమిటీలో ఒక సంవత్సర కాలం పని చేసి 2008లో ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యాడు.

ఖమ్మం జిల్లాలో చర్ల ఎల్‌ఓఎస్ పరిధిలో మిలీషియా బాధ్యుడిగా పని చేస్తూ మిలీషియాను నిర్మాణాలలోకి, పార్టీలోకి తీసుకురావడానికి విశేష కృషి చేసినాడు. ముఖ్యంగా ఆదివాసీ గూడాలలోని ప్రజల భాషను తొందరగా నేర్చుకొని ప్రజలలో మంచి గుర్తింపు పొందినాడు. ఏ వయస్సు వారితోనైనా సులభంగా, తొందరగా కలిసి పోయేవాడు. ఖమ్మం జిల్లాలో శత్రువు తలపెడుతున్న గ్రీన్‌హంట్ దాడిని ఓడించడంలో మిలీషియా పాత్రను పెంచడానికి కృషి చేశాడు. రోడ్లను ధ్వంసం చేయడం, ఆటంకాలు కల్పించడం, ప్రజా ద్రోహులను, ఇన్‌ఫార్మర్లను మట్టుపెట్టడంలో మిలీషియా పాత్రను పెంచినాడు. ఆ తరువాత 2011లో నూతనంగా ఏర్పడిన పిఎల్‌లోకి బదిలీ అయినాడు. తాను అమరుడయ్యే నాటికి ఆర్గనైజేషన్ రంగంలో పని చేస్తున్నాడు.

పెళ్లి తదితర తన వ్యక్తిగత సమస్యలను పార్టీ పద్ధతిలో పరిష్కరించుకోకుండా నిరుత్సాహానికి గురై రాజకీయంగా బలహీనపడి, సరెండర్ కావడానికి నిర్ణయించుకొని (ఊగిసలాడుతూ) చివరికి గ్రామంలో వున్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్నాడు.

కామ్రేడ్ శ్యాం అంత్యక్రియలు అతను ప్రేమించే ఆదివాసీ ప్రజల మధ్యనే, విప్లవ సాంప్రదాయాలతో జరిగాయి. అనేక మంది ప్రజలు, పిఎల్‌జిఎ సభ్యులు అంతిమయాత్రలో పాల్గొని అమరునికి జోహార్లు చెబుతూ నివాళులర్పించారు.

# పేందోర్ భీంరావు



ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడి పోలీసులు పెట్టిన శారీరక, మానసిక చిత్రహింసలకు గురై అనారోగ్యంతో కామ్రేడ్ భీంరావు (తుడుందెబ్బ భీంరావు) 2010 మే 24న మరణించాడు.

కామ్రేడ్ భీంరావు ఆదిలాబాద్ జిల్లా తిర్యాణి మండలం గోపేర గ్రామంలోని పెందోర్ తుకారాం - లచ్చుబాయిల మూడవ సంతానం. పేదరికం వలన ఏడవ తరగతిలోనే చదువు మానేసి, జీవనోపాధి కోసం ఐ.టి.డి.ఏ.లో జి.వి.డబ్ల్యూగా పని చేస్తూ ఐ.టి.డి.ఏ/ప్రభుత్వ అధికారుల అవినీతికి వ్యతిరేకంగా ఆదివాసులను ఐక్యం చేసి పోరాటాలకు పురిగొల్పాడు. మొదట తునికాకు రేట్లు పెంచడం వంటి ఆర్థిక డిమాండ్లతో మొదలైన పోరాటాలు చివరకు కొమురం భీం పోరాట స్ఫూర్తితో ఆదివాసుల హక్కుల పోరాట సమితి 'తుడుం దెబ్బ' ఏర్పాటుకు దారితీశాయి. తుడుం దెబ్బ ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించి "మావ నాటే మావ రాజ్" అనే నినాదంతో ఆదివాసుల స్వయం ప్రతిపత్తి కోసం పోరాడాడు.

కామ్రేడ్ భీంరావు పార్టీ సభ్యుడిగా పార్టీ రాజకీయాలను, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలలోకి తీసుకపోతూ, ప్రజలకు అండదండగా వున్నాడు. ఉత్తర తెలంగాణ ఉద్యమం ఆటు పరిస్థితిలో వున్నప్పటికీ ప్రజలకు ధైర్యం చెపుతూ, పార్టీని కంటికి రెప్పలా కాపాడుతూ గొప్ప ఆదర్శంగా వున్నాడు.

శత్రువు ఎన్నిసార్లు అరెస్టులు చేసి, చిత్రహింసలకు గురిచేసినప్పటికీ పార్టీ రహస్యాలను కాపాడుతూ తుది శ్వాస వరకు విప్లవం కోసం ప్రజల కోసం పని చేసిన కామ్రేడ్ పేందోర్ భీంరావు అమరత్వం పార్టీకి, ప్రజలకు తీరని లోటు. కామ్రేడ్ పేందోర్ భీంరావులోని పట్టుదల, వర్గచైతన్యం ప్రజలకు, పార్టీ సభ్యులకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలిచిపోతాయి. కామ్రేడ్ భీంరావు ఆశయాలను తుదివరకు కొనసాగిద్దామని, ఉత్తర తెలంగాణాలో ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకుందామని శపథం చేద్దాం.

★

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర రీజనల్ బ్యూరో


జూలై 19, 201

## పీడిత ప్రజల పక్షపాతి, అవిశ్రాంత పోరాటకారుడు

## కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణకు అరుణారుణ జోహార్లు!

సుదీర్ఘ కాలం పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజా వుద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణ (72) జూన్ 22న గుండెపోటుతో మరణించారు. సిపిఐ (మావోయిస్టు) సభ్యుడిగా ఎల్లవేళలా ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన కామ్రేడ్ బీఎస్ఏకు మా పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజాసంఘాలు తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నాయి. ఆయన ఆశయ సాధనలో పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రతిజ్ఞ చేస్తున్నాయి. ఆయన బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాయి.

బిఎస్ఎగా సుప్రసిద్ధుడైన బొమ్మకంటి శ్రీ ఆంజనేయ సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో కమ్యూనిస్టు కుటుంబంలో 1940లో పుట్టారు. అప్పటి పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ శాఖలో రైల్వే మెయిల్ సార్టింగ్ వుద్యోగిగా చేరి 1950 చివరిలో హైదరాబాద్‌కు వెళ్లారు. నక్సల్బరీ పోరాట ప్రభావంతో ఆయన పి అండ్ టి కార్మికోద్యమ నేత అయ్యారు. తన సహచరులు అమరుడు కామ్రేడ్ యు. శ్రీనివాసులు, ప్రస్తుతం జైలు ఖైదును అనుభవిస్తున్న కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తిలతో పాటు ఆయన కార్మిక, ఉద్యోగ రంగాల్లో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలే కాక కర్నూలు, ఆదోని వంటి పట్టణాల్లోనూ కార్మికరంగంలో విప్లవ రాజకీయాలను ఎత్తిపట్టారు. రాష్ట్రమంతటికీ మేడే సభల్లో వక్తగా వెళ్లేవారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెలోనూ, 80 దశకంలో జరిగిన, దేశంలోనే అతి పెద్ద సమ్మెగా ప్రసిద్ధి చెందిన పి అండ్ టి సమ్మెలోనూ ఆయన చురుకైన పాత్ర వహించారు.



కార్మికరంగంలో పనిచేస్తూనే 1970 నుండి 75 వరకు హైదరాబాద్‌లో విద్యార్థి, యువజన, రచయితల సంఘాలకు సంబంధించిన ఏ సభలు జరిగినా ఆ నిర్వహణలో ఆయన తప్పకుండా చురుకైన పాత్ర వహించేవారు. నక్సల్బరీ, శ్రీకాకుళ వుద్యమాలు దెబ్బతిన్న తర్వాత వుద్యమాన్ని పునరుద్ధరింప చేయడానికి జరిగిన కృషిలో ఆయన భాగస్వామి అయ్యారు.

ఎమెర్జెన్సీ సమయంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు. రెండు నెలల జైలు శిక్ష అనంతరం ఆయన విడుదలయ్యారు. అయితే అప్పటికే ఆయన నిర్వహిస్తున్న పోరాటాల పట్ల కక్షసాధింపుతో వున్న యాజమాన్యం, అరెస్టును సాకుగా తీసుకొని ఆయనను ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. అరెస్టులు, చిత్రహింసలు, యాజమాన్య వేధింపుల కారణంగా విప్లవ స్ఫూర్తి ఏమాత్రం దెబ్బతినని ఆయన మార్క్సిస్టు బోధకుడిగా రాష్ట్రమంతా తిరుగుతూ పార్టీ, సంఘ కార్యకర్తలకు రాజకీయ తరగతుల ద్వారా విద్యగరపడంలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మార్క్సిస్టు తత్వశాస్త్రం, కార్మికోద్యమ చరిత్రలను బోధించేవారు. ఆ సమయంలో 1984లో విజయవాడలో రాడికల్ యువజన సంఘం కార్యకర్తలకు రాజకీయ తరగతులు బోధిస్తుండగా పోలీసులు దాడి చేసి అందరితో పాటు ఆయనను కూడా అరెస్ట్ చేసి, కుట్రకేసు మోపి జైల్లో పెట్టారు. విడుదలైన తర్వాత ఆయన అజ్ఞాతవాసంలోకి వెళ్లి పూర్తికాలం మార్క్సిస్టు బోధకుడిగానే గాక కార్మిక పథం వంటి విప్లవ పత్రికల నిర్వహణలో భాగమయ్యారు.

అనారోగ్య కారణాల రీత్యా 1990లో ఆయన బహిరంగ జీవితంలోకి వచ్చి పోస్టల్ శాఖలో వుద్యోగంలో చేరారు. అదే సమయంలో లా చదివి న్యాయవాదిగా మారారు. న్యాయవాదిగా

రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాడారు. పౌర హక్కుల రంగంలో విశేషంగా కృషి చేస్తూ, గ్రామాలకు సైతం వెళ్లి న్యాయ సహాయం అందించేవారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డిల పాలనా కాలాల్లో పోలీసు నిర్బంధం, ప్రైవేటు హంతక ముఠాల హింసాకాండ మధ్య విప్లవకారులకు, ప్రజలకు న్యాయ సహాయం అందించిన అతి కొద్దిమంది న్యాయవాదులలో ఆయన ఒకరు. జుడీషియల్ కస్టడీ నుండి పోలీసు కస్టడీకి అప్పగించిన నిందితులను న్యాయవాదుల సమక్షంలోనే విచారించాలనే నిబంధనను ఎన్నడూ పాటించని పోలీసుల మెడలు వంచి కొందరు విప్లవకారుల విచారణలో ఆ నిబంధనను అమలు చేయించారు. అట్లా పోలీసుల చిత్రహింసల నుండి ఖైదీలను కాపాడారు. తన వృత్తిలో భాగంగా జడ్జిలతోనూ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతోనూ నిక్కచ్చిగా వ్యవహరించేవారు. కోర్టు ధిక్కరణకు కూడా పాల్పడ్డారు.

మరో వైపు కార్మికోద్యమ పత్రిక 'శ్రమజీవి'ని ప్రారంభించారు. కార్మికోద్యమ నేతగా, న్యాయవాదిగా ఆయనకున్న అనుభవం నుండి ఆ పత్రికను కార్మికోద్యమ కరదీపికగా తీర్చిదిద్దారు. ఆ పత్రికలో ఎన్నో విలువైన వ్యాసాలు రాశారు.

గత కొద్ది కాలంగా ఆయన రాజకీయ ఖైదీల విడుదల కమిటీ (సీఆర్‌పీపీ)కి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యక్షుడిగా చురుకైన పాత్ర వహిస్తున్నారు. తన అనారోగ్య సమస్యలను లెక్క చేయకుండా రాజకీయ ఖైదీల విడుదల కొరకు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల జైళ్లలో వున్న రాజకీయ ఖైదీలను కలిసి మనోధైర్యాన్ని అందించారు. వాళ్ల కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రయత్నించారు.

సుదీర్ఘ కాలం ప్రజల పక్షాన దృఢంగా నిలబడి, ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర వహిస్తున్న కామ్రేడ్ బీఎస్ఏ మంచి అధ్యయనశీలి, వక్త. ఉద్యోగంలో సస్పెన్షన్లు, కోర్టు ధిక్కరణ నేరాల పేరిట వేధింపులు. ఆర్థిక ఒడిదుడుకులు, అనారోగ్యాలు... వంటివేవీ ఆయన రాజకీయ నిబద్ధతను మాసిపోనీయలేదు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఎన్నో విలువలు, ఆదర్శాలను పాటించారు. తినడానికి సరైన తిండి లేని పరిస్థితుల్లో కూడా ఆయన ఎన్నడూ జీవితంతో రాజీపడలేదు. ఆస్తులు, సౌకర్యాల కోసం తాపత్రయపడకుండా అత్యంత నిరాడంబరమైన జీవనశైలిని అనుసరించారు. ఆయన నిరాడంబరత విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచిపోతుంది.

ప్రస్తుతం ప్రజలపై యుద్ధం కొనసాగుతున్న పరిస్థితుల్లో, ప్రజల పక్షాన దృఢంగా నిలబడే, ఈ ఆదర్శవంతమైన ప్రజా నాయకుడిని కోల్పోవడం ప్రజలకూ, ప్రజా సంఘాలకూ, ప్రజాస్వామిక వుద్యమాలకూ తీవ్రమైన నష్టం.

కామ్రేడ్ బీఎస్ఏ మొక్కవోని నిబద్ధతనూ, ఆదర్శాలనూ, పోరాటతత్వాన్ని పుణికిపుచ్చుకున్న విప్లవ ప్రజా సంఘాలు ప్రజా పోరాటాల్లో మరింత చురుకైన పాత్ర పోషిస్తూ ఆయన లేని లోటును తప్పక పూరిస్తాయని మా పార్టీ ప్రగాఢంగా విశ్వసిస్తున్నది.

- ★ **కామ్రేడ్ బిఎస్ఏ అమర్ రహే!**
- ★ **అమరుల ఆశయాలను కొనసాగిద్దాం!**
- ★ **మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**
- ★ **కార్మికవర్గ అంతర్జాతీయతత్వం వర్ధిల్లాలి!**

**ఆనంద్**
**కార్యదర్శి**
**కేంద్ర రీజనల్ బ్యూరో**
**సీపీఐ (మావోయిస్టు)**

---

***(18వ పేజీ తరువాయి...)***

పార్టీకి వరుసగా జరుగుతున్న నష్టాల నేపథ్యంలో బహుముఖంగా నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలనే సిసి పథకానికి కామ్రేడ్ శేషన్న అమరత్వం మరొక దెబ్బ. వెనుకంజలో ఉన్న ఎన్‌టి ఉద్యమానికి ఇప్పట్లో తీర్చుకోలేని నష్టం. పార్టీ ఎన్నో కష్ట నష్టాల గుండా ప్రయాణించి విప్లవ విజయాన్ని సాధిస్తుంది. ఈ గెలుపు, ఓటముల్లో రాటు తేలిన వారే నాయకులుగా ఎదుగుతారు. కామ్రేడ్ శేషన్న కూడా యిలాంటి ఎగుడు దిగుడు, వంకర టింకర మార్గాల గుండా ధైర్యంగా ప్రయాణించడం ద్వారానే ఒక మంచి రాష్ట్ర కమిటీ నాయకుడుగా ఎదిగాడు. కామ్రేడ్ శేషన్న తన విప్లవ జీవిత కాలంలో అందించిన విప్లవ చైతన్యం, ప్రేరణతో ఎంతో మంది కామ్రేడ్స్ ఆ కంటకావృతమైన విప్లవ మార్గంలో ప్రయాణించడానికి సిద్ధంకావడంతో పాటు, కొత్తగా నూతన బాధ్యతలు స్వీకరించడానికి ముందుకు వస్తారు. ఒక వీరుడు మరణిస్తే-ప్రభవింతురు వేలకొలది; ప్రజలు, విప్లవోద్యమమే నాయకులను సృష్టిస్తుందనే చారిత్రక సత్యాన్ని నిరూపిస్తూ ఉద్యమంలో నూతన నాయకత్వం ముందుకు రావడం తప్పక జరిగి తీరుతుంది. ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి వికసింప జేయడానికి ఉత్తర తెలంగాణా పజలు, పార్టీ, పిఎల్‌జీఏ యోధులు కామ్రేడ్ శేషన్న చూపిన మార్గంలో మరింత దృఢంగా ముందుకు సాగుతారు. ఆదిలాబాద్ ఉద్యమాన్ని, ఎన్ని యిబ్బందుల మధ్యనైనా కొనసాగించడం, ఎన్‌టి ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి అహర్నిషలు కృషి చేసి, లక్ష్యాన్ని సాధించడం ఆ క్రమంలో భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే కామ్రేడ్ శేషన్నకు మనం నిజమైన నివాళి అర్పించగలం.

**కామ్రేడ్ గుండేటి శంకర్ (శేషన్న, మహేషన్న) అమర్ రహే!** ★

# మాడ్ ప్రాంతంపై ప్రభుత్వ సాయుధ బలగాల విధ్వంసదాడి

ఈ సంవత్సరం కూడా మార్చ్ నెల దండకారణ్య ప్రజలకు నిరుటి వలెనే వినాశనాన్ని కొని తెచ్చింది. గత సంవత్సరం సరిగ్గా ఇదే నెలలో 11-16 తేదీల మధ్య దక్షిణ బస్తర్‌లోని చింతల్‌నార్ ప్రాంతంలో మోర్‌పల్లి, పులాన్‌పాడ్, తిమ్మాపురం, తాడిమెట్ల గ్రామాలపై ప్రభుత్వ సాయుధ బలగాలు విధ్వంసకర దాడి జరపగా, ఈసారి దాడికి గురైంది పాలకులు 'అబూజ్‌మాడ్'గా వ్యవహరించే మాడ్ ప్రాంతం. చింతల్‌నార్ విధ్వంసం గురించి, ఆ తర్వాత నిజనిర్ధారణ కోసం వచ్చిన అగ్నివేష్ తదితరులపై జరిగిన ఇతర దాడుల గురించి అన్ని సెక్షన్ల నుండి వచ్చిన వత్తిడి మూలంగా, సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఆ 'విచారణ' జరుగుతున్న సమయంలోనే మాడ్‌పై జరిగిన ఈ అమానుష దాడి ద్వారా, మన దేశంలో అమలవుతున్నది ప్రజాస్వామ్యమని ఇంకా నమ్మేవాళ్లెవరైనా వుంటే వాళ్లకు కనువిప్పు కాకతప్పదు.



**తోకె గ్రామంలో జరిగిన విధ్వంసానికి సాక్ష్యం**

గత జూలైలో సుప్రీంకోర్టు ఎస్‌పిఓ, కోయ కమాండోల నియామకాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించి వాళ్ల చేతుల్లోని తుపాకుల్ని వెనక్కి తీసుకోవాలని తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తన అలవాటు ప్రకారం ఈ తీర్పును కూడా బేఖాతరు చేస్తూ ఎస్‌పీవో/కోయ కమాండోలను 'ఆగ్జిలియరీ పోలీసు ఫోర్స్'గా పేరు మార్చి కొనసాగిస్తున్న సంగతి కూడా తెలిసిందే. నిరుడు 'కోయ కమాండో'ల రూపంలో వీరంగమాడిన ఫాసిస్టు మూకలు ఈసారి కొత్త కొత్త పేర్లతో సి.ఆర్.పి.ఎఫ్. (కోబ్రా), సి.ఎ.ఎఫ్., ఎస్.టి.ఎఫ్., సి-60 క్రాక్ కమాండో బలగాలతో కలిసి విధ్వంసానికి, లూటీలకు, హత్యలకు, అత్యాచారాలకు, విచ్చలవిడి కాల్పులకు పాల్పడ్డాయి.

ప్రభుత్వమే చెప్పిన ప్రకారం మూడు వేల మంది వివిధ సాయుధ బలగాలు పాల్గొన్న ఈ దాడికి 20-25 గ్రామాలు గురయ్యాయి. ఏకకాలంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్‌కు చెందిన నారాయణ్‌పూర్ జిల్లా, బీజాపూర్ జిల్లా, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాల నుండి – మూడు వైపుల నుండి జరిగిన ఈ దాడిలో ఒక ఆదివాసీ యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరొక ఆదివాసీ యువకుడు మాయం చేయబడ్డాడు. కాగా ఎందరో ఆదివాసీ ప్రజానీకం గాయపడ్డారు. ఎన్నో చోట్ల నిరాయుధ ప్రజలపై పోలీసులు/పారామిలిటరీ బలగాలు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. పదుల సంఖ్యలో ఇండ్లను ధ్వంసం చేశారు. కొన్నింటిని కాల్చి బూడిద చేశారు. ఇండ్లల్లో దాచుకున్న లక్షల రూపాయల విలువ చేసే ప్రజల కష్టార్జితాలను లూటీ చేశారు. కాల్చివేశారు.

సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ల పేరుతో గత ఏడేళ్లుగా సాగిస్తున్న విధ్వంసాల, హత్యాకాండల పరంపరలో భాగంగా 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' అనే పేర్లతో సాగించిన ఈ తాజా విధ్వంసకాండను పాలకవర్గాలు తమ 'విజయం'గా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నాయి. దేశ సరిహద్దుల వద్ద కాపలా కాస్తూ శత్రు దేశాల దాడుల నుండి దేశాన్ని రక్షించడానికి ఉద్దేశించిన సరిహద్దు భద్రతా బలగం, ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు దళం, సశస్త్ర సీమా బల్‌లతో పాటు ప్రస్తుతం సైన్యాన్ని, వాయుసైన్యాన్ని కూడా దేశం నడి మధ్యన మోహరిస్తూ ఇక్కడి అత్యంత నిరుపేద జనాన్నే శత్రువులుగా పరిగణించి వేటాడుతున్న రాజ్యానికి ఇది శత్రు దేశంపై సాధించిన 'విజయం' లాగా తోచడంలో ఆశ్చర్యం ఏముంది?!

ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశలో భాగంగా గత సంవత్సరం జూన్ నెలలో ఒక బ్రిగేడ్ సంఖ్యలో భారత సైన్యాలు మాడ్ ప్రాంతంలో 'శిక్షణ' పేరుతో దండకారణ్యంలో ప్రవేశించిన సంగతి తెలిసిందే. మొత్తం 750 చ.కి.మీ. భూభాగాన్ని ఆక్రమించుకునే కుట్రలో భాగంగా మాడ్‌లోని అనేక గ్రామాల్ని లేకుండా చెయ్యడానికి, మొత్తంగా మాడియా ఆదివాసుల అస్తిత్వాన్నే రూపుమాపడానికి పథక రచన జరిగింది. దేశ సహజ సంపదల్ని కార్పొరేట్ వర్గాలకు దోచి పెట్టేందుకు అతి పెద్ద అడ్డంకిగా వున్న మావోయిస్టు వుద్యమాన్ని దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదంగా ఒక పథకం ప్రకారమే

దుష్ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా మాడ్ ప్రాంతాన్ని మావోయిస్టుల ప్రధాన స్థావర ప్రాంతమనీ, మావోయిస్టు అగ్రనేతలు మాడ్‌లోనే తలదాచుకుంటున్నారనీ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ, తద్వారా తమ దాడులకు సాధికారతను, ఆమోదాన్ని పొందవచ్చని భ్రమిస్తున్నారు.

నిజానికి మాడ్ ప్రాంతంలో దాడులు కొత్త విషయమేమీ కాదు. గతంలో వేరు వేరు ప్రాంతాల్లో వందల సంఖ్యలో పోలీసు/ పారామిలిటరీ బలగాలు అక్కడక్కడ దాడులు చేసి హత్యలకు, విధ్వంసానికి, హింసకు పాల్పడ్డ సందర్భాలున్నాయి. మాడ్ అంచున వున్న ఇంద్రావతి నదీతీర ప్రాంతంలో 2005 నుండి సల్వాజుడుం దాడులు అనేకం జరిగాయి. పదుల సంఖ్యలో గ్రామాల్ని కాల్చి బుగ్గి చేశారు. ఎంతో మంది ప్రజలను కాల్చి చంపారు. లూటీలు, పంటల విధ్వంసం ఎంతో జరిగిపోయింది. కానీ ఇంత భారీ సంఖ్యతో మాడ్ ప్రాంతాన్ని మొత్తం మూడు వైపుల నుండి చుట్టేస్తూ ఏకకాలంలో దాడికి దిగడం ఇదే మొదటిసారి. మాడ్‌లో శిక్షణా స్కూళ్ల ఏర్పాటు పేరుతో నిరుడు బస్తర్‌లో దిగిన భారత సైన్యం మాడ్‌కు పక్కనే, కొండగాం ప్రాంతంలో మోహరించి వున్న నేపథ్యంలో ఇలాంటి భారీ దాడి జరిగిందనేది గమనార్హం. సైన్యం రూపొందించిన వ్యూహంతో, శత్రు దేశాలపై విరుచుకుపడే సైన్యాల మాదిరి జరిగిన ఈ దాడిలో హెలికాప్టర్లను, మానవరహిత విమానాలను, అత్యాధునిక టెక్నాలజీని, మోర్టార్స్ సహా అనేక రకాల మారణాయుధాలను పెద్ద ఎత్తున వుపయోగించారు.

మాడ్ ప్రాంతం నుండి ఆదివాసులను ఖాళీ చేయించడం; సైన్యానికి శిక్షణా స్కూలు పేరుతో మొత్తంగా మాడ్‌ను ఆక్రమించుకోవడం; దళారీ పెట్టుబడిదార్లకూ, బహుళజాతి కంపెనీలకూ బస్తర్ సంపదలన్నీ దోచిపెట్టడం; వీటన్నిటినీ నిరాటంకంగా పరిపూర్తి చేయడం కోసం మావోయిస్టులను నిర్మూలించడం లక్ష్యాలుగా సాగుతున్న యుద్ధంలో భాగమే మాడ్‌పై జరిగిన ఈ తాజా దాడి.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసు వున్నతాధికారులు ఈ దాడికి పథక రచన చేశారు. కేంద్ర హోంశాఖ నక్సల్ ప్రభావిత రాష్ట్రాల డిజిపిలతో, ప్రధాన కార్యదర్శులతో గత నెల 22న జరిపిన తాజా సమావేశంలో, ఆ తర్వాత మార్చ్ 2న హోంమంత్రి చిదంబరం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాల ప్రకారమే ఈ దాడి జరిగిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

పోలీసు అధికారులు ఈ దాడిని 'నక్సలైట్లపై పోలీసుల విజయం'గా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. అసలు ఈ దాడి జరిగింది ఎవరిపైన? టార్గెట్ చేసింది ఎవరిని? హింస జరిగింది ఎవరిపైన? అనే విషయాలేవీ పట్టించుకోని మీడియా పోలీసుల కథనాలకు మరింత మసాలాతో ప్రచారం సాగిస్తున్నది. అయితే నారాయణపూర్ ఎస్.పి. మీడియా వాళ్లతో మాట్లాడుతూ కొన్ని వాస్తవాల్ని కూడా చెప్పక తప్పలేదు. మాడ్‌లోని లోతట్టు గ్రామాల్లో స్కూళ్లు, ఆసుపత్రులు ఏవీ లేవని, మావోయిస్టులు కూరగాయలు, జొన్నలు తదితరాలు పండిస్తున్నారని, స్కూళ్లు నడుపుతున్నారని అన్నాడు. మరి ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన ప్రజలు మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో స్కూళ్లు నడుపుకోవడం, వ్యవసాయాన్ని మెరుగుపర్చుకోవడానికి కృషి చేయడం నేరమెలా అయ్యిందో దేశ పాలకుల్ని నిలదీయాల్సిన అవసరం వుంది. గ్రామాలతో పాటు ఈ ప్రాంతంలో విప్లవ జనతన సర్కార్ నడిపే రెండు స్కూళ్లను, రెండు వ్యవసాయ క్షేత్రాలను కూడా లక్ష్యంగా చేసుకొని సాగించిన ఈ దాడిని 'విజయం'గా ఎలా చెప్పుకుంటున్నారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

ఇక ఈ దాడి జరిగిన తీరుతెన్నుల్ని పరిశీలించడం ద్వారా ఇది మరింత స్పష్టమవుతుంది.

## దక్షిణాన ఇంద్రావతి అవతలి నుండి మొదలైన దాడి

జగ్దల్‌పూర్ నుండి మార్చ్ 7న కోబ్రాలు, పోలీసులు, ఎస్‌పీవోలతో కూడిన తొమ్మిది కంపెనీల సాయుధ బలగాలు – అంటే దాదాపు 800 మంది బీజాపూర్‌కు చేరుకున్నారు. 'ఆపరేషన్ హాకా'గా చెప్పుకున్న ఈ దాడికి అక్కడే సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. 11 వుదయం ఇంద్రావతి ఒడ్డున వున్న బోడ్‌గా అనే గ్రామానికి చేరుకున్నారు. ఈ గ్రామంలో అనేక ఇండ్లల్లో లూటీలకు పాల్పడ్డారు. జావా అనే రైతు ఇంట్లోంచి 2,550 రూపాయలు దోచుకున్నారు. నకిరీ ఓయామివి రెండు వేల రూపాయలు దోచుకున్నారు. మాడివి బామన్ అనే రైతును విపరీతంగా కొట్టారు. దెబ్బల వలన ఆయన లేవలేకుండా అయ్యాడు. రాత్రికి వెడమ గ్రామానికి చేరుకున్నారు.

సాయుధ బలగాలు గ్రామాలపై దాడికి వచ్చిన విషయం తెలిసిన తాకిలోడ్ గ్రామ ప్రజలు, తమ గత చేదు అనుభవాల రీత్యా ముందుగానే గ్రామాన్ని ఖాళీ చేసి వెడమ గ్రామ సమీపంలోని అడవిలోకి వెళ్లి పడుకున్నారు. అలా పడుకున్న ప్రజలపై ప్రభుత్వ సాయుధ బలగాలు విచ్చలవిడిగా కాల్పులు జరిపాయి. 12 వుదయం పోలీసులు వెడమ నుండి రేకవాయ పరిసరాల్లోకి వచ్చి అన్నం వండుకొని తిన్నారు. గ్రామంలో తమ చేతికి దొరికిన కోళ్లను ఇష్టానుసారం కోసుకొని తిన్నారు. ఇండ్లల్లోని కొన్ని వస్తువులు, నగదు కూడా దోచుకున్నారు.

12వ తేదీ సాయంత్రం నాయుంపార అనే చోట విప్లవ జనతన సర్కార్ నిర్వహించే ప్రాథమిక ఆశ్రమ పాఠశాలపై దాడి చేశారు. అయితే అందులో చదువుకునే పిల్లలు, టీచర్లు ముందే అడవిలోకి తప్పుకోవడంతో ఎవరికీ నష్టం జరగలేదు. ఆ రాత్రి పాఠశాలలోనే పడుకున్న జవానులు పోతూ పోతూ ఇక్కడ పిల్లలు స్నానాలు చేసే కాలువ దగ్గర ఒక బాంబును అమర్చి తమ హంతక స్వభావాన్ని చాటుకున్నారు. మరుసటి రోజు రాత్రి చీకటి పడ్డ తర్వాత కుమ్మం అనే చిన్న పల్లెకు చేరుకున్నారు. ఆ పల్లెలో ఇండ్లల్లోకి జొరబడి బలవంతంగా బియ్యం, ఇతర తిండి సరుకుల్ని దోచుకొని వంట చేసుకున్నారు. గెరిల్లాలు ఎదురుదాడి చేసే అవకాశం వుందని

భయపడి ఇండ్లన్నీ ఆక్రమించుకొని ప్రజల్ని బైటికి నెట్టేసి పడుకున్నారు. మరుసటి రోజు అక్కడి నుండి గుట్టలు దిగి తాడిబల్ల అనే గ్రామానికి చేరుకున్నారు. అక్కడ చాలా మంది ప్రజల్ని పట్టుకొని అందులోంచి కొందరిని వదిలేసి మిగతా వాళ్లను తమ వెంట తీసుకొని నది దాటిపోయారు. అలా కొట్టి వదిలేసిన కొందరి చేతుల్లో 20, 30, 50 రూపాయల్ని కూడా వుంచారు. బహుశా వాళ్ల గ్రీన్‌హంట్‌లో 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం' కూడా భాగం కాబట్టి ఇలా డబ్బులివ్వాలని నిశ్చయించుకున్నారేమో! తాడిబల్ల గ్రామం వద్ద అడవిని నరికి హెలికాప్టర్ దిగేలా ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. హెలికాప్టర్ ద్వారా బలగాలకు ఆహారాన్ని, ఇతర వస్తువుల్ని కూడా అందజేశారు.

బీజాపూర్-జగ్దల్‌పూర్ రోడ్డు మీదుండే మాట్వాడా నుండి మరో మూడు కంపెనీల బలగాలు దాదాపు ఇదే సమయంలో బయలుదేరాయి. వీళ్లు గుడ్రా అనే గ్రామం దగ్గర ఇంద్రావతి నదిని దాటి రేకపారకు వచ్చారు. ఈ గ్రామ సమీపంలోని అడవిలో జీలి, గోంగ్లా గ్రామాలకు చెందిన 22 మంది ప్రజల్ని పట్టుకున్నారు. కొంత మంది ప్రజలు వాళ్లను చూసి పారిపోతుండగా వాళ్లపై కాల్పులు జరిపారు. పట్టుకున్న ప్రజల్ని వెంట బెట్టుకొని గుట్టల్ని ఎక్కి కుమ్‌నార్ అనే కుగ్రామంపై దాడి చేసారు.

ఈ గ్రామంలో తమ కంటబడిన మహిళల్ని బాగా కొట్టారు. బుద్రు ఓయామి అనే ఒక వ్యక్తిని పట్టుకెళ్లారు. ఆ తర్వాత అతన్ని తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపారు. ఈ గ్రామంలోని అన్ని ఇండ్లలోకి దూరి ఇష్టం వచ్చినట్టుగా దోపిడీకి పాల్పడ్డారు. బుద్రు ఇంట్లోంచి 5 వేలు, పాయికీ అనే మహిళ ఇంట్లోంచి 6 వేల రూపాయల్ని ఎత్తుకెళ్లారు. ఇంకా అనేక ఇండ్లల్లో ప్రజలు దాచి పెట్టుకున్న డబ్బుల్ని లూటీ చేశారు. ఒక రైతుకు చెందిన 'కోహల' (తెలుగులో 'సామలు'గా పిలిచే తృణ ధాన్యం – మాడ్ ప్రజల ప్రధాన ఆహార ధాన్యం) నిల్వచేసి వుంచిన 'బడ్డీ' (గాదె)ని కాల్చివేసారు. దీంతో సంవత్సరం పాటు ఇంటిల్లిపాది కడుపు నింపాల్సిన ధాన్యం ఒక్క క్షణంలో కాలి బుగ్గయ్యింది.

ఇంకా ఈ దాడిలో సాయుధ బలగాలు ప్రజలు చేపలు పట్టడానికి వుపయోగించే వలలను కూడా కాలబెట్టారు. వీటి విలువ 10 వేల రూపాయల దాకా వుంటుంది. ప్రజలు వేటాడి తమ ఇండ్లలో నిల్వ చేసుకున్న ఎండు మాంసాన్ని ఎత్తుకెళ్లారు. చాలా మంది ఇండ్లలో జొరబడి బట్టలు ఎత్తుకెళ్లారు. రెండు భర్మార్లు ఎత్తుకెళ్లారు.

ఈ బలగాలకు బీజాపూర్ ఎస్.పి.తో పాటు మరో ఎస్.పి. స్థాయి అధికారి ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. వీళ్లు తమతో పాటు అత్యాధునిక మారణాయుధాలతో పాటు కంప్యూటర్స్, జి.పి.ఎస్. ఉపకరణాలు, శాటిలైట్ ఫోన్స్ తెచ్చుకున్నారు. అలాగే తేలికపాటి మానవరహిత విమానాల్ని (యు.ఏ.వి.) కూడా వెంట తెచ్చుకున్నారు. తక్కువ బరువుండి, మోయడానికి వీలుగా, ఏ భాగానికి ఆ భాగం విప్పదీసి, తిరిగి అమర్చుకునే వీలున్న యు.ఏ.వి.ని దాదాపు ప్రతి చోటా ఎగరవేస్తూ తామున్న పరిసరాల్లో దాన్ని తిప్పుతూ ఎక్కడైనా గెరిల్లాల కదలికలున్నాయా అని అది తీసే ఫోటోల ద్వారా నిర్ధారించుకున్నారు. బోడ్‌గా, రేకవాయ గ్రామాల్లో ఆగినపుడు వీటిని ఎగరవేశారు. అలా ఈ బీభత్సకర దాడిని హైటెక్ దాడిగా కూడా చెప్పుకోవాలి.

ముందే చెప్పినట్టుగా, పోలీసులు చాలా చోట్ల ప్రజల్ని విపరీతంగా కొట్టడం, ఆ తర్వాత వాళ్ల చేతిలో డబ్బులు పెట్టడంతో పాటు కొందరికి తమతో పట్టుకొచ్చిన కొన్ని బట్టల్ని పంచిపెట్టారు! చాలా మందిని కేవలం పీఎల్‌జీఏ తమపై దాడి చేయకుండా వుండేందుకే రక్షణ కవచంగా వెంట బెట్టుకున్నారు. అయితే ప్రతి చోటా కూడా మహిళలు సాయుధ బలగాల వెంటపడ్డారు. తమ వాళ్లను వదిలెయ్యాలని వాళ్లతో ఘర్షణ పడ్డారు. చివరికి భైరంగఢ్ దాకా కూడా వాళ్ల వెన్నంటే వెళ్లి విడిపించుకొచ్చారు.

రేకపార దగ్గర పట్టుబడ్డ జీలి గ్రామానికి చెందిన 11 మందిని భైరంగఢ్ వరకు పట్టుకెళ్లారు. వీళ్లలో లచ్చు, బుద్రు, సుఖ్‌రాంలను బాగా కొట్టారు. దెబ్బల వల్ల బుద్రుకు మూత్రం బందయ్యింది. అందరినీ ఒక రోజు వుంచుకొని ఫోటోలు తీసుకొని, అందరికీ కలిపి 500 రూపాయలు ఇచ్చి 10 మందిని వదిలేశారు. బుద్రును తప్పుడు కేసుపై జైలుకు పంపారు.

రేకపార దగ్గర సాయుధ బలగాలకు దొరికిపోయిన గోంగ్లా గ్రామానికి చెందిన తొమ్మిది మందిలో లచ్చు ఓయామిని తప్పుడు కేసులో జైలుకు పంపారు. మిగిలిన వాళ్లను భైరంగఢ్ దాకా తీసుకెళ్లి కొన్ని డబ్బులిచ్చి వదిలిపెట్టారు.

మొత్తంగా ఈ ప్రాంతంలో పట్టుకున్న వాళ్లలో 10 మందిపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపించారు – వీరిలో నాయుంపార గ్రామానికి చెందిన మడ్కామి ముసుర్ (32), ఓయామి కుమ్మా (45), మాడివి గుడ్డి (55), బోడగా గ్రామానికి చెందిన ఓయామి బుదు (33), ఓయామి హిడ్‌మా (35), బడేపల్లి గ్రామానికి చెందిన ఓయామి చైతు (40), పదామి సోముదు (35), కుమ్‌నార్‌కు చెందిన ఓయామి బుద్రు (23), గోంగ్ల గ్రామానికి చెందిన ఓయామి లచ్చు (25), జీలి గ్రామానికి చెందిన కుంజాం సుద్రు (35) వున్నారు.

## నారాయణ్‌పూర్ వైపు నుండి సాయుధ బలగాల దాడి

జిల్లా కేంద్రమైన నారాయణ్‌పూర్‌లో ఈ దాడికి సన్నాహాలు మార్చ్ 5 నుండే మొదలయ్యాయి. 13 రాత్రి బలగాలు బయలుదేరాయి. 14న వివిధ సాయుధ బలగాలకు చెందిన దాదాపు వెయ్యి మంది కోహ్కామెట్ట గ్రామం చేరుకొని, వేరే వైపు పోతున్నట్టుగా నటించి కచ్చాపాల్ గ్రామ పొలిమేరల్లోకి చేరుకున్నారు. ఇక్కడ ఊళ్లో నుండి పొలాల వైపు పోయే తోవకు ఆంబుష్ కూర్చున్నారు.

కచ్చాపాల్‌కు చెందిన సోను, రాజు అనే ఇద్దరు గ్రామస్తులు ఈ ఆంబుష్‌లో ఇరుక్కున్నారు. సాయుధ మూకలు వీళ్లపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. సోను కాలికి తూటా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అయినప్పటికీ అతను పరుగెత్తి

తప్పించుకున్నాడు. రాజు మాత్రం పోలీసుల చేతికి చిక్కిపోయాడు. అతన్ని పట్టుకొని విపరీతంగా కొట్టి వదిలేశారు. ఆ దెబ్బల వలన చాలా రోజుల పాటు అతనికి నోట్లోంచి రక్తస్రావం జరిగింది.

## సాయుధ బలగాల విధ్వంసకాండకు గురైన తోకె

15 సాయంత్రం 3 గంటలకు తోకె గ్రామంలోకి జొరబడే ముందు గ్రామ శివార్లలోనే విచ్చలవిడిగా కాల్పులు జరిపి, తర్వాత గ్రామాన్ని చుట్టుముట్టి ప్రజలపై విరుచుకుపడ్డారు. కేయె ధుర్వా అనే రైతు ఇంటిని పూర్తిగా కాలబెట్టారు. ఇంటితో పాటు ఇంట్లో వున్న సామాను, బియ్యం, కోహల ధాన్యం, బట్టలు, వంటపాత్రలు, 16 వేల రూపాయల నగదు కాలిపోయాయి. ఒక పంది కూడా మంటల్లో చిక్కుకొని కాలి చనిపోయింది.

కాళ్లకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న బోతల్ దుంగ (45) అనే ఆదివాసీ నడవలేడు. ఇతన్ని బాగా కొట్టి ఈడ్చుకుపోతుంటే పక్కటెముకల ప్రాంతంలో గాయమై రక్తం కారింది. తర్వాత ఈ రైతు చేతిలో 20 రూపాయలు పెట్టబోయారు. తీసుకోవడానికి అతను నిరాకరిస్తే, అతని ముందు పడేసి పోయారు. ఇదీ వీళ్ల 'ప్రజల హృదయాల్నీ, మనస్సుల్నీ గెల్చుకునే' తీరు!

తర్వాత దుంగ ధుర్వా (38) అనే రైతును విపరీతంగా కొట్టి, తుపాకీ మడమలతో బాది అక్కడికక్కడే ప్రాణాలు తీశారు. దుంగకు భార్యా పిల్లలున్నారు.

మున్న పుల్‌సో (20) ఇంటి మీద దాడి చేసి విధ్వంసం సృష్టించారు. జబ్బుపడి ఇండ్లల్లో వుండిపోయిన ప్రజలను కొట్టడానికి ప్రయత్నించారు. అడ్డం వెళ్లిన మహిళలను కొట్టారు. తర్వాత అక్కడే వున్న కొంతమందికి 20 రూపాయల చొప్పున పంచి పెట్టారు.

ఇదే గ్రామంలో వున్న ఆశ్రమ పాఠశాలలోకి వెళ్లి పిల్లలకు బిస్కెట్లు పంచారు. అవి అదే గ్రామంలో మరొకరి ఇంట్లోంచి ఎత్తుకొచ్చినవి. ఆశ్రమ పాఠశాలలో వున్న సోలార్ లైట్లు, బ్యాటరీలను పగులగొట్టారు. ఇది 'ప్రజాస్వామ్యబద్ధం'గా ఎన్నికైనట్టు చెప్పుకునే ప్రభుత్వం నడిపే పాఠశాల అన్నది గమనార్హం. పైగా వీళ్లు పగులగొట్టిన సోలార్ లైట్లు, బ్యాటరీలు వేరే ఎవరివో కాదు, ప్రభుత్వమే స్కూలుకు మంజూరు చేసినవి. మొత్తంగా గ్రామంలో చాలా మందిని కొట్టి, హింసించి, చాలా ఇండ్లు దోచుకున్న తర్వాత వాటికి బదులుగా అందరికీ కలిపి పంచిన నగదు డబ్బు మొత్తం 240 రూపాయలు!

తోకె నుండి కోడెనార్ గ్రామానికి పోయే దారిలో వున్న ఒక కోహల బడ్డీని కూడా కాల్చివేశారు. గ్రామంలో 4-5 కుటుంబాల వాళ్లవి మొత్తం 20-25 కోళ్లు దొంగిలించి తిన్నారు. వత్తె వద్దె అనే 15 ఏళ్ల పిల్లవాడిని కొట్టుకుంటూ పట్టుకుపోయారు. మున్న ఇంటిలోనివే కాకుండా గోటుల్‌లో, ఇతరుల ఇండ్లల్లో వున్న పెద్ద పెద్ద డోళ్లను కూడా కత్తులతో కోసివేశారు. డోళ్లకు ఆదివాసుల జీవితంలో చాలా ప్రాముఖ్యత వుంటుంది. పుట్టుక, పెళ్లి, చావులతో పాటు, ప్రతి సామాజిక, సాంస్కృతిక కార్యకలాపం డోలు, తదితర వాయిద్యాలతో ముడిపడి వుంటుంది. తాము ఆపదలో పడ్డప్పుడు, అనుకోని విపత్తు ఎదురైనపుడు కూడా డోళ్లు వాయించడం ద్వారానే చుట్టుపక్కల గ్రామస్తులందరినీ అప్రమత్తం చేస్తారు, సమైక్యం చేస్తారు. ఇందువల్ల కూడా ప్రభుత్వ సాయుధ బలగాలకు డోళ్లంటే కోపం. అలా దీనిని ప్రజలపై భౌతికంగానే కాదు, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర ప్రజాజీవన పార్శ్వాలన్నిటిపై జరిగిన దాడి అని చెప్పుకోవాలి.

## గడ్చిరోలి వైపు నుండి బలగాల ఆక్రమణ

దాదాపు వందేళ్ల క్రితం ఆదివాసులు భూంకాల్ తిరుగుబాటు చేసినపుడు బస్తర్ ప్రాంతానికి సైనిక బలగాలు ఏకకాలంలో అప్పటి సెంట్రల్ ప్రావిన్స్ కిందకు వచ్చే నాగపూర్, జబల్‌పూర్‌లతో పాటు మద్రాసు, రాయపూర్ తదితర చోట్ల నుండి బయలుదేరి అణచివేతకు పూనుకున్న విషయం ఇక్కడి చరిత్రతో పరిచయం వున్న వాళ్లకు తెలిసే వుంటుంది. ప్రస్తుత దాడి కూడా, శత్రు దేశంపై పడ్డట్టుగా ఏకకాలంలో రెండు రాష్ట్రాల నుండి పూర్తి సమన్వయంతో జరిగింది. సరిగ్గా మార్చ్ 14 నాడే మహారాష్ట్ర వైపు నుండి కూడా కోబ్రాలు, సి-60 కమాండోలు, పోలీసులు కలిసి దాదాపు 800 మంది మాడ్‌పై దాడికి బయలుదేరారు. నెయ్‌బెరెడ్ నది వెంట కాలి నడకన బయలుదేరిన బలగాలు పోదెవాడ గ్రామానికి చెందిన ముగ్గురిని పట్టుకున్నారు. వాళ్లలో ఇద్దరిని వదిలేసి ఒకరిని పట్టుకొని అడవి గుండా వెళ్లి గొడ్దెల్‌మర్క అనే కుగ్రామంపై మొట్టమొదట దాడి చేశారు. లాల్సు వద్దె అనే 28 ఏళ్ల యువకుడిని, అతని తమ్ముడైన బిటియ వద్దె (21)ను పట్టుకున్నారు. అన్నాదమ్ములిద్దరినీ బాగా కొట్టారు. వీళ్లను కట్టేసి తీసుకెళుతుంటే లాల్సు భార్య అడ్డం తిరిగినందుకు ఆమెను కూడా కింద పడేసి బాగా కొట్టారు. బిటియ ఇంట్లోంచి 1500 రూపాయల్ని కూడా దోచుకున్నారు. దాదాపు అన్ని ఇండ్ల నుండి బియ్యం, తిండి దినుసులు, కోళ్లు, గుడ్లు తదితరాలు లూటీ చేశారు. జైని గోట అనే గ్రామ మహిళపై కాల్పులు జరపగా తూటా ఆమె చేతిని చీరుకుంటూ వెళ్లింది.

15న తెల్లవారక ముందే ఈకోనార్ గ్రామాన్ని చుట్టుముట్టారు. ఈ గ్రామంలో సాందు అనే ఆదివాసీ ఇంటిపై దాడి చేసారు. ఆయన పోలీసుల్ని చూసి పరుగెత్తగా విపరీతంగా కాల్పులు జరిపారు. కానీ అతను క్షేమంగా తప్పుకోగలిగాడు. తర్వాత అతని ఇంట్లోంచి బియ్యం, బట్టలు, కంబళ్లు, చీరలు... అన్నింటినీ బయటికి తెచ్చి కాలబెట్టారు. వాళ్లు ఇంట్లో నిలువ చేసుకున్న 9 క్వింటాళ్ల ధాన్యాన్ని లూటీ చేశారు, కొంత కాలబెట్టారు. అన్ని ఇండ్లలోంచి సామాన్లను ఎత్తుకెళ్లారు. ఎత్తుకెళ్లని వాటిని నష్టపరిచారు. 3 భర్మార్ తుపాకులు, 4 గొడ్డళ్లు తదితర పనిముట్లను ఎత్తుకెళ్లారు. ఇక్కడ కూడా కోళ్లను దోచుకున్నారు. మంగ్లు అనే అతని ఇంట్లోంచి 3800 రూపాయల నగదుతో పాటు బట్టలు, బియ్యం దోచుకున్నారు. ఈ గ్రామం నుండి ఛన్ను పొదాడి అనే పదిహేనేళ్ల పిల్లవాడిని పట్టుకొని విపరీతంగా కొట్టారు. అతనిని

బాల యాక్షన్ టీం కమాండర్‌గా చిత్రిస్తూ తప్పుడు కేసులు మోపి జైలుకు పంపించారు. పాలి అనే వృద్ధురాలిపై కోబ్రా కమాండోలు విరుచుకుపడి విపరీతంగా కొట్టి ఆమె చేతిలో వంద రూపాయలు పెట్టారు. లచ్చు, నంగి, మాలు అనే వాళ్లను కూడా కొట్టి పదేసి రూపాయలు చేతిలో వుంచారు. బయ్యే అనే మహిళను తుపాకీ మడమలతో కొట్టారు. డబ్బులు తీసుకోవడానికి నిరాకరించిన వాళ్లను మళ్లీ కొట్టారు.

ఈ బ్యాచ్ 16వ తేదీ ఉదయం జట్‌వార్‌కి వెళ్లింది. తోకె వైపు నుండి కోడెనార్ గ్రామం మీదుగా వచ్చిన ఛత్తీస్‌గఢ్ బ్యాచ్‌తో వీళ్లు కలిశారు. అటు నుండి వస్తూ వస్తూ వాళ్లు కోడెనార్‌లో కూడా విధ్వంసానికి, లూటీకి పాల్పడ్డారు. రెండు ఇండ్లను దోచుకున్నారు. రెండు బ్యాచ్‌ల వాళ్లు కలిసి జట్‌వార్ గ్రామంలో విచ్చలవిడి విధ్వంసానికి పాల్పడ్డారు. ఇండ్లలోంచి ధాన్యాన్ని, తిండి దినుసుల్ని, నగదును, విల్లు, బాణాలను, కోళ్లను, కోడిగుడ్లను, పొగాకును, గొడ్డళ్లను, టార్చ్‌లైట్లను, అద్దాలను, రేడియోలను, బట్టలను, ఆఖరుకు చెప్పుల్ని కూడా వదలకుండా దోచుకున్నారు. గ్రామంలోని ఒక ఇంటిని, పొలాల్లోని ఒక గుడిసెను కాల్చివేశారు. గోంగ్లు అనే వ్యక్తి ఇంట్లోంచి 2500 రూపాయల విలువ చేసే డివిడి ప్లేయర్‌ను దోచుకెళ్లారు. లాల్సు అనే రైతు ఇంట్లోంచి 7 వేల రూపాయల నగదును దోచుకున్నారు. ఇతర వస్తువులతో పాటు సుక్కో ఇంట్లోంచి 1700, పర్సా ఇంట్లోంచి 700 రూపాయల నగదును దోచుకున్నారు. ఈ మూడు గ్రామాల్లో వీళ్లు దోచుకున్న మొత్తం నగదు 20 వేలకు పైగానే వుంటుంది. పోలీసుల దాడి గురించి ముందే కబురందడంతో ఈ గ్రామస్తులు ఎవరూ పట్టుబడలేదు కానీ ఏదో పనిపై ఈ గ్రామానికి వచ్చిన కోడేనార్ గ్రామ పూజారి ఎడమ కారెను (45) పోలీసులు పట్టుకెళ్లారు.

అయితే ఈ దాడి మొత్తం సాఫీగా, ప్రతిఘటన ఏమీ లేకుండా సాగలేదు. ఈకోనార్, జట్‌వార్ గ్రామాల మధ్య, జట్‌వార్ దగ్గర కొందరు పి.ఎల్.జి.ఏ. గెరిల్లాలు, ప్రజా మిలిషియా సభ్యులు కలిసి ఈ కిరాయి సాయుధ బలగాలపై ఎంతో సాహసంతో, దాదాపు ఆరు సార్లు ఎదురుదాడి చేశారు. ప్రతిఘటన ద్వారా తమ గ్రామాల్ని, ఆస్తిపాస్తులను, పంటలను కాపాడుకోవడానికి ఎంతో పట్టుదలతో ప్రయత్నించారు. వీళ్ల ప్రతిఘటనలో ఇద్దరు కోబ్రా కమాండోలు తీవ్రంగా గాయపడ్డారు. వీళ్లని తీసుకెళ్లడానికి హెలికాప్టర్ జట్‌వార్‌కు వచ్చింది. అయితే గెరిల్లాలు, మిలిషియా సభ్యులు హెలికాప్టర్‌ను కూడా వదలకుండా తేనెటీగల్లాగా దాని వెంటబడ్డారు. 16న పొద్దంతా వందలాది కిరాయి సాయుధ బలగాలకు, పిడికెడు పి.ఎల్.జి.ఏ./మిలిషియా బలగాలకు మధ్య అనేక దఫాలుగా పోరు సాగింది. సాయుధ బలగాలు వందల, వేల తూటాల్ని కాలుస్తూ, విచ్చలవిడిగా మోర్టార్ షెల్స్ వేస్తూ బీభత్సాన్ని సృష్టించినా ప్రజా మిలిషియా చెదిరిపోలేదు, బెదిరిపోలేదు. మిలిషియా సభ్యులు తమ దగ్గరున్న భర్మార్ల వంటి నాటు ఆయుధాలతోనే కాల్పులు జరుపుతూ హెలికాప్టర్‌ను ముప్పుతిప్పలు పెట్టారు. చివరికి ఎలాగోలా గాయపడ్డ వాళ్లను తీసుకెళ్లగలిగారు. సాయుధ బలగాలకు తిండి సామాగ్రిని అందించడం కోసం మరోసారి హెలికాప్టర్ వచ్చింది. కింద వున్న కిరాయి కోబ్రా బలగాలు ప్రతిఘటనకు భయపడి వీటిని అందుకోవడానికి దాని దగ్గరికి కూడా రాలేకపోయాయి. దాంతో హెలికాప్టర్ జార విడిచిన రొట్టెలు, బిస్కెట్స్ వగైరా తిండి సామాగ్రి పిఎల్‌జిఏ, ప్రజలు జప్తు చేసుకొన్నారు. ఈ ప్రతిఘటనే లేకుంటే ప్రభుత్వ సాయుధ బలగాలు మరెంతో విధ్వంసానికి పాల్పడేవనేది స్పష్టం.

అరెస్టు చేసిన వాళ్లను విడిపించుకోవడం కోసం వాళ్ల కుటుంబ సభ్యులు నారాయణ్‌పూర్ వెళ్లారు. అరెస్టు చేసిన వారిలో ఇద్దరిని 21 సాయంత్రం విడిచిపెట్టారు. తోకె గ్రామానికి చెందిన వత్తె వడ్డె అనే పిల్లవాడిని విడిపించుకోవడానికి థానేదార్‌కు అతని తల్లిదండ్రులు 3 వేల రూపాయల లంచం ఇచ్చారు. కోడెనార్ పూజారి విడుదల కోసం అతని కుటుంబ సభ్యులు రెండు వేల రూపాయలు లంచంగా ఇచ్చారు. పోలీసులు తాము సాధించిన ఈ 'విజయానికి' సాక్ష్యంగా మొత్తం 13 మందిని – నారాయణ్‌పూర్ జిల్లాలో ముగ్గురిని, ఇంద్రావతి ఏరియా (బీజాపూర్ జిల్లా)లో 10 మందిని అరెస్టు చేసినట్టు చూపారు. నారాయణ్‌పూర్‌లో అరెస్టుగా చూపిన వాళ్లలో ఈకోనార్‌కు చెందిన ఛన్ను పొదాడి, గొడ్డెల్‌మర్కకు చెందిన బిటియ, ఘసీ అనే మరో వ్యక్తి వున్నారు. అయితే గొడ్డెల్‌మర్క గ్రామానికి చెందిన లాల్సును ఏం చేశారో తెలియడం లేదు. అరెస్టు చేసామని చెబుతున్న 'మావోయిస్టు'లలో అతని పేరు లేదు. అతన్ని విడిచిపెట్టనూ లేదు. పట్టుకున్నపుడే అతన్ని బాగా కొట్టారని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు పోయేటపుడు రెండు శవాల్ని కూడా తీసుకెళ్లారనే ప్రచారం కూడా జరిగింది. దీన్ని బట్టి లాల్సును బహుశా తోవలోనే చంపేసి శవాన్ని పూడ్చిపెట్టి వుంటారని ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారు.

దాడి తర్వాత ఎస్.పి. మయంక్ శ్రీవాస్తవ్ మీడియా వాళ్లతో విజయగర్వంతో పొంగిపోతూ మాట్లాడాడు. తమకు గెరిల్లాలతో మొత్తం 8 సార్లు ఎన్‌కౌంటర్స్ జరిగాయని 12 నుండి 15 మంది దాకా మావోయిస్టులు మరణించి వుంటారని, అయితే శవాలు తమకు దొరకలేదని బొంకాడు. తాము తోకె గ్రామంలో తుపాకీ మడమలతో కొట్టి చంపిన దుంగ ధుర్వ గురించి మాత్రం ప్రస్తావించలేదు.

గ్రామాల్లో ప్రజలపై అమానుష దాడులకు పాల్పడుతూనే చాలా మంది చేతుల్లో రూపాయల నోట్లు పెట్టడం ఈ దాడిలో ఒక కొత్త అంశం. సామ్రాజ్యవాద ఎల్.ఐ.సి. వ్యూహంలో 'ప్రజల హృదయాల్నీ, మనస్సుల్నీ గెల్చుకునే' పథకం ఒకటుంది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్రాల పోలీసు బలగాలకు ప్రభుత్వాలు వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నాయి. దండకారణ్యంలో తిష్ట వేసిన వివిధ పారామిలిటరీ బలగాలు ఈ డబ్బులతో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం (సి.ఏ.పి.) పేరుతో తరచుగా గ్రామాల్లో ప్రజలను బలవంతంగా కుప్పేసి కంబళ్లు, బట్టలు, గిన్నెలు, మందులు, సైకిళ్లు వంటివి

పంచి పెడుతున్నాయి. తీసుకోమని అంటే బెదిరిస్తున్నాయి. అలా తాము వున్నది ప్రజల కోసమేనని నమ్మించగలమని వాళ్ల భ్రమ. ఫిబ్రవరి 22న జరిగిన మీటింగ్‌లో చిదంబరం నొక్కి చెప్పిన అంశాల్లో 'అణచివేత చర్యల సందర్భంగా ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాల'నేది కూడా ఒకటి. మాడ్‌లో ఈ దాడి సందర్భంగా ప్రజల మనోభావాలను ఎంత చక్కగా గౌరవించారో, 'సివిక్ యాక్షన్'ను ఈ దాడిలో ఎంత బాగా మేళవించారో విడిగా చెప్పనక్కర లేదు!

పోలీసు అధికారుల అహంభావపూరిత ప్రకటనలు, ఈ దాడిలో వాళ్లు సాధించిన 'విజయాలు'గా పేర్కొన్న అరెస్టులు, అసలు వాళ్లు ప్రకటించుకున్న లక్ష్యాలు... ఇవన్నీ ఈ దాడి దేనికి వ్యతిరేకంగా, దేన్ని సాధించడం కోసం జరిగింది అనేది స్పష్టం చేస్తున్నాయి. ఈ దాడి జరిగింది ప్రజల పైననే. ఇది 2009 మధ్య నుండి సాగుతున్న 'ప్రజలపై యుద్ధం' (ఆపరేషన్ గ్రీన్‌హంట్)లో భాగమే. సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకత్వంలో ప్రజలు స్వావలంబన, సహకారాలపై ఆధారపడి దండకారణ్యంలో ముందుకు తెస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను రూపుమాపడమే దీని లక్ష్యం. నిజానికి రేపు సైన్యం పూర్తి స్థాయిలో చేయబోయే దాడికి ఇదొక రిహార్సల్ కూడా. ఇదొక హెచ్చరిక కూడా. మావోయిస్టు రాజకీయాలను అనుసరిస్తే, పాలకవర్గాలు అమలు చేస్తున్న వినాశకర, విస్థాపన విధానాల్ని, బూటకపు అభివృద్ధి నమూనాను తిరస్కరిస్తే ఇదే గతి పడుతుందని ప్రజలకు పాలకులు చేస్తున్న హెచ్చరిక.

ఈ అన్యాయమైన యుద్ధాన్ని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. పాలకులు వల్లించే శుష్కమైన శాంతి వచనాల్ని, 'అభివృద్ధి' సొల్లు వాగుడును తోసిపుచ్చి న్యాయం పక్కన దృఢంగా నిలబడాలి. ఈ దాడి ఈరోజు జరిగింది సభ్య సమాజంగా చెప్పుకునే దానికి చాలా దూరంలో విసిరేసినట్టు వున్న అత్యంత వెనుకబడిన ప్రాంతంలోనే కావచ్చు. కానీ ఈ దాడికి పూనుకున్న శక్తులు విసురుతున్న పంజా కేవలం ఇక్కడికే పరిమితం కాదు. వాళ్లు చెబుతున్నట్టుగా ఇది కేవలం మావోయిస్టులపైనే యుద్ధం కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మొత్తంగా జల్-జంగల్-జమీన్‌పై హక్కు కోసం నినదిస్తున్న ఆదివాసులందరిపై యుద్ధం ఇది. స్వావలంబనను, ప్రజాస్వామ్యాన్ని, శాంతిని, సార్వభౌమత్వాన్ని కోరుకునే దేశ ప్రజలందరిపైనా యుద్ధం ఇది. దీని వెనుక సామ్రాజ్యవాదం, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం వుంది. కార్పొరేట్ దోపిడీ దొంగలున్నారు. అండగా బలమైన కార్పొరేట్ మీడియా వుంది. ఈ యుద్ధాన్ని ఇప్పుడే, ఇక్కడే... అతి ప్రాచీన మానవ సమాజాలు నివసిస్తున్న, గొప్ప సాంస్కృతిక, పోరాట వారసత్వం గల ఈ ప్రాంతంలోనే అడ్డుకోకపోతే, ఇప్పుడే గట్టిగా గొంతు విప్పకపోతే, ఈ దాడిని వెంటనే ఆపాలని నినదించకపోతే మన దేశాన్ని, మన సహజ సంపదల్ని మనం రక్షించుకోలేం. ఇది ఒక మాడ్ ప్రాంతంలో బతికే అనామక ఆదివాసుల అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నే కాదు, మొత్తంగా దేశ భవిష్యత్తుతో ముడివడిన ప్రశ్న కూడా.

★

---

***(13వ పేజీ తరువాయి...)***

క్యాంపెయిన్‌కు ప్రణాళికలు రూపొందించడంలో కామ్రేడ్ కోటేశ్వర్లు తన వంతు పాత్ర పోషించాడు. ఎంపిక చేసిన విషయాలపై టీచర్లతో కలిసి నోట్సు తయారు చేయడంలో పాలుపంచుకున్నాడు. క్యాడర్ల స్థాయికి తగినట్టు విషయాల ఎంపిక, నోట్సు తయారీ, తరగతుల నిర్వహణ-బోధనపై తాను ఎక్కడికి వెళ్లినా అవసరమైన సూచనలు, సలహాలు చేసేవాడు.

## ఒక వీరుడు మరణిస్తే ప్రభవింతురు వేల కొలది

కామ్రేడ్ కోటేశ్వర్లు మనకిక లేడు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన అమరత్వంతో మనమొక అనుభవాల గనిని కోల్పోయాం. ఆయన క్యాడర్లకు ప్రీతిపాత్రుడు. సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ రంగాలలో అపార అనుభవాన్ని గడించిన మేధా సంపన్నుడు. ఆయన ఒక కవి. విప్లవ రచయిత. ఎత్తిన ఆయుధాన్ని దించని మావోయిస్టు ప్రజాయుద్ధ సైనికుడు, కమాండర్. విప్లవం కోసం 38 సంవత్సరాలు అహర్నిశలు శ్రమించి ప్రజా వుద్యమాల్లో, ప్రజాయుద్ధంలో అనేక అద్భుతాలను సృష్టించిన వాడు. జగిత్యాల నుంచీ జంగల్ మహల్ వరకూ విప్లవాగ్నులను వ్యాపింపజేసి చిన్న నిప్పురవ్వ దావానలాన్ని సృష్టిస్తుందన్న సత్యాన్ని నిరూపించిన కమ్యూనిస్టు విప్లవకారుడు. ఆయన భారత విప్లవోద్యమ చరిత్రలో ధ్రువతారగా నిలిచాడు. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయుడు.

విప్లవ ఆశయాల సాధనలో తన ప్రాణాల్ని ఫణంగా పెట్టిన ప్రజా నాయకుడు. భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాలతో నిశ్చయాత్మకంగా పోరాడి, ఓడించి, అంతిమంగా గోరి కట్టడమే ఆ వీరయోధుడికి మనం అర్పించే నిజమైన నివాళి. ఆయన జ్ఞాపకాలతో, ఆదర్శాలతో తరగని శక్తిని నింపుకొని, రెట్టింపు ఉత్సాహంతో, బోల్షివిక్ దృఢ సంకల్పంతో కార్యాచరణకు పూనుకుందాం. ఆయన అమరత్వంతో పార్టీకీ, యావత్ భారత విప్లవోద్యమానికి వాటిల్లిన అపార నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజా వుద్యమాలను, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ అసంఖ్యాక కోటన్నలను సృష్టించుకుందాం. ప్రజలూ, ప్రజా వుద్యమాలే కామ్రేడ్ కోటేశ్వర్లును సృష్టించాయి. ఆ ప్రజలూ, ప్రజా వుద్యమాలే ఆయనను మళ్లీ మళ్లీ సృష్టించుకుంటాయి.

**కామ్రేడ్ కోటేశ్వర్లు అమర్ రహే!**

★

# కాంగీ, తెదేపాల దుస్థితిని పట్టి చూపుతున్న ఉప ఎన్నికలు

2009 సెప్టెంబర్‌లో హెలికాప్టర్ దుర్ఘటనలో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణించినప్పటి నుండి రాష్ట్ర రాజకీయాలలో సంక్షోభం కొనసాగుతున్నది. అందులో భాగంగానే జూన్ 12న 18 శాసన సభ స్థానాలకు, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌లో వుంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా)కి అనుకూలంగా వ్యవహరిస్తున్నందుకు, పార్టీ విప్‌ను ధిక్కరించి శీతాకాలం సమావేశాల్లో తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసినందుకు, తన పార్టీకి చెందిన 16 మంది శాసన సభ్యులపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదు మేరకు, మార్చి 2న శాసన సభ స్పీకర్ 16 మంది కాంగ్రెస్ శాసన సభ్యులపై అనర్హత వేటు వేశాడు. కాంగ్రెస్ పార్టీ నుండి పార్లమెంటు సభ్యుడు మేకపాటి రాజమోహన రెడ్డి, ప్రజా రాజ్యం పార్టీ (ప్రరాపా) నుండి ఎన్నికయిన శాసన సభ్యురాలు శోభా నాగిరెడ్డిలు తమ పదవులకు రాజీనామా చేసి వైకాపాలో చేరారు. తిరుపతి శాసన సభ్యుడైన చిరంజీవి రాజ్యసభకు ఎన్నికయ్యాడు. పై కారణాల వల్ల ఈ స్థానాలన్నింటికీ వుప ఎన్నికలు అవసరమయ్యాయి.

అంటే తిరుపతి స్థానం మినహా మిగతా అన్ని స్థానాల్లో ఎన్నికలు జరగడానికి వైకాపానే కారణం. ఈ ఉప ఎన్నికల్లో అనర్హులుగా ప్రకటించబడిన 16 మందీ, రాజీనామా చేసిన ఇద్దరూ, అందరూ కూడా వైకాపా అభ్యర్థులుగా తిరిగి అదే స్థానాల నుండి పోటీ చేశారు. ఇందులో పరకాల, రామచంద్రాపురం, నరసాపురంలలో పోటీ చేసిన వారు తప్ప మిగతా వాళ్లందరూ తిరిగి గెలిచారు. తిరుపతిని కూడా వైకాపానే గెలుచుకుంది. రామచంద్రాపురం, నరసాపురం స్థానాలను మాత్రం కాంగ్రెస్ నిలబెట్టుకోగా, పరకాలను తెరాస అతి కష్టం మీద గెలుచుకుంది. తెదేపా మాత్రం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. కాగా ఆరు స్థానాల్లో కాంగ్రెస్‌కు, అయిదు స్థానాల్లో తెదేపాకు డిపాజిట్ కూడా దక్కలేదు. ఇక బి.జె.పి అన్ని చోట్లా డిపాజిట్‌లను కోల్పోయింది. మొత్తంగా వైకాపా 46.85 శాతం ఓట్లను గెల్చుకుంటే, కాంగ్రెస్‌కు 21.84 శాతం, తెదేపాకు 24.23 శాతం దక్కాయి. కాంగ్రెస్, తెదేపా రెండూ కలిసి దక్కించుకున్న ఓట్ల కంటే వైకాపా గెల్చుకున్న ఓట్లు అధికం. ఈ గెలుపు వైకాపా ఊహించనిదేమీ కాదు. ఒక్క పరకాల తప్ప అన్ని స్థానాల్లోనూ గెలుపు పట్ల వైకాపా ఆత్మ విశ్వాసాన్ని కనబరుస్తూనే వుండింది.

18 శాసన సభ స్థానాలకు గాను 14 స్థానాల్లో పాత వారే గెలిచారు. అయితే తమ పాత పార్టీ తరుపున కాకుండా కొత్త పార్టీ అయిన వైకాపా తరుపున పోటీ చేసి గెలిచారు. కాంగ్రెస్, ప్రరాపాలను వీడి తనతో చేతులు కలిపిన వాళ్లను గెలిపించుకోవడం అనేది వైకాపాకు ప్రతిష్టతో కూడిన విషయమే కాదు, అది దానికి ఉనికి సమస్య కూడా. అందుకే అది సర్వ శక్తులూ ఒడ్డి పోరాడింది. కాంగ్రెస్ తన శాసన సభ్యులు దూరమయిన రోజునే ఆ స్థానాల మీద కూడా చాలా మేరకు ఆశలు కోల్పోయింది. ఇక తెదేపా విషయానికి వస్తే అవన్నీ గత ఎన్నికల్లో తాను గెల్చుకోలేక పోయిన స్థానాలే. అయితే మరో రెండేళ్లలో సాధారణ ఎన్నికలు వచ్చే అవకాశాలు వున్న నేపథ్యంలో ఈ వుప ఎన్నికలను సైమీ ఫైనల్స్‌గా, లిట్మస్ టెస్ట్‌గా భావిస్తున్న నేపథ్యంలో కూడా ఈ ఎన్నికలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆ స్థానాలన్నింటినీ వైకాపా గెలుచుకుంటే ఆ గెలుపు కాంగ్రెస్, తెదేపాల భవిష్యత్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అవి ఊహించాయి. అందుకే ఈ రెండు పార్టీలు కూడా గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించాయి.

ఈ అన్ని పార్టీలు గెలుపు కోసం ఎంచుకున్న మార్గం పాతదే – డబ్బులు వెదజల్లి ఓటర్లకు గాలం వేయడం అనేదే. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి ఖర్చు పెట్టారు. ఒక్క నెల్లూరు లోకసభ నియోజక వర్గంలోనే 400 కోట్ల రూపాయలు వెదజల్లారని ఒక పరిశీలన. ఓటుకు రెండు వందల రూపాయల నుండి రెండు వేల రూపాయల వరకూ పంచారు. ఓటు వేయడానికే కాదు కొన్ని చోట్ల ఓటు వేయకుండా వుండడానికి కూడా డబ్బులు పంచారని వార్తలు వచ్చాయి. ఇలా డబ్బు వెదజల్లడంలో అన్ని పార్టీలు పోటీ పడ్డాయి. వినూత్న తరహాలో ఈ ఎన్నికల్లో బంగారు, వెండి ఆభరణాలు, పత్తి విత్తనాలు వంటివి కూడా పంచిపెట్టారు. 2009లో 294 శాసన సభ స్థానాలకు, 42 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల సమయంలో పోలీసులకు 38 కోట్ల రూపాయలు పట్టుబడితే ఇప్పుడు ఈ కొద్ది స్థానాలకు జరుగుతున్న ఎన్నికల సమయంలో 42 కోట్ల నగదు, 12 కోట్ల బంగారం, వెండి పట్టుబడ్డాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో గెలిస్తే రెండేళ్లు మాత్రమే పదవిలో వుంటారు. అయినప్పటికీ గెలుపుకు చాలా ప్రాధాన్యతను ఇచ్చారు. ఇంతగా ఖర్చు పెడుతున్నారంటే ఎన్నికలు అనేవి ఎంత ఖర్చుతో కూడిన వ్యవహారమో, సామాన్యులు, మధ్య తరగతి వాళ్లు ఎన్నికల బరిలోకి దిగడం ఎంత అసాధ్యమో, ప్రజాస్వామ్యం అనేది ఎవరికి అందుబాటులో వున్నదో అర్థం చేసుకోవచ్చు.

కేవలం పోటా పోటీగా డబ్బులను పంచడం ద్వారానే, వైకాపా గెలుపు అవకాశాలను దెబ్బతీయడం సాధ్యం కాదని భావించిన కాంగ్రెస్ పార్టీ జగన్ అవినీతి చరిత్రను తోడడం మొదలుపెట్టింది. ఎన్నికల ముందు ఒక్కో సాక్ష్యాధారాన్ని వెలికి తీస్తూ, జగన్‌ను అరెస్ట్ చేసింది. జగన్ అరెస్టుతో ఆ పార్టీ అప్రతిష్ట పాలవుతుందని అనుకుంది. కాని దాని ఆశలు అడియాశలే అయ్యాయి. ఎన్నికల ముందు అరెస్టు చేస్తే వైకాపా దెబ్బ తింటుందని కాంగ్రెస్ భావించింది కాని అది వైకాపాకు మరింత సానుభూతిగానే పనిచేసింది.

తెదేపా కూడా ఈ ఎన్నికల్లో కొన్ని సీట్లనయినా గెల్చుకోవాలనుకుంది. ఇటు జగన్ జైలుకెళ్లడం, అటు ప్రభుత్వ వ్యతిరేకత రెండూ తనకు ఎంతో కొంత కలిసి వస్తాయనుకుంది. కాని దానికి కాలం కలిసి రాలేదు.

అంతే కాదు వైకాపా గెలిచినప్పటికీ పోటీ పోటా పోటీగా వుంటుందని ఈ పార్టీలు భావించాయి. కాని అధికార, ప్రతిపక్షాలైన కాంగీ, తెదేపాలకు కలిసి 18 స్థానాలకు గాను పదకొండు స్థానాల్లో డిపాజిట్లే దక్కలేదంటే వాటి పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

ఇంతకూ వైకాపా గెలుపు రహస్యం ఏంటి? తండ్రీ కొడుకులు కలిసి రాష్ట్రాన్ని ఎంతెంత దోచుకున్నారో రోజూ పుంఖాను పుంఖాలుగా వార్తలు వస్తున్నా ఓటర్లు వైకాపాకే ఎందుకు బ్రహ్మ రథం పట్టారు?

అధికార, ప్రతిపక్షాలు రెండూ ప్రజల విశ్వసనీయతను కోల్పోయాయని స్పష్టంగా అర్థమవుతున్నది. అటు కేంద్రంలో గాని, ఇటు రాష్ట్రంలో గాని రెండోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలకు పూర్తిగా భ్రమలు పోతున్నాయి. రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలో పచ్చి ఫాసిస్టు పాలనను నెలకొల్పాడు. రాష్ట్ర సంపదను ప్రపంచబ్యాంకుకు అమ్మాడు. అయితే కొన్ని సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలలో భ్రమలు కల్పించాడు. ఈ పథకాల పేరిట కార్పోరేట్ సంస్థలకు లాభాలను కట్టబెట్టాడు (ఉదా:- ఆరోగ్య శ్రీ), తాను ఆస్తులను పెంచుకున్నాడు. ఒక్క రూపాయి ప్రజలకు ఖర్చు పెడితే పది రూపాయలు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ బండారం బయట పడక ముందే చనిపోయాడు. ఆ పథకాలు రాష్ట్ర ఖజానాకు భారంగా వున్నాయని ప్రస్తుత ప్రభుత్వం కొన్ని పథకాలను సరిగా అమలుచేయడం లేదు. ఈ అవకాశాన్ని చక్కగా వుపయోగించుకొని తన తండ్రి ప్రవేశపెట్టిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం లేదని జగన్ ప్రచారం మొదలుపెట్టాడు. దాంతో ప్రజల్లో రాజశేఖర్ రెడ్డి బతికి వుంటే సంస్కరణలు అమలు జరిగి వుండేవనే భ్రమలు వ్యాపించాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు రాష్ట్ర ప్రజల నాడి తెలవకపోవడంతో పదే పదే తప్పులు చేస్తూ జగన్‌కు మంచి అవకాశాన్ని కల్గించింది. ఇక పోతే రోజు రోజుకూ ధరలు పెరగడం, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఎరువుల, పురుగు మందుల ధరలు పెరగడం, పెట్రోల్ ధరలు పెరగడం, కరెంటు కోత వంటి సమస్యలు ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తున్నాయి. అంతేకాదు ప్రతిదానికీ ఢిల్లీ మీదనే ఆధారపడే, ఢిల్లీ చెప్పినట్టే వినే ముఖ్యమంత్రి అసమర్థ పాలన పట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి వుంది.

కాంగ్రెస్ పార్టీ మీద వచ్చిన ఈ అసంతృప్తి జగన్ లేకుంటే చంద్రబాబుకు లాభించేదేమో. కాని ఆ అసంతృప్తిని వాడుకోవడానికి జగన్ దూసుకొచ్చాడు. జగన్‌కు తండ్రి సంపాయించి పెట్టిన ఇమేజ్ వుంది. అధిష్టానాన్ని ధిక్కరించిన వాడిగా పేరు తెచ్చుకున్నాడు. యువకుడు, ఔత్సాహికుడు కూడా. ఓదార్పు యాత్రల పేరిట ప్రజా పునాదిని పెంచుకున్నాడు. డబ్బును వెదజల్లి కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను కొనేశాడు. తాను అధికారంలోకి వస్తే తండ్రి ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేస్తాననీ, వుద్యోగాలు కల్పిస్తానని చేసుకుంటున్న ప్రచారం పట్ల ప్రజలు, యువత, విద్యార్థులు ఆకర్షితులవుతున్నారు. కుల సమీకరణల్లో భాగంగా నూతనంగా ఎదిగి వస్తున్న కొన్ని కులాలు వైకాపా ద్వారా అధికారంలో దూరగలమని ఆశిస్తున్నాయి. ముస్లింల మద్దతు కూడా జగన్‌కు వుంది. ఇక ఎవరినైనా బెదిరించడంలో లంపెన్ శక్తులకు ఆరాధ్య దైవంగా మారాడు.

వీటన్నింటి ముందు జగన్ అవినీతి పెద్ద లెక్కలోకి రాలేదు. ఎందుకంటే రాజకీయాల్లో అవినీతికి పాల్పడని వాళ్లెవరు? జగన్ అవినీతి గురించి పొద్దున లేస్తే మాట్లాడుతున్న చంద్రబాబు ఏ అవినీతికి పాల్పడకుండానే రెండెకరాల ఆస్తిని రెండు వేల కోట్ల రూపాయల ఆస్తిగా ఎలా మార్చుకున్నాడు? కాంగ్రెస్ పార్టీనే చూస్తే రాజీవ్ గాంధీ అవినీతికి పాల్పడలేదా? పి.వి. నర్సింహారావు అవినీతికి పాల్పడలేదా? అంతెందుకు లక్షా 76 వేల 2జీ స్పెక్ట్రం కుంభకోణం ఎవరి హయాంలో జరిగింది? జగన్ అవినీతి గురించి ఇంత పట్టించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మరి విదేశాల్లో వున్న నల్లధనాన్ని దేశానికి తెప్పించే ప్రయత్నాలు ఎందుకు చేయడం లేదు? తాజాగా పి.సి.సి. చీఫ్‌కు, కొందరు మంత్రులకు మద్యం కుంభకోణంతో వున్న సంబంధాలు బయటపడుతున్నాయి. ఇకపోతే రాజశేఖర్ రెడ్డయినా, జగనయినా అవినీతికి పాల్పడింది ఎప్పుడు? రాజశేఖర్ రెడ్డి పాలనలో, అంటే కాంగ్రెస్ పాలనలో. ఇప్పుడు మంత్రి వర్గంలో వున్న వాళ్లందరూ దాదాపు అప్పుడూ వున్నారు. మరి అప్పుడు ఎందుకు ఈ అవినీతిని పట్టించుకోలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత కూడా జగన్ కాంగ్రెస్‌లో వున్నన్నాళ్లూ పెద్దగా పట్టించుకోకుండా పార్టీని విడిచిపెట్టి పోయిన తర్వాతనే ఎందుకు తవ్వుతున్నారు? మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలోనే ఎందుకు అరెస్ట్ చేశారు? ఇదంతా పరిశీలిస్తే కాంగ్రెస్ జగన్ అవినీతిని విచారించడం అనేది, అవినీతి నిర్మూలన పట్ల దానికున్న చిత్తశుద్ధి వల్ల కాదని, కేవలం జగన్‌పై కక్ష సాధించడానికే అనేది ఎవరికైనా తేలిగ్గానే అర్థమవుతుంది.

జగన్ కుటుంబం అవినీతికి పాల్పడలేదని ఎవరూ అనుకోవడం లేదు. రాజకీయాల్లో వున్నవాళ్లు, అందులోనూ అధికారంలో వున్నవాళ్లు ఆ మాత్రం సంపాయించుకోరా అనే స్థితిలో వున్నారు ప్రజలు. అంతే కాదు వాళ్లెంతయినా సంపాయించుకోనీ దాంట్లోంచి ప్రజలకింత పెడితే చాలు అనే స్థితిలో కూడా వున్నారు. చంద్రబాబు తానే తిన్నాడు, రాజశేఖర్ రెడ్డి తాను తిన్నప్పటికీ ప్రజలక్కూడా కొంచెం పెట్టాడు అనే అభిప్రాయం వుంది.

ఇకపోతే కాంగీ, తెదేపాలు జగన్ మీద చేస్తున్న మరో ఆరోపణ ఏంటంటే, శవ రాజకీయాలు చేశాడని, అంటే తండ్రి చనిపోగానే అధికారాన్ని కోరుకున్నడని. అందులో జగన్‌ను తప్పు పట్టాల్సిందేదీ సాధారణ ప్రజలకు కనబడదు. ఎందుకంటే వారసత్వ రాజకీయాలు మన దేశంలో కొత్తేం కాదు.

జగన్ అవినీతి, అధికార వ్యామోహం ప్రజలకు పెద్ద తప్పుగా అనిపించడం లేదంటే తప్పు ప్రజలది కాదు. ఎందుకంటే రాజకీయాలను అంత కంటే గొప్పగా ఊహించడం లేదు ప్రజలు. రాజకీయాలంటేనే అవినీతి, అధికార వ్యామోహం అని అర్థం చేసుకుంటున్నారు. ఇక ఈ రాజకీయాల నుండి, ఎన్నికల నుండి తమకేదో ఒరుగుతుందని, తమ జీవితాల్లో ఏదో మౌలిక మార్పు వస్తుందని అనుకోవడం లేదు. తాత్కాలికంగా ఏవో కొన్ని ప్రయోజనాలు లభించినా అదే చాలు అనుకోవల్సిన దుస్థితిలో ప్రజలు వున్నారు. ఆ తాత్కాలిక ప్రయోజనాలు ఎవరి వల్ల చేకూరుతాయనుకుంటే వాళ్లకు ఓట్లేస్తున్నారు. కాంగీ, తెదేపాల పాలనను చూసే వున్నారు కనుక వైకాపా పాలన మీద ప్రజలకు కొన్ని భ్రమలు వుండే అవకాశం వుంది. ఆ భ్రమలకు, కాంగ్రెస్ పార్టీ ఆయనను చాలా వేధిస్తున్నదనే సానుభూతి కూడా తోడయింది. ఇక పోతే ఎన్నడూ గడప దాటని మహిళలు కూడా తమకు అన్యాయం జరిగిందని, ఆదుకోమని అర్థించడం ఓటర్లపై చాలా ప్రభావాన్నే వేసింది.

ఇకపోతే తెలంగాణ ప్రాంతంలో ఒకే ఒక పరకాల నియోజక వర్గంలో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెరాస గెల్చినప్పటికీ చాలా తక్కువ మెజారిటీతో గెలిచింది. ఈ నియోజక వర్గంలో వైకాపా నుండి పోటీ చేసిన కొండా సురేఖ, తెరాసకు చాలా గట్టి పోటీనిచ్చింది. పార్లమెంటు సభ్యుడిగా సమైక్యవాదాన్ని వినిపించిన జగన్‌ను తెలంగాణలో అడుగుపెట్టనివ్వమన్న పరిస్థితి నుండి తెరాసకు అంత గట్టి పోటీనిచ్చిన పరిస్థితి వచ్చిందంటే తెలంగాణ వాదం బలహీనపడినట్టా అనే చర్చ వస్తున్నది. తెలంగాణ వాదం బలహీనపడేది కాదు. అయితే వైకాపా ప్రాబల్యం తెలంగాణాలో ఒక మేరకు పెరుగుతుందని అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణలో ముస్లింలతో పాటు యువజనుల మద్దతు వైకాపాకు పెంపొందుతూ వుండడమే దీనికి కారణం. తెలంగాణ సెంటిమెంట్‌పై తెరాసకు మిగతా సెక్షన్లలో ఎన్నికల బలం పెరుగుతున్నప్పటికీ ముస్లింల మద్దతు దానికి చెప్పుకోదగిన విధంగా లేదు. అంతేకాదు వైకాపాను తెలంగాణాలో అడ్డుకునే శక్తి కూడా తెరాసకు లేదు. సమరశీల తెలంగాణా పోరాట శక్తులే జగన్‌కు తెలంగాణాలో నిలువనీడ లేకుండా చేయాలి.

మొత్తంగా ఈ వుప ఎన్నికల్లో వైకాపా గెలుపు కాంగీ, తెదేపాలలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగీ, తెదేపాలు బలహీనపడ్డ తీరు స్పష్టంగా రాష్ట్ర రాజకీయ చిత్రపటంపై కనబడుతున్నది. సీమాంధ్రలో వైకాపా, తెలంగాణాలో తెరాసలు ఆధిపత్యంలో వున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్‌లో మరోసారి పదవుల మార్పు జరగవచ్చునని ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ వుప ఎన్నికల ద్వారా అన్ని పార్టీల భవితవ్యం అర్థమైంది కాబట్టి వైభవాన్ని కోల్పోతున్న కాంగీ, తెదేపాల నుండి చాలా మంది వైకాపాలోకి దూకే అవకాశం వుంది. కాంగ్రెస్ నుండి మరికొంత మంది ఇటు వస్తే ప్రభుత్వమే కూలిపోయే అవకాశం కూడా వుంది. ఇప్పటికే కొంత మంది మంత్రుల కొడుకులు జగన్‌తో సంబంధాలు పెట్టుకుంటున్నారు. కొడాలి నానీ లాంటి తెలుగు దేశం నేతలు వైకాపాలో చేరిపోయారు. కాబట్టి పార్టీని ఎలా పటిష్టం చేసుకోవాలనే దాని మీద కాంగీ, తెదేపాలు తర్జన భర్జనలు పడుతున్నాయి. మళ్లీ పూర్వ వైభవాన్ని కూడగట్టుకోవడానికి కాంగ్రెస్ తెలంగాణావాదం పట్ల సానుకూలంగా స్పందిస్తూ, తెరాసతో ఐక్య సంఘటనకు సిద్ధపడే అవకాశాలున్నాయి. తెదేపా బాలకృష్ణను ముందుకు తెచ్చే అవకాశాలు వున్నాయి.

బలంగా వున్నా బలహీనంగా వున్నా ఈ బూర్జువా పార్టీలేవీ కూడా ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోవని ప్రజలకు ఎప్పుడో స్పష్టంగా అర్థమయిన విషయమే. ప్రజల భూమి సమస్యను గాని, నిర్వాసిత సమస్యను గాని ఏ బూర్జువా రాజకీయ పార్టీలూ పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యల్లో ప్రజలకు అండగా నిలబడడం ద్వారా కాకుండా కేవలం డబ్బు, మద్యం, అంగబలంపై ఆధారపడి అధికారంలోకి రావాలని చూస్తున్న రాజకీయ పార్టీలను మెజారిటీ ప్రజలు ఎన్నటికీ సొంతం చేసుకోలేరు. అయితే నిజమైన ప్రత్యామ్నాయమైన విప్లవోద్యమం ప్రస్తుతం బలహీనంగా వున్న దృష్ట్యా తాత్కాలిక ప్రయోజనాల కోసమో, ప్రచార ఆర్భాటం మూలంగా కొన్ని భ్రమలకు లోనయ్యో ఏదో ఓ పార్టీకి అధికారం కట్టబెడుతూనే వున్నారు.

తమ సమస్యలను పట్టించుకోని పార్టీల వెంటబడి కొట్టుకుపోకుండా, తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆశించకుండా ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి. ఆ పోరాటానికి నాయకత్వం వహించేందుకు మావోయిస్టు పార్టీని ఆహ్వానించాలి. అప్పుడే ఈ భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ నుండి ప్రజలకు విముక్తి కలుగుతుంది. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ★

---

*(39వ పేజీ తరువాయి...)*

వున్న లక్ష్యం. పర్యాటక పరిశ్రమను అభివృద్ధి చేసే లక్ష్యం కూడా ప్రభుత్వానికి వుంది. పులులను కాపాడుకోవాలంటే ఆదివాసీల సహకారంతో, వాళ్ల చైతన్యయుతమైన భాగస్వామ్యంతోనే సాధ్యం. వాళ్లను తరిమేయడం అనేది పులులకూ, అడవులకూ, పర్యావరణానికీ అన్నింటికీ ముప్పే. ఇక్కడ పర్యాటక పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్ల సాంస్కృతిక కాలుష్యం కూడా చోటుచేసుకుంటుంది.

కాబట్టి నేడు టైగర్ ప్రాజెక్టను వ్యతిరేకిస్తూ ఆదివాసీలు చేస్తున్న పోరాటం కేవలం వాళ్ల ఉనికి కోసం మాత్రమే చేస్తున్న పోరాటం కాదు. మొత్తం సమాజానికి అది అత్యంత ఆవశ్యకమైనది, విలువైనది. కనుక ఈ పోరాటంలో భాగం కావడం, ఈ పోరాటానికి అండగా వుండడం, దీన్ని మరింత మిలిటెంట్‌గా కొనసాగించడం నేడు ప్రజలందరి కర్తవ్యం. ★

# పులుల సంరక్షణ పేరుతో
# ఆదివాసులను బలిపెడుతున్న ప్రభుత్వం

నేడు ఆదివాసీలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య నిర్వాసిత సమస్య. ఏదో ఒక సాకుతో ఆదివాసులను తమ జల్, జంగల్, జమీన్‌ల నుండి తరిమి కొట్టాలని పాలక వర్గాలు కంకణం కట్టుకున్నాయి. గనులు, ఓపెన్ కాస్టులు, సెజ్‌లు, ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు, పార్కులు, అభయారణ్యాలు పేర్లేవైన కావొచ్చు ఫలితం మాత్రం ఆదివాసుల కాళ్ల కింది నేల కదిలిపోవడమే. అభివృద్ధి పేరుతో పాలకులు ఏది తలపెట్టినా అది ఆదివాసులకు, పేద ప్రజలకు వినాశనంగానే పరిణమిస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల అడవుల్లో ప్రభుత్వం తలపెట్టిన టైగర్ ప్రాజెక్ట్ ప్రస్తుతం తాజా వుదాహరణ.

మన దేశంలో నలభై ఒకటవదిగా, రాష్ట్రంలో నల్లమల తర్వాత రెండవదిగా ఈ టైగర్ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయదలుచుకుంది. అంతరించిపోతున్న పులుల జాతిని రక్షించాలనే ప్రభుత్వ వుద్దేశం మంచిదే. కానీ పులుల కోసం అది మనుషులనే బలిపెట్టదలుచుకోవడం ఇక్కడ చర్చనీయాంశం. ఈ ప్రాజెక్ట్ మూలంగా దాదాపు 90 గ్రామాలకు చెందిన 60 వేల మంది ప్రజలు నిర్వాసితులవుతారు. జల్, జంగల్, జమీన్‌లపై తమకున్న జన్మ హక్కును కోల్పోతారు. చట్ట ప్రకారం వాళ్లకు సంక్రమించాల్సిన హక్కులను కూడా కోల్పోతారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కుంటలు, చెరువులు, ఓపెన్ కాస్ట్ గనులు, ఖనిజాల పేరిట వేల ఎకరాల భూమిని ఆదివాసుల నుండి ప్రభుత్వం గుంజుకున్నది.

అడవి మీద హక్కు కోసం బ్రిటీష్, నైజాం ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన రాంజీ గోండు, కొమురం భీం పుట్టిన నేలలో 20వ శతాబ్దం అంతా గోండులు నివసించే చారిత్రక ప్రాంతంలోకి పాలక వర్గాల కుటిల నీతి వలన ఆదివాసీయేతరుల వలసలు పెరిగాయి. దక్షిణాన నిజాం ప్రోత్సాహంతో తెలుగు మాట్లాడే వివిధ కులాల ప్రజలు ఆదిలాబాద్ అటవీ ప్రాంతంలోకి చొచ్చుకొని పోగా, ఈ ప్రాంతమంతా జమీందార్లకు, జాగీర్దార్లకు వాళ్ల దోపిడీకి ఆలవాలమైంది. మరో వైపున తూర్పున బొగ్గు గనులు వ్యాపించాయి. ఉత్తరాన లంబాడాల వలసతో, జిల్లాలోని ఉత్తర పశ్చిమ ప్రాంతం అంతా వారి వశమైంది. చివరకు గోండులు జిల్లా మధ్య ప్రాంతంలోని కొండలపై పారిపోయి, తల దాచుకుంటూ బతుకులీడుస్తున్నారు. వీరిలో చైతన్యం పెరిగి ఈ కొండ ప్రాంతాల్లో 'మావ నాటే – మావ రాజ్' (స్వయంపాలన) ఏర్పాటు చేయాలనే నినాదంతో సమరశీల పోరాటాలు చేస్తుంటే, ఈ ప్రాంతం నుండి కూడా వారిని తరిమివేయడానికి, ప్రస్తుత ప్రభుత్వం పులుల సంరక్షణ కేంద్రాన్ని నిర్మించబూనుకుంటున్నది. ఎవరి పాలనను చూసినా, ఏ ప్రాంతంలో చూసినా ఆదివాసుల చరిత్రంతా తమ ప్రాంతాలను కోల్పోయి లోతట్టు ప్రాంతాలకో, కొండ ప్రాంతాలకో వెళ్లిపోయి గిరి పుత్రులుగా, గిరిజనులుగా ప్రభుత్వాల చేత పిలిపించుకోవడమే కనబడుతుంది. ఇప్పుడు పులుల సాకుతోనో, మరో సాకుతోనో లోతట్టు ప్రాంతాల నుండి కూడా వాళ్లను తరిమేయాలని చూస్తున్నారు.

2007 నుండి ఈ టైగర్ ప్రాజెక్ట్ కోసం ప్రణాళికలు రూపొందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంతో గత సంవత్సరం జూన్‌లో శాసన సభ కమిటీ ఈ అడవుల్ని పరిశీలించి వెళ్లింది. 45 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్రం సెప్టెంబర్‌లో అనుమతినిచ్చింది. అందులో భాగంగా అల్లినగర్, మైసంపేట, దొంగపల్లి, మల్యాల ప్రాంతాలకు చెందిన సుమారు 40 ఆవాసాలను ఖాళీ చేయాలని అటవీ శాఖ అధికారులు ఆదివాసులపై ఒత్తిడి చేశారు. జన్నారం అటవీశాఖ పరిధిలోని దొంగపల్లిలో 70, అల్లినగర్‌లో 64, మల్యాలలో 61 కుటుంబాలు వీటి పరిధిలోకి వస్తున్నట్టు గుర్తించినట్టు కూడా ప్రకటించారు. సుమారు 300 కుటుంబాలకు నష్ట పరిహారం, పునరావాసం కల్పించాలని ప్యాకేజీ ప్రకటించారు. అయితే ఆదివాసీ ప్రజలు ఈ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టడం వలన ప్రభుత్వం అప్పట్లో వెనక్కి తగ్గింది.

మళ్లీ ఈ సంవత్సరం ఏప్రిల్ 10న ఈ ప్రాజెక్ట్ కోసం అటవీ, పర్యావరణ శాఖ జీవో నెంబర్ 27 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం టైగర్ జోన్ ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు అటవీ శాఖ డివిజన్లకు విస్తరిస్తుంది. ఈ టైగర్ జోన్ కోసం 89,223 హెక్టార్ల ప్రాంతాన్ని కోర్ ఏరియాగా, 1,12,321 హెక్టార్ల ప్రాంతాన్ని బఫర్ ఏరియాగా ఏర్పాటు చేస్తారు. 2013 కల్లా దీనిని పూర్తి చేయాలని 2014 నాటికి పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వ సంకల్పం.

కోర్ ఏరియా అంటే పులులు తిరిగే ప్రాంతం. కోర్ ఏరియా కిందికి ఐదు మండలాల లోని దాదాపు నలభై గ్రామాలు వస్తాయి. జన్నారం మండలంలోని దొంగపల్లి, అల్లినగర్, మల్యాల, ఇందన్ పల్లి, కలమడుగు, కవ్వాల్, కొత్తపల్లి, నార్లపూర్, చింతగూడ; సిర్పూర్ (యు) మండలంలోని మామిడిపల్లి; ఖానాపూర్ మండలంలోని దొందరి, కల్లెడ, ధర్మాజీపేట, లక్ష్మీపూర్, పాండ్యపూర్, మున్యాల్; ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి, భీర్సాయిపేట తదితర గ్రామాలు ఈ కోర్ ఏరియాలోకి వస్తాయి. ఈ గ్రామాలన్నింటిని ఖాళీ చేయిస్తారు.

కోర్ ఏరియా పరిధిని ఆనుకొని పది కిలోమీటర్ల విస్తీర్ణంతో బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది టైగర్ పార్క్‌కు బాహ్య ఏరియాగా పనిచేస్తుంది. దీని పరిధిలోకి దాదాపు యాభై గ్రామాలు వస్తాయి. ఖానాపూర్ మండలంలోని సత్తెన్‌పల్లి, మాదపల్లి, ముత్యంపేట నాగ్‌పూర్, సోనూర్‌పేట, పెంబి, పోచంపల్లి, పస్పుల, రాయదరి; కడెం మండలంలోని మైసంపేట, ఇస్లాంపూర్, గంగాపూర్, అల్లంపల్లి, దమ్మన్నపేట, లింగపూర్, మాకులపేట, పాత మామిడిపల్లి, దండెపల్లి, తానిమెడుడు, చింతపల్లి, తాళ్లపెట్టి; ఆసిఫాబాద్ మండలంలోని బాలనగర్, చింతగూడ, ధనోరా, వైగాం, కోడనమోవాడ్; తిర్యాణి మండలంలోని మంగి, భీంపూర్, గోపెర, దంపూర్, పంగిడిమాదుర, గిన్నెధరి; నేరడికొండ మండలంలోని గెల్దారి, కుంటాల, పోచరా; ఇచ్చోడ మండలంలోని గెర్జిం, మదపూర్, సిరిచెల్మ, శ్రీకొండ, తలమొద్రి, వాయిపేట; ఇంద్రవెల్లి మండలంలోని వాయిపేట, పోచంపల్లి; ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్, గంగాపూర్, హస్నపూర్; సిర్పూర్ (యు) మండలంలోని నెత్నూర్, చిన్న కోపనూర్, రాఘవ్‌పూర్ చోర్‌పెల్లి; జైనూర్ మండలంలోని రాసిమెట్ట, బూసిమెట్ట, కెరమెరి మండలంలోని కెరమెరి, జోడెన్‌ఘాట్, బాబేఝరి, పట్నాపూర్, చల్‌బండి – ఈ గ్రామాలన్నీ బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి.

కోర్ ప్రాంతంలో అటవీ సంపదలను వినియోగించుకోవడంపై పూర్తి నిషేధం వుంటుంది. బఫర్ జోన్‌లోని గ్రామ ప్రజలకు అడవిని ఉపయోగించుకునే అవకాశం పరిమితంగా వుంటుంది. పొయ్యిలోకి కర్రలు, ఇప్పపూవు వంటివి తెచ్చుకోవచ్చు. అయితే వన్యప్రాణి అధికారి దయాదాక్షిణ్యాల మీదనే ఇది ఆధారపడి వుంటుంది. మొత్తంగా అటవీ వుత్పత్తిలను సేకరించుకోవడానికి, పోడు వ్యవసాయానికి ఆదివాసులు దూరం కావాల్సి వస్తుంది. తమ బతుకుదెరువును కోల్పోవాల్సి వస్తుంది. తమ సంస్కృతికి కూడా దూరం కావాల్సి వస్తుంది.

నిర్వాసిత గ్రామాల యువతకు ప్రైవేటుపరంగా ఉద్యోగ, వుపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రతి కుటుంబానికి పది లక్షల రూపాయలు పరిహారంగా ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. కుటుంబానికి పది లక్షల నష్ట పరిహారం అనేది చాలా తక్కువ. అది కూడా ఎంత మేరకు ఇస్తారనేది సందేహమే. నిర్వాసిత కుటుంబాలన్నింటికీ పది లక్షలు ఇవ్వాలంటే కొన్ని వందల కోట్ల రూపాయలు అవసరం అవుతుంది. కానీ కేంద్ర సర్కార్ నిర్వాసితుల కోసం కేవలం 66 కోట్లు మాత్రమే కేటాయించింది. దేశంలోని లక్షలాది నిర్వాసితులతో ప్రభుత్వాలు ఎలా వ్యవహరిస్తున్నాయో మనకు తెలియనిదేమో కాదు. ఉన్న ఉపాధిని కోల్పోయి, నష్ట పరిహారం అందక, వుద్యోగాలు దొరకక బతుకులీడ్చుతున్న నిర్వాసితుల కథలు మనం వింటూనే వున్నాం.

జల్ జంగల్ జమీన్‌పై ఆదివాసులకున్న హక్కును కాపాడడం అంటూ కోసం అయిదవ షెడ్యూల్, పెసా, ఆదివాసుల అటవీ హక్కుల చట్టం వంటివెన్నో కాగితాల మీదున్నాయి. అయితే వేటినీ లెక్క చేయకుండా ఇప్పుడీ ప్రాజెక్ట్‌ను తలపెట్టారు. వన్యప్రాణి రక్షణ చట్టం కింద ముఖ్యమైన వన్యప్రాణి ఆవాసాలను ఏర్పాటు చేయాలన్నా, లేదా ముఖ్యమైన పులుల ఆవాసాలుగా ఒక ప్రాంతాన్ని నోటిఫై చేయాలన్నా అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి అనుగుణంగా వుండాలనే గైడ్‌లైన్స్‌ను కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ రూపొందించింది. అందులో రెండింటిని తప్పనిసరిగా అమలు చేయాలి.

దీని ప్రకారం కవ్వాల్ ప్రాంతాన్ని పులుల అభయారణ్యం కోసం నోటిఫై చేసే ప్రాంతాన్ని అటవీ శాఖ ఒక్కటే చేయడానికి వీలులేదు. ఒక ముఖ్యుల (ఎక్స్‌పర్ట్) కమిటీని ఏర్పాటు చేయాలి. అందులో జీవావరణ శాస్త్రవేత్తలను, ఆదివాసీ పెద్దలను, గిరిజన సంక్షేమ శాఖ, అటవీ శాఖలలోని కొంతమందిని కలిపి కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ అన్ని విషయాలను కూలంకషంగా చర్చించాలి. అక్కడ నివసిస్తున్న ప్రజలతో చర్చించాలి. అభిప్రాయాలు తెలుసుకోవాలి. ఈ ప్రక్రియనేమీ పాటించకుండానే అటవీశాఖ దీనిని టైగర్‌జోన్‌గా ప్రకటించింది. దానికి ఆ అధికారం లేదు.

అయితే స్థానిక ప్రజలు ఈ ప్రాజెక్ట్‌ను దృఢంగా వ్యతిరేకిస్తున్నారు. ఆందోళనలు చేపడుతున్నారు. ఎట్టి పరిస్థితులలోను తమ గ్రామాలను వదిలి పోయేది లేదని కచ్చితంగా చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక ప్రాజెక్ట్‌ను వెనక్కి తీసుకోకుంటే, ఆదివాసుల మౌలిక సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఇంద్రవెల్లి తిరుగుబాటును మరోసారి సృష్టిస్తామని హెచ్చరిస్తున్నారు. ఆదివాసీ, ప్రజా, పౌర హక్కుల సంఘాలు, తెలంగాణా సంఘాలు కూడా ఈ ప్రజలకు గట్టి మద్దతును ఇస్తూ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నాయి.

అయితే ప్రజలను ఎలాగైనా ఖాళీ చేయించాలని ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి. విషపు పాములను, ప్రాణాలు తీసే పులులను గ్రామాల్లో వదిలామనీ ప్రాణాలు తీస్తే మాది బాధ్యత కాదని అటవీ శాఖ సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

పులులను కాపాడాలనే లక్ష్యంతో వేల మంది ఆదివాసులకు నిలువ నీడ లేకుండా చేయడానికి ప్రభుత్వం ఎంత మాత్రమూ వెనకాడడం లేదంటే పులులకిచ్చే విలువ మనుషులకు ఇవ్వడం లేదన్న మాట. నిజానికి పులులు అంతరించి పోవడానికి కారణం ఎవరు? అటవీ మాఫియా, రాజకీయ నాయకులు, అటవీ శాఖ ఉన్నతాధికారులు... వీరంతా కుమ్మక్కవడం వల్లనే నేడు అటవీ సంపదకు, జీవావరణానికి, జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. ఇక్కడి ఆదివాసీలు 'పులి మా సంస్కృతిలో భాగమనీ, మేం దేవతలా పూజిస్తామని, వేటగాళ్ల నుండి వాటిని రక్షించుకుంటామని' అంటున్నారు. నిజానికి ఈ మాత్రం అడవులు, జీవజాలం మిగిలున్నాయంటే అది ఆదివాసుల, వారు చేస్తున్న పోరాటాల చలువే. ప్రభుత్వానికి వున్నది పులుల మీద ప్రేమ కాదు, ఆదివాసీలను తరలించి ఈ ప్రాంతాన్ని మానవ రహితంగా మార్చి ఇష్టారాజ్యంగా దోపిడీ చేయడమే ఈ టైగర్ జోన్ ఏర్పాటు వెనుక

***(మిగతాది 37వ పేజీలో...)***

# సుప్రీంకోర్టు న్యాయమూర్తికి హిమాంశు కుమార్ బహిరంగ లేఖ

**గౌరవనీయులైన న్యాయమూర్తి గార్కి,**

**సుప్రీంకోర్టు,**

**కొత్త ఢిల్లీ**

సోనీ సోడి అనే ఆదివాసీ అమ్మాయి విషయంలో నేను మీకీ ఉత్తరం రాస్తున్నా. ఆమె మర్మాంగాల్లో దంతెవాడ ఎస్.పి. రాళ్లు జొప్పించిన కేసు మీ న్యాయస్థానంలో నడుస్తున్నది. మీ ఆదేశంపై ఈ అమ్మాయికి వైద్య పరీక్షలు జరపగా డాక్టర్లు ఈ ఆదివాసీ అమ్మాయి చేస్తున్న ఆరోపణలు సరైనవని తేల్చారు. డాక్టర్లు తమ రిపోర్టుతో పాటు ఈ అమ్మాయి మర్మాంగాల్లో నుండి వెలికి తీసిన మూడు రాళ్లను కూడా మీ ముందుంచారు.

నిన్న, 2-12-2012న మీరు ఆ రాళ్లను చూసిన తర్వాత కూడా ఆ ఆదివాసీ అమ్మాయిని ఛత్తీస్‌గఢ్ జైల్లోనే వుంచాలని ఆదేశించారు. అలాగే దీనిపై జవాబివ్వడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఒకటిన్నర నెలల గడువు కూడా ఇచ్చారు.

జడ్జి గారూ! నాకు ఇద్దరు కూతుళ్లున్నారు. ఎవరైనా నా కూతుళ్లపై ఇలా చేస్తే గనుక వాళ్లకు నేను ఒకటిన్నర నెలలు కాదు కదా, ఒకటిన్నర నిమిషాల గడువు కూడా ఇవ్వకపోయే వాడిని. జడ్జి గారూ, ఒకవేళ ఈ అమ్మాయి మీ స్వంత కూతురై వుంటే ఆమె మర్మాయవాల్లో రాళ్లు జొప్పించిన వాళ్లకు మీరు నలభై ఐదు రోజుల సమయం ఇచ్చే వాళ్లేనా? నా కూతురు మర్మాయవాల్లో రాళ్లెందుకు నింపారో నలభైయైదు రోజుల తర్వాత వచ్చి చెప్పండని, అప్పటి దాకా నా కూతురుని మీ ఇంట్లోనే బంధించి వుంచుకోండి అని మీరు అనగలిగే వాళ్లేనా అసలు?

రాళ్లు జొప్పించిన ఆ బద్మాష్ ఎస్.పి.కి, తనను రక్షించడానికి మీరు ఇక్కడ సుప్రీంకోర్టులో ఆసీనులై వున్నారనే విషయం స్పష్టంగా తెలుసు. అందుకే వాడు బేఫికర్‌గా, బలాదూర్‌గా ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్నాడు. బ్రిటిష్ వాళ్ల హయాంలో కోర్టులు పోలీసుల్ని రక్షించినట్టుగానే, మీ సుప్రీంకోర్టు కూడా ఇలాంటి దారుణాలకు పాల్పడ్డ వాళ్లను రక్షిస్తుందనే విషయం నిన్నటి మీ తీర్పు ద్వారా మరింత తేటతెల్లమైంది.

జడ్జి గారూ, ఈ కోర్టు ఆ ఆదివాసీ అమ్మాయిని కాపాడడం కోసం ఏర్పడింది కాని బద్మాష్ ఎస్.పి. కోసం కాదు. ఇది ఈ ప్రజాస్వామిక దేశపు సర్వోన్నత న్యాయస్థానం. దేశంలోని అత్యంత బలహీనులైన వాళ్లను రక్షించడం దీని మొట్టమొదటి పని. దేశంలో అందరికన్నా బలహీనులు మహిళలు, ఆదివాసులు, దళితులు, ఆకలితో చనిపోతున్న కోట్లాది ప్రజలేననే విషయం మీరు గుర్తుంచుకోవాలి. ఇలాంటి ప్రజల పరిస్థితుల్ని మెరుగుపర్చడం కోసమే ఈ కోర్టు తన ప్రతి తీర్పును ఇవ్వాల్సి వుంటుంది. కాని స్వాతంత్ర్యం తర్వాత వీళ్లందరి పట్ల మీ నుండి వ్యక్తమవుతున్నది నిర్లక్ష్యమే తప్ప మరేమీ కాదు. వీళ్ల దుస్థితికి కారకులైన వాళ్లకు మాత్రం రక్షణ కల్పిస్తూ వున్నారు.

నా తండ్రి గారు ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలలేమిటి? ఒకానొక రోజున దేశ సర్వోన్నత న్యాయస్థానం ఒక ఆదివాసీ అమ్మాయికి బదులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డ వాళ్లకు రక్షణ కల్పిస్తుందని వాళ్లు కలలో కూడా వూహించి వుండరు.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం వుందని మాకు చిన్నతనం నుండి నేర్పించారు. దీని అర్థం కోట్లాది ఆదివాసుల, కోట్లాది దళితుల, కోట్లాది ఆకలి కడుపుల వాళ్ల పాలన అని. కాని మీ తీర్పులన్నీ కూడా ఈ కోట్లాది ప్రజలను దుస్థితిలోకి నెట్టి వేసే వాళ్ల పక్షమే వుంటున్నాయి. ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్‌లో తమ భూములను కాపాడుకోవడం కోసం కాలే ఇసుకలో పడుకొని వున్న మహిళలు, పిల్లలు మీ కళ్లకు కనిపించరు. వాళ్ల కోసం గొంతు విప్పిన అభయ్ సాహూ అనే కార్యకర్తను అక్కడి భూముల్ని గుంజుకోజూస్తున్న కంపెనీ యజమానుల ఆదేశంపై ప్రభుత్వం అరెస్టు చేయడం కూడా మీకు కనిపించదు.

గొంపాడు గ్రామంలో ప్రభుత్వ భద్రతా బలగాలు కత్తులతో పొడిచి చంపేసిన పదహారుగురు ఆదివాసుల కేసు మీ కోర్టులో రెండేళ్ల నుండి మూలుగుతున్నది. ఆ ఆదివాసుల కేసును ఈ కోర్టుకు తీసుకొచ్చే సమయంలో ఒక నక్సలైటు నాయకుడు నాతో ఛాలెంజ్ చేస్తూ, ఈ ఆదివాసులను హత్య చేసిన పోలీసులకు ఒకవేళ నువ్వు శిక్ష వేయించగలిగితే నేను తుపాకీ వదిలేస్తానని అన్నాడు.

కాని నేను ఓడిపోయాను. ఆ ఆదివాసీలు ఈ కోర్టుకు వచ్చినందుకు శిక్షగా పోలీసులు వాళ్ల కుటుంబీకులను ఎత్తుకెళ్లారు. వాళ్లు ఇప్పటికీ పోలీసుల అక్రమ కస్టడీలో వున్నారు. మీరు దోషులకు ఇప్పటి వరకు శిక్ష వెయ్యకపోవడం ద్వారా గెలిపించింది దేశ ప్రభుత్వాన్ని కాదు, నాతో ఛాలెంజ్ చేసిన ఆ నక్సలైటును. ఇప్పుడు నేనే మొఖం పెట్టుకొని ఆ నక్సలైటు ఎదుటకు వెళ్లి ఈ దేశంలో వున్న మహోన్నత ప్రజాస్వామ్యం గురించి, నిష్పక్షపాత న్యాయవ్యవస్థ గురించి గప్పాలు కొట్టగలను? అతను తుపాకీ పట్టుకోవడం తప్పని ఎలా అనగలను?

# లాటూర్‌లో దళితులపై దాడి

దళితులపై దాడి చేయడం అనేది మన దేశంలో అత్యంత సాధారణ విషయం. చరిత్ర పుటలను తిరగేస్తే దళితులపై దాడులు జరిగిన సంఘటనలు దేశవ్యాప్తంగా ఎన్నెన్నో కనిపిస్తాయి. దేశంలో దళితులపై ప్రతి 18 నిమిషాలకు ఒక దాడి జరుగుతున్నట్టు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ప్రతిదాడి ఒక యాధృచ్ఛిక ఘటనగా ముందుకొచ్చినా ఇవన్నీ నిచ్చెన మెట్ల వ్యవస్థలో పకడ్బందీ పథకంలో భాగమే. ప్రతి దాడి వెనుక ఒక ప్రత్యేక కారణం వున్నట్టుగా కనబడినప్పటికీ ఈ దాడుల వెనుక వున్న సాధారణత్వం ఒక్కటే – అగ్రకుల దోపిడీ దారులు తమ దోపిడీని, వర్గమూలాలను కాపాడుకోవడానికే ఈ దాడులు. లాటూర్ దళితులపై జరిగిన దాడి కూడా ఇందులో భాగమే. 2012 జనవరి 22న జరిగిన ఈ దాడిలో దళితులకు చెందిన 50 ఇండ్లు కాలి బూడిదయ్యాయి.

లాటూర్ అనేది పశ్చిమ ఒడిశాలోని బోలంగీర్ జిల్లా, కప్రకోల్ తాలూకాలోని ఒక చిన్న టౌన్. నాలుగు వేలకు పైగా జనాభా కలిగిన ఈ టౌన్ విశాఖ నుండి రాయ్‌పూర్‌కు వెళ్లే రైలు మార్గంపై వుండి చిన్న మార్కెట్ సెంటర్‌గా వుంది. కులానికో వాడ చొప్పున ఏడు వాడలు వున్నాయీ టౌన్లో. మార్వాడి (అగర్వాల్), మెహర్, ఆదివాసీ, దళితులతో పాటు ఇతర కులాలు కూడా వున్నాయిక్కడ. అంతటా వున్నట్టే ఇక్కడ కూడా దళితవాడ విడిగానే వుంది. మొత్తంగానే ఈ ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల, భూస్వాముల, ప్రభుత్వాధికార్ల దోపిడీ మూలంగా భూములన్నీ కోల్పోయి ప్రజలు నిరుపేదలుగా మారిపోయారు. ఈ పేదరికం వల్ల బతుకు దెరువుకు మరో మార్గం లేక ప్రతి సంవత్సరం ఈ ప్రాంతం నుండి లక్షలాది ప్రజలు కుటుంబాలకు కుటుంబాలే ఇతర రాష్ట్రాలకు వలస పోతుంటారు. ఇక్కడి దళారులు ఒప్పందాలు చేసుకొని మూడు నెలలు, ఆరు నెలలు పనులు చేయడానికి పంపుతుంటారు. ఇదంతా దొంగ వ్యాపారమే. ఇందులోని మోసాలకు ఎందరో బలవుతుంటారు. ఇటువంటి దళారులకు లాటూరు కూడా ఒక కేంద్రం.

దేశంలో అంతటా వున్నట్టే అగ్రకులాలు దళిత కుల ప్రజలను

---

ఒకవేళ ఈ దేశంలో నియంతృత్వం వుంటే మేం సంతోషపడేవాళ్లం. ఆ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ వుండేవాళ్లం. కాని మాకు చెప్పిందేమో దేశంలో ప్రజాస్వామ్యం వుందని. కాని ఈ వ్యవస్థలోని ప్రతి సంస్థా, చట్టసభలు, పరిపాలక, న్యాయ వ్యవస్థలన్నీ కలిసి కోట్లాది ప్రజలకు వ్యతిరేకంగా, కొందరు ధన పశువుల పక్షాన పూర్తిగా నిస్సిగ్గుగా పని చేస్తున్నాయి. దీన్ని మేం ప్రజాస్వామ్యమని కాదు, ఉత్త బూటకం అని అంటాం. ఇప్పుడు ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న ఈ బూటకస్వామ్యాన్ని ఒక్క రోజు కూడా భరించడానికి మేం సిద్ధంగా లేం.

ఈరోజు నుండి ఏ పేదవాడి కేసును కూడా తీసుకొని నేను మీ కోర్టుకు రానని శపథం చేస్తున్నా. ఇక నేను ప్రజల మధ్యకు వెళ్తాను. ఈ బూటకపుస్వామ్యంపై దాడి చేసి ధ్వంసం చేయాలని ప్రజలను రెచ్చగొడతాను. దాని స్థానంలో నిజమైన ప్రజాస్వామ్య భవంతిని నిర్మించడానికి పూనుకోవాలని కోరుతాను.

ప్రభుత్వానికి కోపం వస్తుందని, దానితో మీ ప్రమోషన్ నిలిచిపోతుందని మీరు ఈ అమ్మాయికి న్యాయం చేయలేకపోతున్నారేమో! ఒకసారి చరిత్రలోకి తొంగి చూడండి. తప్పుడు తీర్పులిచ్చే న్యాయమూర్తులకు చరిత్రలో ఎలాంటి స్థానముండదు. నిజం మాట్లాడిన నేరానికి సోక్రటీస్‌ను శిక్షించిన న్యాయమూర్తి ఎవరో ఎంత మంది గుర్తుంచుకున్నారు?

జీసస్‌ను దొంగలతో కలిపి శిలువపైకి ఎక్కించి మొలలు దిగగొట్టించిన జడ్జి ఎవరో ఈరోజు ఎవరికి తెలుసు? మీరు చేసిన అన్యాయం మూలంగా సోనీ సోడి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. కాని చరిత్ర పుటల్లో మీ పేరు కోసం ఒక చిన్న మూల కూడా మిగలదు.

ఒకవేళ మీరు నిజమైన రాజ్యాంగ స్ఫూర్తితో ఈ బలహీనురాలైన, ఒంటరి ఆదివాసీ మహిళకు న్యాయం అందిస్తే అధికార పీఠం మీదున్న వాళ్లు మీకు ప్రమోషన్ ఇవ్వకపోయినా, మీరు మీ దృష్టిలో, మీ కుటుంబం దృష్టిలో, ఈ దేశం దృష్టిలో ఎంతో ఉన్నతంగా నిలిచిపోయే వాళ్లు.

ఈ ఉత్తరం రాసిన తర్వాత మీరు నన్ను అరెస్టు చేసినా అందుకు నేనే మాత్రం బాధపడను. ఎందుకంటే ఆ తర్వాత నేను నా కూతుళ్ల కళ్లలోకి సూటిగా చూస్తూ మాట్లాడగలుగుతాను. సోనీ సోడి అక్కపై జరిగిన అత్యాచారం విషయంలో నేను భయపడి మౌనంగా వుండిపోలేదని, ఒక తండ్రి తన కూతురిపై అన్యాయం జరిగినపుడు ఏం చేయాలో అదే చేసానని వాళ్లకు చెప్పగలుగుతాను.

**('జన్ జ్వార్' సౌజన్యంతో**

**('దఖల్ కీ దునియా' అనే బ్లాగ్‌లో 2011, డిసెంబర్ 5న ప్రచురితమైన హిందీ ఉత్తరానికి అనువాదం)** ★

అణచిపెట్టడం, అంటుడు ముట్టుడు కూడా లేకుండా అత్యంత హీనంగా వెలివెయ్యడం అనేది లాటూర్‌లో కూడా వుంది. 2007లో లాటూర్‌లో దుర్గా పూజ జరుగుతున్నప్పుడు దళితులను అగ్రకులాల వాళ్లు రానివ్వలేదు. తమను రానివ్వకుంటే దుర్గా పూజకు చందాలివ్వమని, పూజకు బాజా, డప్పులు, డోళ్లు వాయించమని దళితులు బహిష్కరించినారు. ఇలా బహిష్కరించి దళితులు తమ చైతన్యాన్ని చాటుకోవడం, అస్తిత్వాన్ని ప్రదర్శించుకోవడం అనేది అగ్రకుల దోపిడీదారులకు జీర్ణం కాలేదు. దీనికి ప్రతీకారంగా దళితులపై అక్రమ కేసులు కూడా పెట్టి వేధించారు. అయినప్పటికీ దళితుల్లో పెరుగుతున్న చైతన్యాన్ని మాత్రం అడ్డుకోలేకపోయారు.

సారా వల్ల తమ బతుకులు మరింత దుర్భరంగా తయారవుతున్నాయని గ్రహించిన దళితులు, సారాను బంద్ పెట్టాలనే చైతన్యవంతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రస్తుతం సారా అనేది ప్రజలకు నచ్చితే తాగే, లేదంటే మానేసే ఒక సాధారణ సాంస్కృతిక అంశంగా లేదు. పేదలు, దళితులు, ఆదివాసులను అణచిపెట్టడానికి, తమ వర్గ దోపిడీని మరింత తీవ్రం చేయడానికి దోపిడీ వర్గాల చేతుల్లో ఒక బలమైన ఆయుధంగా వుంది. సారా వ్యాపారం రాజకీయాలు, మాఫియాతో కలిసిపోయి బలమైన దోపిడీ సాధనంగా తయారైంది. అందుకే లాటూర్ ప్రజలు మేం సారా తాగము అనే నిర్ణయం తీసుకున్నా, లేదా మా వూళ్లో సారా అమ్మనీయం అనే నిర్ణయం తీసుకున్నా అది చిన్న విషయంగా వుండదు. దోపిడీ వర్గాల్లో ప్రకంపనం సృష్టించే విషయమే అవుతుంది. ప్రకంపనమే సృష్టించింది కూడా!

సారా మాఫియాకు చెందిన ఘాసిరాం అగర్వాల్ ఒడిశా రాష్ట్రంలో అతి పెద్ద సారా కాంట్రాక్టర్లలో ఒకడు. కోటీశ్వరుడైన ఇతను లాటూర్‌కు చెందినవాడే. ఇతనికి 40 – 50 పెద్ద పెద్ద సారా బట్టీలున్నాయి. సారా బంద్ చేయాలనే దళితులు తీసుకున్న నిర్ణయం ఇతనికి సహజంగానే మింగుడు పడలేదు. అందుకే దళితులను దెబ్బకొట్టడానికి అవకాశాలను వెతకసాగాడు.

జనవరి 22న ఉదయం ఒక దళిత విద్యార్థి మెహర్ కులానికి చెందిన బట్టల దుకాణంలో డబ్బులిచ్చి ఒక షర్ట్ కొనుక్కున్నాడు. అగర్వాల్ కులం తర్వాత ఇక్కడ మెహర్ కులమే ఆర్థికంగా ఆధిపత్యంలో వున్న కులం. డబ్బులిచ్చి బట్టలు కొన్నప్పటికీ దుకాణాదారు ఆ విద్యార్థిని డబ్బులివ్వలేదని ఆరోపిస్తూ కొట్టడం మొదలుపెట్టాడు. ఇలా అకారణంగా కొట్టడాన్ని మరో మధ్య వయస్కుడైన దళిత వ్యక్తి ప్రశ్నిస్తే దుకాణాదారు చెప్పు చూపించి అతన్ని కించపరిచాడు. ఆ తర్వాత వీళ్లిద్దరూ హాస్పిటల్‌కు పోతుంటే దారిలో పట్టుకొని మళ్లీ కొట్టారు. ఈ అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని భరించలేని వీళ్లు కప్రాకోల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టారు.

ఇదే అదనుగా భావించిన ఘాసిరాం అగర్వాల్, జగన్నాథ్ అగర్వాల్ అనే మరో మాఫియా నాయకుడితో కలిసి దళితులపై దాడికి పథక రచన చేశాడు. 200 మంది గూండాలను బాగా తాగించి సిద్ధం చేశారు. జగన్నాథ్ అగర్వాల్‌కు పెట్రోల్ బంక్ వుంది. ఇతని పెట్రోల్ బంక్ నుండి 400 లీటర్ల పెట్రోల్‌ను గూండాలకు ఇచ్చారు. దళిత వాడకు వెళ్లే అన్ని దారులను మూసేశారు. పథకం ప్రకారం దళిత వాడపైన దాడి చేసిన గూండాలు నిర్ణయించిన ఇండ్లపైన పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఇండ్లల్లోని సామానును కుప్పగా వేసి మరీ తగులబెట్టారు. అట్లా 50 ఇండ్లు పూర్తిగా ఇండ్లలోని సామాన్లతో సహా కాలి బూడిదయ్యాయి. కాలిపోతున్న సామాన్లను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ ఇండ్లలో చిక్కుకొని పొగతో ఊపిరాడక ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు.

పట్టపగలే జరిగిన ఆ దారుణాన్ని ఘాసిరాం అగర్వాల్ తన బంగ్లాపై నిలబడి ఆనందంగా చూశాడు. జరుగుతున్న ఘోరాన్ని చూస్తూ వుండలేక కొంతమంది ప్రజలు, యువకులు కలెక్టర్‌కు, ఎస్.పి.కి ఫిర్యాదు చేశారు. అయితే పథకం ప్రకారమే జరిగిన దాడి కాబట్టి మార్వాడీల నుండి లంచాలు తీసుకున్న అధికారులు, ఇండ్లన్నీ కాలి బూడిదయిపోయిన తర్వాత పోలీసులను పంపారు. మావోయిస్టులతో ఫైరింగ్ జరిగింది కాబట్టి త్వరగా రాలేకపోయామని పోలీసులు నిస్సిగ్గుగా చెప్పుకున్నారు. నిజానికి పోలీసులు వాళ్లను వాళ్లే కాల్చుకున్నారు. ఇందులో ఒక జవాను కాలికి గాయం కూడా అయింది.

ఇలా సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిపోయిన బాధితుల కనీస అవసరాలు తీర్చాలనే డిమాండ్‌తో ప్రభుత్వ అధికారులతో ప్రజలు పెద్ద ఎత్తున పోరాడాల్సి వచ్చింది. 50 కుటుంబాలకు చెందిన 197 మంది ప్రజలు నదిలోనే తలదాచుకోవాల్సి వచ్చింది. పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో సర్టిఫికెట్లు కాలిపోయి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. రేషన్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లు వంటివన్నీ కాలిపోయి ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రజలు ఎంతో కొట్లాడగా, ప్రదర్శనలు చేయగా బాధితులను ఒక పాఠశాలలో వుంచడానికి అధికారులు ఒప్పుకున్నారు. తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా జనవరి 26ను దళిత ప్రజలు నిరసన దినంగా పాటించారు. పంచాయితీ ఎన్నికలను బహిష్కరించారు.

దళితులపై జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా ప్రచారం జరిగింది. కమిటీల పర్యటనలు, పరిశీలనలు, విచారణలు జరిగాయి. దోషులను శిక్షించాలని రాజకీయ నాయకులు వుపన్యాసాలు దంచారు. కాని దోషులు మాత్రం బహిరంగంగానే తిరుగుతూ గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొన్నారు. దోషులు సంఘ్ పరివార్‌కు చెందిన వారు. పైగా కోటీశ్వర్లు. కాబట్టి నిర్భయంగా తిరుగుతున్నారు.

ఎంతో పోరాటం తర్వాత ప్రభుత్వం కంటితుడుపు చర్యగా బాధితులకు కొంత నష్ట పరిహారాన్ని ఇచ్చింది. కాని దోషులను మాత్రం శిక్షించలేదు.

ఎటువంటి శిక్షను వేయకుండా ఘాసీరాం అగర్వాల్‌ను ప్రభుత్వం వదిలేసినప్పటికీ ప్రజలు, పిఎల్‌జిఎ మాత్రం వదలలేదు. 2012

# పోలీసుల దెబ్బకు ఎదురుదెబ్బ - మంగెవాడ ప్రజా ప్రతిఘటన

గడ్చిరోలి జిల్లా ధనోరా తహసీల్‌లోని మంగెవాడ గ్రామంలో 2011 నవంబర్ 21న విప్లవ ప్రజలు తమపై దౌర్జన్యానికి దిగిన పోలీసులకు మరిచిపోలేని విధంగా బుద్ధి చెప్పారు.

ఆ రోజు పోలీసులు మంగెవాడ గ్రామంలోని సంఘం కార్యకర్తలను, ప్రజా మిలీషియా కార్యకర్తలను పట్టుకునే ప్లాన్‌తో వచ్చారు. దీనికి కొన్ని రోజుల ముందు అక్కడ ప్రజా మిలీషియాకు పీఎల్‌జీఏ శిక్షణనిచ్చింది. ఇలా శిక్షణ ఇచ్చిన సమాచారం, అందులో ఎవరెవరు పాల్గొన్నారనే విషయం ఆ గ్రామంలో ఉన్న ఒక ఇన్‌ఫార్మర్ ద్వారా పోలీసులకు వెళ్లింది. ఇతను కోళ్ల వ్యాపారం చేసే పేరుతో గడ్చిరోలికి రాకపోకలు చేసేవాడు. ఇతను సమాచారం చేరవేస్తున్న విషయం గ్రామస్థులకు అర్థం కాలేదు. ఇతనే ఆ గ్రామానికి 300 మంది కోబ్రా పోలీసులను పట్టుకొని వచ్చాడు.

పోలీసులు ఉదయం 6 గంటలకు గ్రామానికి వచ్చారు. వారు మెల్లమెల్లగా అన్ని ఇళ్లనూ చుట్టుముట్టి ఇళ్లల్లోకి జొరబడ్డారు. కొంతమంది పోలీసులు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన పేర్ల లిస్టు ప్రకారం మిలీషియా సభ్యులుగా అనుమానించిన యువకులను పట్టుకొని గ్రామం బయటకు తీసుకొని వెళ్లారు. మిగతా పోలీసులు గ్రామంలోనే మంచాల మీద, కుర్చీలలో, ఇళ్ల గట్ల మీద కూర్చుని గామ ప్రజలందరినీ ఒక చోట జమ చేస్తూ వారికి ఏదేదో చెబుతున్నారు. తమ అసలు లక్ష్యం బయటపడకుండా వారిని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ పిల్లలను బయటకు తీసుకెళ్లి మాట్లాడుతున్నారు కావచ్చు అని ప్రజలు భావించారు.

కాని, గ్రామం బయట జరుగుతున్నది మరొకటి. పట్టుకొన్న యువకులను అందరినీ ఒక చోట జమ చేసి వారిని పోలీసులు కొట్టడం ప్రారంభించారు. ఈ లోపు ఒక అక్క మూత్రానికి అని వెళ్లి గ్రామం బయట పోలీసులు తమ గ్రామ యువకులను కొడుతున్న విషయాన్ని చూసింది. ఆమె గ్రామంలోకి వచ్చి 'పోలీసులు మనవాళ్లను తీవ్రంగా కొడుతున్నారనే' విషయాన్ని ప్రజలకు తెలియజేసింది.

ఈ విషయం గ్రామంలో గుప్పుమంది. ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకొంది. గ్రామంలో తమ ఇళ్ల వద్ద కూర్చొని కబుర్లు చెబుతున్న పోలీసులపై ప్రజలు విరుచుకుపడ్డారు. 'మాకు చెప్పకుండా, మాకు తెలియకుండా మా పిల్లలను గ్రామం బయటకు తీసుకొనిపోయి కొడుతూ, ఇక్కడ కూర్చొని మాతో కబుర్లు చెబుతున్నారా' అని నిలదీశారు. వాళ్లు కూర్చున్న మంచాలు, కుర్చీలను లాక్కున్నారు, వాటిని ఎత్తి కింద పడేశారు.

గ్రామస్థులంతా తమ పిల్లలను పోలీసుల బారి నుండి రక్షించడానికి వాళ్లను కొడుతున్న ప్రదేశం వద్దకు ఉరికారు. గ్రామస్థులంతా ఉరికి రావడాన్ని గమనించిన పోలీసులు యువకులను కొట్టడం ఆపి పరుగు లంకించుకున్నారు. ఈ పోలీసులతో పాటే ఆ గ్రామానికి చెందిన పోలీసు ఇన్‌ఫార్మర్ వున్నాడు. అతనిని చూసిన తర్వాత గానీ గ్రామస్థులకు విషయం అర్థం కాలేదు. ఇతనే గ్రామ సమాచారాన్ని పోలీసులకు చేరవేసి పోలీసులను పట్టుకొని వచ్చాడనేది అర్థం చేసుకున్నారు. అతను కూడా పోలీసులతో పాటే పారిపోయాడు. యువకులను కొట్టే ప్రదేశానికి వెళ్లే సరికి అక్కడ పోలీసులెవరూ వారికి దొరకలేదు. దెబ్బలుతిన్న తమ పిల్లలను క్షేమంగా గ్రామానికి చేర్చారు.

గ్రామస్థులు గ్రామం నిండా పరుచుకొని ఉన్న పోలీసులతో ఘర్షణకు దిగారు. 'మా పిల్లలు ఏ తప్పు చేస్తే కొడుతున్నారు' అని నిలదీశారు. మహిళలు ముందు వరుసలో నిలబడి పోలీసులతో తలపడ్డారు. పోలీసులకూ మహిళలకూ పెనుగులాట ప్రారంభమైంది. ఈ పెనుగులాటలో ఒక మహిళను ఒక పోలీసు జవాను వెదురు కర్రతో గట్టిగా కొట్టాడు. మొనదేలి ఉన్న భాగం తగలడంతో ఆమెకు నెత్తురు కారడం ప్రారంభమైంది. పోలీసుల చేతిలో దెబ్బలుతిని చేయి విరిగిన ఒక యువకుడి తల్లి ఈమె. తల్లీ కొడుకులు ఇద్దరూ పోలీసుల దాడికి గురికావడంతో మహిళలు పట్టరాని కోపంతో ఊగిపోయారు. పోలీసులపై విరుచుకపడ్డారు.

'బాదండి దుర్మార్గులను....' అంటూ మహిళలు పోలీసుల భరతం పట్టనారంభించారు. చిన్న కర్ర దొరికితే కర్రతో కొట్టారు... బండ

---

మార్చి 24న 250 మంది ప్రజలతో కల్సి పిఎల్‌జిఏ బలగాలు ఘాసిరాం అగర్వాల్‌కు చెందిన లక్షల రూపాయల విలువ చేసే సారా బట్టీని ధ్వంసం చేశారు. ఈ చర్య దళితులనూ, పీడిత ప్రజలను ఉత్సాహపరిచింది.

లాటూర్ దాడి జరిగిన 20 రోజుల తర్వాత డేంకనల్ అనే గ్రామంలో తనకు ఓటు వెయ్యనందుకు సర్పంచ్ దళితులకు చెందిన 20 ఇండ్లను తగులబెట్టించాడు. పోయిన సంవత్సరం బర్గడ్ జిల్లా సోహెలాలో ఇద్దరు దళిత మహిళలను సజీవ దహనం చేశారు. ఇక కొందమాల్‌లో జరిగిన హిందూ ఫాసిస్టుల దాడి గురించి అందరికీ తెల్సిందే. ఇలా దళితులు, ఆదివాసులపై ఎన్నో దాడులు జరిగిపోతూనే వున్నాయి. కాని బాధితులకు కనీస న్యాయం కూడా జరగడం లేదు. దోషులకు కనీస శిక్షలు కూడా పడడం లేదు. పడవు కూడా. ఎందుకంటే దోషుల, వారికి కొమ్ము కాసే దోపిడీ దారుల చేతుల్లోనే అధికార పగ్గాలు వున్నాయి కనుక.

అందుకే ఇటువంటి దాడులకు అడ్డుకట్ట వేయాలంటే ఆ అధికార పగ్గాలను దళితులు, ఆదివాసులు తదితర పీడిత ప్రజలు తమ చేతుల్లోకి తీసుకోవడం తప్ప మరో మార్గం లేదు.

★

దొరికితే బండతో కొట్టారు.... ఈ లోపు ఒక పోలీసు జవాను ఒక మహిళను నడుము మీద తన్నాడు. దెబ్బతిన్న పులిగా ఆమె పళ్లు పటపటా కొరుకుతూ దొరికిన రాయితో ఎదురుతిరిగి వాడిని కొట్టడంతో, వాడు 'అమ్మో...' అంటూ అరుస్తూ ఉరికాడు. ఇలా ఏది చేతికి దొరికితే దానిని అందుకొని పోలీసులతో తలపడ్డారు.

మరొక మహిళ కుర్చీపై కూర్చొని ఉన్న ఒక పోలీసును 'అసలు మీ సంగతి ఏమిటి' అంటూ అతను కూర్చున్న కుర్చీని బరబర ఈడ్చుకొని వెళ్లి ఎత్తి కింద పడేసింది. 'మా పిల్లలను తన్నడం కోసం వచ్చారా' అంటూ అతని కాలర్ పట్టుకొని ఈడ్చికొట్టింది. ఆ ఒక్క మహిళే 5, 6 గురు పోలీసులను బాదింది.

గ్రామస్థులు హఠాత్తుగా ఈ విధంగా తిరగబడడంతో పోలీసులు తెల్లబోయారు. ఒకవేళ గ్రామస్థులు తిరగబడితే ఏం చేద్దామనేది వారి దృష్టిలో లేని విషయం. దీంతో ప్రజలను ఎదుర్కోవడానికి ఏం చేయాలో వారికి అర్థం కాలేదు.

ఈ విధంగా పోలీసులు కంగుతిన్న సమయంలో మహిళలు వారిపై తమ కసి తీర్చుకున్నారు. సుమారు 20 మంది పోలీసులను చితకబాదారు.

మహిళల ప్రతిఘటనను చూసి భీతిల్లిన పోలీసులు క్షమాపణలు వేడుకోవడం ఆరంభించారు. 'తప్పు అయ్యిందని, దెబ్బలు తిన్న మిలీషియా వాళ్లకు వైద్యం చేయిస్తామని' వేడుకోలు మాటలు వల్లించసాగారు. దీంతో మహిళలు కొంచెం తగ్గి 'వైద్యం చేయిస్తే మా గ్రామంలోనే చేయాలి' అని అన్నారు.

ఈ ప్రతిఘటనలో పురుషులంతా వెనక వైపే ఉన్నారు. మహిళలే ప్రతిఘటించాలని, వారికి ఏమైనా అయితే రంగంలోకి దిగుదామని పురుషులంతా వెనకే ఉండిపోయారు. మహిళలు ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ పోలీసులను ఎదుర్కొన్నారు.

ఆ గ్రామంలో మరాఠీ, హిందీ, ఛత్తీస్‌గఢీ, గోండి భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నారు. గ్రామంలో 60 ఇళ్లు ఉంటాయి. వీళ్లంతా విప్లవోద్యమాన్ని స్వంతం చేసుకునేవారే. పోలీసు ఆగడాలను చూసి ప్రజలంతా తమ తమ భాషల్లో రకరకాలుగా పోలీసులను తిట్టిపోశారు. ప్రజలు కందిరీగల్లా ముసరడంతో కిరాయి పోలీసులంతా పిల్లుల్లా మారిపోయారు.

ప్రజా ప్రతిఘటన ఏమాత్రం తగ్గేలా లేదని అర్థమై చేసేది లేక అవకాశం చూసుకొని పరుగు లంకించుకున్నారు. ప్రజలు వారి వెంటబడి తరమడం ఆరంభించారు. పోలీసులు కొంత దూరం పరుగు తీసి ఆగి వెనక్కి తిరిగి మేకపోతు గాంభీర్యాన్ని చూపేవారు. ప్రజలు ఏమాత్రం భయపడకుండా తమ పైకి ఎగబడి రావడం చూసి తిరిగి పరుగు తీసేవారు. ఇలా ఒక కిలోమీటరు దూరం వరకూ వారిని ప్రజలు వెంబడించారు. పోలీసులు వెళ్లే ముందు ఒక గ్రామస్థుడిని పట్టుకొని పరుగుతీశారు. అతనిని విడిపించుకోవడం కోసం ప్రజలు పోలీసుల వెంటాడుతూ పోయారు. దీంతో పోలీసులు అతనిని వదిలిపెట్టక తప్పలేదు.

తర్వాత పోలీసులు పక్కనున్న గ్రామం వద్దకు వెళ్లి ఆగారు. పోలీసుల క్యాంపు పేంద్రి గ్రామం వద్ద ఉంది. కానీ, ప్రజాప్రతిఘటన ధాటికి గందరగోళానికి గురైన పోలీసులు పేంద్రికి వ్యతిరేక దిశలో పరుగు లంకించుకున్నారు. ప్రజలకు ఇది మరో హాస్యాస్పదమైన విషయంగా మారింది. 'ఎటు పారిపోతున్నారు, మీ క్యాంపు ఎటు ఉంది, ఎటు పోతున్నారు' అంటూ అరుస్తూ ప్రజలు పోలీసులను ఎగతాళి చేశారు.

అనంతరం ప్రజలంతా గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామంలో మరో వైపు ఇంకా కొంత మంది పోలీసులు మిగిలే వున్నారు. అలాగే పోలీసుల్ని తీసుకొని వచ్చిన ఇన్‌ఫార్మర్ కుటుంబం గ్రామంలోనే ఉంది. అతని భార్య 'మా ఆయన కోళ్ల వ్యాపారం చేస్తాడని' ఇన్నాళ్లూ చెబుతూ ఉండేది. పోలీసులతో పాటే ఆమె భర్త కనపడడం, ఇతనే ఇన్‌ఫార్మర్ అని ప్రజలు నిర్ధారించుకోవడంతో ఆమెను ఇంటి నుంచి బయటకు లాక్కొచ్చారు. గ్రామంలో మిగిలిన పోలీసులతో పాటే ఆమెను, పిల్లల్ని కూడా తరిమివేశారు.

పోలీసులు తిరిగి గ్రామానికి కానీ, గ్రామం వైపు కానీ రాలేదు. చుట్టూ తిరిగి తమ క్యాంపు బాట పట్టారు. అయితే పోలీసులు రిట్రీట్ అయ్యి పోయారనేది ప్రజలకు తెలీదు. పోలీసులు ఎటు పోయారనే విషయాన్ని ప్రజలు పట్టించుకోలేదు.

ప్రజలు పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న యువకులకు వైద్యం చేయించేందుకు పూనుకున్నారు. పేంద్రి ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వారికి వైద్యం చేయించాలని, అక్కడే ఉన్న పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి పోలీసులను నిలదీయాలని అనుకున్నారు. సైకిళ్లపై గాయపడ్డ యువకులను కూర్చోబెట్టుకొని పేంద్రి గ్రామానికి బయలుదేరారు.

ఈ లోపు చుట్టూ తిరిగి పేంద్రి బాట పట్టిన (తాము తిరిమికొట్టిన) పోలీసులు పేంద్రికి వెళుతూ రోడ్డు పైన మళ్లీ మంగెవాడ ప్రజలకు తగిలారు. పోలీసులు రెండు లైన్లలో/ఫార్మేషన్లో నడుస్తున్నారు. పోలీసు లైన్ ఒక కి.మీ. పొడవున ఉంది. సైకిళ్ల మీద వెళుతున్న ఈ ప్రజలు ఈ రెండు లైన్ల మధ్య నుండి పోలీసులను దాటుతూ వెళుతున్నారు. పోలీసులు ఎవరూ నోరు మెదపలేదు. ఒక పోలీసు కానిస్టేబుల్ అమాయకంగా (!) 'ఏమైంది' అని అడిగాడు. 'ఏమైందా!? ఇంతకు ముందేగా... మా ఊరికి వచ్చి మా పిల్లల్ని చితకబాదారు.... మళ్లీ ఏమైందని అడుగుతున్నారా...' అని ప్రజల్లో ఎవరో చిర్రున అందుకొన్నారు. దానితో ఒక పోలీసు అధికారి స్థాయి అతను 'వాళ్లను ఏమీ అనవద్దు... వాళ్లు చాలా కోపంగా ఉన్నారు.....' అని పోలీసులందరినీ హెచ్చరించాడు.

అలా పోలీసులు నడుస్తూ రావడం... ప్రజలు సైకిళ్లపై వెళ్లడం వల్ల.... ప్రజలు పోలీసుల్ని దాటుకొని వారి కంటే ముందుగానే పేంద్రి క్యాంపుకి చేరుకున్నారు. క్యాంపులో పోలీసులపై ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి తీసుకెళ్లి దెబ్బలు తిన్న యువకులకు వైద్యం చేయించి, తిరిగి తమ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో కూడా పోలీసులు కలిశారు. ఈసారి పోలీసులెవరూ కిక్కురుమనలేదు.

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఉత్తర తెలంగాణ

### ఖమ్మం జిల్లా

**అరెస్టు అయిన సంఘ నాయకులను, మిలీషియాను విడిపించుకుంటున్న ప్రజలు**

ఖమ్మం జిల్లాలోని చర్ల, వెంకటాపురం, చింతూరు మండలాలలోని గ్రామాలలో, పోలీసులు నిత్యం కూంబింగ్‌లతో, అక్రమ అరెస్టులతో ప్రజలను అర్థికంగా, మానసికంగా, శారీరకంగా చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రతిరోజూ సంఘ నాయకులను, లేదా మిలీషియా సభ్యులను అరెస్టు చేయడం, పార్టీ సమాచారం కోసం చిత్రహింసలు పెట్టడం, జైలు పాలు చేయడం సర్వసాధారణమైంది. ఈ అరెస్టుల నుండి సంఘ నాయకులను, మిలీషియాను కాపాడుకోవడంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు ముందు పీఠిన నిలబడుతున్నారు. గ్రామంలో అరెస్టులు జరిగినపుడు వెంటనే చుట్టు పక్కల వున్న గ్రామాల ప్రజలందరు, మహిళా సంఘాల సభ్యులు కలిసి పోలీసులను నిలదీస్తూ, అరెస్టయిన వ్యక్తులను అక్కడికక్కడే విడిపించుకుంటున్నారు. లేదా పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనలు, ధర్నాలు చేపడుతూ విడిపించుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలతో ప్రజలు మరింత ఉత్సాహం పొందుతున్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో ధైర్యంగా పోరాడితే ఎలాంటి అడ్డంకులనైన ఎదిరించవచ్చున్న నిజాన్ని తమ కార్యాచరణ ద్వారా అర్థం చేసుకుంటూ ప్రజా వుద్యమాలలో మరింత ముందుకు సాగుతున్నారు.

**సంఘ నాయకులను, మిలీషియాను విడిపించుకున్న వివరాలు:**

1. చర్ల మండలంలోని చెన్నాపురం, పెద్ద ముడిలేరు పంచాయితీకి చెందిన ఎర్రంపాడు గ్రామాలలో 2011 అగస్టు 29న పోలీసులు ఒకే సారి దాడి చేసి ఆ గ్రామాల సంఘ నాయకులను పట్టుకుంటే చెన్నపురం గ్రామ మహిళా సంఘాల సభ్యులు 15 మంది అక్కడికక్కడే పోలీసులతో ఘర్షణ పడి సంఘ నాయకులను విడిపించుకున్నారు. ఒకరిని స్టేషన్‌కు తీసుకపోతే మూడు రోజులు స్టేషన్ ముందు బైఠాయించి విడిపించుకున్నారు.

2. పెద్ద ముడిలేరు పంచాయితీకి చెందిన ఎర్రంపాడు గ్రామంలో నలుగురు సంఘ కార్యకర్తలను అరెస్టు చేయడానికి ప్రయత్నం చేయగా మహిళలు కదిలి అడ్డుకున్నారు.

3. అగస్టు 30న చర్ల మండలం దేవర్‌పల్లి పంచాయితీలోని కోరుకోట పాడు అటవీ గ్రామానికి పోలీసులు వచ్చి తెల్లవారు జామున గ్రామాన్ని చుట్టుముట్టి అయిదుగురు మిలీషియా కార్యకర్తలను పట్టుకుపోతుంటే ఆ గ్రామ మహిళలు దాదాపు 30 మంది కదిలి విడిపించుకున్నారు. ఒకరిని స్టేషన్‌కు తీసుకుపోతే పోలీసుల వెంటపడి వెళ్లి విడిపించుకున్నారు.

---

పోలీసుల చేతిలో దెబ్బలుతిన్న మిలీషియా వాళ్లను తీసుకొని రావాల్సిందిగా రెండవ రోజు క్యాంపు నుంచి గ్రామానికి కబురు అందింది. అయితే దెబ్బలు తిన్నవాళ్లే కాకుండా గ్రామంలోని ప్రజలంతా సంఘటితంగా పోలీసు క్యాంపుకు చేరుకున్నారు. 'అరే! దెబ్బలుతిన్నవాళ్లనే రమ్మన్నాం కదా! అందరూ ఎందుకు వచ్చారూ...!' అంటూ గ్రామస్థులు ఏదో తప్పు చేసినట్లుగా పోలీసులు హూంకరించ ప్రయత్నించారు.

'దెబ్బలు తిన్నది మా పిల్లలు! వాళ్లతో పాటే మేమూ వస్తాం... వాళ్లనే ఎందుకు పంపుతాం' అంటూ ప్రజలు ముక్తసరిగా సమాధానం చెప్పారు. 'అయినా... అసలు మా పిల్లల్ని ఎందుకు కొట్టారో దానికి సమాధానం చెప్పండి' అని నిలదీశారు.

'మీ పిల్లల్ని మేమెక్కడ కొడతాం... మీ పిల్లలే మా వాళ్లను స్పృహ కోల్పోయ్యేట్లుగా కొట్టారు' అంటూ పోలీసులు ఉల్టా తిరిగారు.

గ్రామస్థులంతా లోలోపలే ముసిముసిగా నవ్వుకున్నారు... తాము కొట్టింది నిజమే కదా... అనుకుంటూ... అయినా ముందుగా పోలీసులు తమ పిల్లల్ని కొట్టడం వల్లే తాము తిరగబడి తిరిగి పోలీసులకు బుద్ధి చెప్పాల్సి వచ్చిందనేది మీకూ తెలుసూ... మాకూ తెలుసూ... అనే భావం తొంగి చూసింది ఆ నవ్వుల్లో...

ముసిముసిగా నవ్వుతున్న వారి ముఖాలు చూసి 'మంగెవాడ అంటే మేమేదో అమాయకమైన ఊరు అనుకున్నాం... ఇంత రోషమున్న ఊరని అనుకోలేదు... ఇంకా అరగంటసేపు మా వాళ్లను కొట్టి ఉంటే... మా వాళ్ల శవాలను పట్టుకొని రావాల్సి వచ్చి ఉండేది' అంటూ పోలీసులు వాపోయారు.

పోరాడితే విజయాన్ని సాధించగలమనే ఆత్మవిశ్వాసంతో గ్రామస్థులు వెనుదిరిగారు తమ పోరు పల్లెకు. ★

4. ఆగస్టు 16న బురుపాడు గ్రామానికి చెందిన పది మంది గ్రామస్తులను పట్టుకుపోతే ఎస్పై రాక ముందే మహిళలు వెళ్లి పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి తీసుకు వచ్చినారు.

5. నవంబర్ 12న వెంకటాపురం మండలం అలుబాక పంచాయితీ మత్తారం గ్రామానికి పోలీసులు వచ్చి మావోయిస్టు పార్టీకి సహకరిస్తున్నారని గ్రామస్తులందరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోతే 30 మంది మహిళలు పోయి విడిపించుకున్నారు.

## ఎస్ఐతో క్షమాపణ చెప్పించిన ఆదివాసీ ప్రజలు

చింతూరు మండలంలోని గ్రామాలపై గత కొన్ని సంవత్సరాలుగా పోలీసులు దాడి చేస్తూ యువతీ, యువకులను అరెస్టు చేసి బైండోవర్ కేసులు పెట్టి ప్రతిరోజు పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి సమాచారం ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తున్నారు. పోలీసుల వేధింపులకు విసిగి వేసారిన ఆదివాసీ ప్రజానీకం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సంఘాలను ఏర్పాటు చేసుకొని, అరెస్టులకు నిరసనగా ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తూ అరెస్టయిన యువతీ, యువకులను విడిపించుకుంటున్నారు.

ఆదివాసీ ప్రజల ఐక్యతను చూసి భరించలేని పోలీసులు అర్ధరాత్రి గ్రామాలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం నిత్యకృత్యంగా మారిపోయింది. 2011 అక్టోబర్ 25న గ్రామాలపై దాడులకు వచ్చిన పోలీసులు పేగా గ్రామంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవ్వారామ్‌ను అరెస్టు చేసి ఎడుగురాళ్లపెల్లి పోలీసుస్టేషన్‌లో వుంచినారు. ఈ విషయం తెలిసిన వెంటనే కోపోద్రిక్తులైన ఎనిమిది గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా కదిలి ఎడుగురాళ్లపెల్లి పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేయడంతో ప్రజల ఐక్యత ముందు తలవంచక తప్పని పోలీసు అధికారులు రవ్వారామ్‌ను విడిచిపెట్టక తప్పలేదు. అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టిన ఎస్ఐలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడంతో, ప్రజల డిమాండ్‌కు తలవొగ్గి ఎడుగురాళ్లపెల్లి క్యాంపు ఎస్ఐ, చింతూరు ఎస్ఐలు తమ తప్పును అంగీకరిస్తూ క్షమాపణ చెప్పారు. ఈ సంఘటన చింతూరు మండల ప్రజలలో ఉత్సాహాన్ని కల్గించింది. ప్రజలు ఐక్యతతో దేన్నైనా సాధించవచ్చునని మరోసారి రుజువైంది.

## పీఎల్‌జీఏ వారోత్సవాలు

2011 డిసెంబర్ 2 నుండి 8 వరకు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం 11వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని వెంకటాపురం ఏరియా కమిటీ పత్రికా ప్రకటన చేసింది. మండల కేంద్రాలలో పోస్టర్లు, బ్యానర్లతో ప్రచారం చేసింది. గ్రామ స్థాయిలో పలు సభలు జరుపుకున్నారు. ప్రజా మిలీషియా సెంట్రీల రక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

చింతూరు మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన 1200 మంది ప్రజలు తెలంగాణా–ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో డిసెంబర్ 2న పిఎల్‌జిఎ వారోత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి శబరి ఏరియా కమిటీ కార్యదర్శి ఏరియా కమిటీ సభ్యులు, జననాట్య మండలి కమాండర్ ప్రసంగిస్తూ పిఎల్‌జిఎ విజయాలను వివరించారు. ఆ తరువాత జననాట్యమండలి కళాకారులు ఆట, పాటలతో ప్రజలను ఉత్సాహపరిచారు.

## కామ్రేడ్ కిషన్‌జీ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా

పశ్చిమ బెంగాల్‌లోని జంగల్ మహల్ అటవీ ప్రాంతంలో కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా డిసెంబర్ 4, 5 తేదీలలో కేంద్ర కమిటీ యిచ్చిన బంద్‌ను విజయవంతం చేసే లక్ష్యంతో జిల్లాలోని వెంకటాపురం ఏరియాలో గొమ్ముపాక, రాళ్లగూడెం, ఎదిర నుండి అలుబాక వరకు, చర్ల నుండి దుమ్ము గూడెం వరకు రోడ్లకు అడ్డంగా చెట్లను నరికేసి గోతులు తవ్వారు. దాదాపు 200 మంది మిలీషియా, ప్రజలు కలిసి ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## సైనిక రిక్రూట్‌మెంట్‌ను వ్యతిరేకిస్తూ

ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జనవరి 1న జరిగిన సైనిక రిక్రూట్‌మెంట్‌కు వ్యతిరేకంగా చర్ల, భద్రాచలం జాతీయ రహదారిపై చెట్లు నరికి వేయడం, రోడ్డుపై గోతులు తవ్వడం, పోస్టర్లు వేయడం, గిరిజన యువకులు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనవద్దని పత్రికా ప్రకటన చేయడం జరిగింది.

## గ్రీన్‌హంట్ రెండవ దశ దాడి

2012 జనవరి నుండి గ్రీన్‌హంట్ రెండవ దశ దాడి ఖమ్మం జిల్లా చర్ల, వెంకటాపురం, వాజేడు, చింతూరు మండలాల్లో ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగంగా తెలంగాణా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఆదివాసీ గ్రామాలలో కూంబింగ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి గ్రామాలను చుట్టుముట్టి తెల్లవారుజామున గ్రామాలలోని యువతీ, యువకులను అరెస్టు చేసి మావోయిస్టులకు సహకరిస్తున్నారని చిత్రహింసలు పెట్టి, బైండోవర్ కేసులతో ఎంఆర్ఓ ముందు హాజరుపరిచి రోజు పోలీసుస్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాలనే షరతుతో వదిలిపెడుతున్నారు. చర్ల మండలంలోని గ్రామాలపై జనవరి నుండి ఏప్రిల్ వరకు మూడు సార్లు రాత్రి వేళల్లో దాడులు చేసి యువతీ, యువకులను అరెస్టులు చేసి, చిత్రహింసలు పెట్టి జైలు పాలు చేసినారు. ఈ అక్రమ అరెస్టులను ఎదిరించిన మహిళలను విచక్షణా రహితంగా చితకబాదుతున్నారు. అడవిలో, పొలాల్లో ఎక్కడ చూసినా నిత్యం పోలీసు బూట్ల చప్పుడు వినబడుతూనే వుంటుంది. రాత్రి మండల కేంద్రాలలో, వారపు సంతలలో, దుకాణాల వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో వుంటున్నారు. అడవిలో ఎవరికీ తెలువకుండా కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఎదురుపడితే లాల్‌సలామ్ అంటూ

మభ్యపెడ్తున్నారు. ఆ తరువాత దళం జాడలు చెప్పమని వేధిస్తున్నారు. లేదా తాము వున్న విషయం ఎవరికీ చెప్పవద్దని బెదిరిస్తున్నారు. ఈ పరిస్థితులలో ఆదివాసులు వ్యవసాయ, వేట పనులు చేసుకోలేకపోతున్నారు.

పార్టీ కార్యక్రమం ఏమి జరిగినా మాజీ కార్యకర్తలను పిలిపిస్తూ, మిలీషియా, సంఘ నాయకులను అరెస్టు చేస్తూ, చిత్రహింసలు పెడ్తూ, కరెంట్ షాకులు ఇస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ జైలుకు పంపుతున్నారు. మాజీలను ప్రతి రోజూ స్టేషన్లకు రావలసిందిగా వేధిస్తున్నారు. వారు సంతలకు వెళ్లకుంటే సంతలకు ఎందుకు రావడం లేదని అడుగుతున్నారు. బోలారం, బిజనపల్లి, మొరుమూరు, గణపురం, కొంగాల, ఓటిమామిడి, పెనుగోలు గ్రామాలపై నిత్యం నిఘా వుంటున్నది. పెనుగోలు ప్రజలను రేషన్ షాపు వద్దకు పోతే రేషన్ కార్డులు గుంజుకొని, పోలీస్‌స్టేషన్‌కు రావాలని హెచ్చరిస్తున్నారు. ప్రతిరోజు పోలీస్‌స్టేషన్ చుట్టూ సంతకాల పేరుతో తిరగడం మూలంగా పనులకు ఆటంకం కల్గుతున్నది. అందు వలన సంఘ నాయకత్వంలో సమావేశాలు జరుపుకొని పోలీస్‌స్టేషన్‌లకు పోగూడదని ప్రజలు నిర్ణయించుకున్నారు. ప్రతి రోజు సంతకాల కోసం పోలీస్ స్టేషన్లకు వస్తున్న యువతీ, యువకులు రాకపోవటంతో పోలీసులు కొత్త ఎత్తుగడలతో మాట్లాడాలని పిలిచి అయిదు గ్రామాల (పుంగుల, వంకగూడెం, అందెలపాడు, బోరింగ్ గుంపు, కల్లుగుండా) వారందర్ని సరెండర్ అయినట్లుగా పేపర్‌లో ప్రకటనలు ఇచ్చి 20 మంది యువతీ, యువకులకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున పంపించారు.

ఎంతో మందిని అరెస్టులు చేస్తూ కోర్టులో హాజరుపర్చడం లేదు. రెండు నెలల నుండి వాజేడు మండలంలోని ఆరుగుంటపల్లి గ్రామస్తుడు శ్యామల ఇడుమయ్య జాడలేదు. అతనిని ఎక్కడ మాయం చేశారో తెలువదు. ఇదే విధంగా ఆమాయక ఆదివాసులు ఎంతమంది మాయమయ్యారో కూడ తెలువని పరిస్థితి. 'అడవిలో ఆదివాసులుగా పుట్టడమే మా తప్పా' అని ఆదివాసులు వాపోతున్నారు.

తీవ్రవాదుల ఏరివేత పేరుతో 2012 మార్చి 17 రాత్రి వెంకటాపురం మండలం అలుబాక సమీపంలోని అటవీ ప్రాంతంలో బోదాపురం ఎస్టీ కాలనీకి చెందిన అమాయక ఆదివాసీలైన మడకం బాబురావు, కుంజా నర్సింహారావు, బానాని భాస్కర్‌రావులు గ్రామానికి ఫర్లాంగ్ దూరంలోనే వాగు ఒడ్డుకు వేటకు వెళ్లిన సమయంలో కాల్పులు జరిపి, మావోయిస్టులకు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని పోలీసు అధికారులు నిస్సిగ్గుగా ప్రకటించినారు. ఈ ఘటనను పలు ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాలు ఖండించినప్పటికీ ప్రభుత్వం పోలీసు అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

# ఏఓబీ

## ఈస్ట్ డివిజన్

### పోలీసు సంస్కరణలను వ్యతిరేకించిన ప్రజలు

విప్లవోద్యమాన్ని అణచిపెట్టడం కోసం శత్రువు అనేక రకాల కుయుక్తులు పన్నుతున్నాడు. దాంట్లో భాగంగానే కుటిల సంస్కరణలను తీసుకవస్తున్నాడు. ఒకవైపు ప్రజలకు అందాల్సిన మౌలిక అవసరాలను దూరం చేస్తూనే మరొకవైపు ప్రజల అవసరాలను, వారి బాగోగులను పట్టించుకుంటున్నట్లు పోజు పెడుతున్నాడు.

ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురైన లోతట్టు ప్రాంతాల్లోకి వైద్య సిబ్బందిని రానీయకుండా అడ్డుపడుతున్నాడు. ఉపాధ్యాయులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తూ పాఠశాలలు మూతపడేలా చేస్తున్నాడు. డిఆర్ డిపోలను సైతం పోలీసు స్టేషన్లు వున్న సెంటర్స్‌లలో వుండేలా ఏర్పాటు చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

మరొక వైపు తమ జీత భత్యాలతో అనేక రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు సంతలలో మందులు, చీరలు, ఉప్పు చేపలు పంపిణీ చేయడం, అన్నం పెట్టడం లాంటివి చేస్తున్నాడు. ప్రజలు తీసుకోవడానికి సిద్ధపడని చోట బెదిరించి బలవంతంగా కట్టబెడుతున్నాడు. 2011 సెప్టెంబర్ నెలలో జికె వీధి మండలం, అదే పంచాయితీలోని కుంపుమానుపాకల గ్రామ సంఘ నాయకత్వాన్ని అరెస్టు చేయడానికి వస్తే వారు దొరకకపోవడంతో గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి చీరలు, గొడుగులు బలవంతంగా కట్టబెట్టాడు. సంఘం, మిలీషియా కామ్రేడ్స్ పోలీసు కుట్రల గురించి వివరించిన తర్వాత ప్రజలంతా గ్రామం బయట చీరలు, గొడుగులు కుప్పగా పోసి తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో 100 మంది ప్రజలు 20 మంది మిలీషియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొడుగులు కాదు – భూమి కావాలి. చీరలు కాదు – స్వేచ్ఛ కావాలి అనే నినాదాలు చేసారు. సంఘటన స్థలం వద్ద బ్యానర్లు కట్టి, పోస్టర్లు అంటించారు.

### జి.సి.సి. అధికార్లను నిలదీసిన ప్రజలు

విశాఖజిల్లా, గూడెం కొత్తవీధి మండలం గాలికొండ ఏరియా కమిటీ పరిధిలో 2011 అక్టోబర్ 1న దాదాపు 500 మంది మహిళలతో పాటు 1300 మంది ప్రజలు విప్లవోద్యమ నాయకత్వంలో ప్రజాసభ జరిపి జి.సి.సి.లో కొనసాగుతున్న దోపిడీ, మోసాలను ఎత్తి చూపుతూ జిసిసి అధికారులను నిలదీసారు.

ఆదివాసీ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ఏర్పడిన జి.సి.సి., ఐటిడిఏలు ప్రజలను నిలువునా దోపిడీకి, మోసాలకు గురిచేస్తూ దగా సంస్థలుగా తయారయ్యాయి. మొత్తం ఏజెన్సీలో వలెనే

గాలికొండ ఏరియా పరిధిలోని పెదవలస, లికవరపుపేట, నేరేళ్లబంద, తురుమామిడి, ఎర్రచెరువుల, కుంకుంపూడి, సప్పర్ల, రొంపుల, దారకొండలలోని డిఆర్ డిపోలలో తీవ్ర దోపిడీ కొనసాగుతున్నది. ఈ మోసాల గురించి పలు సందర్భాల్లో ఎఆర్సిఎస్ నాయకత్వంలో నిలదీసి హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. తూకాలు, కొలతల్లో మోసం చేయడం, నిర్ణయించిన రేటుకంటే అధికరేట్లకు అమ్మడం, ముఖ్యంగా డిపోలో ఇచ్చే సరుకులు కాకుండా మార్కెట్ నుండి తెచ్చే సబ్బులు, నూనెలు, కాయగూరలు వంటివి అంటగట్టడం చేస్తున్నారు. ఇటువంటి సరుకులను కార్డుకు 200 రూపాయల చొప్పున తప్పకుండా కొనాలని మొదటి నుండి బలవంతపెట్టేవారు. ఈ మధ్య కాలంలో కార్డుకు 500 రూపాయల చొప్పున ఇటువంటి సరుకులు కొనాలని నిబంధనలను తెచ్చారు. మార్కెట్ శక్తుల వద్ద కమిషన్లు తీసుకొని, ఒప్పందాలు చేసుకొని జిసిసికి సంబంధం లేని నిబంధనలు తెచ్చి, ప్రజల కొనుగోలు శక్తిని పరిగణనలోకి తీసుకోకుండా బలవంతంగా అమలు చేయిస్తున్నారు. దీంతో చాలా మంది ప్రజలు అంత డబ్బులు చెల్లించలేక తమ కార్డులను షావుకార్లకు అమ్మివేస్తున్నారు. ఇదే లాభసాటిగా భావిస్తున్న షావుకార్లు, సేల్స్‌మెన్‌లు డిపో బియ్యంను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తూ లక్షల రూపాయలను ఆర్జిస్తున్నారు.

ఇలా బలవంతంగా సరుకులు అంటగట్టడానికి వ్యతిరేకంగా గత రెండు సంవత్సరాలుగా విప్లవోద్యమం పత్రికా ప్రకటనలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నది. అయినా ఎటువంటి మార్పు రాకపోవడంతో దీనిపై అధికారులను నిలదీయాలని నిర్ణయించుకున్నారు.

ఆ నిర్ణయం ప్రకారం జి.సి.సి. బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్, సేల్స్‌మెన్‌లతో సమావేశం ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం జి.సి.సి. అధికారులు అనుసరిస్తున్న తప్పుడు పద్ధతులపై చర్చించారు. లంచాలకు మరిగి అవినీతికి పాల్పడుతూ పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న బ్రాంచ్ మేనేజర్‌ను విమర్శించారు. ప్రజలంతా బ్రాంచ్ మేనేజర్‌ను గుక్క తిప్పుకోకుండా నిలదీసారు. జి.సి.సి. లక్ష్యం ఏమిటి? ఇది గిరిజన సహకార సంస్థనా? లేక గిరిజనులను దగా చేసే సంస్థనా? అని ప్రశ్నించారు. అటవీ ఉత్పత్తులను, అపరాల పంటను ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ప్రతి కార్డుకు 500 రూపాయల సరుకులు కొనాలనే నిబంధనను ఎందుకు తెచ్చారని నిలదీశారు. మొత్తం జి.సి.సి. అధికారులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలతో పాటు సేల్స్‌మెన్‌లు సైతం తీవ్ర ఆగ్రహంతో మాట్లాడారు.

అనంతరం జి.సి.సి. బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ 500 రూపాయల సరుకులు కొనాలనే నిబంధనను మారుస్తానని హామీ ఇచ్చాడు.

ప్రజలు గుర్తింప చేసిన విషయాలను సమావేశంకు వచ్చిన సేల్స్‌మేన్‌లు ఒప్పుకున్నారు. కొన్ని పై స్థాయి అధికారుల ఒత్తిడి వల్ల చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇకమీదట పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని మాట్లాడారు. సేల్స్‌మేన్స్ అంతా కొత్తవారు కావడంతో మొదటి తప్పుగా భావించి వదిలేశారు. అసిస్టెంట్‌ను సీరియస్ హెచ్చరికతో వదిలేశారు. అతడిని అసిస్టెంట్‌గా తొలగించాలని నిర్ణయం చేసారు.

ఈ సందర్భంగా ప్రజలు జి.సి.సి. అధికారులకు కొన్ని డిమాండ్స్ పెట్టారు. అన్నింటిని అమలు పరుస్తానని బ్రాంచ్ మేనేజర్ హామీ ఇచ్చాడు.

**డిమాండ్స్:**

1. బలవంతంగా సరుకులు అంటగట్టవద్దు.
2. గర్నిబంద, ఎర్ర చెరువుల, నేరేళ్లబంద, జంపర్లోవలలో సబ్ డిపోలు ఏర్పాటు చేయాలి.
3. నెల పొడవునా డిపో తెరిచి వుంచాలి.
4. అటవీ ఉత్పత్తులను, అపరాలను జి.సి.సి. కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
5. డిపోలో ఇచ్చే సరుకులన్నీ ఒకే విడతగా ఇవ్వాలి.
6. షావుకార్లు తెచ్చే కార్డులకు ఎటువంటి సామాను ఇవ్వవద్దు. అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి.
7. మిస్ కార్డ్స్, దూరంగా ఉన్న వారి కార్డ్స్ సమస్యలను పరిష్కరించాలి.
8. జెర్రిగొంది, మండపల్లి గ్రామాలను స్థానిక అయంపూడి డిపోలో కలపాలి.

## షావుకార్ల మెడలు వంచిన ప్రజలు

విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం గాలికొండ ఏరియా పరిధిలో 2011 అక్టోబర్ 5న ఆదివాసీ ప్రజల కష్టార్జితంను దోచుకుంటున్న షావుకార్లను ఎఆర్సిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా కోర్టులో నిలదీసి తమకు రావలసిన డబ్బును ప్రజలు రాబట్టుకున్నారు.

ఉద్యమాన్ని అణచడం కోసం శత్రువు అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధాన్ని ఆసరా చేసుకొని షావుకార్లు, వడ్డీ వ్యాపారులు రైతులను తీవ్ర దోపిడీకి గురిచేస్తున్నారు. ఏరియాలోని గూడెం మండల కేంద్రంలో షావుకార్లు రైతుల ధాన్యాలను కారుచౌకగా తీసుకపోయి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా రైతులను తమ ఇంటి చుట్టూ తిప్పుకుంటూ యిబ్బందుల పాల్జేస్తున్నారు. గత సంవత్సరం పంటలు పూర్తిగా దెబ్బతిని ప్రజలు చాలా ఇబ్బందులకు గురైన పరిస్థితులలో సైతం రైతులకు చెల్లించాల్సిన డబ్బును ఇవ్వకుండా బాధపెడ్తున్నారు. ముఖ్యంగా ముక్కలి గుండురావు, రమణ, ఏ. శ్రీను లాంటి వారు ఆరు గ్రామాలలోనే ఆరు లక్షల రూపాయలు ఇవ్వాల్సి వుంది. గత సంవత్సరం మాట్లాడటంతో కొంత చెల్లించినా మరో లక్షన్నర ఇవ్వాల్సే వుంది. ప్రజలు ఈ విషయాన్ని ఎఆర్సిఎస్‌లో చర్చించి

షావుకార్లకు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా గుండూరావు అనే షావుకారిని సంఘం వద్ద పెట్టుకొని మాకు రావలసిన డబ్బు వడ్డీతో సహా చెల్లిస్తేనే వదిలిపెడతామని హెచ్చరించడంతో ఆ షావుకారి కుటుంబం కచ్చితమైన హామీతో ముందుకు వచ్చింది. దానితో తేదీ నిర్ణయించి వదిలిపెట్టారు. ఈ విషయం తెలిసిన శత్రువు డబ్బుల కోసమే పార్టీ ఈ కిడ్నాప్ చేసిందని దుష్ప్రచారం చేసాడు. పార్టీపై జరిగిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు షావుకారి చెప్పిన తేదీన విలేకర్లను పిలిచి ఏఆర్‌సిఎస్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది ప్రజలతో (180 పురుషులు, 120 మహిళలు) సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సమావేశంలో ముందుగా షావుకారిని ప్రవేశపెట్టి తనను కిడ్నాప్ చేసిన కారణాలను అతనితోనే చెప్పించడం జరిగింది. షావుకారి గుండూరావు తాను ప్రజలకు ఎన్ని రోజుల నుండి డబ్బులు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నాడో ఒప్పుకొని, తనను పార్టీ డబ్బుల కోసం కిడ్నాప్ చేయలేదని విలేకర్ల ముందు చెప్పాడు. ప్రజలకు రావలసిన డబ్బుల విషయంలో జరిగిన జాప్యానికి కొంతమంది షావుకారిపై చేయి చేసుకునే ప్రయత్నం చేయగా సంఘం జోక్యం చేసుకొని నివారించింది. షావుకారి ప్రజలందరికి క్షమాపణ చెప్పి, ఇక నుండి ఎప్పటికప్పుడే నగదు రూపాయలు చెల్లిస్తానన్నాడు. షావుకార్లు, శత్రువు కలిసి పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నిజానికి ప్రజలను మోసం చేసేది వాళ్లేనని ప్రజలు మాట్లాడారు. ఆదివాసీ రైతుకూలి సంఘం జిందాబాద్ అనే నినాదాలతో సమావేశం ముగిసింది.

## లాల్‌గఢ్ పోరాట దినాన్ని జరుపుకున్న ప్రజలు

లాల్‌గఢ్ ప్రజా వెల్లువకు మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో, దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీ విప్లవ రాజకీయాలతో సజీవ సంబంధాలను కలిగి వున్న గాలికొండ ఏరియా ప్రజలు 2011 నవంబరు 13న పిట్టలపాడు గ్రామంలో ఏఆర్‌సిఎస్ ఆధ్వర్యంలో గ్రామ మిలీషియా రక్షణలో, తీవ్ర నిర్బంధం మధ్య సభను జరుపుకున్నారు. ఈ సభకు 20 గ్రామాల నుంచి 800 మంది ప్రజలు తమ పిల్లలతో సహా హాజరయినారు. ఏరియా కమిటీ అధ్యక్షుడు, సభ్యులు మాట్లాడుతూ లాల్‌గఢ్ ప్రజా ప్రతిఘటన స్ఫూర్తితో అన్ని రకాల పోరాటాలను రాజ్య వ్యతిరేక మిలిటెంట్ పోరాటాలుగా మలచాలని పిలుపునిచ్చారు. అడవిపై తమ హక్కును నిలబెట్టుకోవాలంటే, దాడులకు, అరెస్టులకు వెరవక పోరాటాన్ని కొనసాగించాలని, మన్యంలోనున్న విలువైన బాక్సైట్‌ను, బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నదనీ, అందుకు ఆటంకంగా ఉన్న ప్రజలను, పార్టీని నిర్వీర్య పరిచేందుకు పెద్ద ఎత్తున ప్రజలపై దాడులకు పాల్పడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తూ గ్రీన్‌హంట్ –2ను అమలుపరుస్తున్నదనీ, నేడు ప్రజలు చేస్తున్న పోరాటాలను రాజ్య వ్యతిరేక మిలిటెంట్ పోరాటాలుగా మలచకుంటే ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని అవగాహన కల్పిస్తూ, అందుకు పెద్ద ఎత్తున యువతీ, యువకులు మిలీషియా మన్యం పితూరీ సేనలోకి భర్తీ కావాలని పిలుపునిచ్చారు.

## ప్రజల సహకారంతో ఇన్‌ఫార్మర్స్ ఏరివేత

విప్లవోద్యమాన్ని నిర్మూలించడం కోసం శత్రువు రకరకాల పథకాలు రూపొందిస్తూనే వున్నాడు. ఏఓబీ జోన్‌లో ఏపి పాకెట్ నుండి పూర్తిగా వుద్యమాన్ని నిర్మూలించేందుకు ఎల్ఐసిని పకడ్బందీగా అమలు చేస్తూ వస్తున్నాడు. సాయుధ దాడిని గతం కంటే తీవ్రం చేస్తూనే అదే స్థానంలో సంస్కరణలు అమలు చేస్తూ సాంస్కృతిక దాడిని చేస్తున్నాడు. ప్రధానంగా ఉద్యమాన్ని నిర్మూలించడం కోసం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పర్చుకుంటున్నాడు. స్థానికులకు రకరకాల ఆశలు కల్పించి ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకుంటున్నాడు. దళాల, సంఘాల, మిలీషియా కార్యకలాపాల గురించి తెలుసుకోవడం కోసం ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నారు.

శత్రు బలగాలకు కళ్లు, చెవులుగా పనిచేస్తున్న ఈ యిన్‌ఫార్మర్లను అదుపు చేయకుండా ఉద్యమ పురోగమనం సాధ్యం కాదు కనుక ప్రజల సహకారంతో ఏరియాలో కొందరు ఇన్‌ఫార్మర్లను పిఎల్‌జిఏ శిక్షించింది.

2011 నవంబర్ 27న కొయ్యూరు మండలంకు చెందిన శివప్రసాద్, బుజ్జిబాబు అనే ఇద్దరు పోలీస్ ఏజెంట్లను; డిసెంబర్ 23న గాలికొండ ఏరియా పరిధిలోని బూదరాళ్ల పంచాయితీ నిమ్మలగొంది గ్రామానికి చెందిన మంతిల్లో హరి అనే హెూంగార్డును, 2012 జనవరి 30న జి. మాడుగులకు చెందిన చాత్రి అనే పోలీసు ఏజెంట్‌ను పిఎల్‌జీఏ ప్రజాకోర్టుల నిర్ణయం మేరకు కాల్చిచంపింది.

## విజయవంతమైన పీఎల్‌జీఏ వారోత్సవాలు

ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియా పరిధిలో 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం' 12వ ఆవిర్భావ వారోత్సవాలను ఏరియా విప్లవ ప్రజానీకం తీవ్ర శత్రు నిర్బంధం మధ్య ఘనంగా జరుపుకొన్నారు.

మన ప్రియతమ నాయకులు కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలు అమరత్వం చెందిన రోజైన డిసెంబర్ 2న ఏర్పడిన మన పీఎల్‌జీఏకు 11 సంవత్సరాలు నిండాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలయిన తర్వాత శత్రువు దాడి తీవ్రమైంది. ఎల్.ఐ.సి.ని పకడ్బందీగా అమలు చేస్తూనే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక దాడిని కొనసాగిస్తున్నారు.

పార్టీ, పిఎల్‌జీఏ మద్దతుతో ప్రజల సహకారంతో శత్రు నెట్‌వర్క్‌ను ఏరియాలో కంట్రోల్ చేసింది. ప్రజా పోరాటాలు కొనసాగాయి. ప్రజలు మౌలిక సమస్యల కోసం ఉద్యమించారు. ఎపిఎఫ్‌డిసి చేతిలో నుండి కాఫీ తోటలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు గతంలాగా నిర్మాణాలలో సంఘటితపడడం క్రమంగా పెరిగింది. ఇది గ్రహించిన శత్రువు మరింతగా కేంద్రీకరించాడు. పార్టీ ఇస్తున్న పిలుపులను అడ్డుకునేలా అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాడు.

ప్రజా సైన్య ఆవిర్భావ ఉత్సవాలను అడ్డుకునేలా చేయాలని జిల్లా స్థాయి అధికారులే (ఎస్పీ మాత్రమే) కాకుండా ఐజీ, డిఐజీలు కూడా మన్యంలో పర్యటించారు. అయినప్పటికీ విప్లవ ప్రజానీకం తమ సైన్యం పుట్టిన రోజును ఘనంగా జరుపుకొన్నారు. శత్రు కేంద్రీకరణను దృష్టిలో పెట్టుకుని ఒక నెల రోజుల ముందు నుండే స్థానిక ఏసీ ఈ కార్యక్రమంపై కేంద్రీకరించింది. ప్రచార సామాగ్రిని సమకూర్చుకుని పోస్టర్లు, బ్యానర్లు తయారు చేసుకొంది. 15 రోజుల ముందు నుండే విస్తృత ప్రచారం మొదలైంది. ఏరియాలోనే కాకుండా చుట్టూ ఉన్న, పెద్ద సెంటర్లలో కూడా విస్తృత ప్రచారం జరిగింది. చింతపల్లి, రీంతాడా, కొయ్యూరు, జీకే వీధి, కెడి పేట, మంప, పెదవలస... లాంటి సెంటర్లలో రెండు, మూడుసార్లు కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు వేసారు. సుమారు 450 ప్రింటింగ్ పోస్టర్లు, 1000 దాకా చేతితో రాసిన పోస్టర్లు విస్తృతంగా వేసారు. 100 బ్యానర్లు కట్టారు. ఒకవైపు శత్రువు తీవ్రంగా కూంబింగ్ చేస్తున్నప్పటికీ, కార్యక్రమాన్ని కచ్చితంగా విజయవంతం చేయాలనే పట్టుదలతో మిలీషియా పనిచేసింది.

శత్రు కూంబింగుల మధ్యనే 40 మంది మహిళా మిలీషియా సహా, మొత్తం 150 మంది మిలీషియా కామ్రేడ్స్ 20 నుండి 30 మందితో కూడిన ఆరు ప్రచార బృందాలుగా ఏర్పడి ప్రచారం చేశారు. గాలికొండ ఏరియా పరిధిలోనే కాకుండా, పాత తాండవ ఏరియాలో కూడా ప్రచారం చేశారు. ఈ క్రమంలో రెండుసార్లు ఎన్‌కౌంటర్ తృటిలో తప్పింది. ఒక సందర్భంలో చీకట్లో మిలీషియా కామ్రేడ్స్, పోలీసులు ఒకరిని ఒకరు గుద్దుకున్నారు. పోలీసులు వెనుకకు పరిగెత్తడంతో మన కామ్రేడ్స్ రిట్రీట్ అయ్యారు.

పిఎల్‌జీఏ వారోత్సవం ముగింపు రోజున తలపెట్టిన బహిరంగ సభ గురించి శత్రువుకు తెలిసి దాన్ని భగ్నం చేయడానికి, ప్రజలపై దాడులు చేయడానికి సిద్ధమయ్యాడు. దీన్ని ముందుగానే ఊహించిన మిలీషియా 11 ఆంబుష్ టీంలుగా ఏర్పడి వారం రోజులు మాటుగాశారు. కానీ శత్రువు చాలా జాగ్రత్తలు తీసుకుని అడవి నుండి కాకుండా దారిలో నుండి తిరిగిపోయాడు.

మొత్తంగా ఈ సందర్భంగా ప్రచార బృందాలు 40 చిన్న స్థాయి సభలను నిర్వహించగా రెండు చోట్ల పెద్ద సభలు జరిగాయి.

**నల్లబెల్లిలో బహిరంగ సభ:**

ఏరియాలోని నల్లబెల్లి గ్రామంలో డిసెంబర్ 6న 2000 మందితో పిఎల్‌జీఏ సభ జరిగింది. తీవ్ర నిర్బంధం మధ్యనే ఈ సభ విజయవంతం అయింది. ముందుగా చేసిన ప్రచారం వల్ల శత్రువు కూంబింగ్ ప్రారంభించినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజలు సభ జరుపుకున్నారు. ఈ సభకు ఏరియాలోని దాదాపు 60 గ్రామాల నుండి ప్రజలు వచ్చారు. మిలీషియా పకడ్బందీగా ఏర్పాటు చేసిన ఆంబుష్‌లు, సెంట్రీల నడుమ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ దాదాపు సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది.

ఏఆర్‌సిఎస్ కమిటీ సభ్యుడు అధ్యక్షత వహించిన ఈ సభలో, ఏఆర్‌సిఎస్ అధ్యక్షుడు, ఏరియా కమాండర్ ఇన్ చీఫ్ ప్రసంగించారు. తమ ప్రసంగాల్లో వాళ్లు ఆదివాసీ సంపదను బడా పెట్టుబడిదారులకూ, సామ్రాజ్యవాదులకూ కట్టబెట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న తీరును, అందులో భాగంగా విశాఖలో బాక్సైట్ తవ్వకాల కోసం చేస్తున్న ప్రయత్నాలను, వీటిని అడ్డుకోవడానికి పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఎ చేస్తున్న కృషిని వివరించారు. అలాగే పిఎల్‌జిఎ సహకారంతో ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ ప్రజలు కాఫీ తోటలను స్వాధీనం చేసుకున్న తీరును కూడా పేర్కొన్నారు. పోరాటాన్ని అణచడం కోసం ఫాసిస్టు పాలకులు ఇన్‌ఫార్మర్స్‌ను, హోంగార్డ్సును తయారు చేస్తున్నారని, డబ్బులకు ఆశపడి ఉద్యమానికి ద్రోహం చేస్తున్నవారిని ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కుట్రను ఓడించి అడవిపై సర్వాధికారం సాధించాలని అందుకోసం పిఎల్‌జీఏలో చేరాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మిలీషియా సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇలా తీవ్ర నిర్బంధం మధ్యనే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేసుకోగల్గినందుకు ప్రజలు వుత్సాహపడ్డారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటనను నిరసిస్తూ, కొనసాగిన ధర్నా

విశాఖ జిల్లా కోరుకొండ ఏసి పరిధిలోని చింతపల్లి మండలానికి చెందిన అయిదు పంచాయితీలకు 900 మంది ప్రజలు 2012 జనవరి 9న ఆదివాసీ హక్కుల వేదిక నాయకత్వంలో లోతుగెడ్డ వద్ద ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మన్యం పర్యటనను నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా చింతపల్లి నుండి పాడేరు వరకు వుదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రోడ్డును స్థంభింపచేశారు. 'మీ పర్యటనలు మాకు వద్దు, మీ అధ్యయనాలు మాకు ఏమీ ఒరగపెట్టవు', అంటూ బాక్సైట్‌పై తమ వైఖరిని స్పష్టం చేయాలని, అలాగే జిందాల్/ఆన్‌రాక్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేసారు. బాక్సైట్ తవ్వకాలు, ఆదివాసీల అభివృద్ధి కోసం కాదంటూ స్పష్టం చేశారు. సిపిఐ, సిపిఎం సహా అన్ని బూర్జువా పార్టీల వైఖరిని స్పష్టం చేయాలని నిలదీసారు. బలపం పంచాయితీలో 95 మంది ప్రజల పైన గత సంవత్సరం అక్రమ కేసులు పెట్టారు. అవి పోలీసులు, ఎపిఎఫ్‌డిసి, రాజకీయ నాయకులు కుమ్మక్కై పెట్టిన కేసులనీ వీటిపై మిగతా పార్టీల వైఖరిని స్పష్టం చేయాలని లేని పక్షంలో మన్యం అధికార యంత్రాంగాన్ని స్థంభింపచేస్తామని హెచ్చరించారు.

## పిఎల్‌జిఎ చేతిలో రేంజర్ మాధవరావు హతం

విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం, అదే పంచాయితీలోని లంకపాకల గ్రామంలో 2011 సెప్టెంబర్ 28న పిఎల్‌జిఎ యాక్షన్ టీం ఎపిఎఫ్‌డిసిలో రేంజర్‌గా పని చేస్తున్న మాధవరావును కాల్చి చంపింది. అడవిపై సర్వాధికారాల కోసం ఆదివాసీ ప్రజలు చేస్తున్న

ఉద్యమానికి ఆటంకంగా మారి ఉద్యమాన్ని అణచివేయడంలో భాగమైనందున ఇతడిని ప్రజల అభిప్రాయం మేరకు పిఎల్‌జిఎ కాల్చి చంపింది.

ప్రభుత్వ ఆజమాయిషిలో నడుస్తున్న ఎపిఎఫ్‌డిసి ఆదివాసీ ప్రజల హక్కులు కాలరాచి అడవిపై ఆధిపత్యం కొనసాగిస్తున్నది. ప్రజల పోరాటం తీవ్రమయినపుడు ఏదో ఒక పద్ధతిలో ఆధిపత్యం కొనసాగించడానికి కొత్త, కొత్త పద్ధతులను ఎన్నుకుంటున్నది. దాంట్లో భాగంగానే అటవీ ప్రాంతాల్లో కాఫీ తోటలు వేసింది. ప్రజలను తరిమి వేసి వారి పట్టా భూముల్లో సైతం ఈ కాఫీ తోటలను వేసింది. 2008 మేలో మర్రిపాకల ఎస్టేట్‌లోని 250 ఎకరాల తోటలను ఏఆర్‌సిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు స్వాధీనం చేసుకొని పంచుకున్నారు. గత సంవత్సరం పిఎల్‌జిఎ ఆవిర్భావ దినం సందర్భంగా కోరుకొండ ఏసీ పరిధిలోని బలపం పంచాయితీలో 110 హెక్టార్ల కాఫీ తోటలను ప్రజలు స్వాధీనం చేసుకొని పంపిణీ చేసుకున్నారు.

కాఫీ ఎస్టేట్ ప్రజల చేతుల్లోకి వచ్చిన తరువాత ఈ స్ఫూర్తితో అన్ని ప్రాంతాల్లో కాఫీ తోటలను స్వాధీనం చేసుకుంటారనే భయంతో ఎపిఎఫ్‌డిసి మర్రిపాకల ఎస్టేట్‌ను తిరిగి ఆక్రమించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. అనేక సార్లు ప్రజలపై దాడులు, అరెస్ట్‌లకు పాల్పడుతూ, చిత్రహింసలు పెట్టి, అక్రమ కేసులు మోపుతున్నప్పటికీ ప్రజలు ధైర్యంగా నిలబడ్డారు.

2009లో మర్రిపాకల ఎస్టేట్‌కు ఆదివాసీ అయిన మాధవరావును రేంజర్‌గా ఎపిఎఫ్‌డిసి నియమించింది. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో మాధవరావు దిట్ట. ఎపిఎఫ్‌డిసి లక్ష్యం నెరవేర్చడం కోసం, తన స్వార్థ లాభాల కోసం తానూ ఆదివాసీనే అనే స్పృహ కోల్పోయి ఎస్టేట్‌ను ప్రజల చేతి నుండి ఎపిఎఫ్‌డిసికి అప్పజెప్పడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేసాడు. ప్రజలు ఓపికతో అతనికి నచ్చచెబుతూ వచ్చారు. రెండు సార్లు ప్రజాకోర్టు నిర్వహించి ఎస్టేట్‌కు రావద్దని తేల్చిచెప్పారు. అయినప్పటికీ మర్రిపాకలకు ఆనుకొని ఉన్న కుంకుంపూడి ఎస్టేట్‌లో పనిచేస్తూ మర్రిపాకలలోని ప్రజలను అరెస్టులు చేయిస్తూ వచ్చాడు. రెగ్యులర్‌గా పోలీసులతో సంబంధాలు నెరపుతూ పోలీసులు చెప్పినట్టల్లా చేస్తూ వచ్చాడు. కుంకుంపూడి ఎస్టేట్‌ను కూడా ప్రజలు స్వాధీనం చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నపుడు ప్రత్యక్షంగా పోలీసులతో చేతులు కలిపి పోలీసు బందోబస్తు మధ్య కాఫీ పండ్లు సేకరించాడు. నిర్బంధాన్ని ధిక్కరించి స్వతంత్రంగా కాఫీ పండ్లు ఏరుకున్న వారిని పోలీసు కేసులు పెడతానని బెదిరించి వారు సేకరించిన పండ్లలో వాటా తీసుకున్నాడు. 2011 జనవరిలో మర్రిపాకల ఎస్టేట్ పరిధిలోని పెదపాడు గ్రామంపై దాడి చేయించి 5 లక్షల విలువ చేసే కాఫీ పండ్లను ఎత్తుకపోయి అమ్ముకున్నాడు. ప్రజలను పోలీసుస్టేషన్‌కు బలవంతంగా తీసుకపోయి తోటలను వదిలిపెట్టాలని బెదిరించాడు. కానీ ప్రజలు ఏమాత్రం బెదరక ఎట్టి పరిస్థితిలోనూ తోటలను వదలమని ఎఎస్‌పి, సిఐల ఎదురుగా ఖరాకండిగా చెప్పారు.

ఇలా మొత్తంగా కాఫీ తోటల స్వాధీన పోరాటానికి మాధవరావు పెద్ద అడ్డంకిగా మారడంతో యాక్షన్ టీం లంకపాకల ఎస్టేట్‌లో అతడిని కాల్చిచంపింది.

పోలీస్‌బ్యాచ్‌ల కూంబింగ్ తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో ఈ యాక్షన్ జరగడం మంచి ప్రభావాన్ని వేసింది. ఈ సంఘటన అనంతరం ఎపిఎఫ్‌డిసి, పోలీసులు కలిసి చేయించిన కృత్రిమ ఆందోళనలు స్థానిక ప్రజలపై ఎటువంటి ప్రభావం వేయకపోగా, ప్రజలు మిగిలిన తోటల స్వాధీనం, పండ్ల సేకరణ పంపిణీ వైపు కదిలారు.

## కాఫీ తోటలను పిఎల్‌జీఏ మద్దతుతో స్వాధీనపర్చుకున్నామని ప్రకటించుకున్న ప్రజలు

కాఫీ తోటల స్వాధీన పోరాటంలో పురోగమిస్తున్న ప్రజల పోరాట స్ఫూర్తిని నీరుగార్చేందుకు ఎపిఎఫ్‌డిసి, పోలీస్ శాఖ కుమ్మక్కయి ప్రచార దాడిని ముమ్మరం చేశాయి. ఒక సెక్షన్ ప్రజలను కూడదీసి ఎపిఎఫ్‌డిసి లేనిదే ప్రజలకు బతుకుదెరువు వుండదనీ, ప్రజలు పోరాడి స్వాధీనపరుచుకున్న కాఫీ తోటలను సక్రమంగా సాగు చేయలేరని ప్రచారం చేయడం మొదలుపెట్టారు. ఆ తోటలు ప్రజలు పోరాడి సాధించుకున్నవి కాగా, మావోయిస్ట్ పార్టీ పంచిపెట్టినవిగా చిత్రీకరించి, పోలీస్ శాఖతో కలిసి గ్రామాలపై దాడులు చేస్తామని, కేసులు పెడతామనీ ఏపీఎఫ్‌డీసీ బెదిరిస్తున్నది. ఈ సందర్భంగా వాస్తవాలను ప్రపంచానికి తెలియజేయాలని నిర్ణయించుకున్న ప్రజలు లంకపాకల ఎస్టేట్ పరిధిలో 200 మందితో, సప్పర్ల ఎస్టేట్ పరిధిలో 300 మందితోనూ ఒకే సమయంలో 2012 జనవరి 23న సమావేశాలను నిర్వహించి వాస్తవాలను పత్రికాముఖంగా ప్రకటించారు. ఈ సభలలో కాఫీ తోటలను ఎవరూ తమకు పంచి ఇవ్వలేదనీ, తమ భూమి- తమ హక్కు కనుక తామే స్వాధీనపర్చుకున్నామని, దీనికి పిఎల్‌జీఏ మద్దతు ఇచ్చిందని ఎపిఎఫ్‌డిసి ఇంత కాలం తమ శ్రమను దోచుకున్నదనీ, దాని మనుగడను తాము కాంక్షించడం లేదనీ, అంతేకాక ఆ సంస్థ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలనీ, లేకుంటే ఆ సంస్థపై, కాఫీ తోటలలో జోక్యం చేసుకునే అధికారులపై సైతం దాడులు తప్పవనీ, అరెస్టులకు తాము భయపడమనీ, తమ పోరాటాన్ని నీరుగార్చేందుకు ఎపిఎఫ్‌డిసి, పోలీసుశాఖ ప్రచార దాడిని సాగిస్తుందని దాన్ని తాము ఐక్యంగా ఎదుర్కొంటామని ప్రకటించారు.

ఈ ప్రకటనల అనంతరం సైతం తన కార్యకలాపాలను కొనసాగిస్తూ, అరెస్టుల పేరుతో ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్న ఎపిఎఫ్‌డిసి, లంకపాకల ఎస్టేట్ పరిధిలో ఆటంకంగా మారిన పల్పర్ యూనిట్ పైన, ఆ ఎస్టేట్ పరిధిలోని సుమారు 200 మంది ప్రజలు మిలీషియా మద్దతుతో దాడి చేసి పల్పర్ బిల్డింగ్‌ను ధ్వంసం చేశారు. అందులోని ఫర్నిచర్‌ను దగ్ధం చేశారు. ఎపిఎఫ్‌డిసి మన్యం నుంచి వెళ్లి పోవాలని డిమాండ్ చేస్తూ పోస్టర్లు వేశారు.

## ప్రజా వ్యతిరేక కుటుంబాల గ్రామ బహిష్కరణ

గాలికొండ ఏరియాలోని బూసులు, లంకపాకలు, నేరెళ్లబంద గ్రామాల నుంచి వెళ్లిన మాతె నాగేశ్వరరావు, గెమ్మెలి సీత, కొర్ర మహేష్‌లు హోంగార్డులుగా పనిచేస్తూ గ్రామంలో ఉన్న తమ కుటుంబీకులతో సంబంధాలను కొనసాగిస్తూ పార్టీ, గ్రామ నిర్మాణాల సమాచారం సేకరిస్తున్నారు వీరిలో నేరెళ్లబందకు చెందిన కొర్ర మహేష్, లంకపాకల సీతలు గతంలో దళంలో పనిచేసి 2005లో లొంగిపోయి పోలీసులతో సంబంధాలను కొనసాగిస్తున్నారు. బూసులు గ్రామానికి చెందిన మాతె నాగేశ్వరరావు గ్రామంలోనే వుంటూ రహస్యంగా నెట్‌వర్క్‌ను నడిపి 2011లో ప్రజల చేతికి చిక్కాడు. ఆ సందర్భంలో ప్రజల చేతి నుండి తప్పించుకుని పూర్తి స్థాయి హోంగార్డుగా కొయ్యూరు పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ కూంబింగ్‌లకు వస్తూ, రహస్యంగా తమ కుటుంబీకులను కలుస్తూ సమాచారం సేకరిస్తున్నాడు.

నేరెళ్లబంద మహేష్ కూడా 2005లో సరెండర్ అయిన నాటి నుండి మన సమాచారం చేరవేస్తూ, కొన్ని సరెండర్లు కూడా చేయించాడు. ప్రస్తుతం గూడెంలో స్పాటర్‌గా పని చేస్తున్నాడు. అప్పటినుంచి అనేకసార్లు ఆ గ్రామంలో సమావేశం నిర్వహించి, ప్రజలకు సరెండర్ అయి ఇంటికొచ్చి బతకమని ఇతనికి పార్టీ పిలుపునిచ్చింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో 2012 ఫిబ్రవరి 8న ఎర్రజెరువుల గ్రామంలో జరిగిన సభలో నేరెళ్లబంద గ్రామంలో ఉంటున్న ఇతని భార్య నిర్మలను గ్రామం విడిచిపెట్టి పోవల్సిందిగా సుమారు ఆరు గ్రామాల నుండి వచ్చిన 150 మంది ప్రజలు నిర్ణయించారు.

గతంలో అనేకసార్లు హెచ్చరించినా ఖాతరు చేయకుండా నివసిస్తున్న బూసులు నాగేష్ ఇంటిపైన 2012 ఫిబ్రవరి 3న, లంకపాకల సీత ఇంటిపైన 2012 ఫిబ్రవరి 18న సుమారు 100 మంది ప్రజలు, మిలీషియా దాడి చేసి ఆహార ధాన్యాలను స్వాధీనపరుచుకొని, ఇళ్లను ధ్వంసం చేసి గ్రామం విడిచిపెట్టి పోవల్సిందిగా హెచ్చరించి విడిచిపెట్టారు.

చీడిగొంది గ్రామంలో మునసబు, భూస్వామి, పెత్తందారి, ప్రజా వ్యతిరేకి అయిన గెమ్మెలి భాస్కర్‌రావు ఇంటిపై 2012 ఫిబ్రవరి 11న సుమారు 8 గ్రామాలకు చెందిన 200 మంది ప్రజలు, మిలీషియా నాయకత్వంలో దాడిచేసి ఆహారధాన్యాలను స్వాధీనపర్చుకుని మిగతా ఆస్తిని ధ్వంసం చేశారు. తక్షణమే గ్రామం విడిచిపోవాలని హెచ్చరించారు.

విశాఖ జిల్లా చింతపల్లి మండలం కోరుకొండ ఏసి పరిధిలోని లోతుగెడ్డ పంచాయితీ చెరుకుపాలెం గ్రామానికి చెందిన లింగమూర్తి, శంకర్‌రావు, వెంకట్రావులు కూడా పోలీసు ఇన్ఫార్మర్లుగా పనిచేస్తున్నారు. 2012 ఫిబ్రవరి 12న వీరిని పట్టుకొని ప్రజాకోర్టులో విచారించగా ప్రజలు లింగమూర్తికి గ్రామ బహిష్కరణ శిక్ష వేశారు. వెంకటరావు, శంకర్‌రావులకు దేహశుద్ధి చేశారు.

అదే విధంగా ఏరియాలోని గేదెరుబ్బల గ్రామానికి చెందిన నాగేష్ పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ, గ్రామంలో ఆధిపత్యం చెలాయిస్తూ ప్రజా వ్యతిరేకిగా మారాడు. దళం ఆరు గ్రామాల ప్రజలను సమావేశపరిచి ప్రజాభిప్రాయం మేరకు ఇతన్ని గ్రామం నుండి బహిష్కరించింది. పోలీసులకు సమాచారం అందించడంలో సహకరిస్తున్న ఇతడి బంధువులు దోవిగుమ్మ గ్రామానికి చెందిన మల్లేశ్, సంపెంగొంది గ్రామానికి చెందిన బాలన్నలను కూడా గ్రామాల నుండి బహిష్కరించారు.

## పోలీసుల బారి నుండి మిలీషియా సభ్యులను విడిపించుకుంటున్న ప్రజానీకం

విశాఖ జిల్లా చింతపల్లి మండలం కోరుకొండ ఏసీ పరిధిలోని బలపం పంచాయితీ విప్లవోద్యమానికి బలమైన ప్రాంతం. 2010లో ఇక్కడి ప్రజానీకం కాఫీ తోటల్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుండి పోలీసులు ఈ ప్రాంతంలోని 95 మంది ప్రజలపై అక్రమ కేసులు పెట్టి మిలీషియా సభ్యుల్ని పట్టుకున్నారు. వెంటనే 500 మంది ప్రజలు కదిలి అన్నవరం స్టేషన్‌ను ముట్టడించి మిలీషియా సభ్యుల్ని విడిపించుకున్నారు. తిరిగి ఈ సంవత్సరం ఫిబ్రవరి 14న రాళ్లగడ్డ గ్రామంపై 70 మంది పోలీసులు దాడి చేసి ఇద్దరు మిలీషియా సభ్యుల్ని పట్టుకున్నారు. గ్రామస్థులంతా కలిసి వీరందరినీ విడిపించుకున్నారు. దీనితో పోలీసులు వెళ్లిపోయినట్లు నటించి 15 నిమిషాల తర్వాత వెనక్కి వచ్చి సిందేరి కార్లను పట్టుకొని పోయారు. ఒక పోలీసు బృందం అతనిని పట్టుకొని పోతుంటే మిగతా రెండు బృందాలు తమ వెంట పడుతున్న ప్రజల్ని అడ్డుకున్నాయి. అయినప్పటికీ ప్రజలు వెనుకడుగు వేయకుండా సాంప్రదాయక ఆయుధాలు పట్టుకొని పోలీసుల్ని రాళ్లగెడ్డ గ్రామం నుండి 200 గజాలు తరిమి కొట్టారు. రెండు సార్లు పోలీసులు పొగ బాంబులు వేసి లాఠీచార్జ్ చేసి ప్రజల్ని బెదిరించే ప్రయత్నం చేసారు. ప్రతిగా ప్రజలు పోలీసులపై రాళ్ల వర్షం కురిపించారు. ఫలితంగా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఈ ప్రతిఘటనలో 10 మంది ప్రజలు కూడా గాయపడ్డారు. అయినప్పటికీ ప్రజలు పోలీసులపై రాళ్ల వర్షం కురిపిస్తూనే వుండడంతో పోలీసులు అయిదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆ కాల్పుల వలన ప్రజలు వెనక్కి తగ్గారు. ఇలా సుమారు మూడు గంటలు పోలీసులకు, ప్రజలకు మధ్య భీకర పోరు జరిగింది. పోలీసులను ఈ సంఘటన ఖంగు తినిపించింది. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు 5 పంచాయితీలకు చెందిన దాదాపు 1000 మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో అన్నవరం పోలీసు స్టేషన్‌ను ముట్టడించి, స్టేషన్ ముందు బైఠాయించి, ఎస్ఐ బయటకు రావాలని ఆ ప్రాంతం మారుమోగిపోయేలా నినదించారు. పోలీసులు ప్రజల్ని చూసి స్టేషన్ లోపలే వుండి పోయారు. రోడ్డు మొత్తం స్థంభించిపోయింది. పోలీసుస్టేషన్ గేటుపై రాళ్ల వర్షం మొదలైంది. ఎఎస్‌పి గోపినాథ్‌కు ఫోన్ చేయడంతో గూడెం, చింతపల్లి సిఐలను అక్కడికి పంపించాడు. ప్రజలంతా గూడెం సిఐ పైకి దూసుకు పోవడంతో సిఐ స్టేషన్

లోపలి నుండే సమాధానం చెప్పాల్సి వచ్చింది. బైటకు రావాలంటూ మహిళలు నినదించారు. ప్రజల, ముఖ్యంగా మహిళల హెచ్చరికలు చూసి సిఐ వెంకటరావు ఖంగుతిన్నాడు. ఈ విధంగా ప్రజల ఐక్యత శత్రువు క్యాంపుకు కలవరం పుట్టించింది.

## రాళ్లగడ్డ గ్రామంపై పోలీసుల దాడికి నిరసనగా

విశాఖ జిల్లా గూడెం మండలం కోరుకొండ ఏసి పరిధిలోని మెండిగెడ్డ పంచాయితీ రోడ్డుకు దగ్గరగా వుంటుంది. పైగా బాక్సైట్ వున్న కొండల ప్రాంతమిది. ఈ ప్రాంత ఆదివాసుల అభివృద్ధి పేరుతో మెండిగెడ్డ నుండి గింజంగి వరకు మూడు జె.పి.సి.లతో రోడ్డు వేస్తున్నారు. ఆదివాసుల్ని మభ్యపెట్టి ఈ రోడ్డును వేస్తున్నారు. 2012 ఫిబ్రవరి 16న మిలీషియా మెండిగెడ్డకు వెళ్లి ఈ ప్రాంతంలో వున్న బాక్సైట్‌ను దళారులకు లాభాలు కట్టబెట్టడానికే ఈ రోడ్డు వేస్తున్నారని ప్రజలకు అర్థం చేయించి, ఫిబ్రవరి 14న రాళ్లగడ్డ గ్రామంపై పోలీసులు చేసిన దాడికి నిరసిసగా రోడ్డు, జెపిసిలను ధ్వసం చేశారు. ఈ చర్య వలస దాదాపు కోటి రూపాయల నష్టం జరిగింది. పోలీసుల దాడి జరిగిన వెంటనే ఈ చర్య జరగడం ఆ ప్రాంతంలో మంచి ప్రభావాన్ని వేసింది.

# మల్కన్‌గిరి డివిజన్

## ఇన్‌ఫార్మర్ల నిర్మూలన

డివిజన్‌లోని కలిమెల ఏరియా నల్లగొండి పంచాయితీ కొత్తకొండ గ్రామానికి చెందిన గంగాల్ మొదట సంఘంలో పనిచేసి, వ్యక్తిగత కక్షలతో గ్రామ పెద్దాల్‌ను హత్య చేసి జైలుకు వెళ్ళాడు. విడుదలైనప్పటి నుండి పోలీసులతో సంబంధాలు పెట్టుకొని సమాచారం చేరవేయడం పార్టీ పేరు చెప్పుకొని ప్రజలను బెదిరించడం, దళసభ్యులను లొంగిపోయే విధంగా కుటుంబాలపై వత్తిడి చేయడం, సంఘ సభ్యులను అరెస్టులు చేయించడం వంటి ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు.

కలిమెల ఏరియా, సలిమెల కొండ గ్రామానికి చెందిన దామాలు కలిమెల బ్లాక్ కేంద్రంలో ఆఫీసు ప్యూన్‌గా పనిచేస్తూ, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారాడు. సంఘ కార్యకర్తలను నమ్మించి, పోలీసులకు పట్టించి అరెస్టులు చేయించాడు. వారిని విడిపించడానికి వాళ్ల కుటుంబాల వద్ద డబ్బులు గుంజాడు. చుట్టు పక్కల గ్రామాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తున్నాడు.

డైక్-3 లో వుంటూ చౌకిదారుగా పనిచేస్తున్న లలిత్ ద్యూటీ మాటున ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. టన్నెల్ క్యాంపులోని బి.ఎస్.ఎఫ్. క్యాంపుతో నిత్యం సంబంధాలు కొనసాగిస్తూ, గంజాయి పండించే ఆదివాసీ రైతులను బెదిరించి డబ్బు వసూళ్ళు చేస్తూ, పోలీసులకు మన సమాచారం చేరవేస్తున్నాడు.

పోలీసు ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తూ, ప్రజా వ్యతిరేకులుగా, వుద్యమానికి తీవ్ర ఆటంకంగా తయారైన వీరిని ప్రజాభీష్టం మేరకు పి.ఎల్.జి.ఎ. నిర్మూలించింది.

## పోలీస్ అధికారులను హతమార్చి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పిఎల్‌జిఎ

2012 ఫిబ్రవరి 10న జన్నిగూడ వద్ద బి.ఎస్.ఎఫ్.అధికారులు వస్తున్న 'బోలెరో' కారును పిఎల్‌జిఎ గెరిల్లాలు మందుపాతరతో పేల్చారు. పేలుడు శక్తివంతంగా లేకపోవడంతో, పోలీసులు కవర్లు తీసుకొని కాల్పులు జరిపారు. ఇరువర్గాలకు పది నిమిషాల పాటు జరిగిన కాల్పుల్లో, 107 బిఎస్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్, డిప్యూటీ కమాండెంట్, సి.ఐ. ర్యాంకు, ఎఎస్‌ఐ ర్యాంకు అధికారులు నలుగురు చనిపోయారు. డ్రైవర్ (బిఎస్‌ఎఫ్)తో పాటు మరో జవాన్ తప్పుకున్నారు. ఏకేలు - 2, ఏకే మేగజైన్లు - 9 (221 తూటాలు), 9ఎమ్‌ఎమ్ పిస్టల్ - 1, రెండు మేగజైన్లు (20 తూటాలు), మిలిటరీ గ్రెనేడ్లు-10, బేస్‌సెట్-1 తదితర సామాగ్రి పిఎల్‌జిఎ స్వాధీనం అయ్యాయి.

చనిపోయిన వారందరూ అధికార్లు కావడంతో శత్రువు షాక్‌తిన్నారు. గుర్రైనాడు. శత్రువు దూకుడుకు కళ్లెం పడింది. ఈ చర్య విజయవంతం కావడంతో పిఎల్‌జీఏ, ప్రజల మనోధైర్యం మరింత పెరిగింది.

## పోలీసు హెడ్ కానిస్టేబుల్, కాంట్రాక్టర్ల హతం

పొడియా బ్లాక్ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాంచందర్ పేద ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తూ, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తూ ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా తయారయ్యాడు. రాంచందర్ బారినపడి నానా ఇక్కట్ల పాలవుతున్న ప్రజల అభీష్టం మేరకు యాక్షన్ టీం, మిలీషియా కలిసి పొడియా బ్లాక్ కేంద్రంలో సంత జరిగే రోజున పట్టపగలే ఇతన్ని కాల్చి చంపాయి. ఇతడి పీడ విరగడ కావడంతో ప్రజలు ఎంతగానో సంతోషించారు.

## ప్రజా వ్యతిరేకి, కాంట్రాక్టర్ సిత్రు హతం

కలిమెల ఏరియాలో కాంట్రాక్టర్ సిత్రు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ పోలీసులకు నమ్మిన బంటుగా తయారయ్యాడు. ఏరియాలో లోతట్టు ప్రాంతంలో రోడ్లు వేయడానికి ఎవరూ ముందుకు రాకపోయినా, ఇతడు ముందుండి రోడ్లు వేయిస్తూ, లక్షలాది రూపాయల డబ్బు కాజేస్తూ ఉద్యమానికి తీవ్ర ఆటంకంగా మారాడు. ఇతడి ప్రజా వ్యతిరేక చర్యలకు తగిన శిక్ష విధిస్తూ కాంట్రాక్టర్ సిత్రును దళం హతమార్చింది.

★

*(56వ పేజీ తరువాయి...)*

రమేష్ (29), ఇరుప దినేష్ (25), మడకం రామ్ విలాస్ (18), మడకం దిలీప్ (19), కాకా సమ్మయ్య (35), కాకా అనిత (12), కాకా రాహుల్ (13); సార్కిన్ గూడకు చెందిన మాడవి ఆయితాల్ (28), కుంజం మల్లా (22), ఆప్కా మీటు (18), సార్కె రామన్న (22) కోర్స బిచ్చెం (18); రాజుపెంటకు చెందిన ఇరుప ధర్మయ్య (45), ఇరుప సురేష్ (18)లు వున్నారు.) వీరిలో 8 మంది కాల్పులలో చనిపోతే మిగతా 9 మందిని గాయపడ్డాక పోలీసులు పట్టుకొని చిత్రహింసలు పెట్టి చంపారు. చనిపోయిన వారిలో ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు.

రాత్రంతా ఈ గ్రామంలోనే గడిపిన పోలీసులు మహిళలపై ఘోరమైన అత్యాచారాలకు పాల్పడ్డారు. ఎనిమిది మంది మహిళలు తమపై అత్యాచారం చేశారని ఆరోపిస్తున్నారు. కాని ఇంతకు రెట్టింపు సంఖ్యలో అత్యాచారాలు జరిగాయని తెలుస్తున్నది. ఇలా అత్యాచారానికి గురైన వారిలో ఒక వృద్ధురాలు కూడా వుంది. అత్యాచారానికి గురైన వారిలో కొత్తగూడకు చెందిన మడకం శాంతి, ఇరుప లలిత, కాకా సరస్వతి, ఇరుప పుష్ప, ఇరుప బయ్యక్క ఇరుప తులసి, కాకా కాంత, మడకం అనిత, కాకా లక్ష్మీ, ఇరుప లక్ష్మీ, కారం దారే, మడకం చిన్నక్క వున్నారు. పన్నెండేళ్ల అనితను కూడా అత్యంత ఘోరంగా అత్యాచారం చేసి చంపారు.

ఈ దాడిలో మొత్తం పదకొండు మంది గాయపడ్డారు. వీరిలో కొత్తగూడ గ్రామానికి చెందిన మడకం సోమా, కాకా సంటి, కాకా రమేష్, కాకా పార్వతి; సార్కిన్‌గూడకు చెందిన ఆప్కా ఛోటు, ఇరుప మూలాల్, సార్కె పుల్లయ్య, కోర్స బిచ్చెం, కోర్స రాజు, కోర్స నందు, హేమ్ల దేవాల్‌లు వున్నారు.

ఈ కాల్పుల్లో పశువులు, పందులు కూడా చనిపోయాయి. ఇవన్నీ చాలా చిన్న గ్రామాలు. ప్రతి గ్రామంలోనూ పది పదిహేను ఇండ్లకంటే మించవు. ఇంత చిన్న గ్రామాల్లో ఒకేసారి ఇంత మంది చనిపోతే ప్రజల్లో ఎంత భీతావహ పరిస్థితి నెలకుంటుందనేది ఊహించడం కష్టమే.

రెండు వందల సంఖ్యలో సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్, కోయ కమాండో బలగాలు ఈ దాడిలో పాల్గొన్నాయి. ఇలా సాధారణ ప్రజలను చంపిన పోలీసు అధికారులు నక్సలైట్లను చంపామని నిస్సిగ్గుగా ప్రకటించుకున్నారు. అయితే ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర నిరసన వెల్లువెత్తింది. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది కూడా ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఎన్‌కౌంటర్‌లో అమాయకులు మరణిస్తే క్షమాపణలు చెప్తానని అంటూనే చీకట్లో అడవిలో కాల్పులు జరిగాయి కాబట్టి సీఆర్‌పీఎఫ్ ఎదురుకాల్పులు జరిపిందని, అది వాళ్ల ప్రామాణికంగా అనుసరించే పద్ధతే అని చిదంబరం, నిబంధనల ప్రకారమే వ్యవహరించారని సీఆర్‌పీఎఫ్ డీజీ విజయ్‌కుమార్ జరిగిన ఘటనలో సీఆర్‌పీఎఫ్‌ను పూర్తిగా సమర్థించారు. నక్సలైట్లపై కాల్పులు జరిపే క్రమంలో చీకట్లో కనబడక సాధారణ ప్రజలపై కూడా కాల్పులు జరిపినట్టుగా సీఆర్‌పీఎఫ్ వాదించింది. కాని అసలక్కడ నక్సలైట్లు లేరని పోలీసులకు స్పష్టంగా తెలుసు. ఇందులో పోలీసులు పొరపడడానికి ఎటువంటి అవకాశాలు లేవు. పోలీసుల ఇంటెలిజెన్స్ అంత బలహీనంగా ఏమీ లేదు. నక్సలైట్లే లేనప్పుడు అటు నుండి కాల్పులు వచ్చే అవకాశాలే వుండబోవు. ఇకపోతే అర్ధరాత్రి అడవిలో నుండి కాల్పులు వచ్చాయని చెప్పడంలో కూడా ఎటువంటి నిజం లేదు. ప్రజలు సమావేశమైంది అడవిలో కాదు. తమ గ్రామంలోనే. అది అర్ధరాత్రి కూడా కాదు.

విప్లవోద్యమాన్ని దెబ్బ తీయాలంటే వుద్యమానికి బలంగా వున్న ప్రజా పునాదిని దెబ్బతీయాలనేది పాలక వర్గాల ఎత్తుగడల్లో ముఖ్యమైనది. ప్రజా పునాదిని దెబ్బ తీయడంలో భాగంగా ప్రజలను టెర్రర్ చేసి వుద్యమానికి దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే ఇటువంటి ఘోరమైన చర్యలకు పాల్పడుతున్నారు. 2010 ఏప్రిల్ 6న తాడిమెట్ల వద్ద పిఎల్‌జిఎ చేసిన దాడిలో 76 మంది పోలీసులు చనిపోయినప్పుడే ఈ ప్రాంతంలో వంద మందిని చంపుతామని సాయుధ బలగాలు బహిరంగంగానే ప్రకటించాయి. అప్పటి నుండి ఈ ప్రాంతంలో ఒక పెద్ద ఊచకోతకు ప్రభుత్వం పథకాలు పన్నుతూనే వుంది. అందులో భాగంగానే గత సంవత్సరం చింతల్‌నార్ సమీపంలోని తాడిమెట్ల, పులాన్‌పాడు, మొర్‌పల్లి, తిమ్మాపురం గ్రామాలపై ప్రభుత్వ సాయుధ బలగాలు దాడిచేశాయి. అయితే పిఎల్‌జిఎ చేసిన ప్రతిఘటన మూలంగా ఆ పథకం నెరవేరక పోగా నలుగురు కోయ కమాండోలే ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు జరిగిన ఊచకోత కూడా అందులో భాగమే. సాధారణ ప్రజలు మీటింగ్ జరుపుకుంటున్నారనీ, అక్కడ గెరిల్లా బలగాలు లేవనే సమాచారం పోలీసులకు స్పష్టంగా వుంది. సార్కిన్‌గూడకు వెళు తుండగా సాయుధ బలగాలకు సమావేశానికి వెళ్తున్న ప్రజలు కల్సారు. వాళ్లను బాగా కొట్టడంతో ప్రజలు తాము సమావేశానికి వెళ్తున్నామని, అది తాము మాత్రమే జరుపుకుంటున్న సమావేశమని కూడా చెప్పారు. నక్సలైట్లు సమావేశంలో లేరని పక్కాగా తెలియడం వల్లనే పోలీసులు అంత సమీపం నుండి సమావేశ స్థలాన్ని చుట్టుముట్టగలిగారు. మొదట అక్కడికి చేరుకున్న సాయుధ బలగాలు మిగతా బలగాలన్నీ చేరుకునేంత వరకూ సమావేశంలో మాట్లాడుకునే మాటలన్నీ వినే అవకాశం కూడా వుంది. కాబట్టి వాళ్లు సాధారణ ప్రజలే అనేది స్పష్టాతిస్పష్టంగా తెలిసే ఈ దాడి చేశారనేది నిర్వివాదాంశం. తెల్లవారాక గాయపడిన వారిని మా వాళ్లే అని మహిళలు మొత్తుకుంటుంటే కూడా వినకుండా చిత్రహింసలు పెట్టి చంపారంటే ప్రజల్లో ఒక భయానక వాతావరణం సృష్టించాలనే ఉద్దేశం పాలకులకు ఎంత బలంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

సుక్‌మా జిల్లా కలెక్టర్ అలెక్స్‌పాల్ మీనన్‌ను అరెస్టు చేసి వుంచిన ప్రాంతం కూడా ఇది కాబట్టి ఈ ప్రాంతంలో ఊచకోత కోయాలనే ప్రతీకార చర్య కూడా ఈ దాడి వెనుక వుంది. మే ఆఖరున సీఆర్‌పీఎఫ్ డీజీ విజయ్‌కుమార్ చింతల్‌నార్‌కు వచ్చి అయిదు రోజులు మకాం వేసి ఈ ఊచకోతకు పథకం పన్నాడు.

నిజమైన ఎన్‌కౌంటర్ అని చెప్పడానికి నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో ఆరుగురు పోలీసులు గాయపడ్డారని చెబుతున్నారు. కాని పోలీసులు గాయపడ్డది క్రాస్ ఫైరింగ్‌లోనే.

బాసగూడ నుండి వచ్చిన బలగాలు జూన్ 28న రాత్రి ఈ ఊచకోతకు పాల్పడితే, 29 ఉదయాన్నే చింతల్‌నార్ క్యాంపు నుండి బయల్దేరిన పోలీసులు సిమిలిపెంట, పెంట గ్రామాలకు వెళ్లి మరో ముగ్గురిని చంపేశారు. ఉదయాన్నే అయిదున్నర గంటలకే నాగలి దున్నడానికి వెళ్లిన ఒక రైతు పొలంలోకి నీళ్లు పెట్టడం కోసం తూము తీస్తుండగా పోలీసులు హఠాత్తుగా కాల్పులు జరిపారు. ఫలితంగా ఆ రైతు అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆ రైతుపై కాల్పులు జరపడం చూసి భయపడి మరొక రైతు పరిగెత్తుతుండగా అతన్ని కూడా కాల్చిచంపారు. చనిపోయిన ఈ రైతుల్లో ఒకరు మడకం లచ్చాల్ కాగా, మరొకరు మడకం ముత్తా. ఆ తర్వాత ముందుకు వెళ్లిన పోలీసులు మిలీషియా దళంపై కాల్పులు జరపగా జొన్నగూడ మిలీషియా కమాండర్ కామ్రేడ్ సోడి దూలా తన దగ్గరున్న ఆయుధంతో హెూరా హెూరీగా పోరాడి చనిపోయాడు. ఈ మిలీషియా దళానికి చెందిన ఒక సభ్యురాలిని పోలీసులు అరెస్ట్ చేసి హెలికాప్టర్లో తీసుకెళ్లారు.

జూన్ 29 వుదయాన్నే జేగురుగొండ నుండి మరొక పోలీసు బృందం బయల్దేరి సిలింగేర్ గ్రామానికి వెళ్లి 40 మంది గ్రామస్తులను పట్టుకెళ్లారు

సార్కిన్ గూడ, కొత్తగూడ, రాజుపెంట గ్రామస్థులు వెళ్లి కొట్లాడగా మృతదేహాలను ఇచ్చారు. కాని సిమిలిపెంట, పెంటలలో చంపేసిన ముగ్గురి మృతదేహాలను గ్రామస్థులు ఎంత కొట్లాడినా ఇవ్వలేదు. సిలింగేర్ మహిళలు వెళ్లి పట్టు విడువకుండా కొట్లాడడం వల్ల తమ గ్రామంలో పట్టుకున్న 40 మందినీ విడుదల చేశారు. అయితే మిలీషియా సభ్యురాలిని వదిలిపెట్టకుండా జైలుకు పంపారు.

ప్రజా యుద్ధాన్ని అణచడంలో భాగంగా పాలకవర్గాలు ఒక చేత్తో అణచివేతను, మరో చేత్తో సంస్కరణలను తీసుకు వస్తున్నాయి. సంస్కరణల్లో భాగంగా ఏవేవో పథకాలు తీసుకువస్తున్నప్పటికీ, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి అంటూ బూటకపు మాటలు మాట్లాడుతున్నప్పటికీ అవి అణచివేతకే త్వరపడుతున్నాయి. ప్రభుత్వం ఎంత ఆకర్షణీయంగా ప్రచారం చేసినప్పటికీ ప్రజలను సంస్కరణలతో మభ్యపెట్టలేకపోతున్నది. అందుకే సల్వాజుడుం సమయంలో భయానికి జుడుంలో పాల్గొన్న ప్రజలు, ఇతర రాష్ట్రాలకు పారిపోయిన ప్రజలు తిరిగి తమ గ్రామాలకు, తమ క్రాంతికారీ జనతన సర్కార్ల అండకోరుతూ వస్తున్నారు. అందుకే సంస్కరణలతో ప్రజలను మభ్యపెట్టలేమని భావిస్తున్న ప్రభుత్వం గ్రీన్‌హంట్ రెండవ దశలో అణచివేతను మరింత ఉధృతం చేస్తున్నాయి.

ఒకవైపు సాయుధ బలగాలు ప్రజలను ఇంత ఘోరంగా ఊచకోత కోస్తే, మరోవైపు ఆర్డీవో ఆధ్వర్యంలో, చనిపోయిన కుటుంబాలకు ఇవ్వడం కోసం అంటూ జూలై 7న నిస్సిగ్గుగా బట్టలు, తట్టలూ వంటి వస్తు సామాగ్రిని పట్టుకొని వచ్చారు. కానీ ప్రజలు ఆ వస్తువులను ఛీ కొట్టారు. మీరే చంపి మళ్లీ మీరే సామాన్లు ఇస్తారా అని ఆవేశంతో ప్రశ్నించారు. చంపేసిన మా వాళ్లను బతికించండి తీసుకుంటాం అన్నారు. తెచ్చిన లారీలను వెనక్కి తిప్పుకొని వెంటనే వెళ్లి పోకుంటే వాటిని తగులబెడుతాం అని హెచ్చరించారు. ఏ మొహం పెట్టుకుని వీటిని తీసుకొచ్చారని ఆగ్రహంతో కసి తీరా తిట్టారు. ముఖ్యంగా మహిళలు ఈ ప్రతిఘటనలో చురుకైన పాత్ర వహించారు. 'ప్రజల మనసులను గెల్చుకోవడం'లో ఓడిపోయిన అధికారులు తెచ్చిన వాటిని తీసుకొని వెనక్కి వెళ్లిపోయారు.

మావోయిస్టులే దేశానికి అతి పెద్ద ప్రమాదమనే మన్మోహన్ అయినా, అభివృద్ధి నిరోధకులు, హింసావాదులు అని ప్రచారం చేసే చిదంబరం అయినా, పశుపతి నుండి తిరుపతి వరకు అని వుపన్యాసాలు ఇస్తూ సంస్కరణలను సత్వరంగా, నిర్దిష్టంగా అమలు చేయాలని కాళ్లకు బలపాలు కట్టుకొని తిరిగే జైరాం రమేష్ అయినా, రహస్య సైనిక ఆపరేషన్లకు నేతృత్వం వహించే విజయ్‌కుమార్ అయినా... వీళ్ల బాధ్యతలేవైనా, వీళ్ల లక్ష్యం ప్రజలపై యుద్ధాన్ని రుద్దడమే. వీళ్లంతా ప్రజలకు నరకం చూపించేవారే.

ఈ ఘటన జరిగినప్పటి నుండి సార్కిన్‌గూడకు పోలీసులు రోజూ వచ్చి పోతున్నారు. ఇప్పటికే ఇంత మంది చనిపోవడం, గాయపడడం వలన వ్యవసాయ పనులకు చాలా ఆటంకం ఏర్పడింది. ఇక పోలీసులు రోజూ వచ్చి పోవడం అనేది ప్రజల పనులకు మొత్తంగా ప్రజా జీవనానికి తీవ్ర ఆటంకంగా వుందని, మందలు మందలుగా వచ్చే పోలీసులను చూసి బెదిరి పశువులు కూడా పారిపోతున్నాయి కనుక దున్నడానికి వీలుకాకుండా పోతున్నదని ప్రజలు ఆందోళన పడుతుండగా తాజాగా జూలై 17న సార్కిన్‌గూడలో పోలీసు క్యాంపు వేశారు. రోజూ క్యాంపు సమీపంలోనూ, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి కాల్పులు జరుపుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

ఇంకా సైన్యం ఆపరేషన్‌లకు దిగక ముందే ఇక్కడి ప్రజల పరిస్థితి ఇంత భయానకంగా వుంది. ఇంక సైన్యం ఆపరేషన్లకు దిగితే ఇంకెన్నో రెట్ల హింస, హక్కుల హననం జరుగుతాయనడంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచంలో ఎక్కడైనా పోరాటాలను అణచడానికి పోరాటకారులనే కాదు అమాయక ప్రజలను కూడా కుప్పలు తెప్పలుగా చంపిన ఉదాహరణలు వున్నాయి. శ్రీలంకలో ఎల్‌టిటిఇని అణచివేయడానికి శ్రీలంక సైన్యం అమాయక ప్రజలను ఎంత ఊచకోత కోసిందో మనం ఎరిగిందే. అల్ కాయిదా, తాలిబన్‌లను అణచివేసే పేరుతో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా పాల్పడుతున్న డ్రోన్ దాడులలో వేలాది అమాయక ప్రజలు చనిపోతున్న విషయం కూడా మనం ఎరిగినదే.

కాబట్టి ఈ ప్రజలపై యుద్ధాన్ని ఆపాలని ప్రజలూ, ప్రజాస్వామిక వాదులు శక్తివంచన లేకుండా పోరాడాలి.

బాసగూడెం హత్యాకాండకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనను చేపట్టాలి. బాధితులకు అన్ని రకాలుగా మద్దతుగా నిలబడాలి. ★

# సార్కిన్‌గూడ మారణకాండను వ్యతిరేకించండి!

ప్రజలపై యుద్ధంలో భాగంగా సాయుధ బలగాలు పాల్పడుతున్న మారణకాండకు అంతే లేకుండా పోతున్నది. సింగారం, సింగనమడుగు, గొంపాడు, తాకిలోడు, చింతల్‌నార్ ప్రాంతాలలో పాల్పడినట్టుగానే ప్రభుత్వ సాయుధ బలగాలు జూన్ 28న సార్కిన్‌గూడ ప్రాంతంలోనూ మరోసారి మారణకాండకు పాల్పడ్డారు.

సార్కిన్‌గూడ, కొత్తగూడ, రాజుపెంట – ఈ మూడు బాసగూడ గ్రామంలో భాగంగానే వుంటాయి. సల్వాజుడుం భయానికి ఈ గ్రామాల నుండి ప్రజలు పక్కనే వున్న ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయారు. అలా పారిపోయిన వాళ్లలో చాలా మంది గత సంవత్సరం తమ గ్రామాలకు చేరుకున్నారు. సల్వాజుడుం ప్రారంభమైనప్పటి నుండి ఈ గ్రామాల్లో కొన్ని మార్పులు జరిగాయి. కొందరు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోనే వున్నారు. కొంత మంది చనిపోయారు. కొన్ని కుటుంబాలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామాల పరిధిలోని భూములను సర్దుబాటు చేసుకోవాలని ఈ గ్రామస్థులు అనుకున్నారు. అంటే ఊరి నుండి పారిపోయిన వారి పడావు పడిన భూములను తిరిగి సాగులోకి తీసుకురావడం, కొత్తగా ఏర్పడిన కుటుంబాలకు భూములను కేటాయించడం, చనిపోయిన వాళ్ల భూములను కూడా సాగులోకి తీసుకురావడం వంటి మార్పులు చేర్పులు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జుడుం భయానికి పారిపోయి తిరిగి వచ్చిన వాళ్ల పశువులు కూడా ఆగమయిపోయినాయి కాబట్టి కొంత మందికి పశువుల్లేవు, కొంత మందికి నాగళ్లు లేవు. పశువులు లేని వాళ్లకు పశువులు, నాగళ్లు లేని వాళ్లకు నాగళ్లు సహకార పద్ధతిలో లభ్యమయ్యేటట్టుగా ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. అంతే కాకుండా విత్తనాలు ఎప్పుడు వేయాలి, కొన్ని పండుగలు ఎప్పుడు చేయాలి అనే విషయాలను కూడా నిర్ణయించుకోవాలనుకున్నారు. తొలకరి చినుకులు మొదలయిన కాలం కనుక భూమి తప్ప మరో ఆధారం లేని ప్రజల ఆలోచనలు భూమి చుట్టూతా తిరగడం సహజం. అందుకే పై సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవడానికి ఈ మూడు గ్రామాల ప్రజలు ఒకచోట చేరాలనుకున్నారు. ఈ గ్రామాల్లో క్రాంతికారీ జనతన సర్కార్లు లేవు. ప్రజా సంఘాలు మాత్రమే వున్నాయి. ప్రజా సంఘాల నాయకత్వంలోనే ఈ సమావేశం జరుపుకోవాలనుకున్నారు.

అయితే జూన్ 20 నుండే బాసగూడ, జేగురుగొండ, చింతల్‌నార్ వంటి సమీప క్యాంపుల్లో పోలీసు బలగాల మోహరింపు పెరుగుతూ వస్తున్నది. ఈ విషయం ప్రజలకు కూడా తెలుసు. అయినప్పటికీ ఈ సమావేశం జరుపుకుంటేనే వ్యవసాయ పనులు ముందుకు పోతాయి కనుక అనివార్యంగా వాళ్లు సమావేశమయ్యారు. అయితే అన్ని గ్రామాల్లో ఏ సమావేశం జరుపుకున్నా సాధారణంగా ఏర్పాటు చేసుకునే సెంట్రీ వంటి ఏర్పాట్లను కూడా వీళ్లు చేసుకోలేదు.

మూడు గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది ప్రజలు జూన్ 28న చీకటి పడుతుండగా సార్కిన్‌గూడ గ్రామంలో సమావేశమయ్యారు. సమావేశం మొదలైన కొద్ది సేపటి నుండే సమావేశ స్థలం చుట్టూ పోలీసుల మోహరింపు మొదలైంది. దూరం నుండి ప్రజలకు కొన్ని లైట్లు కనపడ్డాయి కాని ఎవరో సాధారణ ప్రజలని వాళ్లు భావించారు. ఆ తర్వాత ఒక గంటలోపే పోలీసులు అన్ని దిక్కుల నుండి, అతి సమీపం నుండి ప్రజల మీదికి విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలారు. కొందరు గాయపడ్డారు. అతి సమీపం నుండి చుట్టుముట్టి కాల్పులు జరుపుతుండడం వల్ల ఎటూ పారిపోలేని పరిస్థితిలో ప్రజలు కాల్పులు వస్తున్న దిక్కుకే పరిగెత్తి తుపాకీ బ్యారెల్లను తోసేసుకుంటూ పారిపోవాల్సి వచ్చింది. అందరూ పారిపోయి సమావేశ స్థలం ఖాళీ అయిన తర్వాత పోలీసులు లైట్లు వేసుకొని చుట్టు పక్కల అంతటా గాలిస్తూ గాయపడి పడిపోయి వున్న వారిని బాయ్‌నెట్ ఛార్జ్ చేసి చంపారు. ఒక పిల్లవాడి కాళ్లు నరికేసి చంపారు. గాయపడి ఇండ్లల్లో దాక్కున్న మరి కొందరిని తెల్లవారాక ఏడు గంటల ప్రాంతంలో బయటకు లాక్కొచ్చి ఇటుక పెడ్డలతో, రాళ్లతో అత్యంత క్రూరంగా తలల మీద బాది నుజ్జు నుజ్జు చేసి చంపారు. మరి కొందరిని గొడ్డళ్లతో నరికి చంపారు, కొందరిని కత్తులతో పొడిచి చంపారు. గతంలో సల్వాజుడుం గూండాలు ఇలా అత్యంత జుగుప్సాకరంగా చంపేవారు. కానీ ఈ ఘటనలో ఇలా చంపింది సల్వాజుడుం గూండాలు కాదు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలే! కాల్పులతోనే సరిపెట్టకుండా ఇటువంటి జుగుప్సాకరమైన పద్ధతులను అవలంబిస్తున్నారంటే రోజు రోజుకూ వాటి స్వభావం మరింత క్రూరత్వాన్ని సంతరించుకుంటున్నదని అర్థం చేసుకోవచ్చు. తమ వాళ్లను చంపవద్దని వేడుకున్న మహిళలను విపరీతంగా కొట్టారు. మొత్తంగా ఈ దాడిలో 17 మంది చనిపోయారు. (చనిపోయిన వారిలో కొత్తగూడ గ్రామానికి చెందిన – ఇరుప నారాయణ (45), మడకం నాగేశ్ (32), మడకం సురేష్ (27), ఇరుప

***(మిగతాది 54వ పేజీలో...)***